# పాఠం- 1

## భారతదేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు - సామాజిక ఆర్ధిక లక్ష్యాలు

**1.0 లక్ష్యం**

ఈ పాఠము భారతదేశంలో ప్రభుత్వరంగ సంస్థలు విస్తరించటానికి కారణాలు మరియు సామాజిక, ఆర్ధిక లక్ష్యాలను అర్థము చేసుకోవటానికి దోహదము చేస్తుంది.

**విషయ క్రమం**

1.1 పరిచయము

1.2 ప్రభుత్వ రంగ సంస్థల భావజాల మూలాలు

1.3 భారతదేశంలో ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధి

1.4 ప్రభుత్వ రంగ సంస్థల ముఖ్య లక్షణాలు

1.5 ప్రభుత్వ రంగ విస్తరణకు కారణాలు

1.6 ప్రభుత్వ రంగ సంస్థలు - ఆర్ధిక సామాజిక లక్ష్యాలు

1.6.1 ఆర్ధిక లక్ష్యాలు

1.6.2 ఆర్ధికేతర లక్ష్యాలు

1.6.2.1 సామాజిక లక్ష్యాలు

1.6.2.2 రాజకీయ లక్ష్యాలు

1.6.3 కొన్ని ఇతర లక్ష్యాలు

1.7 నూతన పారిశ్రామిక విధానము July 1991

1.8 సారాంశము

1.9 వ్యాస రూప ప్రశ్నలు

1.10 లఘు వ్యాఖ్యలు

1.11 చదువదగిన గ్రంథాలు

## 1.1 పరిచయము:

ఒకనాడు ప్రజలు, ప్రభుత్వము నుండి అణచివేత తప్ప ఏదీ ఆశించలేదు. ఆ తరువాత కాలములో ప్రజలు, ప్రభుత్వము జోక్యము చేసుకోకుండా తమ మానాన తమను వదలి వేస్తే చాలని భావించారు. ఆధునిక కాలములో ప్రజలు ప్రభుత్వము తమకు అనేక వస్తువులను, సేవలను, అందించాలని, రక్షణను కల్పించాలని ఆశిస్తున్నారు.

సాంప్రదాయ ఆర్థికవేత్త ఆడమ్ స్మిత్ ప్రతిపాదించిన లెస్సెజ్ ఫెయిర్ ( స్వేచ్ఛగా వదలి వేయుట ) సిద్ధాంతము 17,18 శతాబ్దాలలో ప్రపంచ దేశాల ఆర్థిక, సామాజిక వ్యవహారాలకు ఆధిపత్యం వహించింది. ఆ తరువాత కాలములో అదే సిద్ధాంతము ప్రభుత్వ నియంత్రణ మరియు ఆర్థిక వ్యవస్థ నియంత్రణకు మార్గము చూపింది. కొంత కాలము తరువాత కేవలము ప్రభుత్వ నియంత్రణ సరిపోదు, రాజ్యము బయటి నుండి ఆర్థిక వ్యవహారాలను గమనిస్తే సరిపోదు, ప్రభుత్వము సమర్థవంతముగా తన విధానాలను అమలు పరచడానికి ప్రత్యక్షముగా ఆర్థిక వ్యవహారాలలో జోక్యము చేసికోవాలనే భావన బలపడింది.

పారిశ్రామిక విప్లవ కాలములో అనేక అమానవీయ చర్యలు చోటు చేసుకున్నాయి. కానీ ఆ కాలంలో శాస్త్ర, సాంకేతిక రంగాలలో, పాలనలో ఎంతో అభివృద్ధి జరిగింది. ఈ కాలంలో మనిషి తన ఆహారాన్ని సంపాదించుకోవటానికి యంత్రాల వద్ద పని చేసే బానిసగా మార్చబడ్డాడు. పారిశ్రామిక విప్లవం ఫలితంగా ప్రైవేటు పెట్టుబడి ఆవిర్భవించింది. ఈ ప్రైవేటు పెట్టుబడి మనిషి యొక్క రక్షణకు, సంక్షేమానికి, భవిష్యత్తుకు తీరని నష్టాన్ని కలిగించింది. అసమానతలు, ధనికులకు పేదలకు మధ్య విపరీతమైన అంతరము ఏర్పడింది.ఈ పరిస్థితులు, ప్రభుత్వం ఆర్థిక వ్యవహారాలలో జోక్యము చేసికోవటానికి మరియు పారిశ్రామిక చట్టం ఏర్పడటానికి దోహదము చేసింది.

## 1.2 ప్రభుత్వరంగ సంస్థల భావజాల మూలాలు :

మార్క్సిస్ట్ మరియు ఫేబియన్ ఆలోచనాదృక్పథాల ప్రభావముతో రాజ్యము అధీనములోనే ఉత్పత్తి కారకాలుండాలనే భావన బలపడింది. ఆస్తిహక్కును లీగల్ హక్కుగా మార్పు చేయటం జరిగింది. అంతకుముందు ఆస్తిహక్కును ' పవిత్రమైనదిగా' ధిక్కరించటానికి వీలులేని హక్కుగా భావించటం జరిగింది. సామ్యవాదతత్వ చింతనను అంగీకరించిన దేశాలలో రాజ్యము ఉత్పత్తి కారకాలను తన అధీనములో ఉంచుకొని పారిశ్రామికవేత్త పాత్రను స్వీకరించి సామాజిక మార్పును సాధించే బాధ్యతను చేపట్టింది.

ప్రాథమికంగా ప్రపంచంలో మూడు రకముల అభివృద్ధి నమూనాలు అమలులో ఉన్నాయి.

1. మొదటి నమూనాను ఆచరించిన దేశాలలో రాజ్యము కేవలము మౌలిక వసతులను కల్పించే పాత్రకు పరిమితమైంది. రాజ్యము ప్రభుత్వరంగంలో పరిశ్రమల స్థాపన చేయకుండా దేశ ఆర్థికవ్యవస్థ అభివృద్ధికి ప్రైవేటు పారిశ్రామికవేత్తల పై ఆధారపడింది. ఈ దేశాలు స్వేచ్ఛా వ్యాపారము, మార్కెట్ శక్తుల స్వేచ్ఛ సూత్రాలపై ఆధారపడ్డాయి. పారిశ్రామికీకరణ ప్రాథమిక దశలో జపాన్, మెక్సికో, తైవాన్ ఇదే ఆలోచనా దృక్పథంతో వ్యవహరించాయి.

2. ఈ నమూనా ప్రకారము U.S.S.R మరియు తూర్పు ఐరోపాలోని కొన్ని సామ్యవాద దేశాలు సామ్యవాద ఆర్థిక వ్యవస్థను అమలు పరచాయి. ఈ దేశాలు ఉత్పత్తికారకాలు ప్రభుత్వ అధీనములోనే ఉండాలని విశ్వసించాయి. ఈ దేశాలు ప్రైవేటు రంగ సంస్థలు ప్రాథమికంగా సమాజ వ్యతిరేకమైనవిగా భావించాయి. టాంజానియా, ఇరాక్ లాంటి దేశాలు ప్రైవేటు రంగ సంస్థల స్థానములో ప్రభుత్వరంగ సంస్థలను విస్తృతపరచాలని భావించినప్పటికీ అన్ని ఆర్థిక కార్యకలాపాలను జాతీయము చేయలేదు..

3. మూడవ నమూనా దేశాలు మిశ్రమ ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసికొన్నాయి. దీని ప్రకారము ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేటు రంగ సంస్థలు పరస్పర సహజీవనము చేస్తాయి. ఈ నమూనాకు భారతదేశము మంచి ఉదాహరణ.

పెట్టుబడిదారీ వ్యవస్థలోని లోపాలు సామ్యవాద భావజాలము ఆవిర్భవించటానికి, ప్రభుత్వరంగ సంస్థల స్థాపనకు కారణమైంది. ఉత్పత్తికరకాలు ప్రభుత్వరంగ అధీనములోనే ఉండాలని, ప్రైవేటు పెట్టుబడిదారుల చేతిలో ఉండకూడదని సామ్యవాద భావజాలము విశ్వసిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థపై అనేక విమర్శలున్నాయి.

1. మాక్సిస్ట్ భావజాల సారాంశము మిగులు విలువ, శ్రమ దోపిడి, అధిక లాభార్జన ధ్యేయమే పెట్టుబడిదారీ వ్యవస్థ ముఖ్య లోపము.

2. ఎక్కువ మంది ప్రజలు పేదరికంలో మగ్గుతూ, కొనుగోలు శక్తి అల్పంగా ఉంటుంది.

3. పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడి కల్గిన వారు అధిక శక్తిని కల్గియుంటారు. ఉద్యోగుల పైన, జాతీయ ఆర్థిక విషయములలో

నిర్ణయాలు తీసికోవటంలో వీరు తమ శక్తిని ప్రదర్శిస్తారు.

4. పెట్టుబడిదారీ వ్యవస్థ 'పోటీ' పై ఆధారపడి యుంటుంది.

సమర్థత కల్గిన వారే జీవించగల్గుతారు ( Survival of the fittest). ఇది అనైతికం, సహకార స్ఫూర్తికి భంగకరం. 1930 లో ఏర్పడిన ఆర్థికమాంద్యం స్వేచ్ఛా విఫణి సూత్రంపై ఆధారపడిన పెట్టుబడిదారీ వ్యవస్థ లోపాలను బహిర్గతం చేసింది. ప్రముఖ ఆర్థికవేత్త 'కీన్స్' సరియైన డిమాండ్ మరియు ఉపాధి అవకాశాలు కల్పించటానికి ఆర్థిక వ్యవస్థలో రాజ్యము యొక్క జోక్యము అవసరమని సిద్ధాంతీకరించటం జరిగింది. అమెరికా అధ్యక్షుడు రూస్‌వెల్ట్ 'న్యూడీల్' ఆర్థిక వ్యవహారాలలో రాజ్యము ప్రత్యక్ష పాత్ర వహించాలనే భావనకు గుర్తింపునివ్వటం జరిగింది. ఇంగ్లాండ్‌లో లేబరు పార్టీ 1930-40 కాలములోని ఆర్థిక పరిస్థితితో ప్రభావితమై కీలక పరిశ్రమలను జాతీయం చేయటమే సామాజిక అభివృద్ధికి మార్గమని విశ్వసించటంజరిగింది. ప్రపంచదేశాల ఆలోచనా దృక్పధాల ప్రభావంతో భారతదేశం కూడా అదే బాటలో పయనించటం జరిగింది. ప్రొఫెసర్ హేన్‌సన్ మాటలలో "ప్రభుత్వ రంగ సంస్థల ఆవస్యకత ఎంతైనా ఉంది. ప్రణాళిక లేని దేశాలలో ప్రభుత్వ రంగ సంస్థలు ఎంతో కొంత సాధిస్తాయి. ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థలలో ప్రభుత్వ రంగ సంస్థలు లేకపోతే అది పేపరుకే పరిమితమౌతుంది కానీ ఏమీ సాధించలేవు".

## 1.3 భారతదేశంలో ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధి :

ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం 20 వ శతాబ్దపు ముఖ్య లక్షణం. 1918 లో మొదటి ప్రపంచయుద్ధం ముగిసే నాటికి ఈ భావాలు బలపడటం జరిగింది. 1945 లో రెండవ ప్రపంచ యుద్ధం ముగియడంతో ఈ భావాలు ఊపందుకొన్నాయి. 1991 లో ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానమును ప్రకటించేవరకు ప్రభుత్వ రంగ సంస్థలు విస్తరిస్తూ వచ్చాయి.

భారత జాతీయ కాంగ్రెస్ 1931వ సంవత్సరములో ' కరాచి ' సమావేశములో మొట్టమొదటి సారి స్వరాజ్యము సాధించిన తరువాత తమ ఆర్థిక, సామాజిక విధానాన్ని వివరించటానికి ప్రయత్నించింది. ఈ సమావేశ నిర్ణయాలలోని ముఖ్యాంశాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. ప్రభుత్వము కీలక పరిశ్రమలను, సేవలను తన అధీనములోనే ఉంచుకుంటుంది. ఖనిజలవణాలు, రైల్వేలు, నీటి వనరులు, నౌకారంగం మరియు ఇతర ప్రజాప్రయోజన రంగాలు ప్రభుత్వ అధీనములో ఉంటాయి. ఈ ప్రకటన ద్వారా భారత జాతీయ కాంగ్రెస్ భవిష్యత్‌లో ఉత్పత్తి కారకాలు, పంపకం జాతీయం చేయబడతాయనే బీజాలను నాటింది. కాంగ్రెస్ పార్టీలోని సామ్యవాద భావాలుగల, అభ్యుదయ భావాలు కల్గిన యువకులు జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో చేసిన వత్తిడి ఫలితమే ఈ ప్రకటన. ఆ తరువాత 1934 లో సర్.ఎమ్. విశ్వేశ్వరయ్య వ్రాసిన గ్రంథము ప్లేన్డ్ ఎకానమి ఫర్ ఇండియా ( Planned Economy for India ) లో భారతదేశ ఆర్థిక అభివృద్ధికి సమగ్ర ప్రణాళికను సూచించడం జరిగింది. ఆ తరువాత నేతాజీ సుభాష్ చంద్రబోస్ 1938 లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న కాలంలో జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షునిగా, కె.టి.షా జనరల్ సెక్రటరీగా ఒక జాతీయ ప్రణాళికా కమిటీని నియమించటం జరిగింది. ఈ కమిటీ జాతీయ ప్రణాళికా సూత్రాలు, పాలనాయంత్రాంగం, మొదలైన అంశాల పై సూచనలు చేయవలసినదిగా 1940 లో రెండు సబ్ కమిటీలను నియమించటం జరిగింది. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం కావటంతో, కాంగ్రెస్ పార్టీ జాతీయోద్యమంలో నిమగ్నమై ఉండటంతో ఈ సబ్ కమిటీల యొక్క నివేదిక 1948 లో వెలుగు చూచింది. ఈ కమిటీ పరిశ్రమలను రెండుగా విభజించింది. 1. రక్షణకు సంబంధించిన పరిశ్రమలు. 2. ప్రజా అవసరాలకు సంబంధించిన పరిశ్రమలు. ఈ కమిటీ పరిశ్రమలను ప్రభుత్వాధీనములోనే నిర్వహించాలని సూచించింది. రెండవ ప్రపంచ యుద్ధకాలములోనే, 1943 లో బాంబేలోని ఎనిమిదిమంది ముఖ్య పారిశ్రామికవేత్తలు బాంబే ప్రణాళికను రూపొందించడం జరిగింది. ఈ పరిస్థితులు ప్రజలను ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి గురించి ఆలోచింపచేసినవి. ఇదే భావాలను భారత రాజ్యాంగము లోని పార్ట్ - IV లో ఆదేశసూత్రాలలో పొందుపరచడం జరిగింది. ఆర్టికల్ 39 ప్రకారము దేశ వనరులపై ప్రభుత్వమే ఆధిపత్యాన్ని, నియంత్రణను కల్గి సమిష్టి ప్రయోజనాల సాధనకు ఉపయోగించాలని, దేశ ఆర్థిక వ్యవస్థ, సంపద, ఉత్పత్తి కారకాలను కేంద్రీకృతము చేయటానికి కాకుండా సమిష్టి ప్రయోజనాల సాధనకు వినియోగించాలని వివరించటం జరిగింది.

స్వాతంత్ర్యానంతరము జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాని కావటంతో ప్రభుత్వ నియంత్రణ, ఆర్థిక వ్యవస్థ జాతీయం కావటం

ఖాయమని తేలిపోయింది. 1948, ఏప్రిల్ 6న ప్రభుత్వము తన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించటం జరిగింది. భారతదేశానిదిః మిశ్రమ ఆర్థిక వ్యవస్థను అమలు పరచనున్నట్లు ప్రకటించింది. జవహర్‌లాల్ నెహ్రూ నవంబరు, 1954న, జాతీయ అభివృద్ధి మండలిలో మాట్లాడుతూ 'సోషలిజమ్' అనే పదాన్ని ఉపయోగించటం జరిగింది. కాంగ్రెస్ పార్టీ 1954లో 'ఆవడి' సమావేశములో సామ్యవాదసమాజ స్థాపనే తన లక్ష్యంగా ప్రకటించింది. 1954, డిసెంబరులో భారత పార్లమెంటు కూడా సామ్యవాద సమాజ స్థాపన లక్ష్యంగా ప్రకటించింది.

ఏప్రిల్ 30, 1956లో భారత ప్రభుత్వము తన నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. ఈ విధానం ఆర్థిక అసమానతలను తగ్గించటం, ఆర్థిక శక్తి కేంద్రీకృతం కాకుండా నివారించడానికి, నూతన పరిశ్రమలను ప్రభుత్వ రంగంలో స్థాపించటం తన లక్ష్యంగా ప్రకటించింది. ఈ విధానం ప్రకారం పరిశ్రమలను A,B గ్రూపులుగా విభజించటం జరిగింది.' A ' గ్రూపులోని 17 పరిశ్రమల భవిష్యత్ అభివృద్ధి ప్రభుత్వము పూర్తిగా తన బాధ్యతగా ప్రకటించింది.' B 'గ్రూపులోని సామాజిక ప్రాధాన్యత కల్గిన 12 రకాల పరిశ్రమలు సాధ్యమైనంత వరకు ప్రభుత్వ ఆధీనములోనే ఉంటాయని ప్రకటించటం జరిగింది. మిగిలిన ఇతర పరిశ్రమలు ప్రైవేటు రంగానికి వదలివేస్తున్నట్లు ప్రకటించింది. అయితే ప్రభుత్వం అవసరమనిపిస్తే ఏ పరిశ్రమనైనా స్థాపించటానికి అవకాశము కల్పించబడినది. అప్పటి నుండి ప్రభుత్వము వీలైనంతవరకు ప్రభుత్వ రంగానికే పెద్ద పీట వేస్తూ వచ్చింది. అవసరమని భావించిన చోట ప్రభుత్వము వ్యాపార కార్యకలాపాలను కూడా నిర్వహిస్తుంది.

మన ప్రభుత్వ రంగము పంచవర్ష ప్రణాళికలతో పాటు అభివృద్ధి చెందటం జరిగింది. మొదటి పంచవర్ష ప్రణాళిక ఆరంభం నాటికి కేవలం ఐదు పరిశ్రమలు మాత్రమే ప్రభుత్వ రంగంలో ఉన్నాయి. రెండవ పంచవర్ష ప్రణాళిక ప్రారంభం నాటికి అవి 21 పరిశ్రమలుగా ఎదిగాయి. మూడవ పంచవర్ష ప్రణాళిక నాటికి 48 పరిశ్రమలు ప్రభుత్వ రంగంలో ఉన్నాయి.

వివిధ పంచవర్ష ప్రణాళికలలో ప్రభుత్వరంగము ఏవిధముగా విస్తరించిందో క్రింది పట్టిక ద్వారా తెలిసికొనవచ్చు

| సంవత్సరము | ప్రభుత్వ రంగ సంస్థ సంఖ్య | మొత్తము పెట్టుబడి ( కోట్లలో ) |
|---|---|---|
| 1951 | 5 | 29 |
| 1956 | 21 | 81 |
| 1961 | 48 | 953 |
| 1966 | 74 | 2415 |
| 1969 | 85 | 3902 |
| 1974 | 122 | 6237 |
| 1979 | 176 | 15602 |
| 1980 | 186 | 20000 |

ఈ సంఖ్యలో డిపార్ట్‌మెంటల్‌గా నిర్వహిస్తున్న సంస్థలు మరియు జాతీయం చేయబడిన బ్యాంకులు చేర్చబడలేదు.

స్థూలంగా పరిశీలించినట్లయితే ప్రభుత్వరంగ సంస్థలు ఆశించిన ఫలితాలను సాధించటంలో విఫలమయినాయని చెప్పక తప్పదు. చాలా పరిశ్రమలు నష్టాల బాటలో నడుస్తూ 1991 నూతన పారిశ్రామిక విధానము ద్వారా ప్రభుత్వము తన దృక్పథమును

మార్చుకొని ప్రైవేటు రంగము వైపు మొగ్గు చూపటానికి దోహదము చేసినాయి.

## 1.4 ప్రభుత్వరంగ సంస్థల ముఖ్యలక్షణాలు :

ప్రభుత్వరంగ సంస్థల ముఖ్యలక్షణాలను ఈ క్రింది విధముగా వివరించవచ్చును.

**1. ప్రజలకొరకు ఏర్పాటు చేయబడినవి :**

ప్రభుత్వరంగ సంస్థలు ప్రజల కొరకు కొన్ని సామాజిక, ఆర్థిక లక్ష్యాలను సాధించటానికి ఏర్పాటు చేయబడినాయి. ఇవి జాతీయవిధానాల లక్ష్యాలు సాధించటానికి మార్గాలు. ప్రైవేటు రంగ సంస్థలు వ్యాపార లక్షణం కలిగి ప్రజల అభివృద్ధి కంటే లాభార్జనే ధ్యేయంగా పని చేస్తాయి. ప్రభుత్వరంగ సంస్థలు లాభాల కంటే ప్రజాప్రయోజనమే ధ్యేయంగా పనిచేస్తాయి.

**2. ప్రభుత్వ అధీనములో ఉంటాయి :**

ప్రభుత్వరంగ సంస్థలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ అధీనములో కాని, రాష్ట్ర ప్రభుత్వ అధీనములో కాని లేక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధీనములోగాని ఉంటాయి. ప్రభుత్వ అధీనమనగా పరిశ్రమలో ప్రభుత్వము 51% ఈక్విటీ కల్గియుంటుంది. పబ్లిక్ కార్పొరేషన్లు మరియు డిపార్ట్ మెంటల్ అండర్ టేకింగ్స్ పూర్తిగా ప్రభుత్వ అధీనములో ఉంటాయి. కోఆపరేటివ్ రంగంలో ఉన్న పరిశ్రమలు ప్రభుత్వరంగ సంస్థల జాబితాలోకి రావు.

**3. ప్రభుత్వ నియంత్రణ :**

ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వం అనేక పద్దతులలో నియంత్రిస్తుంది. వివిధ నియంత్రణలు, శాసనసభ, కార్యనిర్వాహణ శాఖలద్వారా ప్రభుత్వము, ప్రభుత్వరంగ సంస్థలను నియంత్రిస్తుంది. వాటి యొక్క ఉన్నతస్థాయి నిర్వహణా బాధ్యతలను నిర్వహిస్తుంది. పెట్టుబడి, ధరలు, జీతభత్య విధానము, ఉన్నతస్థాయి నియామకాలు ప్రభుత్వమే నిర్వహిస్తుంది.

**4. ప్రజలకు బాధ్యత వహిస్తుంది :**

ప్రభుత్వరంగ సంస్థలకు నిధులను ప్రభుత్వ ఖజానా నుండి చెల్లించటం జరుగుతుంది. కనుక పార్లమెంటు, మంత్రులు, ఉద్యోగిస్వామ్యం, ఆడిట్ సంస్థల ద్వారా ప్రజలకు బాధ్యత వహిస్తుంది.

**5. స్వీయపాలనా స్వేచ్ఛ :**

ప్రభుత్వము పెద్ద మొత్తములో ప్రభుత్వరంగ సంస్థలకు పెట్టుబడులు పెట్టినప్పటికీ వాటికి తమంతతాము తమపద్ధతిలో నిర్వహించు కోవటానికి స్వేచ్ఛను ఇస్తుంది. ప్రభుత్వము వాటి రోజువారి కార్యకలాపాలలో జోక్యము చేసుకోదు.

## 1.5 ప్రభుత్వరంగ విస్తరణకు కారణాలు :

ప్రభుత్వరంగ సంస్థల స్థాపన వెనుక అనేక లక్ష్యాలు, ఒత్తిడిలు, మరియు అవసరాలు ఉన్నాయి. ప్రభుత్వరంగ సంస్థల స్థాపనలో దేశ వాస్తవ అవసరాలు, దేశ రక్షణ అవసరాలు, రాజకీయ భావజాలం, సామాజిక తత్వచింతన, ఆర్థికప్రగతి ఇమిడి ఉన్నాయి. ప్రభుత్వరంగ సంస్థల స్థాపనకు దోహదము చేసిన కారణములను ఈ క్రింది విధముగా వివరించవచ్చును.

**1. జాతీయ ప్రణాళిక విజయవంతం కావటానికి మార్గము :**

ప్రణాళికా బద్ధమైన ఆర్థిక వ్యవస్థ విజయవంతం కావటానికి ప్రభుత్వరంగ సంస్థల అభివృద్ది దోహదము చేస్తుంది. ఆధునిక ఆర్థిక వ్యవస్థలు ప్రణాళికా బద్ధమైనవి. ప్రణాళికా లక్ష్యాలను సాధించటానికి ప్రభుత్వరంగ సంస్థలను స్థాపించటమేకాక ప్రైవేటు వ్యాపారవేత్తలు నిర్వహించే వ్యాపారము, మరియు పరిశ్రమలను నియంత్రించటం ద్వారా ఆశించిన లక్ష్యాల సాధనకు ప్రభుత్వము

కృషిచేస్తుంది.

**2. దేశ మౌళిక అవసరాలను తీర్చడం :**

అనేక వందల సంవత్సరములు వలసలుగా ఉండి, అభివృదికి నోచుకోక, స్వాతంత్ర్యము సాధించుకున్న తరువాత దేశ ఆర్థిక వ్యవస్థ ముందున్న పెనుసవాలు దేశ మౌళిక అవసరాలను తీర్చటం. రైల్వేలు, రోడ్లు, తంతితపాలా, విద్యుత్తు, నౌకారంగము, విమానసర్వీసులు, పోస్టల్ సర్వీసు, బ్యాంకులు, ఇన్సూరెన్సు అవసరతలు, అభివృద్ధిని వేగవంతం చేస్తాయి. అనేక దేశాలలోని అనుభవంతో పై మౌళిక అవసరతలను ప్రైవేటు రంగం సమర్థవంతంగా తీర్చలేదని గుర్తించటం జరిగింది. కనుక ప్రభుత్వమే పై మౌళిక అవసరతలను తీర్చడానికి ముందుకు రావలసిన అవసరము ఏర్పడింది. పై మౌలిక అవసరతలను తీర్చటం ద్వారా వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి బాటలు వేయవచ్చును.

**3. సమతౌల్య ప్రాంతీయ అభివృద్ధి :**

ప్రైవేటురంగం లాభాపేక్ష కలిగియుంటుంది. అధిక లాభాలను ఆర్జించగలమని భావించిన రంగాలలోనే ప్రైవేటురంగం పరిశ్రమలను స్థాపించటానికి ముందుకు వస్తుంది. అంతేకాక ప్రైవేటు రంగం సహజవనరులను సమర్ధవంతంగా, శాస్త్రీయంగా ఉపయోగించుకొనలేదు. అందువలన ఆర్థిక వ్యవహారాలలో ప్రభుత్వము జోక్యము చేసుకొనవలసిన అవసరత ఏర్పడింది. ప్రభుత్వ రంగం సమతౌల్య ప్రాంతీయాభివృద్ధిని సాధించటానికి ప్రయత్నిస్తుంది.

**4. కీలకమైన మరియు ప్రాథమిక పరిశ్రమల అభివృద్ధి :**

అభివృద్ధి చెందుతున్న దేశాల అనుభవాల ప్రకారము ప్రైవేటు పారిశ్రామిక వేత్తలు వ్యాపారానికి సంబంధించిన ఇబ్బందులు తక్కువగా ఉన్న పరిశ్రమలను మాత్రమే స్థాపించటానికి ముందుకు వస్తారు. కీలకమైన మరియు ప్రాథమిక పరిశ్రమల స్థాపనకు వారికి సరియైన ఉత్సాహము కానీ, సరిపడినంత పెట్టుబడి కానీ, మరియు ఇతర వనరులను కానీ సమకూర్చు కొనలేరు. స్వయం సమృద్ధిని వేగంగా సాధించటానికి ప్రభుత్వమే ముందుకు వచ్చి కీలకమైన మరియు ప్రాథమిక పరిశ్రమలను స్థాపించవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

**5. సామ్యవాద మరియు సంక్షేమ సమాజ స్థాపన :**

పూర్వపు ప్రభుత్వాలు శాంతి భద్రతలు, దేశ రక్షణ లాంటి తక్కువ కార్యకలాపాలను మాత్రమే నిర్వహించేవి. ఆధునిక ప్రభుత్వాలు విస్తృతమైన అనేక కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. సామ్యవాద, సంక్షేమ సమాజ స్థాపన లక్ష్యాలుగా ప్రభుత్వం పారిశ్రామిక మరియు వ్యాపార బాధ్యతలను నిర్వహించవలసిన ఆవస్యకత ఏర్పడింది.

**6. ఆర్థిక శక్తి కేంద్రీకరణను నివారించుట :**

ఆధునిక కాలంలో ప్రభుత్వము సమాజములో ఆర్థిక అసమానతలను తగ్గించటానికి ప్రయత్నిస్తుంది. లాభాలపై పన్ను, సంపద పన్ను, అధిక ఆదాయ వర్గాలపై పన్ను విధించటం లాంటి చర్యలు అశించిన ఫలితాలను సాధించటంలో విఫలమైనాయి. సంపద కొద్ది మంది చేతిలో బందీ కాకుండా నివారించాలంటే ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించవలసిన అవశ్యకత యున్నది.

**7. పెట్టుబడిని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రైవేటు పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందించవలసి రావటం :**

అభివృద్ధి చెందుతున్న దేశాలలోని పారిశ్రామికవేత్తలు తాము ఆశించిన పెట్టుబడిని మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వము అందిస్తేనే పరిశ్రమలు స్థాపించటానికి ముందుకు వస్తున్నారు. విదేశీ వ్యాపార ఒప్పందాలకు కూడా ప్రభుత్వ సహకారాన్ని పొందుచున్నారు. ఇటువంటి సమస్యలను ఎదుర్కొంటున్న ప్రభుత్వాలు ఆర్థిక ప్రయోజనాల సాధన కొరకు తామే పరిశ్రమలను స్థాపించటం మంచిదని భావించటం జరిగింది.

**8. రక్షణ అవసరాలను తీర్చుట కొరకు :**

దేశ రక్షణకు అవసరమైన ఆయుధాలను ఉత్పత్తి చేసే పరిశ్రమలు ప్రభుత్వ రంగంలోనే ఉండవలసిన ఆవశ్యకత ఉంది. జాతీయ భద్రత, రక్షణ ప్రాతిపదికగా ఈ పరిశ్రమలు ప్రైవేటు రంగంలో ఉండకూడదు. రక్షణకు సంబంధించిన రహస్యాలను ఇతరులకు తెలియకుండా జాగ్రత్త వహించాలి. ప్రభుత్వ రంగములో ఆ పరిశ్రమలు ఉన్నప్పుడు మాత్రమే అది సాధ్యపడుతుంది.

**9. ప్రభుత్వ విధానాలను సమర్ధవంతముగా అమలు పరచుటకు :**

ప్రభుత్వము తానాశించిన లక్ష్యాల సాధన కొరకు అనేక విధానాలను రూపొందిస్తుంది. ఉదా : ఉత్పత్తి చేసే వస్తువు స్వభావము, ధర నిర్ణయము, ఉద్యోగులు, మొదలైనవి. ప్రైవేటు పారిశ్రామిక వేత్తల లక్ష్యము స్వీయప్రయోజనాలు కనుక వారు ప్రభుత్వ విధానాలను ఆశించిన మేరకు అమలు పరచడానికి ఇష్టపడరు. ప్రభుత్వరంగ సంస్థల లక్ష్యము జాతీయ ప్రయోజనాల సాధన కనుక ప్రభుత్వ విధానాలను సక్రమముగా అమలుపరచి విధాన లక్ష్యాలను సాధించటానికి అవకాశముంటుంది.

**10. నమూనా పారిశ్రామికవేత్తగా :**

రాజ్యము, వ్యాపారము మరియు పరిశ్రమల రంగంలో పాల్గొనుట ద్వారా ఉత్తమ పారిశ్రామిక వేత్తకు నమూనాగా రూపొందవచ్చును. ప్రభుత్వ రంగ సంస్థల స్థాపన ద్వారా ఉత్తమ విలువలను, ఆదర్శాలను నెలకొల్పవచ్చును. ఉదా : మిగులు ఉద్యోగుల విషయములో, గృహవసతి కల్పించటం, కార్మికుల అంగీకారముతో విధానాలను రూపొందించటం, పారిశ్రామిక శిక్షణ, శ్రామికులకు సరియైన జీతభత్యములు చెల్లించుట, పరిశ్రమ పాలనా నిర్ణయాలలో శ్రామికులకు పాత్ర కల్పించటం ద్వారా ఉత్తమ పారిశ్రామిక వేత్తకు నమూనాగా ప్రైవేటు పారిశ్రామికవేత్తలకు మార్గదర్శకునిగా రూపొందవచ్చును.

**11. జాతీయ ఖజానాకు ధనమును సమకూర్చవచ్చును :**

ప్రభుత్వ రంగ సంస్థలు సాధించే లాభాలను సామాజిక అవసరాలను తీర్చటానికి ఉపయోగించవచ్చును. ఆ లాభాలను ఆర్థిక ప్రగతి సాధించటానికి పెట్టుబడిగా ఉపయోగించవచ్చును. పరిశ్రమలు ప్రైవేటు పారిశ్రామిక వేత్తల చేతిలో ఉన్నట్లయితే అవి ఆర్జించే లాభాలు వారి జేబులోనికి వెళతాయి కానీ జాతీయ ప్రయోజనాల సాధనకు ఏమాత్రమూ ఉపయోగపడవు. ప్రభుత్వము ప్రజల నుండి పన్నుల రూపంలో సమీకరించే వనరులు ప్రభుత్వం తన లక్ష్యాలను సాధించటానికి ఏమాత్రం సరిపోవు కనుక ప్రభుత్వ రంగ సంస్థలు సాధించే లాభాలు ప్రభుత్వానికి చాలా ఉపయోగపడతాయి.

**12 .పరిశోధన మరియు అభివృద్ధిని ప్రోత్సహించుట :**

దేశీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి పరచి, అభివృద్ధి చెందిన దేశాలపై ఆధారపడకుండా స్వయం సమృద్ధిని సాధించటానికి పరిశోధన మరియు అభివృద్ధిని ప్రోత్సహించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రైవేటు పారిశ్రామిక వేత్తలు పరిశోధన మరియు అభివృద్ధికి చేసే వ్యయం, వృధావ్యయంగా భావించటం జరుగుతుంది. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారానే ప్రభుత్వము పరిశోధనా మరియు అభివృద్ధిని సమర్ధవంతముగా సాధించగల్గుతుంది.

**13. విదేశీ మారక ద్రవ్యాన్ని సాధించవచ్చును :**

అభివృద్ధి చెందుతున్న దేశాలు, అభివృద్ధిని వేగవంతము చేయటానికి విదేశీ మారక ద్రవ్యాన్ని సాధించటం పెద్ద సమస్యగా ఉంటుంది. విదేశీ మారక ద్రవ్యాన్ని సాధించాలంటే దేశము నుండి మిగులు వస్తువులను, సేవలను ఇతర దేశాలకు విక్రయించగలగాలి లేక దిగుమతి చేసికొనే వస్తువులకు ప్రత్యామ్నాయ వస్తువులను తయారు చేసుకోవడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని వినియోగించటంలో పొదుపు పాటించాలి. అందువలననే భారతదేశము ప్రాథమిక పరిశ్రమలను స్థాపించి విదేశీ మారక ద్రవ్యాన్ని పొదుపు చేయగల్గుతుంది.

**14. ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడం :**

రాజ్యము వ్యాపార మరియు పారిశ్రామిక రంగాలలో పెద్ద ఎత్తున పాల్గొనుట ద్వారా ప్రత్యక్షముగా ఉద్యోగ అవకాశాలు

మెరుగుపడతాయి. అంతేకాక పరోక్షముగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ప్రత్యక్షముగా మరియు పరోక్షముగా ఉపాధి అవకాశాలు మెరుగుపడటం దేశాభివృద్ధికి దోహదం చేస్తుంది.

**15. జీవనస్థాయిని మెరుగు పరచడం :**

సామ్యవాద సమాజ స్థాపన ప్రభుత్వ లక్ష్యముగా ప్రకటించటంతో ప్రజలందరికీ ఉన్నత స్థాయి జీవితాన్ని కల్పించటం జాతీయ లక్ష్యంగా మారింది. పేదరికాన్ని నిర్మూలించి ప్రజలందరికీ ప్రాథమిక అవసరాలను (ఆహారము, గృహము, బట్టలు) తీర్చటం ప్రభుత్వ బాధ్యత. ప్రజావసరాలను తీర్చటానికి సరిపడినంత వస్తువుల, సేవల ఉత్పత్తిని పెంచవలసిన బాధ్యత ప్రభుత్వము పై ఉంది. వీటిని త్వరితగతిని సాధించాలంటే ప్రైవేటు రంగ సంస్థల కంటే ప్రభుత్వరంగ సంస్థలే ఈ లక్ష్యాలను సమర్థవంతముగా సాధించ గల్గుతాయి. పై కారణముల వలన ప్రభుత్వరంగ సంస్థలను స్థాపించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## 1.6 ప్రభుత్వ రంగ సంస్థలు - ఆర్థిక సామాజిక లక్ష్యాలు :

భారతదేశం స్వాతంత్ర్యం సాధించిన తరువాత ఆర్థిక ప్రగతిని సాధించటానికి మిశ్రమ ఆర్థిక వ్యవస్థను మార్గముగా ఎంచుకోవటం జరిగినది. ప్రభుత్వ రంగంలో పరిశ్రమలను స్థాపించి ఆర్థిక ప్రగతిని వేగవంతము చేయటానికి ప్రయత్నిస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థల స్థాపన లక్ష్యాలను ఈ క్రింద వివరించటం జరిగింది. ఈ లక్ష్యాలను స్థూలంగా మూడు భాగాలుగా విభజించవచ్చును.

1. ఆర్థిక లక్ష్యాలు
2. ఆర్థికేతర లక్ష్యాలు

ఆర్థికేతర లక్ష్యాలను మరల రెండుగా విభజించవచ్చును.

a) సామాజిక లక్ష్యాలు
b) రాజకీయ లక్ష్యాలు

3. ఇతర లక్ష్యాలు

ఈ లక్ష్యాలను గురించి క్రింద వివరించటం జరిగింది.

**1.6.1 ఆర్థిక లక్ష్యాలు :**

ఆర్థిక లక్ష్యాలలో కొన్ని ముఖ్యమైన వాటిని ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

**1. ఆర్థిక ప్రగతిని వేగవంతం చేయటం :**

ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించటంలో ముఖ్యమైన లక్ష్యం ఆర్థిక ప్రగతిని సాధించటం. భారతదేశం స్వాతంత్ర్యం సాధించే వరకు ప్రాథమిక పరిశ్రమలు, మౌలిక ఏర్పాట్లు విషయంలో చాలా వెనుకబడి ఉంది. ఆర్థిక ప్రగతి వేగవంతం కావాలంటే పై అవసరతలను ప్రైవేటు రంగం ఒక్కటే తీర్చలేదని భావించి ప్రభుత్వం కూడా ఆయా పరిశ్రమలను స్థాపించి ఆర్థిక ప్రగతిని వేగవంతం చేయాలని భావించింది.

**2. ప్రణాళికా లక్ష్యాలను సాధించటం :**

భారతదేశం ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధిని సాధించటం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రణాళికా బద్ధమైన ఆర్థిక ప్రగతిని సాధించటానికి ప్రభుత్వము వ్యాపార, పారిశ్రామిక రంగాలలో పాల్గొనటం ద్వారానే సాధ్యపడుతుంది.

**3. దేశ ఆదాయన్ని పెంపొందించటం :**

ప్రభుత్వరంగ సంస్థలు సాధించే లాభాలు భవిష్యత్ ప్రణాళికలకు పెట్టుబడిగా ఉపయోగపడతాయి. ప్రైవేటు రంగంలో సాధించబడే లాభాలు పారిశ్రామికవేత్తల జేబులోనికి వెళతాయి. ప్రభుత్వ రంగ సంస్థలు సాధించే లాభాలు దేశాభివృద్ధికి తోడ్పడతాయి.

**4. వివిధ పరిశ్రమల మధ్య సమతౌల్యతను సాధించటం :**

భారీ పరిశ్రమలు, నౌకానిర్మాణం, నూనె గింజలు, నూనె శుద్ధి కర్మాగారాలు, ఇంజనీరింగ్, రసాయన ఎరువులు లాంటి పరిశ్రమల స్థాపన మన ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకు వెళ్ళగలిగాయి. రైల్వేలు, అణుశక్తి, ఇంజనీరింగ్ ప్రాజెక్టులు, భారత ఆహార సంస్థ, ONGC లాంటి సంస్థల ఏర్పాటు ద్వారా వివిధ పరిశ్రమల స్థాపన మధ్య సమతౌల్యతను సాధించటానికి ప్రభుత్వ రంగ సంస్థలు దోహదము చేస్తాయి.

**5. విదేశీ మారకద్రవ్యమును పొదుపు చేయుట :**

ప్రభుత్వము కీలక పరిశ్రమలను స్థాపించుట వలన విదేశీ మారకద్రవ్యాన్ని పొదుపు చేయుటకు అవకాశమేర్పడింది. లేకపోతే వస్తువుల, సేవల దిగుమతి కొరకు పెద్ద మొత్తంలో విదేశీ మారకద్రవ్యాన్ని వ్యయము చేయవలసియుండేది. ఉదా : ONGC ని స్థాపించుట వలన చమురు దిగుమతిని తగ్గించుకొని పెద్ద మొత్తంలో విదేశీ మారకద్రవ్యాన్ని పొదుపు చేయుటకు వీలు కల్గింది.

**6. సరసమైన ధరలకు వస్తువులను, సేవలను ప్రజలకు అందించుట :**

రాజ్యము వ్యాపార, మార్కెట్ రంగాలలోకి కూడా ప్రవేశించింది. స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్, నేషనల్ టెక్స్టైల్ కార్పొరేషన్ లాంటి సంస్థల స్థాపన ద్వారా ప్రజలకు చాలినన్ని వస్తువులను, సరసమైన ధరలకు అందించుటకు ప్రయత్నిస్తుంది. ప్రభుత్వ లక్ష్యము కేవలం లాభాపేక్ష కాదు కనుక ప్రజలకు నాణ్యమైన వస్తువులను, సేవలను, సరసమైన ధరలకు అందించటానికి అవకాశము ఏర్పడుతుంది.

**1.6.2 ఆర్థికేతర లక్ష్యాలు :**

ఆర్థికేతర లక్ష్యాలను రెండుగా విభజించవచ్చును.

1. సామాజిక లక్ష్యాలు 2. రాజకీయ లక్ష్యాలు.

**1.6.2.1 సామాజిక లక్ష్యాలు :**

సామాజిక లక్ష్యాలను క్రింది విధముగా వివరించవచ్చును.

**1.ఉత్పత్తి కారకాలు, సంపద కేంద్రీకరించబడకుండా నివారించుట :**

కొద్దిమంది చేతిలో సంపద కేంద్రీకరించబడకుండా నిరోధించటానికి ప్రభుత్వ రంగ సంస్థలు దోహదము చేస్తాయి. ప్రభుత్వము పారిశ్రామిక వేత్తగా మరియు ఇతర నియంత్రణా పద్ధతుల ద్వారా పై లక్ష్యాన్ని సాధించటానికి ప్రయత్నిస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థలు ఉత్పత్తి కారకాలు, సంపద కేంద్రీకృతము కాకుండా నియంత్రించటం ద్వారా ఆర్థిక అసమానతలను కొంత మేరకు తగ్గించటానికి ప్రయత్నిస్తుంది.

**2. సమతౌల్య ప్రాంతీయాభివృద్ధి సాధించుట :**

ప్రభుత్వ రంగంలో పరిశ్రమలను స్థాపించటంలో ప్రభుత్వము సమతౌల్య ప్రాంతీయాభివృద్ధిని పరిగణనలోనికి తీసికొంటుంది. వివిధ ప్రాంతాలలో పరిశ్రమలను స్థాపించటం ద్వారా ప్రాంతీయ అసమానతలను తగ్గింటానికి ప్రయత్నిస్తుంది.

**3. ఆదాయ వ్యత్యాసాలను తగ్గించటం :**

ఉన్నత స్థాయి ఉద్యోగుల జీతభత్యాలపై సీలింగ్ విధించుట ద్వారా వివిధ ఉద్యోగుల ఆదాయాల మధ్య అసమానతలను

తగ్గించటకు ప్రయత్నించుచున్నది. ఈ లక్ష్యసాధనకు ప్రభుత్వ రంగ సంస్థలు దోహదము చేస్తున్నాయి.

**4. వెనుకబడిన వర్గాలకు సహాయపడటం :**

S.C మరియు S.T. వెనుకబడిన వర్గాల ప్రజలకు ఆయా ప్రభుత్వ రంగ సంస్థలలో సరియైన ప్రాతినిధ్యం కల్పించటం ద్వారా, అణగారిన వర్గాలకు చేయూతనిస్తుంది. ప్రైవేటు రంగసంస్థలు వ్యాపార దృక్పధంతో పనిచేస్తాయి. కనుక ఈ సామాజిక బాధ్యతను అవి గౌరవించవు.

**5. శ్రమ దోపిడీని అడ్డుకొనుట :**

ప్రభుత్వ రంగ సంస్థలు శ్రమదోపిడీని నివారించి, కార్మికులకు సరియైన ప్రాధాన్యతనిస్తూ సంస్థలో సుహృద్భావ వాతావరణం నెలకొల్పటానికి ప్రయత్నిస్తాయి.

**6. ఉద్యోగ అవకాశాలను పెంపొందింప చేయుట :**

ప్రభుత్వ రంగ సంస్థలు లక్షల కొలది ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నాయి. ఈ సంస్థల స్థాపన జరిగిన ప్రాంతములో ఆ ప్రాంత ప్రజలకు ఎక్కువ ఉద్యోగ అవకాశములను కల్పించటం జరుగుతుంది.

**7. అనుబంధ మరియు చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి :**

ప్రభుత్వ రంగ సంస్థలు, అనుబంధ సంస్థల అభివృద్ధికి మరియు చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి అవకాశము కల్పిస్తున్నాయి. ఆర్థిక సహకారము, సాంకేతిక పరిజ్ఞానము, యంత్ర పరికరాలను అందించటం ద్వారా అనేక మందికి ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తున్నాయి.

**1.6.2.2 రాజకీయ లక్ష్యాలు :**

ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటులో రాజకీయ లక్ష్యాలను ఈ క్రింది విధముగా వివరించవచ్చును.

**1. సామ్యవాద సమాజ స్థాపన :**

సామ్యవాద సమాజ స్థాపన భారతదేశం లక్ష్యంగా ప్రకటించింది. ఈ లక్ష్యసాధనకు ప్రభుత్వ రంగ సంస్థల స్థాపనే మార్గము. 1956 లో ప్రభుత్వము సామ్యవాద సమాజ స్థాపన తన లక్ష్యముగా ప్రకటించినప్పటి నుండి ప్రభుత్వ రంగ సంస్థల స్థాపనను విస్తృత పరచింది.

**2. ఆర్థిక వ్యవస్థను నియంత్రీకరించి ఉన్నత శిఖరాలకు చేర్చటం :**

వ్యూహాత్మక ప్రాధాన్యత కల్గిన పరిశ్రమలను ప్రభుత్వ రంగములో స్థాపించి ఆర్థిక వ్యవస్థను నియంత్రీకరించుట ద్వారా ఉన్నత శిఖరాలకు చేర్చటం ప్రభుత్వ లక్ష్యము. వనరులను సక్రమంగా సమీకరించక పోతే ఆర్థికాభివృద్ధి అసాధ్యమవుతుంది. ఈ లక్ష్యసాధన కొరకే ఇన్సూరెన్స్ కంపెనీలను, బ్యాంకులను జాతీయం చేయటం జరిగింది.

**3. సామ్యవాద దేశాలతో సంబంధాలు మెరుగు పరచుకోవడం :**

భారతదేశంలో అనేక పరిశ్రమలు సామ్యవాద దేశాల సాంకేతిక పరజ్ఞాన సహకారముతో ఏర్పాటు చేయటం జరిగింది. భారతదేశం మొదటి నుండి సామ్యవాద అనుకూల దృక్పధం కల్గిన దేశము కనుక BHEL, IDPL, బొకారో ఉక్కు కర్మాగారం, HAL మొదలైన పరిశ్రమల స్థాపనకు సామ్యవాద దేశాలు ఆర్థిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించటం జరిగింది.

**1.6.3 కొన్ని ఇతర లక్ష్యాలు :**

**1. ప్రైవేటు రంగము అభివృద్ధికి తోడ్పడుట :**

భారత ఆర్థిక విధానము మిశ్రమ ఆర్థిక విధానము కనుక ప్రభుత్వము తన విధానములో భాగంగా ప్రైవేటు రంగ అభివృద్ధికి కూడా చేయినందించి సమగ్ర ఆర్థికాభివృద్ధి సాధన లక్ష్యంగా పని చేస్తుంది. నష్టాల ఊబిలో చిక్కుకున్న పరిశ్రమలకు సహాయ సహకారాన్నందించి ఉత్పత్తికి, ఉద్యోగులకు రక్షణ కల్పిస్తుంది.

**2. శ్రామికులకు సరియైన ప్రాధాన్యత నివ్వటం :**

పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రమ దోపిడీ మరియు కార్మిక సంఘాల ఏర్పాటుకు అవకాశము లేని పరిస్థితులుండేవి. శ్రామికులకు తగిన ప్రాధాన్యతనిచ్చుట ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలు ఉత్తమ పారిశ్రామికవేత్తకు నమూనాగా వ్యవహరిస్తున్నాయి.

**3. ప్రైవేటు వ్యాపార సంస్థలతో పోటీ :**

ప్రైవేటు వ్యాపార సంస్థలతో, ప్రభుత్వ వ్యాపార సంస్థలు సామర్థ్యం విషయంలో పోటీపడటం అంత సులభం కాదు. ప్రభుత్వం సూపర్ బజార్, జాతీయ గృహ నిర్మాణ సంస్థల లాంటి సంస్థల ద్వారా సరసమైన ధరలతో ప్రైవేటురంగ సంస్థలకు ఆరోగ్యకరమైన పోటీ నిస్తున్నాయి.

**4. జాతీయ వనరులను శాస్త్రీయంగా ఉపయోగించుట :**

జాతీయ వనరులను సక్రమముగా శాస్త్రీయంగా ఉపయోగించుకొనవలసిన ఆవశ్యకత ఉన్నది. అశాస్త్రీయతకు తావు లేకుండా శాస్త్రీయంగా వనరులను ఉపయోగించుకోవటం మరియొక లక్ష్యము. పై లక్ష్యాల సాధన కొరకు ప్రభుత్వరంగం వేగంగా విస్తరించింది. అయితే ఇన్నేళ్ళ అనుభవంలో ప్రభుత్వరంగం ఏమేరకు ఆశించిన లక్ష్యాలను సాధించింది అని పరిశీలిస్తే 1991 లో ప్రభుత్వము రూపొందించిన నూతన పారిశ్రామిక విధానమే ఈ ప్రశ్నకు సమాధానమిస్తుంది.

## 1.7 నూతన పారిశ్రామిక విధానము July 1991 :

భారతదేశము స్వాతంత్ర్యము పొందినప్పటి నుండి ప్రభుత్వ రంగ సంస్థలకే పెద్దపీట వేసింది. నూతన పారిశ్రామిక విధానము (1991 ) ప్రభుత్వ రంగ సంస్థల పనితీరులో అనేక లోపాలను గుర్తించింది. సామర్థ్యానికి మించిన ఉద్యోగుల సంఖ్య, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసికొనకపోవడం, పరిశోధన, అభివృద్ధికి సరియైన ప్రాధాన్యత నివ్వకపోవటం, మానవ వనరుల అభివృద్ధి జరగకపోవటం, నష్టాలబాటలో పయనించటం లాంటి సమస్యలతో ఆశించిన లక్ష్యాలు సాధించబడలేదు. ప్రభుత్వ రంగం ప్రభుత్వానికి లాభాలను ఆర్జించి పెట్టకపోగా భారంగా పరిణమించాయి. కొన్ని కీలకమైన పరిశ్రమలు తప్ప సరియైన సాంకేతిక పరిజ్ఞానము లేని, అసమర్థత, అనుత్పాదక రంగాలలోని పరిశ్రమలను, ప్రైవేటు రంగము నిర్వహించ గల్గిన సామర్థ్యము ఆధారముగా ప్రైవేటురంగానికి అప్పగించటానికి చర్యలు చేపడుతుంది. ప్రభుత్వ ఆలోచనా దృక్పథములో వచ్చిన మార్పు విప్లవాత్మకమైనదైనప్పటికీ ఆచరణీయ వాస్తవాల ఆధారముగా మారుతున్న ప్రపంచ ఆర్థిక వాతావరణంతో పాటు ప్రభుత్వ రంగము నుండి ప్రైవేటు రంగమునకు మారక తప్పని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం భారతదేశం ఈ బాటలోనే పయనిస్తుంది.

## 1.8 సారాంశము :

దేశ ఆర్థిక ప్రగతిని శీఘ్రతరము చేయటానికి, ప్రగతిని సాధించటానికి అవసరమైన మౌలిక అవసరాలను ఏర్పాటు చేయటానికి, వివిధ రాష్ట్రాలలో పారిశ్రామిక అభివృద్ధిలో అసమతౌల్యాన్ని తగ్గించటానికి ప్రభుత్వ రంగ సంస్థలు దోహదము చేస్తాయని భావించటం జరిగింది. ప్రైవేటు రంగ సంస్థలను నియంత్రించటానికి, మరియు వాటికి మార్గదర్శకత్వం వహించటానికి ప్రభుత్వ రంగ సంస్థలు ఉపయోగపడతాయి. ప్రైవేటు రంగం విఫలమైన రంగాలలో ప్రభుత్వ రంగం ప్రవేశించటం జరిగింది. ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయము,

సాధించటానికి ప్రభుత్వ రంగ సంస్థలు దోహదము చేస్తాయి.

సమాజము యొక్క ఆర్థిక అవసరాలను తీర్చటంలో రాజ్యము జోక్యము చేసుకోవటమనేది సాధారణ విషయమే. 1991 ముందు కాలము వరకు భారత ప్రభుత్వము, వ్యాపార వేత్తగా, రక్షకునిగా కీలక పాత్ర పోషించింది. జాతీయ ప్రణాళికల ద్వారా స్వయంసమృద్ధిని సాధించటానికి ప్రయత్నిస్తుంది. సామాజిక అవసరాలను సమర్థవంతంగా తీర్చటానికి ప్రభుత్వరంగ సంస్థలను స్థాపించటం జరిగింది. పెట్టుబడిని అభివృద్ధి చేయటం, సహజవనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవటం, ఆదాయాన్ని, సంపదను వీలైనంత సమానముగా ప్రజలందరికీ పంచటం ప్రభుత్వము యొక్క లక్ష్యము. భారత మాజీ దివంగత ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించటం లోని లక్ష్యాలను ఈ క్రింది విధముగా వివరించటం జరిగింది.

1. ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థపై నియంత్రణను సాధించి ఆర్థిక వ్యవస్థను ఉన్నత శిఖరాలకు చేర్చటం.
2. లాభార్జన కంటే సామాజిక అవసరాలను తీర్చటం, వ్యూహాత్మకంగా విలువలను ఆధించటం.
3. ఆర్జించిన లాభాలను తిరిగి పెట్టుబడిగా పెట్టి ఆర్థిక ప్రగతిని వేగవంతం చేయటం.

ప్రభుత్వము దేశములోని వివిధ ప్రాంతాలలో పరిశ్రమల స్థాపనకు బాధ్యత వహించటం జరిగింది.

## 1.9 వ్యాస రూప ప్రశ్నలు :

1) ప్రభుత్వ రంగ సంస్థల లక్ష్యాలను వివరింపుము.
2) ప్రభుత్వ రంగ సంస్థల ఆర్థిక లక్ష్యాలను వివరింపుము.
3) ప్రభుత్వ రంగ సంస్థల స్థాపనలో హేతుబద్ధతను వివరింపుము.

## 1.10. లఘు వ్యాఖ్యలు :

1) ప్రభుత్వ రంగ సంస్థల సామాజిక లక్ష్యాలు.
2) 1991 నూతన పారిశ్రామిక విధానము.

## 1.11 చదవదగిన గ్రంథాలు :


1. Lakshmi Narain - Principles and Practice of Public Enterprise Management.
2. B.C. Tandon - Management of Public Enterprises in India.
3. Avasthi - Maheswari - Public Administration
4. A.H.Hanson - Parliament and Public Ownership.


**డా॥. బి. ఉదయ ప్రకాశ్**

*****

## పాఠం - 2

# ప్రభుత్వరంగ సంస్థల రూపాలు
# (FORMS OF PUBLIC ENTERPRISES)

## 2.0 లక్ష్యం

ప్రభుత్వరంగ సంస్థలు బ్రిటిష్ ప్రభుత్వం నుండి స్వతంత్ర భారతదేశానికి సంక్రమించాయి. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వరంగ సంస్థలు భారతదేశంలో గణనీయంగా విస్తరించాయి. భారత సామాజిక - ఆర్థికాభివృద్ధి సాధనకు అనేక ప్రభుత్వరంగ సంస్థాగత రూపాలను భారత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అవి ముఖ్యంగా మూడు రకాలు అవి. 1. శాఖాపరమైన వ్యవస్థలు, 2. ప్రభుత్వ కార్పోరేషన్లు, 3. ప్రభుత్వ కంపెనీలు. ప్రభుత్వరంగ సంస్థల సంస్థాగత రూపాలను వివరించడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయసూచిక :**


2.1. ప్రభుత్వరంగ సంస్థల రూపాలు - పరిచయం
2.2. శాఖాపరమైన ప్రభుత్వరంగ వ్యవస్థలు
    2.2.1. ప్రధాన లక్షణాలు
    2.2.2. లాభాలు
    2.2.3. నష్టాలు
2.3. ప్రభుత్వ కార్పోరేషన్లు
    2.3.1. వివిధ రకాల ప్రభుత్వ కార్పోరేషన్లు
    2.3.2. ప్రభుత్వ కార్పోరేషన్లు - ప్రయోజనాలు
    2.3.3. ప్రభుత్వ కార్పోరేషన్లు - లక్షణాలు
2.4. ప్రభుత్వ కంపెనీలు
    2.4.1. ప్రభుత్వ కంపెనీ - లక్షణాలు
    2.4.2. ప్రభుత్వ కంపెనీ స్థాపన - కారణాలు
    2.4.3. ప్రభుత్వ కంపెనీ - పరిమితులు
    2.4.4. హోల్డింగ్ కంపెనీ
2.5. సారాంశము
2.6. నమూనా ప్రశ్నలు
2.7. చదువదగిన గ్రంథాలు


## 2.1. ప్రభుత్వరంగ సంస్థల రూపాలు - పరిచయం

ప్రభుత్వరంగ సంస్థల సంస్థాగత రూపాలకు సంబంధించి స్పష్టమైన నిర్వచనాలు లేవు. ఒక వేళ ఒక సంస్థాగత రూపానికి సంబంధించి నిర్దిష్టమైన నిర్వచనం ఉన్నప్పటికీ, వాటి సంఖ్యకు సంబంధించి అసందిగ్ధత ఉంది. ఉదాహరణకు, ప్రభుత్వరంగ సంస్థల సర్వే 1998-99,

240 కేంద్ర ప్రభుత్వ కంపెనీలను పేర్కొనగా అదే కాలానికి కేంద్ర ప్రభుత్వ ఆడిట్ రిపోర్టు నెం. 2, 2000, ఆ సంఖ్యను 262గా పేర్కొంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించి ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. ప్రభుత్వరంగ సంస్థల సంస్థాగత రూపాలను వివరించడంలో ఈ అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి.

1947 సంవత్సరంలో బ్రిటిష్ ప్రభుత్వం నుండి స్వతంత్ర భారతదేశానికి గణనీయమైన పరిమాణంలో ప్రభుత్వరంగం (Public Sector) సంక్రమించింది. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం సత్వర ఆధునీకరణ సాధించడానికి సామాజిక ఆర్థిక ప్రగతిని తన లక్ష్యంగా నిర్ధారించుకుంది. ఈ దిశలో దేశ ప్రగతికి మిశ్రమ ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వ విధానంగా ఆచరించింది. ప్రభుత్వేతర సంస్థలతో పాటు ప్రభుత్వం వ్యాపార, పారిశ్రామిక రంగాలలోకి ప్రవేశించింది. వాస్తవానికి స్వాతంత్ర్యానికి పూర్వమే 1931లో కరాచి సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ "కీలక పరిశ్రమలు, సేవలు, ఖనిజ వనరులు, రైల్వేలు, నౌకా పరిశ్రమ, ప్రభుత్వానికి సంబంధించిన ఇతర విషయాలు లేదా విధులు రాజ్యం లేదా ప్రభుత్వం అధీనంలో ఉండాలి" అని తీర్మానించింది. ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటుకు ఈ తీర్మానం నాంది. భారత ప్రభుత్వం 1948లో రూపొందించిన ప్రధమ పారిశ్రామిక విధానం ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటును సూచించింది. 1956 పారిశ్రామిక విధానం ప్రభుత్వరంగ సంస్థల పరిధిని విశేషంగా విస్తృతం చేసింది. ఇది ప్రాథమిక, కీలకమైన పరిశ్రమలు ప్రభుత్వరంగంలోనే ఉండాలని నిర్ణయించింది. ఈ తీర్మానం ప్రకారం ఎ1 శ్రేణికి చెందిన 17 పరిశ్రమలను ప్రభుత్వ యాజమాన్యంలో ఉంచి బి1 శ్రేణికి చెందిన సామాజిక ప్రాముఖ్యం ఉన్న 12 పరిశ్రమలను ప్రభుత్వమే చేపట్టి మిగిలిన పరిశ్రమలన్నింటిని ప్రయివేటు సంస్థలకు కేటాయించింది. అప్పటి నుండి భారత సమాజ అవసరాలకు అనుగుణంగా అనేక సంస్థాగత రూపాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటి పరిధి, స్వభావంలో స్వతసిద్ధమైన బేధాలున్నాయి. ఉదాహరణకు కొన్ని ప్రభుత్వరంగ సంస్థలు పూర్తిగా ప్రగతిశీలమైనవి, అభివృద్ధి పరమైనవికాగా, కొన్ని ఆర్థిక స్వభావం ఉన్న పనులను నిర్వహిస్తున్నాయి.

శాసనంద్వారా న్యాయపరమైన అస్థిరత్వం, పారిశ్రామిక, వ్యాపార, ఆర్థిక, ప్రత్యేక సేవలనందించడానికి, ఆర్థిక, పాలనపరమైన స్వేచ్ఛను కలిగిన వ్యవస్థే ప్రభుత్వరంగ సంస్థ. ఎస్.ఎస్.ఖేరా అభిప్రాయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా రెండూ కలిసి సంయుక్తంగా పారిశ్రామిక, వ్యాపార, ఆర్థిక కార్యకలాపాలని స్వయంగా, స్వేచ్ఛగా నిర్వహించే, శాసనబద్ధంగా ఏర్పడిన సంస్థ ప్రభుత్వరంగ సంస్థ. భారతదేశంలో ప్రభుత్వరంగ సంస్థలు ముఖ్యంగా మూడు రకాలుగా వ్యవస్థీకృతమై ఉన్నాయి. అవి : 1. శాఖాపరమైన ప్రభుత్వరంగ వ్యవస్థలు, 2. ప్రభుత్వ కార్పొరేషన్లు, మరియు 3. ప్రభుత్వ కంపెనీలు.

## 2.2 శాఖాపరమైన ప్రభుత్వరంగ వ్యవస్థలు :

శాఖాపరమైన ప్రభుత్వరంగ వ్యవస్థలు ప్రాచీనమైనవి. భారత రైల్వే, తంతి-తపాల శాఖలు శాఖాపరమైన నిర్వాహణ రూపంలో తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. అణుశక్తి సంస్థలు, ఆయుధ కర్మగారాలు, బహుళార్ధ సాధక నదీ ప్రాజెక్టులు, టంకసాల, ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌లు, ప్రచురణల విభాగం శాఖాపరమైన వ్యవస్థలకు మరికొన్ని ఉదాహరణలు. కేంద్ర ప్రభుత్వ శాఖల వలె ఇవి ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తూ, నియంత్రించబడతాయి.

**2.2.1. ప్రధాన లక్షణాలు :** శాఖాపరమైన ప్రభుత్వరంగ సంస్థల ప్రధాన లక్షణాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు. అవి :

1. ఈ సంస్థలకు నిధులు పార్లమెంటు, ఆమోదించిన వార్షిక బడ్జెట్ గ్రాంటుల ద్వారా ప్రభుత్వం సమకూరుస్తుంది. ఈ సంస్థలకు వచ్చే మొత్తం ఆదాయం కానీ, వాటి ఆదాయంలో కొంత భాగం కాని ప్రభుత్వ ఖజానాకు చేరుతుంది.

2. ప్రభుత్వ పాలనా శాఖలకు వర్తించే విధంగా బడ్జెట్, ఆడిట్, అకౌంటింగ్ పద్ధతులు ఈ సంస్థలకు వర్తిస్తాయి.

3. ఈ సంస్థలలో శాశ్వత సివిల్ సర్వీసుకు చెందిన ఉద్యోగులు పనిచేస్తారు. ఇతర సివిల్ సర్వీసు ఉద్యోగులకు వర్తించే భర్తీ, సర్వీస్ నిబంధనలు ఈ సంస్థల ఉద్యోగులకు వర్తిస్తాయి.

4. కేంద్ర ప్రభుత్వం శాఖలకు అనుబంధంగా ప్రభుత్వరంగ సంస్థలు నిర్వహించబడి, శాఖాధిపతుల ప్రత్యక్ష నియంత్రణలో పనిచేస్తాయి. శాఖాపరమైన ప్రభుత్వరంగ సంస్థలు సంబంధిత మంత్రిత్వశాఖ నిర్వహించే మంత్రి ఆధీనంలో క్రమానుగత శ్రేణిలో నిర్వహించబడుతుంది. ఆ సంస్థ నిర్వహణ కార్యకలాపాలకు ఆ మంత్రి కేబినేట్‌కు పార్లమెంట్‌కు జవాబుదారిగా ఉంటాడు. వాటి పాలనా వ్యవహారాలను సీనియర్ సివిల్ సర్వీస్ ఉద్యోగులు నిర్వహిస్తారు.

5. ప్రభుత్వం మీద దావా వేయడానికి అవలంబించే పద్ధతులు ఈ సంస్థలకు వర్తిస్తాయి. ప్రభుత్వం అనుమతి లేనిదే ఈ సంస్థలపై దావా వేయడానికి వీలు లేదు.

**2.2.2. లాభాలు :** శాఖాపరమైన వ్యవస్థల వల్ల కొన్ని లాభాలున్నాయి. అవి :

1. శాఖాపరమైన ప్రభుత్వరంగ సంస్థలపై పార్లమెంటు సమర్ధవంతమైన నియంత్రణ చేస్తుంది.

2. ఈ సంస్థల నిర్వాహణకు మంత్రి పాలన బాధ్యత వహిస్తాడు. సంస్థ కార్యకలాపాలను సివిల్ సర్వీసు ఉద్యోగులు నిర్వహిస్తారు. సంబంధిత మంత్రి పార్లమెంటుకు బాధ్యత వహిస్తాడు.

3. ఈ సంస్థ నుండి వచ్చే ఆదాయం ఇతర ప్రభుత్వరంగ సంస్థ మాదిరిగా కాక నేరుగా ప్రభుత్వానికి అందుతుంది.

4. శాఖపరమైన ప్రభుత్వరంగ సంస్థకు, సంబంధిత మంత్రి వర్గ శాఖకు ఇతర ప్రభుత్వ పాలనా వ్యవస్థలకు మధ్య సంబంధాలు ఈ రూపానికున్న అదనపు లాభం.

**2.2.3. నష్టాలు :** కృష్ణమీనన్ కమిటీ నివేదిక శాఖాపరమైన ప్రభుత్వరంగ సంస్థల వల్ల కలిగే నష్టాలను వివరించింది. అవి :

1. శాఖాపరమైన ప్రభుత్వరంగ సంస్థకు చెందిన శాశ్వత ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే సర్వీసు నియమ నిబంధనలకు లోబడి పనిచెయ్యాలి. దీని వల్ల ఈ సంస్థల ఉద్యోగులకు మెరిట్ పద్ధతిలో పదోన్నతి రాదు. వీరిపై త్వరితగతిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి వీలులేదు.

2. ఈ సంస్థలలో కాలయాపనతో కూడుకున్న పద్ధతుల వలన నిధుల మంజూరులో ఎంతో జాప్యం జరుగుతుంది. ఉదాహరణకు ప్రతి ఒక్క సందర్భంలో ఖర్చుకు విధిగా అనుమతి ఉండాలి.

3. నగదు రశీదులను ప్రభుత్వ అకౌంటులో ఉంచాలి. ప్రత్యేక మంజూరు లేనిదే నిధులను తీసుకోరాదు.

4. క్లిష్టమైన ఆడిట్, అకౌంటింగ్ పద్ధతులు

5. ప్రభుత్వం, రాజకీయ నాయకుల జోక్యం

6. నిర్ణయం తీసుకోవడంలో చొరవకు స్థానం లేకపోవడం

7. దైనందిన నిర్వాహణ మీద పార్లమెంటుకు జవాబుదారీ

8. ప్రభుత్వ కార్పొరేషన్లకున్న విశేష హక్కులు శాఖాపరమైన సంస్థలకు ఉండవు.

9. ప్రభుత్వ కార్పొరేషన్ల విషయంలో మంత్రి కేవలం తాను తీసుకున్న చర్యలకే బాధ్యత వహిస్తాడు, కాని దైనందిన కార్యకలాపాలకు, విధాన నిర్ణయాలకు పార్లమెంటుకు జవాబుదారు కాడు.

10. శాఖాపరమైన ప్రభుత్వరంగ సంస్థల నిర్వాహణ అంచనాల సంఘం, ప్రభుత్వ ఖాతాల సంఘం పరిధిలోకి వస్తుంది. కాని ఇతర రకాల ప్రభుత్వరంగ వ్యవస్థలు ప్రభుత్వరంగ సంస్థల కమిటీ పరిధిలోకి వస్తాయి.

ప్రభుత్వ శాఖల ద్వారా నిర్వహించబడే శాఖాపర ప్రభుత్వరంగ సంస్థలు శాఖా వ్యవస్థీకరణ కుండే లోపాలను గురువుతుంటాయి. ఈ తరహా వ్యవస్థ వాణిజ్య, వ్యాపార కార్యకలాపాల నిర్వాహణకు ఉపయుక్తంగా ఉండదు. మంత్రులు తరచూ మారుతుంటారు. ఎవరి పద్ధతిలో వారు నిర్ణయాలు తీసుకుంటారు ఇది ఆ సంస్థ సమర్ధతను ప్రభావితం చేస్తుంది. ఈ సంస్థలలోఉద్యోగిస్వామ్య లాంఛనప్రాయ నియమ నిబంధనలు నిర్వాహణ సామర్ధ్యాన్ని దెబ్బ తీస్తాయి. అయినప్పటికి గోర్వాలా పేర్కొన్నట్లు కొన్ని రకాల ప్రభుత్వ కార్యకలాపాలకు శాఖాపరమైన ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటు తప్పనిసరి, ఉదాహరణకు, జాతీయ భద్రత, రక్షణ కార్యకలాపాలు వంటి లక్ష్య సాధనకు సంబంధించిన వాటికి శాఖాపరమైన సంస్థలు ఏర్పాటు ఎంతైనా అవసరం.

## 2.3 ప్రభుత్వ కార్పొరేషన్లు :

ప్రభుత్వ కార్పొరేషన్లు శాసనాత్మక సంస్థలు. ప్రభుత్వంచే నడపబడే వాణిజ్య కార్యకలాపాలకు ప్రభుత్వ కార్పొరేషను ఆదర్శవంతమైన సంస్థగా గుర్తించవచ్చు. రాబ్సన్ ప్రకారం ప్రభుత్వ వ్యవస్థల పరిధిలో ప్రభుత్వ కార్పొరేషను 20వ శతాబ్దపు నూతన వ్యవస్థ. ప్రభుత్వ కార్పొరేషన్లకు సాధారణంగా శాఖలలో కనిపించని పాలన, ఆర్థిక స్వయం ప్రతిపత్తులు కొంత వరకు ఉంటాయి.

**2.3.1. వివిధ రకాల ప్రభుత్వ కార్పొరేషన్లు :** యాజమాన్యం, నియంత్రణ దృష్ట్యా చూస్తే కార్పొరేషన్లు మూడు రకాలు అవి :

1. పెట్టుబడి లేదా వాటా మొత్తంగాని, దానిలో ఎక్కువ భాగం కాని ప్రభుత్వానిదై బోర్డు, డైరెక్టర్లు, అందరూగాని వారిలో మెజారిటీ గాని ప్రభుత్వం నియమించిన వారై ఉండే కార్పొరేషన్లు.
2. ప్రభుత్వం కొంత పెట్టుబడిని మాత్రమే పెట్టడంగాని, కొందరు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లను నియమించడంగాని, ఒక్కొక్కప్పుడు ఈ రెండు పనులూ కలిపి చేసే మిశ్రమ కార్పొరేషన్లు.
3. ప్రభుత్వ పెట్టుబడి అసలు లేకుండా, డైరెక్టర్ల బోర్డులో దానికి ప్రాతినిధ్యం లేకుండా ప్రభుత్వానికి కేవలం ఇన్‌కార్పొరేషన్ చట్టం క్రింద పర్యవేక్షించి నియంత్రణ చేసే అధికారం మాత్రం ఉండేవి. ప్రైవేటు కార్పొరేషన్లు, ఇన్సురెన్సు కంపెనీలు, మిశ్రమ వాటా కంపెనీలు ఈ తరగతికి చెందుతాయి.

భారత రాజ్యాంగం ప్రకారం కార్పొరేషన్లను నియమించి, వినిమయం చేసే అధికారం కేవలం పార్లమెంటుకు ఇవ్వబడింది. కాబట్టి కార్యనిర్వాహక చర్యల వల్ల కార్పొరేషన్లు నిర్మితం. పార్లమెంటు చట్టరీత్యా అనుమతిస్తేగాని రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్లను స్థాపించడానికి వీలు లేదు. ఇంతవరకు రోడ్డు రవాణా కార్పొరేషన్ చట్టము (1948), రాష్ట్ర ఆర్థిక కార్పొరేషన్ చట్టము (1951) లను పార్లమెంటు ఆమోదించింది. ఈ చట్టాల ననుసరించి అనేక రాష్ట్రాలు రోడ్డు రవాణా, ఆర్థిక కార్పొరేషన్లను స్థాపించాయి.

**2.3.2. ప్రభుత్వ కార్పొరేషన్ల ప్రయోజనాలు :** కార్పొరేషన్లు ముఖ్యంగా మూడు రకాల ప్రయోజనాల కోసం వ్యవస్థీకరింపబడతాయి.

ఒకటి, పరపతిని అందజేయడం లేదా విస్తరింపజేయడం కోసం ఏర్పాటు చేయబడే కార్పొరేషన్లు. ఉదా॥ పునరావాస విత్త కార్పొరేషన్ పారిశ్రామిక విత్త కార్పొరేషన్.

రెండు, పారిశ్రామిక వర్తక వాణిజ్య కార్యకలాపాలను నిర్వహించడం. ఉదా॥ రోడ్ రవాణా కార్పోరేషన్లు, విమాన కార్పొరేషన్లు.

మూడు ఏదో ఒక ప్రాంతపు బహుళార్థక ప్రయోజక పెంపుదలకు చేపట్టే కార్పొరేషన్లు. ఉదా॥ దామోదర్ లోయ కార్పొరేషన్.

**2.3.3. ప్రభుత్వ కార్పొరేషన్ లక్షణాలు :** ప్రభుత్వ కార్పొరేషన్ ఈ క్రింది ముఖ్య లక్షణాలు కలిగి ఉంటుంది.

1. ప్రభుత్వ కార్పొరేషన్లు పూర్తిగా రాజ్య నిర్వాహణలో ఉంటాయి.
2. ప్రభుత్వ కార్పొరేషన్ పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పాటు చేయబడుతుంది. దాని అధికారాలు విధులు, వ్యవస్థీకరణ, మంత్రిత్వ శాఖలతో, ప్రభుత్వ శాఖలలో దాని సంబంధాలను పార్లమెంటు చేసిన చట్టం వివరిస్తుంది.

3. ప్రభుత్వ కార్పొరేషన్ న్యాయపరంగా ఒక కార్పొరేట్ వ్యవస్థ. అది ఇతర సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకోవచ్చు, ఆస్తి సంపాదించుకోవచ్చు. ఆస్తులను అమ్మవచ్చు, దావా వేయవచ్చు. కార్పొరేషన్ మీద కూడా ఎవరైనా దావా వేయవచ్చు.

4. ప్రభుత్వ కార్పొరేషన్ ప్రభుత్వ బడ్జెట్ పరిధిలోకి రాదు. ప్రభుత్వ అకౌంటింగ్, ఆడిట్ చట్టాలు దీనికి వర్తించవు.

5. ప్రభుత్వ కార్పొరేషన్‌కు ఆర్థిక రంగంలో స్వేచ్ఛ ఉంటుంది. ప్రజలు ప్రభుత్వం నుంచి తీసుకున్న ఋణం, వస్తువులు లేదా సేవల అమ్మకం వలన వచ్చిన డబ్బు కార్పొరేషన్‌కు ఆదాయం అవుతుంది. దానికి అది సంపాదించిన ఆదాయాన్ని ఖర్చు చేసే అధికారం ఉంటుంది. ఒక వేళ నష్టం వస్తే ప్రభుత్వం ఉదారంగా ఆర్థిక సహాయం చేస్తుంది.

6. ప్రభుత్వ కార్పొరేషన్‌కు నిర్వాహణా స్వేచ్ఛా ఉంటుంది.

7. ప్రభుత్వ కార్పొరేషన్ ఉద్యోగి బృందాన్ని నియమిస్తుంది. ఉద్యోగుల భర్తీ, నియమ నిబంధనలను అనుసరించి జరుగుతుంది. ఉద్యోగి బృంద విషయాల్లో ప్రభుత్వ కార్పొరేషన్‌కు స్వేచ్ఛ ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులను ప్రభుత్వ కార్పొరేషన్‌లో డిప్యూటీషన్ మీద నియమించవచ్చు. ప్రభుత్వ సర్వీసు నియమ నిబంధనలు కార్పొరేషన్ ఉద్యోగి బృందానికి వర్తించవు.

ప్రభుత్వ కార్పొరేషన్లు వాణిజ్య పరంగా నిర్వహించబడినప్పటికి లాభార్జన వాటి ముఖ్య ధ్యేయం కాదు. లాభార్జన కంటే అవి ముఖ్యంగా జాతికి సేవ, జాతి సంక్షేమం కోసం పనిచేస్తాయి. కార్పొరేషన్ మీద పార్లమెంటు నియంత్రణ ఉంటుంది. ప్రభుత్వ కార్యనిర్వాహక శాఖ కార్పొరేషన్ బోర్డు సభ్యులను నియమిస్తుంది. వారిని కొనసాగించడం, తీసివేయడం, అనేది కూడా కార్యనిర్వాహక శాఖ అధికార పరిధిలో ఉంటుంది. బోర్డు సభ్యులు కార్పొరేషన్ విధాన నిర్ణయాలు చేస్తారు. ఆ విధానాలను అమలు జరిగేలా చూస్తారు. అయినప్పటికీ బోర్డు కార్యకలాపాలలో ప్రభుత్వ జోక్యానికి ఎంతో ఆస్కారం ఉంటుంది. కార్పొరేషన్ స్వేచ్ఛా నిర్వాహణకు ఇది అవరోధంగా ఉంటుంది. బోర్డు తన సంస్థ వార్షిక పాలనా నివేదికను కార్యనిర్వాహక శాఖకు చెందిన మంత్రికి అందిస్తుంది. మంత్రి ఆ నివేదికను శాసనసభలో ప్రవేశపెడతాడు. ఈ విధంగా కార్పొరేషన్ పై కార్యనిర్వాహక శాఖ నియంత్రణ ఉంటుంది. కార్పొరేషన్ వ్యవస్థ ప్రభుత్వ కార్యనిర్వాహక శాఖ పరిధిలోకి రాకుండా, పార్లమెంటు నియంత్రణలో ఉండాలని పాల్. హెచ్. ఆపిల్‌బీ అభిప్రాయం.

## 2.4. ప్రభుత్వ కంపెనీలు :

భారతదేశంలో కంపెనీ తరహా వ్యవస్థ అత్యంత విస్తృతంగా ఉపయోగించబడుతుంది. రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఏర్పాటు చేసిన దాదాపు అన్ని ప్రభుత్వరంగ సంస్థలను కంపెనీలుగా వ్యవస్థీకరించడమైంది. ఈ కాలంలో ఏర్పాటు చేసిన 33 ప్రభుత్వరంగ సంస్థల్లో 29 కంపెనీలు కాగా 3 పబ్లిక్ కార్పొరేషన్లు, ఒకటి శాఖాపరమైన ప్రభుత్వరంగ వ్యవస్థ.

ప్రభుత్వ కంపెనీని భారతదేశ కంపెనీల చట్టం సెక్షన్ 617 ప్రకారం ఏర్పాటు చేస్తారు. ఈ ప్రభుత్వ కంపెనీలో 51 శాతానికి తక్కువ కాకుండా షేర్లను కేంద్ర ప్రభుత్వంగాని, రాష్ట్ర ప్రభుత్వంగాని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గాని కల్గి ఉంటాయి. ఈ తరహా వ్యవస్థలో ప్రభుత్వము పూర్తిగా నిధులను కేటాయించవచ్చు లేదా ప్రయివేటు సంస్థలతో కలిసి పెట్టుబడి పెట్టవచ్చు.

**2.4.1. ప్రభుత్వ కంపెనీ లక్షణాలు :** ప్రభుత్వరంగ సంస్థలలో మరొక రకమైనది 'కంపెనీ వ్యవస్థ'. పాలనా సంస్కరణల సంఘం తాలూకు ప్రభుత్వరంగ సంస్థల అధ్యయన బృందం ప్రభుత్వ కంపెనీల ముఖ్య లక్షణాలను కింది విధంగా ఉదహరించింది.

1. ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల లక్షణాలు అనేకం ఉంటాయి.

2. కంపెనీ మూలధనంలో 51% లేదా అంతకన్నా ఎక్కువ ప్రభుత్వ వాటాలుంటాయి.

3. మూల ధనం వాటాను బట్టి కంపెనీ డైరెక్టర్లందరినీ లేదా వారిలో ఎక్కువ మందిని ప్రభుత్వం నియమిస్తుంది.

4. కంపెనీ చట్టం ఆధారంగా కంపెనీ వ్యవస్థను స్థాపించడం జరుగుతుంది.

5. కంపెనీ ఆస్తిపాస్తులను సంపాదించవచ్చు, ఒప్పందాలు కుదుర్చుకోవచ్చు, దావా వేయవచ్చు, కంపెనీ మీద దావా వేయవచ్చు.

6. కార్యనిర్వాహక ఉత్తర్వు ద్వారా కంపెనీ వ్యవస్థను స్థాపించవచ్చు. దీనికి పార్లమెంటు ఆమోదం అవసరం లేదు. కంపెనీ వ్యవస్థాపన ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌ను అనుసరించి ఉండాలి. నియమ నిబంధనలు చట్టానికి పరిమితమైనప్పటికీ ప్రభుత్వం వాటిని మార్చవచ్చు.

7. ప్రభుత్వం కంపెనీకి నిధులను సమకూరుస్తుంది. కొన్ని సందర్భాల్లో ప్రైవేటు వాటాదార్ల నుంచి నిధుల సేకరణ కూడా జరుగుతుంది.

8. ప్రభుత్వ బడ్జెట్, ఆడిట్, ఖాతా, ఉద్యోగి బృంద నియమాలు ప్రభుత్వ కంపెనీకి వర్తించవు.

9. కంపెనీలో పనిచేసే ఉద్యోగులు డిప్యూటేషన్ మీద వచ్చిన వారితో సహ సివిల్ ఉద్యోగులు కారు.

**2.4.2. ప్రభుత్వ కంపెనీ వ్యవస్థ స్థాపనకు కారణాలు :** భారతదేశంలోని ప్రభుత్వరంగ సంస్థలకు చాలా వరకు కంపెనీ వ్యవస్థే ఉంది. కొన్ని ప్రభుత్వ కంపెనీలలో మొత్తం పెట్టుబడులన్నీ కూడా ప్రభుత్వానివే. కంపెనీ వ్యవస్థను స్థాపించడానికి గల ప్రధాన కారణాలవి:

1. జాతీయ విదేశీ పారిశ్రామిక సంస్థల సహాయోగంతో పరిశ్రమలను కంపెనీ వ్యవస్తీకరణతో స్థాపించవచ్చు. ఉదాహరణకు హిందూస్థాన్ స్టీల్ లిమిటెడ్, హిందూస్థాన్ షిప్ యార్డ్ మొదలైనవి. భారత ప్రభుత్వంకు హిందూస్థాన్ షిప్ యార్డ్ పెట్టుబడులలో మూడోవంతు వాటాలున్నాయి.

2. ప్రభుత్వం కంపెనీని స్థాపించి తరువాత ప్రజలకు గాని, ప్రైవేటు సంస్థలకు గాని అప్పగించవచ్చు.

3. ఉద్యోగ, ఆర్థికపరమైన సంక్షోభ పరిస్థితులలో ఉన్న సంస్థను జాతీయ ఉత్పత్తిని, లేదా జాతీయ సేవలను దృష్టిలో ఉంచుకొని లాభదాయకంగా లేని, నష్టాలకు గురి అయిన ప్రైవేటు సంస్థను ప్రభుత్వం స్వాధీనపరుచుకొంటుంది. వాటాలను తీసికొని ప్రభుత్వం ఆ సంస్థను స్వాధీనపరచుకోవచ్చు. ఉదాహరణకు భారత ఇనుము, ఉక్కు కంపెనీ, మరెన్నో బట్టల మిల్లులు మొదలైన వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం జరిగింది. ప్రభుత్వం కంపెనీ తరహా సంస్థలను స్థాపించడానికి అనుకూలంగా ఉన్నట్లు కనబడుతుంది.

**2.4.3. ప్రభుత్వ కంపెనీ సంస్థ - పరిమితులు :** ప్రభుత్వ కంపెనీ సంస్థకు కొన్ని పరిమితులున్నాయి. వాటిలో కొన్ని ఇవి :

1. కంపెనీ ప్రభుత్వరంగ సంస్థ రాజ్యాంగపరమైన బాధ్యతలను తప్పించుకొంటుంది. ప్రభుత్వం, పార్లమెంటు నియంత్రణ నుంచి తప్పించుకొని, వాటికి బాధ్యత వహించదు.

2. ప్రభుత్వ కంపెనీ విధానం వ్యాపార సంస్థల నిర్వహణకు వర్తించే చట్టం వాస్తవంగా ఒక మిధ్యగా కనబడుతుంది. ఎందుకంటే, దాదాపు అన్ని విధులు వాటాదార్ల నిర్వహణలోనే ఉంటాయి. విశేషమేమిటంటే ఈ వివరణ అంతా కంపెనీ ఏర్పాటు కోసం ఉన్న చట్టంలోనే పేర్కొని ఉంటుంది. ప్రభుత్వ వాటాలు 51% గాని మొత్తం వాటాలు ప్రభుత్వానివే అయితే కంపెనీ నిర్వహణ ప్రభుత్వ ఆధీనంలోనే జరుగుతుంది.

ప్రభుత్వ కంపెనీ సంస్థకు ప్రభుత్వ కార్పోరేషన్‌కు చట్టపరమైన హోదా తప్పించి వేరే భేదాలు ఏమి లేవనే అభిప్రాయం హస్సన్ అనే రచయిత వెలిబుచ్చాడు. ప్రభుత్వ యాజమాన్య సంస్థలను కొనసాగించడం, కంపెనీ చట్టం మీద, రాజ్యాంగం మీద జరిగే దురుపయోగమని ఆడిటర్ జనరల్ అభిప్రాయం. కంపెనీ సంస్థలకే ప్రాధాన్యం ఎక్కువగా ఉంది. మన దేశమేగాక ఇతర దేశాలలో కూడా ప్రభుత్వరంగ సంస్థలను కంపెనీ విధాన సంస్థలుగా ఏర్పాటు చేయడం అతి సామాన్య విషయమైంది. ఎన్ని మార్పులను సూచించినప్పటికి, కంపెనీలూ, కార్పోరేషన్ల పనితీరు అంత సంతృప్తికరంగా లేనందువల్ల వాటి పని తీరుతెన్నులను పరిశీలించడానికి కంట్రోలర్ అండ్ ఆడిటర్ పర్యవేక్షణ నియంత్రణలో ఒక ఆడిట్ బోర్డులను ఏర్పాటు చేయాలని పాలనా సంస్కరణల సంఘం సూచించింది. తత్ఫలితంగా 1969వ సంవత్సరంలో ఒక ఆడిట్ బోర్డును ఏర్పాటు చేశారు. ఏది ఏమైనప్పటికీ భారత దేశంలో మాత్రం కంపెనీ తరహా ప్రభుత్వరంగ సంస్థ స్థాపనకే అనుకూలత కనబడుతుంది.

**2.4.4. హోల్డింగ్ కంపెనీ :** ప్రభుత్వరంగ సంస్థలకు హోల్డింగ్ కంపెనీ మాదిరి వ్యవస్థ కొత్త. 1967 సంవత్సరంలో పరిపాలన సంస్కరణల సంఘం రంగం వారీ కార్పొరేషన్ల ఏర్పాటును సిఫార్సు చేసింది. ఇవి హోల్డింగ్ కంపెనీలకు భిన్నమైనవి కావు. ఇనుము, ఉక్కు, ఇంజనీరింగ్ యంత్ర సామాగ్రి పరికరాలు, ఎలక్ట్రికల్స్, బొగ్గు, లిగ్నైట్, పెట్రోలియం, పెట్రోరసాయనాలు, ఇనుము, ఇతర పదార్థాల తవ్వకంతో పాటు నాన్ ఫెర్రస్ లోహాల తవ్వకం, ప్రాసెసింగ్, రసాయన ఎరువులు, రసాయనాలు, ఔషధాలు, వాయురవాణా, నౌకా రవాణా, హోటళ్ళు, పర్యటన రంగాల్లోని పారిశ్రామిక, ఉత్పత్తి సంస్థలన్నింటిని రంగం వారీ కార్పొరేషన్లుగా వర్గీకరించాలని ఈ సంఘం సిఫార్సు చేసింది. ఈ విధంగా ఒకే నిర్వాహణా రంగంలోని లేదా పరస్పరం సౌష్టవమైన వాణిజ్య లేదా సాంకేతిక సంబంధాలున్న సంస్థలను ఉమ్మడి నిర్వాహణ కింద ఒకటిగా సమైఖ్యం చేయాలనే ధోరణి వ్యక్తమయింది. జనవరి 1973లో భారత స్టీల్ అధారిటీ ఏర్పాటు చేయడం ఈ తరహా కంపెనీ వ్యవస్థాపనకు నాంది.

భారత స్టీల్ అధారిటీ అత్యుత్తమమైనది. దీనికి ప్రభుత్వరంగ ఉక్కు పరిశ్రమలు హిందుస్థాన్ స్టీల్, బొకారో స్టీల్ వంటివి అనుబంధ సంస్థలుగా ఉంటాయి. నిర్దేశ, నియంత్రణ, సమన్వయ విధులన్నిటిని ఈ అధారిటీ చేస్తుంది. ఈ అధారిటీ అనుబంధ సంస్థల ఆర్థిక అవసరాలను నిర్ణయించి ఏకీకృత బడ్జెట్‌ను ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ప్రభుత్వం నుంచి ఈ ఆధీన బద్ధ సంస్థలకు ఏమైన ఆర్థిక అవసరాలు గనక ఉన్నట్లయితే వాటిని అధారిటీయే ఈక్విటీలు లేదా ఋణాల ద్వారా వాటికి సమకూరుస్తుంది. ఆర్థిక వనరులను ఆ సంస్థలు వినియోగించుకోవడంలో ప్రభుత్వం సహాయపడుతుంది. ప్రభుత్వం తన అనుబంధ సంస్థల కోసం అధారిటీ తీసుకున్న ఋణాలపై స్వల్పంగా సర్వీస్ ఛార్జి విధిస్తుంది. ఈ అధారిటీలో ఒక ఛైర్మన్, ముగ్గురు డైరెక్టర్లు, 10 మంది పార్ట్ టైం డైరెక్టర్లు ఉంటారు. జాతీయ చేనేత జౌళి సంస్థ, కోల్ అధారిటీ ఆఫ్ ఇండియా అనేవి ఇతర హోల్టింగ్ కంపెనీలు.

అర్జున్ సేన్ గుప్తా కమిటి (1985) హోల్టింగ్ కంపెనీ తరహా వ్యవస్థలో ఒక ప్రయోజనాన్ని వివరించింది. ఈ మాదిరి వ్యవస్థలో ప్రభుత్వ జోక్యం కేవలం హోల్డింగ్ కంపెనీ స్థాయికే పరిమితమై ఉంటుంది. ఫలితంగా దాని అనుబంధ సంస్థలు తమ తమ దైనందిన కార్యనిర్వాహణలకు సంబంధించినంత వరకు స్వతంత్రులుగా ఉంటాయి. హోల్టింగ్ కంపెనీ వికేంద్రీకృత విధాన రూపకల్పన ప్రోత్సాహిస్తుంది. ఒక సాధారణ నియమంగా ప్రభుత్వ అధీన బద్ధ సంస్థలు అనుభవించే స్వతంత్ర ప్రతిపత్తికి ప్రభుత్వ లాంఛనరహిత జోక్యం కంటే ఎక్కువ లాంఛనప్రాయ జోక్యమే ప్రతిబంధకం అవుతుంది.

## 2.5. సారాంశము :

భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత ఎదురైన ప్రధాన సమస్యలలో ఆర్థికాభివృద్ధి సాధన ఒకటి. ఆర్థికాభివృద్ధి సాధనకు మిశ్రమ ఆర్థిక వ్యవస్థ విధానాన్ని అవలంబించి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సేవలను ఉపయోగించుకోవాలన్నది భారత ప్రభుత్వ విధానం. ఈ విధాన వ్యవస్థలో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు అభివృద్ధికి పాటుపడాలి. ఆర్థికాభివృద్ధికి 1948లో రూపొందించిన ప్రథమ పారిశ్రామిక విధానం ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటును సూచించింది. ఆర్థిక అసమానత్వాన్ని తొలగించడానికి, ఆర్థిక శక్తి కేవలం కొందరి చేతుల్లో ఉండకుండా చేసేందుకు, పౌరులను పీడన నుంచి కాపాడటానికి ప్రభుత్వ రంగ సంస్థలను నెలకొల్పడం, విస్తరించడం జరిగింది. అంతేకాకుండా ప్రయివేటు రంగ శక్తి సామర్థ్యాలకు అతీతమైన పరిశ్రమలు ప్రభుత్వరంగ సంస్థలలోనే ఉండాలనే అభిప్రాయం 1956 సంవత్సరంలో రూపొందించిన పారిశ్రామిక విధానంలోనే ఉంది. కేంద్ర ప్రభుత్వమే కాక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆర్థిక, పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వరంగ సంస్థలను స్థాపిస్తాయి.

ప్రభుత్వరంగ సంస్థలు అనేక రూపాలలో ఉంటాయి. అయితే ముఖ్యంగా ప్రభుత్వరంగ రూపాలు మూడు రకాలు. అవి : 1. శాఖాపరమైన ప్రభుత్వరంగ సంస్థలు, 2. ప్రభుత్వ కార్పొరేషన్లు, మరియు 3. ప్రభుత్వ కంపెనీలు. వ్యవస్థాపరంగా దేని లాభాలు, లోపాలు దానికున్నాయి. శాఖాపరమైన ప్రభుత్వరంగ సంస్థలు అత్యంత ప్రాచీనమైనవి. అయితే దీనిలో ఉండే కాఠిన్యం, జాప్యాల కారణంగా ప్రస్తుతం ఆ రూపం పట్ల ప్రభుత్వం మొగ్గు చూపడం లేదు. రైల్వే, తంతితపాలా శాఖలు. శాఖాపరమైన నిర్వాహణ రూపంలో తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లో అత్యంత ఉత్సాహంతో ప్రభుత్వ కార్పొరేషన్ల

ఏర్పాటు చెయ్యబడ్డాయి. దామోదర్ వేలీ కార్పొరేషన్, పారిశ్రామిక ఆర్థిక విత్త సంస్థను తొలి దశలో ఏర్పాటు చేయడం జరిగింది. తరువాత కాలంలో కంపెనీ తరహా వ్యవస్థను అత్యంత విస్తృతంగా ఉపయోగించడమైంది. 1967లో పరిపాలనా సంస్కరణల సంఘం సిఫార్సు మేరకు కంపెనీ తరహాలో ఒక రకమైన హోల్డింగ్ కంపెనీ వ్యవస్థా రూపాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. దీనికి ఉదాహరణ భారత స్టీల్ అథారిటీ. ముఖ్యంగా గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే ఆదర్శవంతమైన ప్రభుత్వరంగ సంస్థల స్వరూపం ఈ విధంగా ఉండాలని నిర్ధారించడానికి వీలు లేదు. కాబట్టి ప్రభుత్వ రంగ సంస్థల రూపాలను సందర్భానుసారంగా నిర్ధారించాలి.

## 2.6. నమూనా ప్రశ్నలు :

### 1) వ్యాస రూప ప్రశ్నలు

1. ప్రభుత్వరంగ సంస్థల రూపాలపై ఒక వ్యాసము వ్రాయుము.
2. శాఖాపరమైన ప్రభుత్వరంగ సంస్థల ప్రధాన లక్షణాలు పేర్కొని, వాటి లాభ, నష్టాలను వివరింపుము.
3. "భారతదేశంలోని ప్రభుత్వరంగ సంస్థలకు చాలా వరకు కంపెనీ వ్యవస్థ ఉంది" పరిశీలింపుము.
4. ప్రభుత్వ కార్పొరేషన్ల ప్రయోజనాలు, లక్షణాలు వివరింపుము.

### 2) లఘు రూప ప్రశ్నలు :

1. ప్రభుత్వ కార్పొరేషన్
2. ప్రభుత్వ కంపెనీ వ్యవస్థాపన కారణాలు
3. హోల్డింగ్ కంపెనీ
4. ప్రభుత్వరంగ సంస్థల రూపాలు

## 2.7. చదువదగిన గ్రంథాలు


1. ఎమ్.పి. శర్మ : ప్రభుత్వపాలనా - సిద్ధాంతం, ఆచరణ
2. వి. శివలింగ ప్రసాద్ : భారతదేశ పాలన
3. యస్.ఆర్. మహేశ్వరి : భారతీయ పాలన శాస్త్రం
4. Laxmi Narain : Public Enterprises Managment and Privatisation
5. Hoshiar Singh & Mohinder Singh : Public Administration in India.


**డా॥ పి.వి.వి. సుబ్రహ్మణ్యం**

## పాఠం - 3

# ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణా బోర్డులు

### 3.0 లక్ష్యం

ప్రభుత్వరంగ సంస్థలలో బోర్డులు చాలా ముఖ్యమైన పాత్రను నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వరంగ సంస్థల సామర్థ్యం లేక వైఫల్యం బోర్డుల మీదనే ఆధారపడి ఉంటుంది. అంటే దానర్థం బోర్డులలోని సభ్యుల శక్తి సామర్థ్యాలపై ప్రభుత్వరంగ సంస్థల విజయం ఆధారపడివుంటుంది. బోర్డులలో సర్వసాధారణంగా వివిధ రంగాలలో ప్రత్యేక పరిజ్ఞానంతోపాటు అనుభవశాలులైన నిపుణులు వుంటారు. వీరు తమ శక్తియుక్తులను ఉపయోగించి బోర్డు ద్వారా ప్రభుత్వరంగ సంస్థల విజయానికి దోహదపడతారు. ప్రభుత్వరంగ సంస్థల పురోగతి లేదా తిరోగతి అనేది బోర్డులపైనే ఆధారపడి వుంటుందనేది నగ్న సత్యం. ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణా బోర్డుల రకాలు, బోర్డు విధులు, నియామకపు అధికారం, బోర్డు సభ్యుల ప్రాతినిధ్యం మరియు బోర్డు పరిమాణంలను గురించి వివరించడమే ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

### విషయసూచిక :


3.1 నిర్వహణ బోర్డులు - పరిచయము

3.2 బోర్డులు - రకాలు

3.3 విధానాల బోర్డులు

3.4 విద్యుక్త బోర్డు

3.5 మిశ్రమ బోర్డు

3.6 నిర్వహణా బోర్డుల విధులు

3.7 నియామకపు అధికారం

3.8 బోర్డు సభ్యుల ప్రాతినిధ్యం

3.9 బోర్డు పరిమాణం

3.10 బోర్డు సభ్యుల కాల పరిమితి

3.11 సారాంశము

3.12 నమూనా ప్రశ్నలు

3.13 చదువదగిన గ్రంథాలు


### 3.1. నిర్వహణాబోర్డులు - పరిచయం :

ప్రభుత్వరంగ సంస్థల బోర్డును లాంఛనంగా పరిశీలించినట్లయితే అవి యాజమాన్య హక్కును కలిగి ఉన్నట్లుగా గుర్తించాలి. బోర్డు నిర్మాణం కార్పొరేటుకు ప్రతిబింబంగా ఉంటుంది. ప్రప్రథమంగా బోర్డులు ప్రభుత్వేతర వ్యాపార రంగాలలో చాలా ప్రసిద్ధి చెందాయి. అటు తర్వాతనే వీటిని ప్రభుత్వ రంగాలలో ప్రవేశపెట్టడం జరిగింది. ప్రభుత్వేతర రంగాలలో ఇవి ప్రసిద్ధి చెందడానికి కారణం ఏమంటే ఒకే వ్యక్తి నిర్వహణలో కంటే కొంత మంది వ్యక్తుల నిర్వహణలో తమ పెట్టుబడి సంస్థలో సురక్షితంగా ఉంటుందని సంస్థలోని భాగస్వాములు

భావించటం వల్ల ఈ నిర్వహణ బోర్డులు ప్రభుత్వరంగ సంస్థలలో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలలో బోర్డు ప్రభుత్వానికీ, కార్యనిర్వాహకులకూ మధ్య సత్ సంబంధాలను ఏర్పరచడానికి దోహదం చేస్తుంది. బోర్డు అన్ని విధానాలకు సమన్వయం చేకూర్చే ప్రాతినిధ్యపు సంస్థగా గుర్తించడం జరిగింది. వివిధ రకాలైన అనుభవాలు, విజ్ఞానం ఉన్న సభ్యుల కూటమి కావటం వల్ల బోర్డు ప్రభుత్వరంగ సంస్థల లక్ష్య సాధనకు తోడ్పడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రభుత్వం పెట్టుబడి పెడుతుంది కాబట్టి ప్రయివేటు రంగ సంస్థ మాదిరి వాటాదార్ల ఆమోదం అవసరం లేదు. ప్రభుత్వరంగ సంస్థలలో విధాన నిర్ణయాలలో, అర్థ వివరణలో సంస్థకు మార్గదర్శకత్వం వహిస్తూ సంస్థను నియంత్రించడానికి నిర్వహణా బోర్డు ఖచ్చితమైన కీలక పాత్ర నిర్వహించవలసి ఉంటుంది. ప్రభుత్వ రంగ సంస్థల విధాన నిర్ణయాలను పార్లమెంటు మరియు మంత్రులు చేయడం వల్ల బోర్డుకు గల స్థాయిననుసరించి నిర్వహణలో ఉమ్మడి ఆలోచనకు ఉమ్మడి నాయకత్వానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ కారణాల ఆధారంగా ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వహణ బోర్డులను ఒక ప్రధాన కార్యనిర్వాహకుని అధ్యక్షతన లేదా అధ్యక్ష తరహా నిర్వహణ దర్శకుని ఆధీనంలో ఉంచాలనే విధానాన్ని భారతదేశంలోని ప్రభుత్వ సంస్థలలో కనిపిస్తుంది.

ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణా బోర్డు విధాన తయారీలోను, విధాన విశ్లేషణలోను, మార్గదర్శకత్వం మరియు నియంత్రణలలో చాలా ముఖ్య భూమిక పోషిస్తుంది. ఈ క్రింది అంశాలను అవగాహన చేసుకొన్నట్లయితే ఈ బోర్డులు యొక్క ఆవశ్యకత విశదమౌతుంది.

ఎ) ఈ బోర్డు ప్రభుత్వానికి, ప్రభుత్వాధికారులకు మరియు సాధారణ ప్రజలకు మధ్య కావాల్సిన లింకును ఏర్పాటు చేస్తుంది.

బి) ప్రభుత్వం తయారుచేసిన విధానాలను సమర్థవంతంగా మరియు విజయవంతంగా విశ్లేషించి, అమలు చేసి నిర్ణయించిన లక్ష్యాన్ని చేరుకోవాలంటే అది బోర్డు ద్వారానే సాధ్యమౌతుంది.

సి) పాల్ ఆపల్‌బి చెప్పినట్లుగా బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ చేతిలో మేజర్ ఏమీ లేదు. కాని ఈ బోర్డులు ప్రభుత్వాధికారంచే పటిష్టంగా ఉండి సాంప్రదాయ బద్ధంగా పనిచేస్తున్నాయి.

డి) ఈ బోర్డుల నిర్వహణ ద్వారా ప్రజాస్వామ్య పద్ధతిలో నాయకత్వ పురోభివృద్ధి సాధ్యపడుతుంది. ఒకే నాయకుడి ఆధీనంలో నియంతృత్వ ధోరణులు ఏర్పడి ఇతర వ్యక్తులకు అవకాశం ఉండదు.

ఇ) ఈ బోర్డుల నిర్వహణ వల్ల ప్రభుత్వ సంస్థలు మరియు వాటి విధానాలు కొనసాగింపు, నిరంతర మార్గ దర్శకత్వం లభిస్తుంది. అదే కనుక ఏకనాయకత్వంలో అయితే ఆ నాయకుని మరణం వల్ల కాని, నాయకత్వ మార్పు వల్ల కాని విధానాల నిరంతర కొనసాగింపుకు అంతరాయం ఏర్పడుతుంది.

యఫ్) తగినంత స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ప్రభుత్వ రంగ సంస్థల బోర్డులకు ఇచ్చినట్లయితే అవి చాలా శక్తివంతంగా పని చేస్తాయి. అంతేగాక బోర్డులు ప్రభుత్వరంగ సంస్థల పనితీరును పరిశీలించి, మూల్యాంకన చేయడానికి వీలుపడుతుంది.

జి) శక్తి కేంద్రీకరణను నిరోధించడానికి, కావల్సినంత అధికారాన్ని క్రింది స్థాయిలకు దత్తత చేయడానికి బోర్డులు చాలా అవసరం. కారణం ఏకపాలకుని నాయకత్వంలో శక్తి కేంద్రీకరణ మరియు అధికారాన్ని క్రింది స్థాయిలకు దత్తత చేయకపోవటం జరుగుతుంది.

## 3.2 బోర్డులు - రకాలు :

ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ బోర్డులను పరిశీలించినట్లయితే అవి మూడు రకాలుగా ఉంటాయని విశదమౌతుంది. అంటే ఈ బోర్డులను మూడు రకాలుగా విభజించవచ్చు. అవి : మొదటిది - విధానాల బోర్డు, రెండవది - విద్యుక్త బోర్డు మరియు మూడవది - మిశ్రమ బోర్డు. మొదటి బోర్డుకు అంటే విధానాల బోర్డుకు విద్యుక్త బాధ్యతలుండవు. ఇది కేవలం సలహారూపకంగా, శాసన పర్యవేక్షణ రూపకంగా, విధానాల రూపకర్తగా వుంటుంది. ఈ బోర్డు సాధారణ విధానాలకు సంబంధించిన విధి నిర్వర్తిస్తుంది. ఇక రెండవది విద్యుక్త బోర్డు. ఈ బోర్డు వృత్తిపరమైన సభ్యుల ఆధిపత్యంతో కూడి ఉండి ఉన్నత స్థాయి బాద్యతలను నిర్వహించేవారుగా ఉంటారు. సంస్థ విధానాల నిర్ణయానికి వీరందరూ బాధ్యులు. వ్యక్తిగతంగా దాని విద్యుక్త విధి నిర్వహణకు కూడా బాధ్యత వహిస్తారు. చివరిగా మిశ్రమ

బోర్డులు. ఈ బోర్డు విధానాల బోర్డుకు, విద్యుక్త బోర్డుకు మధ్యస్థంగా వుంటుంది. మిశ్రమ బోర్డు వల్ల ప్రభుత్వ రంగ సంస్థకు విధానాల బోర్డు, విద్యుక్త బోర్డుకు గల లాభాలు సంస్థ సంతరించుకుంటుంది.

## 3.3 విధానాల బోర్డు (Policy Board) :

ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణా బోర్డులలో మొదటిది విధానాల బోర్డు. విధానాల బోర్డు విధాన తయారీ, పర్యవేక్షణ, సలహా రూపక మరియు అధికారిగా ఉంటుంది. ఈ బోర్డులో పూర్తికాల మరియు పరిమిత కాల సభ్యులు ఉంటారు. వీరిని సంపూర్ణకాల, అసంపూర్ణకాల సభ్యులు అంటారు. వీరు సంస్థ యొక్క ప్రత్యేక విధులకు సంబంధించిన కార్యనిర్వాహక అధికారానికి బాధ్యత వహించరు. ఈ బోర్డుకు కేవలం పర్యవేక్షణ లక్షణం ఉంటుంది. విధానాల బోర్డు సాధారణ విధానాలకు సంబంధించిన విధులు నిర్వర్తిస్తుంది.

**3.3.1. విధానాల బోర్డు స్వభావం :** విధానాల బోర్డు ప్రభుత్వ రంగ సంస్థలో ఈ క్రింది స్వభావాన్ని కలిగి ఉంటాయి.

1. ఈ బోర్డు పర్యవేక్షణ అధికార స్వభావాన్ని కలిగి కేవలం సాధారణ విధానాలకు పరిమితం అవుతుంది.
2. ప్రత్యక్ష విధి నిర్వహణా బాధ్యతలు కలిగి ఉంటుంది.
3. ఈ బోర్డులో సంపూర్ణకాల, అసంపూర్ణకాల సభ్యులు ఉంటారు.
4. ఈ బోర్డులకు ప్రభుత్వరంగ సంస్థల సమిష్టి పర్యవేక్షణ అధికారం ఉంటుంది. ఇవి విధానాల ద్వారా లక్ష్యాలను గుర్తిస్తాయి.
5. విధానాల బోర్డులోని సభ్యులకు ప్రత్యేక పరిజ్ఞానం ఉన్నవారే ఉండాలన్న నిబంధన లేదు. వ్యాపార పారిశ్రామిక రంగాలలో అనుభవజ్ఞులైతే చాలు.

**3.3.2. విధానాల బోర్డు యొక్క లాభాలు :**

1. బోర్డు సభ్యుల నియామకంలో సంబంధిత మంత్రి తనకున్న అధికార స్వాతంత్ర్యంతో సభ్యులను ఏ రంగంలో నుంచి అయినా నియమించవచ్చు. సమిష్టిగా వ్యక్తులతో కలసి సామూహిక నిర్దేశత్వాన్ని ఇవ్వగల వ్యక్తిని బోర్డులో సభ్యునిగా నియమించవచ్చు.
2. విధానాల బోర్డు ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణపై స్వతంత్రంగా వ్యవహరిస్తూ విమర్శనాత్మక దృష్టితో వాటి నిర్వహణను పర్యవేక్షించగలదు. దీనికి నిర్వహణలో ప్రత్యక్షంగా పాల్గొనే అవసరం ఉండదు.
3. విధానాల బోర్డు సంస్థ నిర్వహణనను సాధారణ దృష్టితో పరిశీలిస్తూ అవసరమైన విధానాలను తయారు చేసి సంస్థకు అప్పగిస్తుంది.
4. ఈ బోర్డు ద్వారా శ్రామికుల భాగస్వామ్యాన్ని సంస్థలో పెంచవచ్చు. అంతేగాక ప్రజా సంబంధాలను సమర్థవంతంగా నిర్వహించవచ్చు.
5. విధానాల బోర్డులకు ఆజ్ఞలు ఇవ్వడానికి తగిన అధికారం ఉంటుంది.
6. విధానాల బోర్డల ద్వారా ప్రభుత్వ చట్టాలను, సూచనలు ఆధారంగా దేశ జనాభాకు లాభం చేకూర్చే విధంగా అర్థ వివరణ చేయించవచ్చు.

**3.3.3. విధానాల బోర్డు ద్వారా నష్టాలు :**

1. విధానాల బోర్డులో విధానాలు తయారుచేసి వాటి అమలుకు బాధ్యత వహించరు.
2. విధానాల బోర్డులో అధికంగా రాజకీయ నాయకులు అనధికార సభ్యులుగా చేరి సంస్థకు బోర్డు ద్వారా లభించే మార్గదర్శకత్వం, అనుభవం, చొరవకు లోటు తెచ్చే అవకాశం ఉంది.
3. ప్రభుత్వరంగ సంస్థలలో ఈ బోర్డుకు, కార్య నిర్వహక వర్గానికీ మధ్య వివాదాలు ఏర్పడే అవకాశాలున్నాయి.

4. విధానాల బోర్డులో వ్యక్తిగత బాధ్యతను ఖచ్చితంగా చెప్పడం కష్టం.

5. విధానాల బోర్డులోని సభ్యులు ఏ విషయ పరిజ్ఞానానికి సంబంధించినవారు కానందు వల్ల ప్రత్యేకీకరణకు అవకాశం లేదు.

**3.3.4. విధానాల బోర్డు సభ్యులు :** ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ బోర్డులో సంపూర్ణకాల, అసంపూర్ణకాల సభ్యులు ఉంటారు. తగిన అభ్యర్థులు లభ్యంకాని పక్షంలో బోర్డు అసంపూర్ణకాల సభ్యులను నియమించవచ్చు. వివిధ రకాల నైపుణ్యాన్ని అనుభవాన్ని అసంపూర్ణ కాల సభ్యుల ద్వారా సాధించవచ్చు. అయితే ఈ అసంపూర్ణ కాల సభ్యుల వల్ల కొన్ని నష్టాలు కూడా లేకపోలేదు. అసంపూర్ణకాల సభ్యులకు పూర్తి అవగాహన వుండదు. వీరు ఒకటి కంటే ఎక్కువ సంస్థలలో అసంపూర్ణకాల సభ్యులుగా ఉంటారు. కాబట్టి వీరు సరియైన కృషి చేయలేరు. అయితే సంపూర్ణకాల సభ్యులు వీరికి భిన్నంగా ఉంటారు. సంపూర్ణకాల సభ్యులు ప్రభుత్వం ద్వారా నియమితులౌతారు. వీరు సంస్థకు విధేయులై ఉండి ప్రత్యక్షంగా సంస్థ అభివృద్ధికి పాటుపడతారు. వీరి సేవలు సంస్థకు నిరంతరం లభిస్తాయి. ఈ తరహా సభ్యుల వల్ల సంస్థలో వృత్తిపరమైన అభివృద్ధి సాధించవచ్చు.

## 3.4. విద్యుక్త బోర్డు (Functional Board) :

విద్యుక్త బోర్డులు ప్రభుత్వరంగ సంస్థలలో కనిపిస్తాయి. ఈ బోర్డులోని సభ్యులు సంపూర్ణకాలానికి చెంది పూర్తికాలం పనిచేస్తారు. ఈ తరహా బోర్డులన్నింటిలో వృత్తిపరమైన సభ్యుల ఆధిపత్యం వుంటుంది. ఇందులోని సభ్యులు ఆయా ప్రభుత్వరంగ సంస్థలలోని ఉత్పత్తి, విత్తం, ఉద్యోగి బృందం, మార్కెటింగ్ నిర్వహణలో ఏదోక దానికి బాధ్యత వహిస్తారు.

### 3.4.1. విద్యుక్త బోర్డు స్వభావం :

1. సంపూర్ణకాల సాంకేతిక పరిజ్ఞానం గల వారితో బోర్డును ఏర్పరచడం జరుగుతుంది.

2. ఈ బోర్డులోని సభ్యులు వారి పరిజ్ఞానం మరియు అనుభవాన్ని అనుసరించి నియమితులౌతారు.

3. ఈ బోర్డులోని సభ్యులు సంస్థలో వారి వారి రంగాలలో ప్రత్యేక బాధ్యత కలిగిన వారై లక్ష్య సాధనకు సామర్థ్యాన్ని కలిగి ఉంటారు.

4. వీరు బోర్డు సమావేశాల్లో సమిష్టి బాధ్యతను వహిస్తారు. సంస్థ విధాన నిర్ణయాలకు సభ్యులందరూ బాధ్యులే. అంతేగాక వ్యక్తిగతంగా కూడా దాని విద్యుక్త విధి నిర్వహణకుకూడా బాధ్యత వహిస్తారు.

5. విద్యుక్త బోర్డు సభ్యులందరూ సంపూర్ణ కాల సభ్యులు. అందుచేత వీరు సంస్థలో సమర్థవంతమైన నియంత్రణ, పరిజ్ఞానం, ప్రభావం చూపగలరు.

**3.4.2. విద్యుక్త బోర్డు వల్ల లాభాలు :** ప్రభుత్వరంగ సంస్థలలో కొన్ని రంగాలలో విద్యుక్త బోర్డులను ఏర్పరచటం జరుగుతుంది. రైల్వే బోర్డు, పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్స్, టెలిఫోన్ రంగాలలో విద్యుక్త బోర్డుల ఏర్పాటు ఉన్నది. దీనికి కారణం క్రిందనీయబడిన లాభాలేనని చెప్పవచ్చు.

1. ఈ బోర్డులోని సభ్యులు విధానాల తయారీకి, అమలుకు బాధ్యత వహిస్తారు. కాబట్టి సమర్థవంతమైన నియంత్రణను సాధించటం చాలా సులభం.

2. ఈ బోర్డులో నిపుణులు ఉంటారు. దీని పరిమాణం చిన్నదిగా ఉంటుంది. బోర్డు సభ్యులందరూ సంపూర్ణకాల నిర్వాహకులుగా ఉంటారు.

3. బోర్డు సభ్యులకు వ్యక్తిగత బాధ్యత అనేది స్వయం సూచితమై ఉంటుంది. ప్రతి నిపుణుడు బోర్డుకు జవాబుదారీగా ఉంటాడు.

4. బోర్డు ద్వారా మంచి పర్యవేక్షణ, ఉన్నత వర్గ నిర్వాహకులకు యధార్థమైన పనికి మధ్య చక్కని సంబంధాలను కలిగి ఉంటుంది.

5. బోర్డు సభ్యులు సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండి, అవగాహనతో సంస్థలో సాంకేతిక అభివృద్ధికి దోహదం చేస్తారు.

**3.4.3. విద్యుక్త బోర్డు వల్ల నష్టాలు :** విద్యుక్త బోర్డు వల్ల లాభాలతో పాటు ఈ క్రింది నష్టాలు కూడా ఉన్నాయి.

1. విద్యుక్త బోర్డు తరచుగా సంస్థ నిర్వహణ విషయంలో తీసుకొనే నిర్ణయాలలో స్థూల దృష్టి లోపించవచ్చు.
2. బోర్డులోని సభ్యులు పాలకులుగా సామర్థ్యాన్ని తరచూ నిరూపించుకోలేకపోవచ్చును. ప్రతీ విషయాన్ని నిర్ణయాలలో వారు పక్షపాత వైఖరిని అవలంబించే అవకాశాన్ని సూక్ష్మ దృష్టితో చూస్తారు.
3. నిపుణుల అభిప్రాయం ప్రకారం బోర్డులోని సభ్యులకు సంప్రదింపులు, సర్దుబాటు అనే ధోరణి తక్కువగా ఉంటుంది. బోర్డు సభ్యులు ఇతర సభ్యుల నైపుణ్యాన్ని గుర్తించకపోవచ్చు అనే అభిప్రాయం ఉన్నది.
4. బోర్డు నిర్ణయాలలో హేతుబద్ధమైన చర్యలోపించి, ఇచ్చి పుచ్చుకోవడం పద్ధతులలో నిర్ణయాలు చేస్తారనే అభిప్రాయం ఉన్నది.
5. సంస్థలోని చిన్న చిన్న విషయాలలో బోర్డు సభ్యులు జోక్యం కలిగించుకుంటూ, జాప్యానికి కారకులు అవుతారన్న అభిప్రాయం కూడా ఉన్నది.

## 3.5. మిశ్రమ బోర్డు (Mixed Board) :

ప్రభుత్వ రంగ సంస్థలన్నీ మిశ్రమ బోర్డులకే ప్రాధాన్యతనిస్తున్నాయి. కారణం విధానాల బోర్డు మరియు విద్యుక్త బోర్డులు వాటి సూత్ర ప్రాధాన్యతతో పూర్తి సిద్ధాంతపరంగా ఏర్పాటు చేయబడకపోవటమే. ఈ బోర్డు స్వభావ రీత్యా విధానాల బోర్డు మరియు విద్యుక్త బోర్డుకు మధ్యస్థంగా ఉంటుంది. మిశ్రమబోర్డులో సంపూర్ణ కాల సభ్యులు మరియు అసంపూర్ణ కాల సభ్యులు ఉంటారు. అసంపూర్ణకాల సభ్యులు సంస్థలోని ఏ విభాగానికీ ప్రత్యక్షంగా బాధ్యత వహించరు. సంపూర్ణకాల సభ్యులు సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉన్న వారే కాక సంస్థలలో ప్రత్యక్షంగా బాధ్యతను చేపడతారు. స్వభావ రీత్యా విధానాల - విద్యుక్త విధులను కలిగి కొంత మంది సభ్యులు ఎలాంటి పదవీ బాధ్యతుల ఇవ్వబడకుండా ఉండి మరికొంత మంది బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తూ వుంటారు.

### 3.5.1. మిశ్రమ బోర్డు లక్షణాలు :

1. మిశ్రమబోర్డు సంపూర్ణకాలం మరియు అసంపూర్ణకాల సభ్యులతో కూడి వుంటుంది. ఈ బోర్డులలో అనుభవజ్ఞులైన సాంకేతిక సభ్యులు సంఖ్య సంస్థ పరిధి మీద ఆధారపడి ఉంటుంది.
2. బోర్డులోని కొంత మంది సభ్యులు ముఖ్యంగా అసంపూర్ణకాల సభ్యులకు విద్యుక్త విధులు, బాధ్యతలు ఉండవు. కాని సంపూర్ణ కాల సభ్యులు మాత్రం ఖచ్చితమైన శాఖాపరమైన విద్యుక్త విధులు నిర్వహించబడి స్పష్టంగా చెప్పబడి వుంటాయి.
3. బోర్డులోని సంపూర్ణకాల సభ్యులు సాధారణంగా సంస్థలోని వారై వుంటారు. వీరు తమకు అప్పగించిన విధులకు బాధ్యత వహిస్తారు.
4. సభ్యులు సంస్థ తరపున ప్రత్యక్ష బాధ్యతను వహించి, ఉమ్మడి బాధ్యతను సభ్యులందరూ కలిగి ఉంటారు.

మిశ్రమ బోర్డు వల్ల ప్రభుత్వ రంగ సంస్థకు విధానాల బోర్డు, విద్యుక్త బోర్డులకు గల లాభాలు సంస్థ సంతరించుకుంటుంది. భారతదేశంలోని మిశ్రమ పద్ధతి ప్రభుత్వరంగ సంస్థలలో ప్రసిద్ధి చెందినది. ఉదా : జీవిత భీమా సంస్థ, హిందూస్థాన్ మెషీన్ టూల్స్, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ సంస్థలు మిశ్రమ బోర్డుకు ఉదాహరణలు.

## 3.6. నిర్వహణా బోర్డుల విధులు :

ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ బోర్డుల విధులను వివిధ రచయితలు వివిధ రకాలుగా నిర్వచించారు. ఆచార్య రాబిన్ సన్ ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణా బోర్డులు ఈ క్రింది విధంగా విధులను నిర్వహించాలని వివరించారు.

1. సంస్థ ప్రధాన కార్య నిర్వాహకుని, ముఖ్య అధికారులను నియమించడం
2. ప్రస్తుతం తమ భవిష్యత్తుకు సంబంధించిన ఉత్పత్తికి సంబంధించిన కార్యక్రమాలను నిర్ణయించడం
3. సంస్థను తిరిగి అభివృద్ధి పరచడానికి తగిన ప్రణాళికలను తయారు చేయడం
4. భవిష్యత్తు పథకాలకు సంబంధించిన కొత్త పరికరాల గురించి నిర్ణయం చేయడం
5. విధానాలకు సంబంధించినంత విషయాలలో మంత్రితో సంబంధం ఏర్పర్చుకోవటం
6. సంస్థకు సంబంధించినంత వరకు పార్లమెంటులో వచ్చే విమర్శలు, వినియోగదారుల ఫిర్యాదులు వాటిపై తీసుకోవల్సిన చర్యలు
7. కార్మిక సంఘాల కోరికలు, వారితో జరిపే సంప్రదింపులు ఇతర ముఖ్య విషయాలు.
8. విత్తం, మూలధన వ్యయం, ధరలు, మిగులు, లోటుకు సంబంధించిన విషయాల విధానాలు.
9. కార్మికుల వేతనాలు, పారితోషికాలు, సుస్థితి సంప్రదింపులకు సంబంధించిన విధానాలు
10. సంస్థకు సంబంధించినంత వరకు అవసరమైన భవిష్యత్తు శాసనాలు, రానున్న క్రొత్త బిల్లులపై తమ సంస్థ వైఖరి.
11. తమ సంస్థకు సంబంధించిన మంత్రి ఆదేశాలు, వాటిపై సంస్థ వైఖరి మంత్రికి విన్నవించే విన్నపాలకు సంబంధించిన విషయాలు.
12. సంస్థకు కావలసిన విధులు, నిల్వ విధులకు సంబంధించిన విషయాలు
13. ప్రభుత్వరంగ సంస్థ తన నిర్వహణ లోటును పూరించడానికి తీసుకోవల్సిన చర్యలు
14. తమ సంస్థ చేపట్టవలసిన ముఖ్యమైన కొత్త కల్పనలు, అభివృద్ధి కోసం చేపట్టే విధానాలు, పరిశోధనలకు సంబంధించిన విధానాలు సంస్థ అభివృద్ధి కోసం అధ్యయనాలు మొదలైనవి చేపట్టడం.

మార్షల్ డిమాక్ అభిప్రాయం ప్రకారం ప్రభుత్వరంగ సంస్థలకు ఆరు ముఖ్యమైన విధులున్నాయి.

1. ఉప విధానాల తయారీ
2. సంస్థ అంతర్గత విత్త కార్యక్రమాన్ని పరిశీలించడం
3. సంస్థాగతమైన సమస్యలను అధ్యయనం చేయడం
4. కార్య నిర్వాహకుల నియామకంలో క్రొత్త ప్రయత్నాలు చేయడం
5. విత్త విధానాలను నియంత్రిస్తూ, వాటిని గురించి నివేదించడం
6. ప్రజా సంబంధాలను నిర్వహించడం

లండన్‌కు చెందిన జాతీయ బొగ్గు బోర్డుకు సంబంధించిన ఫ్లీక్ నివేదిక (1955) బోర్డుల విధులను ఈ విధంగా నిర్వచించింది.

1. తమ సంస్థకు సంబంధించిన వివిధ విభాగాల నిర్వహణలో ఏక రూపతను సాధించడానికి బోర్డు కృషి చేస్తుంది.
2. సంస్థ అభివృద్ధికి సరిపడే మూలధనాన్ని సంపాదించడంలో, దానికి తిరిగి చెల్లించడంలోనూ గల సామర్థ్యాన్ని బోర్డులు సాధించాలి.

3. సంస్థ ద్వారా పెద్ద తరహా వ్యవస్థలకు లాభం చేకూరేటట్టు కావల్సిన చర్యలను చేపట్టడం.

4. బోర్డులు తమ తమ సంస్థలలో నిర్వాహకులకు విశ్వాసం ఉండేటట్లు వినయం విధేయతలను కలిగి, వారందరూ ఒకే బృందం అనే అభిప్రాయంతో సమిష్టి కృషి జరిగేటట్లు చూడాలి.

భారతదేశానికి సంబంధించినంత వరకూ ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణ బోర్డుల విధులను ఈ విధంగా పేర్కొనవచ్చు.

**3.6.1. ప్రాథమిక లక్ష్యాలను విధానాలను నిర్ణయించడం :** ప్రభుత్వ సంస్థలలో సేవలు, ఉత్పత్తి ఏ పరిమాణంలో ఎంత నాణ్యత కలిగి ఉండాలి అనే విధానాలను బోర్డు నిర్ణయించాలి. ఇదే కాక ధరల విధానం సంస్థ పునర్వ్యవస్థీకరణ, అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయడం, సంస్థలోని మానవ వనరులు, సంస్థలోని వ్యవస్థల నిర్మాణానికి సంబంధించిన మార్పులు, ఇతర అభివృద్ధికి సంబంధించిన అంశాలు. ఈ అంశాలే కాక బోర్డులు భవిష్యత్తులో సంస్థ చేపట్టవలసిన సర్వ సాధారణ మార్పులను కూడా నిర్ణయించవలసి ఉంటుంది.

**3.6.2. విత్తపాలన :** బోర్డు చేసే నిర్ణయాలలో అత్యధికం విత్త సంబంధమైనవి. సంస్థకు గల విత్త వనరులను నియంత్రిస్తూ, బోర్డు తుది నిర్ణయాలను చేస్తుంది. కొత్త మూలధన పెట్టుబడులు, వార్షిక వ్యయాలు, ప్రస్తుత వార్షిక వ్యయాలు, లాభాలను సమకూర్చగల విధానాలు, వాటికి సంబంధించిన మార్గాలు, పద్ధతులు, ప్రస్తుతం సంస్థ స్థితిగతులు మొదలైన విషయాలు అన్నీ బోర్డులకు సంబంధించిన విత్త పాలనా విధానాలుగా చెప్పవచ్చు.

**3.6.3. మానవ వనరుల నిర్వహణ :** సంస్థను సమర్థవంతంగా నడపగల సిబ్బందిని ఎన్నుకొని తద్వారా సంస్థ నిర్వహణ నిరంతరం సాఫీగా జరిగేటట్లు చూడవలసిన చార్టులు, చార్టులలో కాక సంస్థలలో కొత్త పదవులను సృష్టించవచ్చు. వాటికి తగిన వేతనాలను కూడా నిర్ణయించే అధికారాన్ని కలిగి ఉన్నాయి. సంస్థలోని సిబ్బందికి తగిన విధంగా ఇచ్చిన మార్గదర్శక సూత్రాలను అనుసరించి, ప్రావిడెంట్ ఫండ్, పదవీ విరమణ సౌకర్యాలు, ఇంటి అద్దె సంస్థ ద్వారా రవాణా సౌకర్యం, పారిశ్రామిక సంబంధాలు, కార్మిక సంక్షేమం సంస్థలో సిబ్బంది రక్షణ మొదలైన విషయాలన్నింటినీ నిర్వహించేవి నిర్వహణా బోర్డులు.

**3.6.4. ప్రజా సంబంధాలు :** ప్రభుత్వ రంగ సంస్థల బోర్డు మరొక ముఖ్య విధి ప్రభుత్వంతోను, పార్లమెంటుతోను సంబంధాలు ఏర్పరచుకోవాలి. వినియోగదారుల సూచనలను అనుసరించి బోర్డు తన నిర్ణయాలను తీసుకొని వినియోగదారుల సంస్థలు, సంస్థ సేవలపై విశ్వాసాన్ని కలిగి ఉండేటట్లు చూడాలి. ఈ విధంగా ప్రభుత్వ సంస్థల బోర్డులు ఉత్పత్తిదారులు, వినియోగదారులు ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీకి సంబంధించిన సామాజిక బాధ్యతను నిర్వహిస్తాయి.

**3.6.5. అంతర్గత వ్యవస్థీకరణ :** ప్రభుత్వ సంస్థకు సంబంధించిన ముఖ్య కార్యనిర్వహణాధికారులను నియమించడమే కాక అవసరమైనప్పుడు సంస్థ అంతర్గత వ్యవస్థను కాలానుగుణంగా మార్చడానికి గాను నిబంధనలు లేదా ఉపశాసనాలను బోర్డు ఆమోదించవలసి ఉంటుంది. న్యాయపరమైన అంశాలు, ప్రభుత్వ సంస్థల తరపున తీసుకోవలసిన చొరవ, పనుల ఒప్పందాల రద్దు, వాటికి సంబంధించిన న్యాయపరమైన చర్యలు, సంస్థ తరపున చేపట్టడానికి బోర్డు అనుమతి ఇవ్వవలసి ఉంటుంది. ప్రభుత్వ సంస్థ తరపున భీమా ఆస్తి, మరి ఇతర న్యాయపరమైన లాంఛనాలను బోర్డు ఆమోదించవలసి ఉంటుంది.

## 3.7 బోర్డుల నియామక అధికారం :

ప్రభుత్వ సంస్థల బోర్డు నియామక అధికారం గురించి దానిని స్థాపించడానికి ఏర్పరచిన శాసనంలో పొందుపరచి ఉన్నది. బ్రిటన్‌లోని ప్రభుత్వ రంగ సంస్థల బోర్డులను సంబంధించిన మంత్రి నియమిస్తాడు. అమెరికాలో బోర్డును అధ్యక్షుడు ఏర్పరుస్తాడు. కెనడాలో బోర్డును ఏర్పాటు చేసే అధికారం గవర్నర్ జనరల్‌కు ఉన్నది. భారతదేశంలో బోర్డు నియామకం విషయంలో ఒక వ్యవస్థను ఏర్పాటు చేసారు. దానిని ప్రభుత్వరంగ సంస్థల ఎంపిక బోర్డు అంటారు. ఈ బోర్డు అర్హులైన అభ్యర్థుల పేర్లను ప్రభుత్వానికి సూచిస్తుంది. ప్రభుత్వరంగ సంస్థల ఎన్నిక బోర్డు సిఫార్సు చేసినప్పటికీ తుది నిర్ణయం మాత్రం ప్రధానమంత్రి అధ్యక్షతన కల్గిన కేబినేట్ నియామకపు

కమిటీ ద్వారా జరుగుతుంది. బోర్డు స్థాయి ఉన్నత శ్రేణి నియామకాలన్నీ రాజకీయ నిర్ణయాలపై ఆధారపడి ఉంటాయి. చట్టపరమైన కార్పొరేషన్ల నియామకాలను కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. కాని పారిశ్రామిక విత్త కార్పొరేషన్లో కొంత మంది డైరెక్టర్లను సంస్థ భాగస్వాములు నియమిస్తారు. అసంపూర్ణకాల అనధికారులను సంబంధిత పాలనా మంత్రిత్వ బోర్డు అనుమతితో బోర్డులో నియమించడం గమనించవలసిన ఒక ముఖ్య విషయం. బోర్డు నియామకం కేంద్ర ప్రభుత్వం చేసినా లేదా అధ్యక్షుడు చేసినా, నియామకాల విషయంలో పార్లమెంటుకు బాధ్యత వహించవలసింది సంబంధిత మంత్రి మాత్రమే.

## 3.8 బోర్డు సభ్యుల ప్రాతినిధ్యం :

హెర్బర్ట్ మెరిసన్ అభిప్రాయం ప్రకారం ప్రభుత్వరంగ సంస్థలలోని బోర్డు సభ్యులను వీలున్న మేరకు శ్రేష్ఠులను ఎన్నుకొని నియమించాలి. అలాగే బోర్డు సభ్యులకు వ్యాపార పరిజ్ఞానం, దక్షత ఉండటం అవసరం. బోర్డులో నియమితులయ్యే సభ్యులను రెండు రకాలుగా విభజించవచ్చును. ఒకటి - అధికారులు, రెండు - అనధికారులు. అధికారులు ప్రభుత్వ సంస్థలకు చెందినవారు లేదా ప్రభుత్వ శాఖలకు చెందినవారు. అనధికారులు కార్మిక యూనియన్, ప్రభుత్వేతర సంస్థలకు, విద్యా సంస్థలకు, ప్రజా జీవనానికి సంబంధించిన వారై ఉంటారు. ప్రభుత్వ రంగ సంస్థలలోని అధికారుల ప్రాధాన్యతను, దాని వల్ల సంస్థకు జరిగే నష్టాన్ని సరిదిద్దడానికి అనధికారులను బోర్డులో సభ్యులుగా నియమించాలని అనేక మంది శాస్త్రవేత్తలేకాక ప్రభుత్వ అంచనాల సంఘము కూడా సూచించింది. అనధికార సభ్యుల వల్ల ప్రభుత్వ సంస్థ ప్రతిపత్తికి రక్షణ లభిస్తుంది.

ప్రభుత్వరంగ సంస్థలలో సమర్థవంతమైన సమన్వయాన్ని సాధించడానికి వివిధ రంగాలకు చెందిన వారిని బోర్డు సభ్యులుగా ఎన్నుకోవాలి.

1. పారిశ్రామిక వ్యాపార రంగంలో అనుభవం ఉన్నవారు
2. కార్మిక యూనియన్ నాయకత్వ అనుభవం కలిగినవారు
3. పదవీ విరమణ చేసి ప్రత్యేక పరిజ్ఞానం గడించిన సివిల్ ఉద్యోగి
4. విత్త లేదా ఖాతాల నిర్వహణలో అనుభవజ్ఞుడు
5. ఇంజనీరు లేదా శాస్త్రవేత్త లేదా పదవీ విరమణ చేసిన మిలటరీ జనరల్ / మార్షల్.

క్రిష్ణ మీనన్ సిఫారసును అనుసరించి బోర్డు సభ్యులలో విత్త పాలనా నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం, కార్మిక ప్రతినిధి, ఉద్యోగి బృంద ప్రాతినిధ్యం గల వారు ఉండాలని సూచించడం జరిగింది. ప్రభుత్వ రంగ సంస్థలలో ఈ క్రింది వారిని బోర్డులలో నియమిస్తారు.

1. మంత్రి, 2. పార్లమెంటు సభ్యుడు లేదా శాసన సభ్యుడు, 3. సివిల్ ఉద్యోగి, 4. కార్మిక ప్రతినిధి, 5. ప్రభుత్వ సంస్థకు సంబంధించిన కార్యనిర్వాహకుడు, 6. సాంకేతిక నిపుణులు, ప్రభుత్వేతర మేనేజర్లు, పారిశ్రామికదార్లు ఇతరులు

**3.8.1. మంత్రి :** కొన్ని ప్రభుత్వరంగ సంస్థలకు మంత్రి బోర్డు ఛైర్మన్గా ఉంటాడు. ఉదా : ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్. జాతీయ సహకారాభివృద్ధి కార్పొరేషన్లలో సంబంధిత మంత్రి ఛైర్మన్గా ఉంటాడు. ఉత్తరప్రదేశ్లో మంత్రి రాష్ట్ర ఆగ్రో పారిశ్రామిక కార్పొరేషన్కు ఛైర్మన్గా ఉంటాడు. మంత్రి ప్రభుత్వరంగ సంస్థకు బోర్డుకు అధ్యక్షునిగా ఉన్నట్లయితే సంస్థకు జాతీయ ఆర్థిక వ్యవస్థలో గుర్తింపు, ప్రాధాన్యతలు లభిస్తాయి. మంత్రి అధ్యక్షునిగా ఉండటం వల్ల ప్రభుత్వ రంగ సంస్థకు ప్రభుత్వానికి సంబంధాలు ఏర్పడి, సంస్థ నిర్వహణ బలపడుతుంది. ఈ లాభాలతో పాటు మంత్రి బోర్డు చైర్మన్గా ఉన్నట్లయితే వచ్చే నష్టాల్ని కూడా పరిశీలిద్దాం. మంత్రి బోర్డులో ఉండటం వల్ల ఇతర సభ్యుల చొరవ, చురుకుతనం తగ్గిపోతాయి. హాన్సన్ చెప్పినట్లుగా మంత్రి బోర్డునందు ప్రభుత్వరంగ సంస్థలోని కార్పొరేటు బాధ్యత భంగపరచవచ్చు. మంత్రికి మద్దత్తునిచ్చే సభ్యులు ఒక గ్రూపుగా ఉండి, ప్రతీ నిర్ణయానికి అతని సూచన ప్రకారం ఆమోదం తెలుపుతారు. అంతేగాక మంత్రిగా అతని విలువైన సమయం బోర్డు మీటింగులకు వృధా అవుతుంది. 1946లో ఇంగ్లాండ్లో మిస్టర్ హోమ్ అనే వ్యక్తి నియంత్రణ బోర్డు గురించి చర్చిస్తూ మంత్రి బోర్డులో లేనట్లయితే బోర్డు సమర్థవంతంగా పనిచేయగలదని

అభిప్రాయం వెలిబుచ్చారు. కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలలో మంత్రి బోర్డు ఛైర్మన్‌గా ఉండవచ్చు. కాని సాధారణంగా మంత్రిని బోర్డులో ఉంచరాదనే అభిప్రాయం బలంగా వినిపిస్తుంది. జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత గల ప్రభుత్వరంగ సంస్థల బోర్డుకు మంత్రి ఛైర్మన్‌గా ఉండటం అవసరం.

**3.8.2. పార్లమెంటు లేక శాసన సభ్యులు :** ప్రభుత్వం చాలా ప్రభుత్వరంగ సంస్థలలో అధికంగా పార్లమెంటు సభ్యులను, శాసన సభ్యులను నియమించింది. ప్రత్యేక చట్టం ద్వారా శాసన సభ్యులు బోర్డులో సభ్యులుగా ఉండటానికి అనుమతి లభిస్తుంది. సాధారణ చట్టాన్ని అనుసరించి పార్లమెంటు సభ్యులు బోర్డులో నియమితులవ్వడానికి అనర్హులు. కారణం ఏమిటంటే ఈ పదవులు లాభార్జనకు సంబంధించినవి కానప్పటికీ, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణలో వీరి పలుకుబడి కొంత పాత్ర వహిస్తుంది. శాసన పరమైన కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలలో చట్టపరంగానే రాష్ట్ర, జాతీయ శాసన సభ్యులు బోర్డులలో సభ్యులుగా నియమితులవడాన్ని నిషేధించటం జరుగుతుంది. ఉదా: దామోదర్ వ్యాలీ కార్పొరేషన్, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా, రాష్ట్ర విద్యుచ్ఛక్తి సంస్థ. అనుభవం, పరిజ్ఞానం ఉన్న పార్లమెంటు సభ్యులను బోర్డులలో తరచుగా ప్రభుత్వం సభ్యులుగా నియమిస్తూ ఉన్నది. ప్రస్తుత భారత ప్రభుత్వ విధానంలో పార్లమెంటు సభ్యులను బోర్డులో నియమించరాదు అనే విధానం ఉన్నది. కృష్ణ మీనన్ కమిటీ కూడా పార్లమెంటు సభ్యులను బోర్డులో నియమించరాదని పేర్కొన్నది.

**3.8.3. ప్రభుత్వ ఉద్యోగులు :** భారతదేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల బోర్డులలో ప్రభుత్వ ఉద్యోగులను బోర్డులో రెండు పద్ధతుల ద్వారా నియమిస్తారు. అధికారిక స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగి ముఖ్య అధికార హోదాను అనుసరించి అధికారిక స్థాయిని కల్పిస్తారు. ఈ అధికారిక స్థాయి పదవి అతని ముఖ్య పాలనా స్థాయి ఉద్యోగంతో ముడిపడి ఉంటుంది. ఉదా : సచివాలయ కార్యదర్శులు ప్రభుత్వ రంగ సంస్థలలో అధికారిక సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వ రంగ సంస్థల బోర్డు సూచనలను అనుసరించి సంబంధిత పాలన మంత్రిత్వ శాఖ నుంచి అధికారికమైన స్థాయిలో వారి ప్రతినిధులను బోర్డులో నియమించాలి. రెండవ పద్ధతి ప్రభుత్వం నియమించినవారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం తమ ప్రభుత్వ ఉద్యోగులను ప్రభుత్వ రంగ సంస్థల బోర్డులలో సభ్యులుగా నియమిస్తారు. వీరు ఆయా ప్రభుత్వాల ఇష్టానుసారంగా బోర్డు పదవిలో కొనసాగుతారు. ప్రభుత్వ ఉద్యోగులను వివిధ శాఖల నుండి, విత్త శాఖల నుండి నియమిస్తారు. బోర్డులలో ప్రభుత్వ ఉద్యోగుల నియామకం రెండు రకాలుగా ఉన్నాయి. అవి :

**3.8.3.1. శాఖా కార్యదర్శుల నుంచి నియామకాలు :** ప్రభుత్వం సాధారణంగా కార్యదర్శులను, అదనపు కార్యదర్శులను, సంయుక్త కార్యదర్శులను, వివిధ శాఖల నుంచి ఎన్నుకొని వారిని ప్రభుత్వ రంగ సంస్థల బోర్డులో నియమిస్తుంది. వీరు ప్రభుత్వరంగ సంస్థకు, మంత్రిత్వ శాఖకు మధ్య సమన్వయానికి కృషి చేస్తారు. బోర్డు సంబంధిత పాలనా మంత్రిత్వశాఖ, విత్తశాఖల అధికారులను నియమించడం వల్ల మంత్రిత్వ శాఖల మంత్రి వైఖరిని, వీరు బోర్డు సమావేశాలలో ప్రతిబింబింప చేస్తారు.

**3.8.3.2. ఇతర సివిల్ ఉద్యోగులను బోర్డులో నియమించడం :** ప్రభుత్వరంగ సంస్థలలో శాఖాకార్యదర్శులు కాకుండా ఇతర సివిల్ ఉద్యోగులను కూడా బోర్డులో సభ్యులుగా నియమిస్తారు. వీరిని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రహిస్తారు. వీరు సంస్థలకు లాభదాయకంగా దాని పనులను సమన్వయ పరచడానికి కృషి చేయవలసి ఉంటుంది. ఈ పద్ధతివల్ల కొన్ని నష్టాలు ఉన్నాయి. వీరి వల్ల సంస్థలు తన స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోతాయి. శాఖీయ వ్యవస్థగా మారే ప్రమాదం ఉంది. బోర్డు వ్యాపారపరమైన నేర్పరితనాన్ని కోల్పోతుంది. అంతేగాక సివిల్ ఉద్యోగులు అభివృద్ధికి ఆటంకంగా ఉంటారనే అభిప్రాయం కూడా ఉన్నది. వీరు బోర్డులో ఉండటం వల్ల జాప్యానికి బాధ్యులు కాగలరు. వీరు బాధ్యత నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తారు అనే విమర్శ కూడా ఉంది. ఆచార్య హాన్‌సన్ అభిప్రాయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వరంగ సంస్థలు సివిల్ ఉద్యోగుల ఆధిపత్యం వల్ల అభివృద్ధి చెందడం లేదు.

**3.8.4. కార్మికులు :** భారత రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాలను అనుసరించి ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణలో కార్మికులకు పాత్ర కలిగించాలనే వాదం ఉంది. కార్మికులను డైరెక్టర్లుగా నియమించాలనే పథకాన్ని భారత ప్రభుత్వం ఎంతో ఉత్సాహంతో ప్రారంభించింది. ఈ పథకాన్ని సుమారు జాతీయం చేసిన అన్ని బ్యాంకులకు వర్తింపజేసారు. వాణిజ్య బ్యాంకులు కొన్ని కారణాల వల్ల ఈ పథకాన్ని అమలు చేయడానికి జాప్యం చేస్తూ వచ్చాయి. కార్మికులను డైరెక్టర్లుగా నియమించిన సంస్థలు భారతదేశంలో జీవిత భీమా, స్టీల్ అథారిటీ ఆఫ్

ఇండియా, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, ఎయిర్ ఇండియా, I.I.S.Co., HEC మరియు సింద్రి ఎరువుల సంస్థ. బోర్డులో కార్మిక మెంబరు వల్ల ప్రభుత్వ రంగ సంస్థలోని కార్మికులకు నిర్వహణ అవగాహనకు కృషి చేయడానికి వీలు కలుగుతుంది. కాని యదార్థంగా బోర్డులో ఉన్న కార్మికుల శ్రేయస్సుకు ఆశించినంత ఫలితాలను ఇవ్వలేదు. బోర్డులోని కార్మిక సభ్యులు కొన్ని సందర్భాలలో కార్మిక శ్రేయస్సు కన్నా రాజకీయ నాయకునిగా మాత్రమే, ఈ కార్మిక సంస్థ నాయకులుగా ఎన్నికవుతారు. వీరే బోర్డులో సభ్యత్వం పొందుతున్నారు. వాస్తవంగా వీరు కార్మికుల ప్రతినిధులు కాలేరు. కాబట్టి వీరివల్ల ఆశించిన ఫలితాలు కార్మికులకు లభించడం లేదు.

**3.8.5. సాంకేతిక నిపుణులు, ప్రభుత్వేతర మేనేజర్లు, పారిశ్రామికదార్లు :** ప్రభుత్వ రంగ సంస్థలో మంచి అనుభవం ఉన్న వ్యక్తులను కూడా బోర్డులో సభ్యులుగా చేస్తారు. వీరు ఆయా రంగాలకు సంబంధించిన విషయాలలో బాగా అనుభవ పరిజ్ఞానం ఉన్న జిజ్ఞాసులు. వీరిని మూడు రంగాలకు చెందిన వారుగా గుర్తించవచ్చు.

**3.8.5.1. సాంకేతిక నిపుణులు :** వీరు సాధారణంగా బోర్డు సమావేశాలలో సాంకేతిక దృష్టికి సంబంధించిన విషయాలను సభ్యులకు తెలియపరుస్తారు. వీరు ఇంజనీర్లు, వైద్య, వ్యవసాయ, న్యాయపరమైన రంగాలకు చెందిన వారై ఉంటారు. వీరు బోర్డు విధానాలు తయారు చేయటంలో సహాయపడతారు.

**3.8.5.2. ప్రభుత్వేతర సంస్థల మేనేజర్లు :** ప్రభుత్వేతర సంస్థల మేనేజర్లు అనుభవాన్ని తెల్సుకోవడానికి దీని నుంచి లాభం చేకూర్చడానికి గాను ప్రభుత్వరంగ సంస్థలలోని బోర్డులలో వీరిని సభ్యులుగా నియమిస్తారు. వీరి వల్ల ప్రభుత్వరంగ సంస్థ వ్యాపారరీత్యా సంస్థను ఎలా నిర్వహించాలో తెలుసుకోవచ్చు. అయితే వీరిలో సహాయ దృష్టి ఉండాలేగాని వ్యవస్థకు వ్యతిరేకమైన అభిరుచి ఉండరాదు.

**3.8.5.3. పారిశ్రామిక వేత్తలు :** కొన్ని సందర్భాలలో ప్రయివేటు పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ రంగ సంస్థల బోర్డులలో సభ్యులుగా కూడా నియమితులవుతారు. వీరి అనుభవం హోదా ప్రభుత్వ రంగ సంస్థలకు లాభదాయకమౌతుంది. ఉదా : J.R.D. టాటా ఎయిర్ ఇండియా బోర్డులో చాలా కాలం పని చేసారు.

## 3.9. బోర్డు పరిమాణం :

ప్రభుత్వరంగ సంస్థలలోని బోర్డుల పరిమాణం గురించి ఖచ్చితంగా చెప్పిన నిబంధనలు ఏవీ లేవు. బోర్డు పరిమాణంలో ప్రభుత్వ రంగ సంస్థ వస్తూత్పత్తి విధుల మీద ఆధారపడి ఉంటుంది. సంస్థ స్వభావానికి బోర్డు పరిమాణానికి ఎటువంటి సంబంధం లేదు. కాని ప్రభుత్వ రంగ సంస్థ యొక్క బోర్డు పరిమాణం అతి పెద్దదిగా గాని లేదా అతి చిన్నదిగా గాని ఉండకుండా ఉండేటట్లు చూడవలసిన అవసరం ఉన్నది. విధానాల బోర్డు కన్నా విద్యుక్త బోర్డులు విస్తృతమైనవి. బోర్డు పరిమాణం ఆ ప్రభుత్వ సంస్థలో ఎవరికి ప్రాతినిధ్యం కల్పించాలనే విధానం మీద ఆధారపడి వుంటుంది. ఆ ప్రభుత్వ సంస్థకు ఏ రకపు బోర్డును నిర్ణయించారు అనే అంశం మీద బోర్డు పరిమాణం ఆధారపడి వుంటుంది కూడా. 1955లో అంచనాల సంఘం నివేదికనుసరించి బోర్డులో మూడు నుంచి ఐదుగురు సభ్యులు ఉండవచ్చు. వారిలో ఒకరు ఛైర్మన్‌గా ఉండాలని సూచించడం జరిగింది. కృష్ణమీనన్ కమిటీ బోర్డు సభ్యుల సంఖ్య 5 నుంచి 9 వరకు ఉండాలని పేర్కొన్నది. అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో పెద్ద పరిశ్రమలలో ఒకటైన రైల్వే బోర్డులో 5గురు సభ్యులు ఉన్నారు.

## 3.10. బోర్డు సభ్యుల కాల పరిమితి :

బోర్డు సామర్థ్యం బోర్డు సభ్యుల పదవీకాలంపై ఆధారపడి ఉంటుంది. సభ్యుల కాలపరిమితి ఆయా ప్రభుత్వ రంగ స్థాపనకు జారీ చేసిన చట్టంలో పేర్కొనడం జరుగుతుంది. సభ్యులకు ఖచ్చితమైన పదవీకాలం గురించి ప్రభుత్వరంగ సంస్థలలో ఏకరూపత లేదు. LIC లో అధికార సభ్యుల పదవీకాలం కేంద్ర ప్రభుత్వ ఇష్టానుసారంగా ఉంటుంది. అనధికార సభ్యుల కాల పరిమితి LIC లో రెండు సంవత్సరాలు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల పదవీకాలం ఐదు సంవత్సరాలకు మించరాదు. భారత ఆహార సంస్థ చట్టాన్ని అనుసరించి నియమితుడైన డైరెక్టర్, అధికారుల ఇష్టానుసారంగా అధికారంలో ఉంటాడు. ఎన్నికైన డైరెక్టర్ కాలపరిమితి నాలుగు సంవత్సరాలు. రైల్వే బోర్డు విషయంలో సభ్యుల కాలపరిమితి పేర్కొనబడలేదు. వీరు అందరూ పదవీ విరమణ నిబంధనకు గురి అవుతారు.

## 3.11. సారాంశము :

ప్రభుత్వరంగ సంస్థలలో బోర్డులు చాలా కీలకపాత్రను నిర్వహిస్తూ అతి ముఖ్యమైన అంగాలుగా చెప్పబడుచున్నవి. ప్రభుత్వరంగ సంస్థల సామర్థ్యం బోర్డుల మీద ఆధారపడి ఉంటుంది. వివిధ రకాలైన బోర్డులలో వివిధ రంగాలలో ప్రత్యేక పరిజ్ఞానం, నిపుణతలతో బాటు అనుభవం ఉన్న నిపుణులు ఉంటారు. వీరు తమ శక్తియుక్తులను ఉపయోగించి బోర్డు ద్వారా సంస్థ విజయానికి దోహదం చేస్తారు. కాబట్టి బోర్డులలోని సభ్యుల శక్తి సామర్థ్యాలపై ప్రభుత్వ రంగ సంస్థల విజయం ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వరంగ సంస్థల పురోగతి లేదా తిరోగతులు బోర్డుపై ఆధారపడి వుంటాయి. ఈ సంస్థలలో బోర్డు సభ్యులను సాధ్యమైనంత వరకూ పరిజ్ఞానం, అనుభవం ఉన్న వారిని ఎంచుకొని నియమించాలి. అలాగే బోర్డు సభ్యులకు వ్యాపార పరిజ్ఞానం ఉండటం ఎంతైనా అవసరం. ప్రభుత్వరంగ సంస్థల సక్రమ నిర్వహణకై వివిధ పద్ధతులను అవలంభించడం జరిగింది. ఇందులో భాగంగానే బోర్డు పద్ధతిని అవలంభించడం ఆనవాయితీ అయ్యింది. ఈ బోర్డు పద్ధతి మొదట ప్రయివేటు రంగ సంస్థలలో ప్రసిద్ది చెందినప్పటికీ క్రమ క్రమంగా ఆ పద్ధతిని ప్రభుత్వరంగ సంస్థలలో కూడా ఆచరించడం పరిపాటి అయిపోయింది. ప్రభుత్వరంగ సంస్థలలో సమర్థవంతమైన సమన్వయాన్ని సాధించడానికి వివిధ రంగాలకు చెందినవారిని బోర్డు సభ్యులుగా ఎన్నుకుంటారు. క్రిష్ణమీనన్ సిఫారసు ప్రకారం బోర్డు సభ్యులలో విత్త పాలనా నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం, కార్మిక ప్రతినిధి, ఉద్యోగి బృంద ప్రాతినిధ్యం గలవారు ఉండాలని సూచించడం జరిగింది.

## 3.12. నమూనా ప్రశ్నలు

**1. వ్యాసరూప ప్రశ్నలు**

1. ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణా బోర్డుల రకాలు తెలియజేసి వాటి గురించి కూలంకషంగా చర్చించడానికి ?
2. ప్రభుత్వరంగ సంస్థలలో బోర్డుల ఆవశ్యకతను తెలియజేసి విధానాల బోర్డు, విద్యుక్త బోర్డు, మిశ్రమ బోర్డుల గురించి తెలియజేయండి?
3. బోర్డుల రకాలు తెలియజేసి వాటి విధులు, సభ్యుల ప్రాతినిధ్యం, పరిమాణం మరియు కాల పరిమితులను గూర్చి తెల్పండి ?

**2. లఘు ప్రశ్నలు**

1. విధానాల బోర్డు గురించి తెలియజేస్తూ దాని స్వభావాన్ని, లాభనష్టాల్ని తెలియజేయండి ?
2. విద్యుక్తబోర్డు గూర్చి వివరిస్తూ దాని స్వభావం, లాభ నష్టాల్ని గూర్చి వ్రాయండి ?
3. మిశ్రమ బోర్డు స్వభావాన్ని తెలియజేస్తూ దాని లక్షణాలు వివరించండి ?
4. ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణా బోర్డుల విధులు తెలియజేస్తూ దాని కాల పరిమితిని గూర్చి వ్రాయండి ?
5. నిర్వహణా బోర్డులలో సభ్యుల ప్రాతినిధ్యం గురించి లఘు వ్యాసాన్ని వ్రాయండి ?

## 3.13. చదువదగిన గ్రంథాలు


1. Jagdish Prakash, Nageshwar Rao, M.B. Shukla : Administration of Public Enterprises in India.
2. Muralidhar Rao, Ramachandram, Bhupathi Rao, Suryakaladhar : Public Enterprises (Telugu Academy)


**డా॥ డి. వెంకటేశ్వరరావు**

పాఠం-4

# ప్రభుత్వ రంగ సంస్థల సంస్థా నిర్మాణము ఛైర్‌మెన్ మరియు ముఖ్య కార్యనిర్వాహణాధికారి పాత్ర

## 4.0 లక్ష్యం :

వివిధ ప్రభుత్వ రంగ సంస్థల సంస్థా నిర్మాణ నమూనాలను అర్థము చేసి కొనటానికి వీలుకల్గుతుంది. ఈ పాఠ్యాంశ అధ్యయనము ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలలో ఛైర్‌మెన్ మరియు ముఖ్య కార్య నిర్వాహణాధికారి పాత్రను తెలిసి కొనటానికి వీలుకల్గుతుంది.

**విషయసూచిక:**


4.1 పరిచయము

4.2 ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణా నమూనాలు

4.2.1 మంత్రిత్వశాఖా నిర్వహణా నమూనా

4.2.2 డిపార్ట్‌మెంట్ అండర్‌టేకింగ్స్ నిర్వహణా నమూనా

4.2.2.1 డిపార్ట్ మెంట్ నిర్వహణా నమూనా - ప్రయోజనాలు

4.2.2.2. డిపార్ట్ మెంట్ నిర్వహణా నమూనా - లోపాలు

4.2.3. ప్రభుత్వ కార్పొరేషన్ నిర్వహణా నమూనా

4.2.3.1 పబ్లిక్ కార్పొరేషన్ నిర్వహణా నమూనా - ప్రయోజనాలు

4.2.3.2 పబ్లిక్ కార్పొరేషన్ నిర్వహణా నమూనా - లోపాలు

4.2.4 గవర్నమెంట్ కంపెనీలు

4.2.4.1 ప్రభుత్వ కంపెనీలు - ముఖ్యలక్షణాలు

4.2.4.2 ప్రభుత్వ కంపెనీలు - ప్రయోజనాలు

4.2.4.3 ప్రభుత్వ కంపెనీలు - లోపాలు

4.3 ఛైర్‌మెన్ యొక్క పాత్ర

4.3.1 అర్హతలు

4.3.2 ఛైర్‌మెన్ అధికారాలు - బాధ్యతల

4.3.3 ఛైర్‌మెన్ యొక్క ప్రత్యేక అధికారాలు

4.3.4 ఛైర్‌మెన్‌గా మంత్రి లేక రాజకీయ నాయకులు

4.3.5 ఛైర్మెన్‌లుగా సివిల్ సర్వెంట్స్

4.4 ముఖ్య కార్యనిర్వాహణాధికారి లేక మేనేజింగ్ డైరెక్టర్

4.4.1 ముఖ్య కార్య నిర్వాహణాధికారి - సమస్యలు

4.4.2 ముఖ్య కార్య నిర్వాహణాధికారి - సాధారణ పరిజ్ఞానము - సాంకేతిక నైపుణ్యము

4.5 సారాంశము

4.6 నమూనా ప్రశ్నలు

4.7 చదువదగిన గ్రంథాలు

## 4.1 పరిచయము :

భారతదేశ ఆర్థికవ్యవస్థ అభివృద్ధిలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర కీలకమైనది. 1948లో ప్రభుత్వము ప్రకటించిన పారిశ్రామిక విధానము ప్రకారము ప్రభుత్వరంగ సంస్థలు నెలకొల్పబడినాయి. 1956లో ప్రకటించిన పారిశ్రామిక విధానము ప్రకారము ప్రభుత్వ రంగ సంస్థలు విస్తరించబడినాయి. దీనితో ప్రాథమిక పరిశ్రమలు, వ్యూహాత్మకంగా ప్రాధాన్యత కల్గిన పరిశ్రమలు, ప్రజలకు అవసరమైన సేవలను అందించే పరిశ్రమలు, అధికపెట్టుబడులు అవసరమైన పరిశ్రమలు, ప్రభుత్వ అధీనములో, నియంత్రణలో ప్రారంభించబడినాయి. 1980 నాటికి దాదాపు 200 పరిశ్రమలు, 30,000 కోట్ల పెట్టుబడులతో దాదాపు రెండు మిలియన్ల మంది ప్రజలకు ఉద్యోగావకాశాలను కల్పించే స్థాయికి ప్రభుత్వ రంగ సంస్థలు విస్తరించినాయి. కేంద్ర ప్రభుత్వముతో పాటు, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనేక ప్రభుత్వ రంగ సంస్థలను నెలకొల్పటం జరిగింది.

సంస్థ యొక్క విజయము సంస్థ యొక్క నిర్మాణ నమూనాపై ఆధారపడియుంటుంది. సరియైన నమూనా పాలనానిర్మాణము సరియైన నిర్వహణ మరియు వనరుల సద్వినియోగమునకు దోహదము చేస్తుంది. సంస్థా నిర్వహణానమూనా అన్ని దేశములలో ఒకే విధముగా లేదు, మరియు ఒకే దేశములోని వివిధ సంస్థల నిర్మాణనమూనాలలో చాలా భిన్నత్వముంటుంది. సరియైన పాలనా నిర్మాణనమూనా లేకపోతే పాలనాలోపాలు, ఆర్థిక నష్టాలు, అశాస్త్రీయ నిర్వహణ మరియు అసమర్ధ సేవలు ఫలితాలౌతాయి. ఎటు వంటి నిర్వహణానమూనాని ఎంచుకొన్నప్పటికీ అది నిర్వహణలో పొదుపు పాటించేదిగా మరియు నాణ్యమైన ఉత్పత్తులను సాధించేదిగా ఉండాలి. హెర్బర్ట్ మారిసన్ వివరించినట్లు ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ ఆధిపత్యములో బాధ్యతకల్గి, ప్రజావసరాలను తీర్చే వ్యాపార నిర్వహణా నమునాగా ఉండాలి. ఈ సంస్థలు విజయవంతము కావాలంటే త్వరిత గతిని నిర్ణయాలు చేయుటం, బాధ్యతవహించటం, ప్రభుత్వ నియంత్రణ, పోటీతత్వం, పాలనా మరియు ఆర్థికస్వేచ్ఛ, వినియోగదారునికి స్వేచ్ఛ, అధిక ఉత్పత్తి, వ్యాపారపరమైన నిర్వహణ, పాలనాపరంగా పారిశ్రామిక ప్రజాస్వామ్యము ముఖ్య లక్షణాలుగా ఉండాలి.

భారతదేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు వివిధ నిర్వహణా నమునాలను కలిగియున్నాయి. దీనికి అనేక కారణాలున్నాయి.

1. శాస్త్రీయ నిర్వహణ, పరిశ్రమల నిర్వహణలో దేశంలో సరియైన అనుభవము అందుబాటులో లేకపోవటం.

2. ప్రపంచ వ్యాప్తముగా ఏ ఒక్క నిర్వహణానమూనా స్పష్టమైన విజయాలను సాధించగలదని నిరూపించలేకపోవటం.

3. నిర్వహణా పరమైన వెనుకబాటుతనాన్ని తొలగించటానికి త్వరితగతిని చర్యలు చేపట్టక పోవటం వలన భారత ప్రభుత్వం వేగంగా విస్తరించిన ప్రభుత్వరంగ సంస్థలలో వివిధ నిర్వహణా నమూనాలతో ప్రయోగాలు చేసింది. ప్రభుత్వరంగ సంస్థలు నిర్వహించే అన్ని ఆర్థిక కార్యకలాపాలకు ఒకే నిర్వహనా నమూనాను సూచించటానికి అవకాశము లేదు. నిర్వహణానమూనా అనేక అంశాల పై ఆధారపడి నిర్ణయించబడుతుంది.

ఉదా : సంస్థా స్వభావము, నిర్వహణ మరియు ఆర్థిక అవసరాలు, ఆర్థిక వ్యవస్థ పై ప్రభావము, నైపుణ్యత మరియు అనుభవములో ప్రభుత్వమునకు అందుబాటులో ఉన్న వనరులు, సాధారణ ఆర్థికవాతావరణం.

## 4.2 ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణా నమూనాలు :

భారతదేశంలో పారిశ్రామిక మరియు వ్యాపార సంస్థల నిర్వహణా నమునా ఆధారంగా 4 నమూనాలుగా విభజించవచ్చును.

1. మంత్రిత్వశాఖా నిర్వహణానమూనా.
2. డిపార్ట్‌మెంట్ అండర్ టేకింగ్స్ నిర్వహణానమునా
3. స్టేట్యుటరీ కార్పొరేషన్ లేక ప్రభుత్వ కార్పొరేషన్ నిర్వహణానమూనా.
4. గవర్నమెంటు కంపెనీలు.

### 4.2.1 మంత్రిత్వశాఖా నిర్వహణానమూనా :

ఈ నమూనాలో సంస్థ నిర్వహణా బాధ్యత అంతా ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖ నిర్వహిస్తుంది.

ఉదా : భారతరైల్వేల నిర్వహణా బాధ్యతను ఒక మంత్రిత్వశాఖ చేపడుతుంది. దీనికి ఒక మంత్రి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, ఒక చైర్మన్, ఇతర సభ్యులు మరియు ఒక ఫైనాన్సియల్ కమిషనర్ ఉంటారు. ఈ సభ్యులందరూ భారత ప్రభుత్వంలో సెక్రటరీ హోదాను కల్గియుంటారు. బోర్డు ఢిల్లీ నుండి తన కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

### 4.2.2 డిపార్ట్ మెంట్ అండర్‌టేకింగ్స్ నిర్వహణానమూనా :

ప్రభుత్వరంగ సంస్థల విస్తరణ ప్రారంభదశలో ప్రభుత్వం ఈ నమూనాను అమలు పరచింది. అనేక ప్రభుత్వరంగ సంస్థలు ఈ నిర్వహణా నమూనాలో నిర్వహించబడుతన్నాయి.

ఉదా : పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్స్, హైవేలు, దేశ రక్షణకు సంబంధించిన పరిశ్రమలు, ప్రజోపయోగ సేవలకు సంబంధించిన పరిశ్రమలు. ప్రభుత్వరంగ సంస్థల విస్తరణ ప్రారంభదశలో ప్రభుత్వ పాలనా కార్యకలాపాలకు, ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణకు ఎటువంటి తేడాను గుర్తించలేదు. డిపార్ట్‌మెంటల్ నిర్వహణా నమూనాలో ఖచ్చితమైన క్రమానుగత శ్రేణి అధికార విభజన ఉంటుంది. దీనికి సంబంధిత మంత్రి అగ్రస్థానములోఉండి కేబినేట్‌కు, పార్లమెంటుకు బాధ్యత వహిస్తాడు. ఈ నమూనాలో సంస్థ పాలన సహజంగా సీనియర్ సివిల్ సర్వెంట్స్ చేతిలో ఉంటుంది. ఆర్థిక నియంత్రణ కోశాగారము చేతిలో ఉంటుంది. ప్రపంచవ్యాప్తముగా దాదాపు అన్ని ప్రజోప యోగ సంస్థల నిర్వహణ, నియంత్రణ, పెట్టుబడి ఈ డిపార్ట్‌మెంటల్ నమూనాలోనే నిర్వహించబడుతుంద. ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చటానికి ఈ నమూనా దోహదము చేస్తుంది. వినియోగదారులకు వస్తువులను, సేవలను సరసమైన ధరలకు అందించటంలో కూడా ఈ నమూనా నిర్వహణ తోడ్పడుతుంది. అంతేకాక దేశ రక్షణ, శాంతి భద్రతలకు సంబంధించి, దేశానికి సంబంధించిన రహస్యాలను కాపాడుటకు ఈ నమూన చాలా ఉపయోగంగా ఉంటుంది.

#### 4.2.2.1 డిపార్ట్ మెంట్ నిర్వహణా నమూనా ప్రయోజనాలు :

డిపార్ట్ మెంట్ నిర్వహణానమూనా ప్రయోజనాలను ఈక్రింది విధముగా వివరించవచ్చును.

1. ఇది ప్రభుత్వబాధ్యతను, కార్యకలాపాలను సులభతరం చేస్తుంది.
2. ప్రభుత్వ నియంత్రణ అధిక స్థాయిలో ఉండటానికి వీలుంటుంది.

3. ఈ నమూనా ప్రజోపయోగ సేవలను అందించటానికి, రక్షణ, దేశరహస్యాలను కాపాడటానికి వీలుగా ఉంటుంది.

4. స్థిరమైన ప్రభుత్వాలు, సమర్థులైన సివిల్ సర్వెంట్స్ ఉన్న దేశాలలో ఈ నమూనా విజయవంతమైంది.

5. ఈ నమూనాలో సంబంధిత మంత్రి సూచనల మేరకు సంస్థ నిర్వహించబడుతుంది.

6. ఈ నమూనాలో లేబొరేటరీలు, లైబ్రరీల నేర్పాటు చేయుట ద్వారా శాస్త్రీయ నిర్వహణా సామర్థ్యము మెరుగుపడుతుంది.

**4.2.2.2. డిపార్ట్ మెంట్ నిర్వహణా నమూనా లోపాలు :**

ఈ నిర్వహణా నమూనాలో అనేక లోపాలు కూడా ఉన్నాయి.

1. ఈ నమూనాలో అధికార కేంద్రీకరణ ఎక్కువగా ఉంటుంది. అధికార విభజన సక్రమముగా ఉండదు. పరిశ్రమ, వ్యాపార సంస్థలలో అవసరమైనచొరవ, అద్భుతత్వము లోపిస్తాయి.

2. ఈ నమూనాలో ఉద్యోగిస్వామ్యం చురుకుగా ఉండదు. నిర్ణయాలు చేయటంలో నెమ్మదిగా వ్యవహరిస్తారు. ప్రతి అంశానికి సంబంధించిన ఫైలు, అనేక మంది అధికారుల అనుమతి పొందవలసి యుంటుంది కనుక వారు నిర్ణయాలు చేయటానికి సుముఖంగా ఉండరు.

3. ఈ నిర్వహణానమూనాలో ప్రత్యేక నైపుణ్యత కల్గినవారు అందుబాటులో లేకపోవటము, అద్భుత లోపించటము, అధినాయ కత్వము సార్వభౌమునిలా వ్యవహరించటము సంస్థకు ప్రమాదకరముగా పరిణమిస్తున్నాయి.

4. ప్రభుత్వ ధనము వృధాకాకుండా ఉండటానికి, అనేక నియంత్రణలు ఉండుట వలన, ముడి పదార్థాల కొనుగోలులో సమస్యలు, కాంట్రాక్టర్లతో సంఘర్షణలు చోటుచేసుకుంటాయి. సాధారణంగా అమోదించబడిన వ్యాపారసూత్రాలను కూడా అమలు పరచటం కష్టమౌతుంది.

5. బడ్జెట్ నియంత్రణలు అధికంగా ఉంటాయి. ఈ సంస్థలు శాసనసభ నుండి సాంవత్సరిక కేటాయింపులను పొందవలసి యుంటుంది.

6. అధికారములో ఉన్నపార్టీ అధికారము కోల్పోయినప్పుడు మంత్రి కూడా మారవలసి యుంటుంది. అదే పార్టీ అధికారములో ఉన్నప్పటికీ మంత్రి మార్పు జరుగవచ్చును. తరచుగా విధానమార్పు, సంస్థ నిర్వహణకు సమస్యగా మారుతుంది.

ఈ లోపాల వలన భారత ప్రభుత్వము చాలావరకు డిపార్ట్మెంట్ నమూనా అమలులో ఉన్న సంస్థలను స్వయంప్రతిపత్తి కల్గిన సంస్థలుగా మార్పు చేసింది. సంస్థ విజయము అధికారవిభజన, ఆధునిక, శాస్త్రీయ వ్యాపార నిర్వహణా పద్ధతులను అనుసరించటం, చురుకుగా నిర్ణయాలు తీసికోవటం, అద్భుత్వం అమలు పరచటం పై ఆధారపడి యుంటుంది.

**4.2.3. ప్రభుత్వ కార్పొరేషన్ నిర్వహణా నమూనా :**

పబ్లిక్ కార్పొరేషన్ ఈ క్రింది ముఖ్యలక్షణాలను కలిగియుంటుంది.

1. పబ్లిక్ కార్పొరేషన్స్ పూర్తిగా ప్రభుత్వ అధీనములో ఉండే సంస్థలు.

2. ఇవి ప్రత్యేక చట్టము ద్వారా, వాటి విధులను, బాధ్యతలను, పరిమితులను, నిర్వహణా విధానము, మంత్రిత్వశాఖతో ఉండవలసిన సంబంధములను ముందుగా నిర్ణయించబడటం జరుగుతుంది.

3. దీని పై చట్టపరమైన చర్యలు తీసికొనవచ్చును. మరియు కార్పొరేషన్ కూడా చట్టపరమైన చర్యలు తీసికొన వచ్చును.

...ఒప్పందాలు చేసికొనవచ్చును. ఆస్తులను కార్పొరేషన్ పేరు మీదే సంపాదించవచ్చును.

4. పబ్లిక్ కార్పొరేషన్, నిధులను ప్రభుత్వఖజానా నుండి అప్పుగా కాని లేక ప్రజల నుండి కాని పొంద వచ్చును. లేక అది వస్తువులను, సేవలను విక్రయించు టద్వారా పొంద వచ్చును. ఆదాయాన్ని ఉపయోగించు కొనుటకు, తిరిగి ఉపయోగించు కొనుటకు అవకాశముంటుంది.

5. ఇవి సాధారణముగా ప్రభుత్వ నిధుల వ్యయము, బడ్జెట్, ఎకౌంటింగ్, రుణచట్టముల వంటి వాటి విషయములో పెద్దగా ప్రభుత్వ అధికనియంత్రణలకు గురికావు.

6. పబ్లిక్ కార్పొరేషన్ ఉద్యోగులు సివిల్ సర్వెంట్స్ కాదు. నియామకము, జీతభత్యములు కార్పొరేషన్ నిర్ణయించిన సూత్రావళి మేరకు అమలు చేయబడతాయి.

7. పబ్లిక్ కార్పొరేషన్ యొక్క విధివిధానాలు వ్యాపార సంస్థను పోలియుంటాయి. అయితే ప్రభుత్వము మార్గ దర్శకాలను సూచించ వచ్చును.

పబ్లిక్ కారొరేషన్స్‌కు భారతదేశములో ఉదాహరణగా ఎయిర్ ఇండియా, ఇండియన్ ఎయిర్ లైన్స్, అయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్, జీవితభీమా కార్పొరేషన్, వివిధ జాతీయ బ్యాంకులు, రాష్ట్రవిద్యుత్ బోర్డులు, ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ మొదలైనవి. ఇవి పార్లమెంటు చేసిన ప్రత్యేక చట్టము ద్వారా ఏర్పడినవి.

ప్రైవేటు సంస్థలోని మంచి లక్షణాలు, ఉద్యోగి స్వామ్యంలోని సమస్యలకు దూరంగా ప్రభుత్వ కార్పొరేషన్స్ నిర్వహించబడటానికి వీలుంటుంది. సమర్థవంతమైన పనితీరుతో, పార్లమెంటు నిర్దేశించిన విధానాలను అమలు పరుస్తుంది మరియు ప్రజలకు జవాబుదారిగా వ్యవహరిస్తుంది. ప్రొఫెసర్ రాబ్‌సన్ వివరించినట్లు " ప్రభుత్వ కార్పొరేషన్స్ ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణకు 20వశతాబ్దపు నూతన సృష్టి".

**4.2.3.1 పబ్లిక్ కార్పొరేషన్ నిర్వహణా నమూనా ప్రయోజనాలు :**

1. పబ్లిక్ కార్పొరేషన్స్ స్వేచ్ఛను కల్గియుంటాయి. త్వరితంగా, సరియైన నిర్ణయాలు తీసికోవటానికి వీలుంటుంది. అత్యవసర పరిస్థితిలో త్వరితంగా నిర్ణయాలు తీసికోవటానికి, వాటిని అమలు పరచటానికి అవకాశముంటుంది.
2. అనవసరమైన నియంత్రణలుండవు. ఆర్థిక పరమైన, నిర్వహణా పరమైన సరళత ఉంటుంది.
3. అనవసర కాలయాపన లేకుండా అది తన నిధులతో లేక అప్పు తీసికొనుట ద్వారా సంస్థను విస్తరించుకొనవచ్చును.
4. స్థూలంగా పార్లమెంటు నియంత్రణలకు లోబడి జాతీయ విధానాలను అమలు పరుస్తూ తన కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

అనవసర కాలయాపన లేకుండా, మారుతున్న పరిస్థితుల కనుగుణముగా నిర్ణయాలు చేస్తూ, విపరీతమైన నియంత్రణలు లేకుండా బాధ్యతలను వికేంద్రీకరిస్తూ కార్పొరేషన్ నిర్వహించబడటానికి అవకాశముంటుంది.

**4.2.3.2 పబ్లిక్ కార్పొరేషన్ - లోపాలు :**

ఈ నిర్వహణానమూనాలో లోపాలను ఈ క్రింది విధముగా వివరించవచ్చును.

1. ప్రభుత్వ డిపార్ట్‌మెంట్స్ యొక్క అనవసర జోక్యము పబ్లిక్ కార్పొరేషన్ స్వేచ్ఛకు భంగము కలిగిస్తూ పెద్ద సమస్యగా మారింది.

2. పబ్లిక్ కార్పొరేషన్స్ ఏర్పాటు లక్ష్యాలకు, ప్రభుత్వము యొక్క సంబంధిత చర్యలకు మధ్య సంఘర్షణ చోటు చేసుకుంటుంది.

3. పబ్లిక్ కార్పొరేషన్స్ నిర్వహణా నమూనా పెద్ద పెద్ద సంస్థల పాలనా నిర్వహణకు అనువుగా ఉంటుంది కానీ చిన్న సంస్థల నిర్వహణలో ఇది అంతగా విజయవంతము కాలేదు.

పబ్లిక్ కార్పొరేషన్స్ తన లాభాలలో కొంతభాగాన్ని తిరిగి పెట్టుబడిగా ఉపయోగించుకొనుటకు అవకాశముంటుంది. ప్రభుత్వరంగ వ్యాపార, పారిశ్రామిక సంస్థల నిర్వహణకు కార్పొరేషన్స్ అనువైనవి. 1967లో నియమించబడిన ఒక స్టడీటీమ్ ప్రభుత్వరంగ సంస్థల పనితీరును అధ్యయనం చేసి సమర్పించిన తన రిపోర్ట్‌లో భారతదేశంలో ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణకు పబ్లిక్ కార్పొరేషన్స్ సరియైనవని వివరించటం జరిగింది.

### 4.2.4 గవర్న మెంట్ కంపెనీలు :

ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణా నమూనాలలో ఇది ఒక నమూనా. పెట్టుబడి, పాలనాంశాలలో స్వేచ్ఛను కల్గి, సరిపడినంత ప్రభుత్వ నియంత్రణను అనుమతిస్తుంది. ప్రభుత్వకంపెనీ పూర్తిగా కానీ, ఎక్కువ భాగము కానీ ప్రభుత్వ అధీనములో ఉంటుంది. ప్రభుత్వము ఈ కంపెనీలను నియంత్రించటానికి నూతన నిబంధనలను రూపొందించింది.

ఇండియన్ కంపెనీ చట్టము ప్రకారము కంపెనీలను (1) ప్రైవేటు లిమిటెడ్ కంపనీలు (2) పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలుగా విభజించ వచ్చును. పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలలో కనీసం ఏడుగురు షేర్ హోల్డర్స్ ఉండాలి. ప్రైవేటే లిమిటెడ్ కంపెనీ ఇద్దరు షేర్ హోల్డర్స్‌తో నయినా ప్రారంభించవచ్చును. పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలలో అత్యధికంగా ఎంత మంది షేర్ హోల్డర్స్ ఉండాలనే అంశంలో ఎటువంటి నిబంధన లేదు. ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలలో షేర్ హోల్డర్స్ సంఖ్య 50కి మించరాదు. ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో షేర్స్ కల్గి యున్న వ్యక్తి వాటిని బదిలీ చేయటానికి కొన్ని నియంత్రణలున్నాయి. పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలో అటువంటి నింత్రణలుండవు. ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణకు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు అనువైనవి.

#### 4.2.4.1 ప్రభుత్వ కంపెనీలు - ముఖ్యలక్షణాలు :

1. ప్రభుత్వ కంపెనీలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ లక్షణాలను ఎక్కువగా కల్గియుంటాయి.
2. మొత్తం పెట్టుబడి లేక అధిక శాతం పెట్టుబడి ప్రభుత్వ అధీనంలో ఉంటుంది.
3. కంపెనీ డైరక్టర్లందరూ లేక మెజారిటీ డైరెక్టర్లను ప్రభుత్వము నియమిస్తుంది. అయితే ఇది సంస్థలోని ప్రైవేటు పెట్టుబడిపై ఆధారపడి యుంటుంది.
4. భారతదేశ కంపెనీల చట్టములోని సాధారణ నిబంధనలకు లోబడి ప్రభుత్వ కంపెనీలు ఏర్పాటు చేయబడతాయి.
5. వీటి పై చట్ట అతిక్రమణకు సంబంధించి కోర్టులో దావా వేయవచ్చును. కంపెనీలు కూడా కోర్టులో దావా వేయవచ్చును. ఒప్పందాలు చేసికొనవచ్చును, మరియు కంపెనీ పేరుతో ఆస్తులను సమకూర్చుకొనవచ్చును.
6. ప్రభుత్వ కంపెనీలను ప్రభుత్వ ఎగ్జిక్యూటివ్ నిర్ణయం మేరకు ఏర్పాటు చేయవచ్చును. పార్లమెంటు లో ప్రత్యేక చట్టము రూపొందించవలసిన అవసరము లేదు.
7. ఇవి నిధులను ప్రభుత్వము నుండి పొందవచ్చును. కొన్ని సందర్భాలలో ప్రైవేటు షేర్ హోల్డర్స్ నుండి పొందవచ్చును మరియు వస్తువులు, సేవలు విక్రయించుట ద్వారా కూడా నిధులను సమకూర్చుకొనవచ్చును.
8. ఇతర ప్రభుత్వ డిపార్ట్ మెంట్‌లకు భిన్నంగా బడ్జెట్ ఎకౌంటింగ్, ఆడిట్ చట్టాలు, ఇతర పద్ధతులు, నియామక నిబంధనలు కంపెనీలకు సాధారణంగా వర్తించవు.

9. కంపెనీ ఉద్యోగులు సివిల్ సర్వెంట్స్ కాదు.

పబ్లిక్ కార్పొరేషన్స్ స్థానములో ప్రభుత్వ కంపెనీలు ఏర్పాటు చేయటానికి ప్రభుత్వము ఎందుకు మొగ్గు చూపింది అనే అంశాన్ని వివరించటం అంత సులభము కాదు. మినిస్ట్రీ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ సప్లై సమర్పించిన పత్రము ఆధారముగా 12TH నవంబర్, 1950న ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణకు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలను అనుమతించటం జరిగింది. దాని ఆధారముగా సింద్రీ ఎరువులు మరియు కెమికల్ కర్మాగారమును డిసెంబర్ 1951న ఏర్పాటు చేయటం జరిగింది.

**4.2.4.2 ప్రభుత్వ కంపెనీలు - ప్రయోజనాలు :**

1. ప్రభుత్వము ఒక వ్యాపార సంస్థను నిర్వహించాలంటే ఒక పౌరుడు వ్యాపార సంస్థను ఎలా నిర్వహిస్తాడో అదే విధముగా ప్రభుత్వము కూడా నిర్వహించటం సమంజసము. ప్రభుత్వము పరిశ్రములతో బాటు, వ్యాపార సంస్థలను కూడా నిర్వహిస్తుంది కనుక ఇతర ప్రైవేటు వ్యాపార సంస్థలతో పోటీని ఎదుర్కొనవలసి యుంటుంది. కనుక ప్రభుత్వ కంపెనీలు ప్రైవేటు వ్యాపార సంస్థలు అనుసరించే వ్యాపారమెళకువలను అనుసరించితేనే అవి విజయవంతమౌతాయి.

2. కంపెనీల చట్ట ప్రకారము ప్రైవేటు రంగ సంస్థల మేనేజర్ ఎటువంటి క్రమశిక్షణ కల్గియుండాలో ప్రభుత్వ కంపెనీల మేనేజర్ కూడా అదే క్రమశిక్షణను కల్గియుండాలి. ఇతర ప్రభుత్వ ఉద్యోగులపై తీసికొనే క్రమశిక్షణా చర్యల కంటె ఇవి కఠినముగా ఉంటాయి కనుక కంపెనీ సక్రమముగా నిర్వహించబడటానికి అవకాశముంటుంది.

3. నడుపబడుతున్న సంస్థలో అధిక కంపెనీ ఈక్విటీ పొందటం ద్వారా ఆధిపత్యమును పొందటానికి ప్రభుత్వానికి అవకాశముంటుంది.

4. లాభాపేక్షతో నడుపబడని కంపెనీలు, కంపెనీల చట్టములోని 25వ అధికరణము ద్వారా లభించే సౌలభ్యమును పొంద వచ్చును.

5. ప్రభుత్వ కంపెనీ నిర్వహణానమూనాలో షేర్స్ పొందటం ద్వారా ప్రైవేటు వ్యక్తులు కంపెనీలో భాగస్వాములవటానికి అవకాశముంటుంది.

6. ఈ నిర్వహణానమూనా కేపిటల్ మార్కెట్‌లో ప్రవేశించి ఈక్విటీ పెంపొందింప చేసుకోవటానికి, సమర్ధవంతముగా నిర్ణయాలు తీసికోవటానికి అవకాశము కల్పిస్తుంది. ఉదా :- ప్రభుత్వము ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను (IFCI) జాయింట్ స్టాక్ కంపెనీగా మార్పు చేసింది.

7. స్వంత చార్టర్, నిర్వహణాస్వేచ్ఛ, పెట్టుబడి పై నియంత్రణ లాంటి ప్రయోజనాలను కల్గియుంటుంది.

**4.2.4.3 ప్రభుత్వ కంపెనీలు - లోపాలు :**

1. సాధారణంగా ప్రభుత్వరంగ సంస్థలు శాసనసభకు బాధ్యత వహించే రాజ్యాంగ బాధ్యతను విస్మరించటం జరుగుతుంది. ఎందువలననగా ఇది పార్లమెంటు అనుమతితో పనిలేకుండా కార్యనిర్వాహణా శాఖ చర్య ద్వారా ఏర్పాటు కాబడుతుంది. ప్రభుత్వ నిధులను పొందే అవకాశం ఉంటుంది. కాని పార్లమెంటు నియంత్రణ లోపిస్తుంది.

2. స్థూలంగా ప్రభుత్వ కంపెనీలకు సంబంధించిన చట్టము అర్ధము లేనిదిగా యుంటుంది. అనవసరమైన అనేక పద్ధతులను పాటించ వలసి యుంటుంది.

3. సంస్థ యొక్క స్వేచ్ఛ సంబంధిత మంత్రిత్వశాఖపై ఆధారపడియుంటుంది. ప్రభుత్వ కంపెనీల మేనేజర్లు వారికిచ్చిన స్వేచ్ఛ నామ మాత్రమేనని, మంత్రిత్వశాఖ దయా దాక్షిణ్యాలపై ఆధారపడవలసి యుంటుందని భావిస్తున్నారు.

మాజీ ఆర్థిక శాఖా మంత్రి Dr. C.D దేష్‌ముఖ్ కంపెనీ నిర్వహణానమూనా వలన ప్రత్యేక ప్రయోజనాలేవీ లేవని వివరించినాడు.

N.N. మాల్యా వివరించినట్లు ప్రభుత్వ కంపెనీల లక్ష్యాలు, విధానాలను, చర్చకు పెట్టి సమగ్రంగా చర్చించి ప్రభుత్వము మరియు సంస్థ పాటించవలసిన నియమావళిని రూపొందించలేదు. కంపెనీ యొక్క విధానము, నిర్వహణలో ప్రభుత్వ జోక్యమును అడ్డుకొనగల్గిన దేదియును లేదు. అందువలన అటు ప్రభుత్వము, ఇటు కంపెనీ రెండూ బాధ్యత వహించకుండా తప్పించుకొనడానికి అవకాశముంది. విఫలమైనప్పుడు కంపెనీ ప్రభుత్వాన్ని, ప్రభుత్వం కంపెనీని బాధ్యులను చేయటానికి ప్రయత్నిస్తున్నాయి.

## 4.3 ఛైర్‌మెన్ యొక్క పాత్ర :

ప్రభుత్వ నిర్ణయం ప్రకారము పూర్తికాలపు ఛైర్‌మెన్ - కమ్ - మేనేజింగ్ డైరెక్టర్ ఉండవలెను. అయితే కొన్ని ప్రత్యేక సందర్భాలలో ఛైర్‌మెన్ పార్ట్‌టైమ్ బాధ్యతలు నిర్వహించవచ్చును. అటు వంటి సందర్భాలలో మేనేజింగ్ డైరెక్టర్ పూర్తికాలపు బాధ్యతలను నిర్వహించవలెను. ఛైర్‌మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్‌ల మధ్య అధికార సంఘర్షణ ఉండరాదు.

సంస్థలో ఛైర్‌మెన్‌ది కీలకమైన స్థానము. దాదాపు అన్ని ప్రభుత్వరంగ సంస్థలలో ప్రభుత్వము ఛైర్‌మెన్‌ను నియమిస్తుంది. కొన్ని సందర్భాలలో పదవీవిరమణ చేసిన సెక్రటరీలను సంస్థకు అనధికార ఛైర్ మెన్ (non-official chairman) గా నియమించవచ్చును.

ప్రభుత్వరంగ సంస్థ బోర్డు ఛైర్‌మెన్‌కు సంబంధించిన నాలుగు ముఖ్యమైన అంశాలు.

1. ఛైర్‌మెన్ గా నియమించబడిన వ్యక్తి I. A.S అధికారికాని, వ్యాపారవేత్తకాని అయి ఉండవచ్చును. అయితే అతనికి సంస్థ నిర్వహణలో విశిష్ట నైపుణ్యం, సామర్థ్యం కలిగియుండాలి.

2. ఆ సంస్థకు సంబంధించిన మంత్రితో ప్రత్యక్ష సంబంధం కలిగియుండాలి.

3. ఛైర్‌మెన్ పూర్తి కాలమునకు నియమించాలి. అయితే ఛైర్‌మెన్‌గా నియమించ తలచిన వ్యక్తి పూర్తి కాలపు నియామకానికి అందుబాటులో లేకుంటే పార్ట్ టైమ్ (part time) ఛైర్‌మెన్‌గా నియమించ వచ్చును. సంస్థ ప్రాధమిక దశలో పార్ట్ టైమ్ నియామకము జరిపినప్పటికీ సంస్థ పూర్తిగా అభివృద్ధి చెందిన తరువాత పూర్తి కాలపు ఛైర్‌మెన్ మరియు బోర్డును నియమించవలెను.

4. ఒకే వ్యక్తి ఛైర్‌మెన్‌గాను, కార్యనిర్వాహణాధికారి గాను ఒకేసారి బాధ్యతలను నిర్వహించరాదు.

### 4.3.1 అర్హతలు :

ఛైర్‌మెన్ మరియు ఇతర బోర్డు సభ్యులను సంస్థ సంబంధిత మంత్రి నియమిస్తాడు. సాధారణంగా భారతదేశంలో ఛైర్‌మెన్ మరియు బోర్డుసభ్యులను నియమించేటప్పుడు ఎటువంటి ప్రత్యేక అర్హతలను, అనుభవాన్ని పరిగణన లోనికి తీసికొనకుండా సివిల్ సర్వీసు కేడర్ నుండి నియమించటం జరుగుతుంది. కానీ అసోసియేషన్ ఆఫ్ దినేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (Association of the National Research Development Corporation of India) ఆర్టికల్ ప్రకారము శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక, ఆర్థిక, వ్యాపార, పాలనారంగాలలో అనుభవమున్న వ్యక్తులను అధ్యక్షుడు మరియు డైరెక్టర్‌లుగా నియమంచాలని వివరించబడింది. ఆచరణలో బోర్డు డైరెక్టర్‌ల నియామకం చాలావరకు సంబంధిత మంత్రి ఆదేశాల మేరకు జరుగుతుంటాయి.

### 4.3.2 ఛైర్‌మెన్ అధికారాలు - బాధ్యతలు :

1. బోర్డు సమావేశాలకు అధ్యక్షత వహించటం

2. బోర్డు సమావేశాలలో జరిగే ఓటింగులో సమాన ఓట్లు వచ్చినప్పుడు ఛైర్‌మెన్ నిర్ణాయక ఓటు (casting vote) ద్వారా నిర్ణయాలు తీసికొనబడతాయి.

3. బోర్డు డైరెక్టర్లు చేసిన ఏ ప్రతిపాదననైనా అధ్యక్షుని నిర్ణయం కొరకు పంపించే అధికారము ఛైర్‌మెన్ కల్గియుంటాడు.

4. బోర్డు చర్చలను, నిర్ణయాలను మినిట్స్ పుస్తకంలో నమోదు చేసి సంతకములు చేయించి రికార్డులను నిర్వహించుట.

భారతదేశంలోని ప్రభుత్వేతర సంస్థలలోను మరియు విదేశాలలోను ఎక్కువగా పూర్తి కాలపు లేక పాక్షిక కాలపు ఛైర్‌మెన్ మరియు పూర్తికాలపు కార్యనిర్వాహణాధికారి (సాధారణంగా మేనేజింగ్ డైరెక్టర్‌గా పిలుస్తారు) ఉంటారు. ఛైర్‌మెన్ మరియు ముఖ్యకార్య నిర్వాహణాధికారి వేరు వేరుగా ఉంటే సమర్థవంతముగా వ్యవహరించ గల్గుతారు. అయితే వీరు వేరుగా ఉంటే వీరి అధికార, బాధ్యతల విషయంలో సమస్యలు వస్తాయి. అయితే ప్రపంచంలో చాలా విజయవంతమైన సంస్థలలో ఛైర్‌మెన్ మరియు ఒకరి కంటే ఎక్కువమంది మేనేజింగ్ డైరెక్టర్లున్నారు. LIC, IOC ప్రభుత్వరంగ సంస్థలలో మాత్రము చారిత్రక కారణముల వలన ఒక పూర్తి కాలపు ఛైర్‌మెన్ మరియు ఒకరి కంటె ఎక్కువ మంది మేనేజింగ్ డైరెక్టర్లున్నారు. ఛైర్‌మెన్ బోర్డు సమావేశాలకు అధ్యక్షత వహించటమే కాక, బోర్డు డైరెక్టర్లకు అవసరమైన సమాచారాన్ని అందించాలి. బోర్డు సరియైన నిర్ణయాలు చేయటంలో సహకరించటమేకాక బోర్డు డైరెక్టర్లకు మరియు కార్య నిర్వాహణ వర్గానికి మధ్య సత్సంబంధాలను నెలకొల్పాలి. బోర్డు నిర్ణయాల అమలుకు బాధ్యత వహిస్తాడు.

**4.3.3 ఛైర్‌మెన్, యొక్క ప్రత్యేక అధికారాలు :**

ఛైర్‌మెన్, బోర్డు చేసిన ఏ నిర్ణయాన్నైనా లేక ఇతర ఏ అంశమైనా ప్రభుత్వ ఆమోదం పొందటం అవసరమని భావించినప్పుడు ఆ అంశాలను ప్రభుత్వ అనుమతి కొరకు పంపే అధికారము కల్గియుంటాడు. ప్రభుత్వ అనుమతి లభించే వరకు ఆ అంశము పై ఎటువంటి చర్యా చేపట్టరాదు. క్రిష్ణమీనన్ కమిటీ సిఫారసుల ప్రకారము ఛైర్‌మెన్ అత్యున్నత బాధ్యతలను కల్గియుంటాడు కనుక తాను కంపెనీ ప్రయోజనాలకు భం కరమని భావించినప్పుడు బోర్డు నిర్ణయాన్ని తిరస్కరించి లేక బోర్డుతో ముందుగా సంప్రదించకుండా విచక్షణాధికారముతో నిర్ణయాలను తీసికొని అమలు చేయవచ్చును. అయితే ఛైర్‌మెన్ ఈ నిర్ణయాలను సంబంధిత మంత్రికి తెలియజేయాలి. ఇది ఎలా సాధ్యమో ఈ కమిటీ వివరించలేదు.

**4.3.4 మంత్రి లేక రాజకీయ నాయకులు ఛైర్‌మెన్‌గా :**

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలలో ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ మరియు నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మినహా ఏ ఇతర సంస్థలకూ మంత్రి, ఛైర్మెన్‌గా వ్యవహరించుట లేదు. ఈ రెండు సంస్థలు కూడా వ్యాపార సంస్థలు కాదు. ఇవి సామాజిక ఆర్థిక లక్ష్యాలను సాధించటానికి ఏర్పాటు చేయబడిన సంస్థలు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాల సంస్థలకు కూడా మంత్రులు ఛైర్మెన్‌లుగా వ్యవహరిస్తున్నారు. మంత్రి, సంస్థ ఛైర్మెన్‌గా వ్యవహరిస్తే కొన్ని ఉపయోగాలున్నాయి.

1. సంస్థకు, ప్రభుత్వానికి మధ్య సమన్వయము కుదురుతుంది.

2. మంత్రి, ఛైర్మెన్‌గా ఉండటము సంస్థకు బలాన్ని చేకూరుస్తుంది.

అయితే దీని వలన కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి.

1. ముఖ్య ఉద్దేశమైన సంస్థ స్వీయ పాలన దెబ్బ తింటుంది.

2. మంత్రి శాసనసభలో ఇబ్బంది కర పరిస్థితిని ఎదుర్కొనవలసి యుంటుంది.

కొన్ని సందర్భాలలో పదవీవిరమణ చేసిన మంత్రులను సంస్థ ఛైర్మెన్‌గా నియమించటం జరిగింది. ఉదాహరణకు,K.D మాలవ్యా హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్‌కు ఛైర్మెన్‌గా, B.V కేస్కర్ సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఛైర్మెన్‌గా, జైసుఖ్‌లాల్ హాతి IDPL ఛైర్మెన్‌లుగా వ్యవహరించారు.

**4.3.5 సివిల్ సర్వెంట్స్ ఛైర్మెన్లుగా :**

U.N అధ్యయనము ప్రకారము I.A.S అధికారుల సామర్థ్యము వారు ఆ పదవిలో కొనసాగే కాలము పై ఆధారపడి యుంటుంది.

1. అదే పదవిలో ఎక్కువ కాలము కొనసాగవలెననే స్వీయ ప్రయోజనాలకు సంస్థ యొక్క ప్రయోజనాలను పణముగా పెట్ట వచ్చును.
2. ప్రభుత్వము మరుయు రాజకీయ నియంత్రణలకు సులభముగా లోబడవచ్చును.
3. క్రిందిస్థాయి వారు ఎంత సామర్థ్యమున్నప్పటికీ ఛైర్మెన్ పదవి పొందే అవకాశము లేక నిరాశా, నిస్పృహకు గురికావచ్చును.
4. I.A.S అధికారి ఛైర్మెన్గా నియమించబడితే ప్రభుత్వ ఉద్యోగుల జీత భత్యముల వలె సంస్థ ఉద్యోగుల జీత భత్యములను నియంత్రించవచ్చును.

ఇటువంటి బలహీనతలున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు సివిల్ సర్వెంట్స్నే ఛైర్మెన్లుగా నియమించటం జరుగుతుంది. దీనికి కారణము పాలనా సామర్థ్యమున్న వ్యక్తులు అందుబాటులో లేకపోవటము మరియు శాసనసభకు బాధ్యత వహించుకుండానే సంస్థ పాలనలో జోక్యము చేసికొనటం నాయకులకు సులభము కనుక ఇదే పద్ధతిని అనుసరించటం జరుగుతుంది.

క్రిష్ణమీనన్ కమిటీ సివిల్ సర్వెంట్స్ను ప్రభుత్వరంగ సంస్థలకు ఛైర్మెన్గా నియమించటాన్ని అనేక కారణములతో వ్యతిరేకించింది. 1958 లో ఏర్పాటు చేయబడిన చాగ్లా కమిషన్ కూడా ఇటువంటి అభిప్రాయాన్నే వ్యక్తము చేసింది. గతంలో భారత ప్రభుత్వ సెక్రటరీగా పనిచేసిన ఒక అధికారి మాటలలో ప్రభుత్వరంగ సంస్థల ఛైర్మెన్ గా నియమించబడే సివిల్ సర్వెంట్స్ తన సివిల్ సర్వీసుకు రాజీనామా చేసి పూర్తిగా ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేయాలి. ఎందువలననగా ప్రభుత్వ రంగ సంస్థలలో ఛైర్మెన్లుగా పని చేస్తున్న సివిల్ సర్వెంట్స్ ఉన్నత స్థానాల పై దృష్టి పెడుతున్నారు కానీ తాను ఛైర్మెన్గా పని చేస్తున్న సంస్థ అభివృద్ధి పై దృష్టి సారించుట లేదు అని వ్యాఖ్యానించారు. భారత ప్రభుత్వము క్రిష్ణమీనన్ కమిటీ సూచనలను అంగీకరిస్తూనే కొన్ని సందర్భాలలో ఆ సూచనలను పాటించుటలేదు. ఉదాహరణకు డిపార్ట్మెంట్ ఆఫ్ ఆటమిక్ ఎనర్జీ సెక్రటరీ ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఛైర్మెన్గా నియమించబడినాడు. చాలా సందర్భాలలో వేరే వ్యక్తిని ఛైర్మెన్గా నియమించే వరకు సెక్రటరీలనే ఛైర్మెన్లుగా నియమించటం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలలో అధికారులు ఛైర్మెన్లుగా వ్యవహరించటం సాధారణ అంశమే.

## 4.4 ముఖ్య కార్యనిర్వాహణాధికారి లేక మేనేజింగ్ డైరెక్టర్ :

మేనేజింగ్ డైరెక్టర్ సంస్థ యొక్క ముఖ్యకార్య నిర్వాహణాధికారిగా బాధ్యతలను నిర్వహిస్తాడు. బోర్డు రూపొందించిన సూచనల మేరకు సంస్థకు మార్గదర్శకత్వం వహిస్తాడు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ అధ్యక్షుని లేక కేంద్ర ప్రభుత్వ లిఖిత అనుమతిని ముందుగా పొంది నిర్ణీత కాలపరిమితితో కాని లేక కాలపరిమితి లేకుండా కానీ, ముఖ్య కార్యనిర్వాహణాధికారిని నియమించవచ్చును. మేనేజింగ్ డైరెక్టర్గా నియమించబడేవ్యక్తికి, సంస్థకు మధ్య జరిగిన ఒప్పందం మేరకు కానీ లేక ఇతర వ్యక్తిని ఆ పదవిలో నియమించటానికి కానీ అతనిని తొలగించవచ్చును. మేనేజింగ్ డైరెక్టర్ యొక్క జీతభత్యములను బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎప్పటి కప్పుడు నిర్ణయించిన మేరకు చెల్లించబడతాయి. మేనేజింగ్ డైరెక్టర్ తన అధికారాలను, బాధ్యతలను పాలక మండలి నుండి పొందుతూ పాలక మండలికి బాధ్యత వహించటం జరుగుతుంది. మేనేజింగ్ డైరెక్టర్ తన బాధ్యతలను సక్రమముగా నిర్వహించటానికి తగినన్ని అధికారములను ఇవ్వవలసిన అవసరముంటుంది. మేనేజింగ్ డైరెక్టర్ కంపెనీ యొక్క రోజువారీ కార్యకలాపాలకు పాలక మండలికి బాధ్యత వహించవలసియుంటుంది. ఎప్పటి కప్పుడు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఇచ్చే సూచనల మేరకు మేనేజింగ్ డైరెక్టర్ సంస్థ యొక్క రోజువారీ కార్యకలాపాలను నిర్వహించాలి. ముఖ్య కార్య నిర్వహణాధికారి నిర్మాణఖర్చులకు సంబంధించి, కంపెనీని విస్తృత పరచటానికి, ముడిపదార్ధాలను కొనుగోలు చేయుట మరియు ఇతర వ్యయములకు సంబంధించిన డబ్బును కేటాయించే అధికారము కల్గియుంటాడు. ముఖ్య కార్యనిర్వాహణాధికారి, ఒకస్థాయి వరకూ నియామకాలు,

4)

పదోన్నతులకు సంబంధించిన నిర్ణయాలు తీసికొనవచ్చును. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల అనుమతించిన అధికారాల మేరకు, నిర్దేశించిన లక్ష్యాల మేరకు ముఖ్యకార్యనిర్వాహణాధికారి, నిర్ణయాల అమలుకు బాధ్యత వహిస్తాడు.

వాస్తవానికి ముఖ్యకార్య నిర్వాహణాధికారి కంపెనీకి సంబంధించిన అన్ని ముఖ్య వ్యవహారాలను పర్యవేక్షిస్తాడు. ముఖ్య కార్య నిర్వాహణాధికారి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ యొక్క సూచనల మేరకు రోజువారీ కార్యకలాపాలను నిర్వహిస్తాడు కనుక ముఖ్య కార్య నిర్వాహణాధికారి చర్యలకు బోర్డ్ బాధ్యత వహించవలసియుంటుంది. ముఖ్య కార్య నిర్వాహణాధికారి చాలా వరకు ఉత్పత్తి, అమ్మకములకు సంబంధించిన నెలవారీ రిపోర్ట్‌ను బోర్డ్‌కు మరియు సంబంధిత మంత్రిత్వ శాఖకు పంపించవలసి యుంటుంది. బోర్డ్ మరియు మంత్రిత్వశాఖ రూపొందించిన విధానాలను అమలు పరచి, ఆశించిన లక్ష్యాలు సాధించటానికి ముఖ్య కార్య నిర్వాహణాధికారి బాధ్యత వహిస్తాడు. సంస్థ యొక్క రోజువారీ కార్యకలాపాలను నిర్వహిస్తాడు. సంస్థ యొక్క రోజువారీ కార్యకలాపాలను నిర్వహిస్తాడు. నెలవారీ రిపోర్ట్‌లను సమర్పించుటయే కాక ప్రజాధనానికి రక్షకునిగా సంస్థ యొక్క లక్ష్యాలను సాధించటం ముఖ్యకార్యనిర్వాహణాధికారి బాధ్యత.

**4.4.1 ముఖ్య కార్య నిర్వాహణాధికారి - సమస్యలు :**

సాధారణంగా మేనేజింగ్ డైరెక్టర్స్‌ను సంస్థ బయటి వారిని నిమించటం జరుగుతుంది. ఎక్కువ శాతం I.A.S వారిని నియమించటం జరుగుతుంది. వారు తెలివైన మరియు కష్టపడే స్వభావము కల్గినవారు కనుక వారికి ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణలో శిక్షణ నివ్వటం కష్టం కాదు. వారికి అప్పటికే పాలనానుభవముంటుంది కనుక పాలనా మెళకువలు, శాస్త్రీయ పద్ధతులను సులభముగా అర్థము చేసు కొనగల్గుతారు. వారిని కొద్దికాలము మాత్రమే మేనేజింగ్ డైరెక్టర్స్‌గా ఉంచి పాలకుల ఇష్టానుసారం తరచుగా బదిలీలు చేయటం జరుగుతుంది. వారు సంస్థ యొక్క సమస్యలను అర్థము చేసికొని, ఆధునిక పాలనా సూత్రాలను అవగాహన చేసికొని వాటిని అమలు పరచేనాటికి వారిని బదిలీ చేయటం జరుగుతుంది. బోర్డ్ సభ్యులు కూడా తరచుగా మారిపోతుంటారు. ఈ విధముగా బోర్డ్ సభ్యులు మరియు మేనేజింగ్ డైరెక్టర్‌లు తరచుగా మారిపోవుట వలన సమస్య ఇంకా తీవ్రతరమౌతుంది.

ఛైర్మెన్ రాజకీయ నాయకుడైనప్పుడు దు:ఖకు స్వభావము కల్గి రాజకీయాధికారాన్ని ప్రదర్శిస్తూ, సంస్థకు తానే సర్వోన్నతాధికారిగా వ్యవహరించినప్పుడు ముఖ్య కార్య నిర్వాహణాధికారి తన బాధ్యతలను నిర్వహించటం కష్టమౌతుంది. D.M. బ్రైస్ చెప్పినట్లు ముఖ్య కార్య నిర్వాహణాధికారి తన పదవికి తగిన అధికారాలను, బాధ్యతలను కల్గియుండాలి. సంస్థ నిర్వహణలో స్వేచ్ఛను కల్గియుండాలి. లేకుంటే అతను మేనేజరు కాజాలడు. పనిని, పనివారిని పర్యవేక్షిస్తూ తన పాలనా నైపుణ్యముతో మంచి ఫలితాలను సాధించటానికి తగిన స్వేచ్ఛనివ్వాలి. మేనేజింగ్ డైరెక్టర్ మంచి ఫలితాల సాధనలో విజయం సాధించినట్లయితే అతనిని అభినందించి ప్రోత్సాహకాలనివ్వాలి. విఫల మైనట్లయితే తనను బాధ్యున్ని చేయాలి కాని అడుగడుగునా అతనిని నియంత్రించకూడదు.

**4.4.2 ముఖ్య కార్య నిర్వాహణాధికారి - సాధారణ పరిజ్ఞానమా - సాంకేతిక నైపుణ్యమా :**

ముఖ్య కార్య నిర్వాహణాధికారిగా సాధారణ పరిజ్ఞానమున్న వ్యక్తిని నియమించాలా లేక సాంకేతిక నైపుణ్యమున్న వ్యక్తిని నియమించాలా అనే అంశము పై భిన్నాభిప్రాయాలున్నాయి. శ్రీమతి ఇందిరా గాంధి ప్రభుత్వరంగ సంస్థల ఉన్నతాధికారుల సమావేశంలో ప్రసంగిస్తూ ఈ క్రింది వ్యాఖ్యలు చేశారు. " ఇన్ని సంవత్సరాలుగా మనము ముఖ్యమైన ప్రభుత్వ పథకాలను అమలు పరిచాము. అయితే ఈ సంస్థల అధిపతులుగా నియమించబడినవారు తమ పనిలో పూర్తిగా నిమగ్నము కాకుండా అది ఇతరుల పనిగా భావించటం జరుగుతుంది. అటువంటి దృక్పథాన్ని భరించే స్థాయిలో మనము లేము".

అనగా ప్రభుత్వరంగ సంస్థల అధినేతలు తమ బాధ్యతలను పూర్తిగా బాధ్యతతో నెరవేర్చుటలేదని శ్రీమతి ఇందిరా గాంధి భావించారు. పార్లమెంటులో బాధ్యతాయుత సభ్యుడు సోమసుందరం శ్రీమతి ఇందిరాగాంధికి రాసిన ఉత్తరంలో ఈ క్రింది విధముగా అభిప్రాయపడినారు. "ప్రస్తుతము ప్రభుత్వరంగ సంస్థలకు మరియు ఇతర సాంకేతిక డిపార్ట్‌మెంట్స్‌కు జనరల్ మేనేజర్స్‌గా I.A.S వారిని నియమించటం జరుగుతుంది. సాధారణ పరిజ్ఞానము కల్గిన వారి క్రింద సాంకేతిక నైపుణ్యత కల్గినవారు పనిచేయ వలసి

రావటంతో వారిలో నిరాశా, నిస్పృహలు ప్రబలుతున్నాయి." సాంకేతిక నైపుణ్యత కల్గియుండి, విస్తృత పాలనానుభవము, సాంకేతిక పరిజ్ఞానమున్న వారికే ప్రభుత్వరంగ సంస్థల అధికార బాధ్యతలను అప్పగించాలని సూచించటం జరిగింది.

అయితే కొంత మంది మేధావులు ముఖ్య కార్య నిర్వాహణాధికారిగా సాధారణ పరిజ్ఞానమున్నా వారినే నియమించాలని వాదించటం జరిగింది. ముఖ్యకార్య నిర్వాహణాధికారి బోర్డ్ఆఫ్ డైరెక్టర్స్‌కు, ఇతర అధికారులు, ఉద్యోగులకు మధ్యస్థానములో ఉండి అనుసంధానకర్తగా వ్యవహరిస్తాడు. వీరి మధ్య అను సంధానకర్తగా వ్యవహరిస్తాడు. కంపెనీ యొక్క అన్ని కార్యకలాపాలకు బాధ్యత వహిస్తాడు. ప్రతి కంపెనీ కొన్ని స్పష్టమైన ఆర్థిక, సామాజిక లక్ష్యాలను కల్గియుంటుంది, కనుక ఆ లక్ష్యాలను సాధించటం ముఖ్య కార్య నిర్వాహణాధికారి యొక్క బాధ్యత.

ముఖ్య కార్యనిర్వాహణాధికారికి సాంకేతిక నైపుణ్యత కంటె సాధారణ పరిజ్ఞానము అవసరము. ఆయన మంచి జ్ఞానవంతుడైయుండాలి. వివిధరంగాలలో లక్ష్యాలను సాధించటానికి అవసరమైన నైపుణ్యత కల్గియుండాలి. నాయకత్వ లక్షణాలు కల్గి, నిర్ణయాలు చేయగల సామర్థ్యముండాలి. ఇటువంటి లక్షణాలను సాధారణంగా సాధారణ పరిజ్ఞానమున్న వ్యక్తులే కల్గియుంటారు. కంపెనీలో పని చేసే వారిని సక్రమముగా ఉపయోగించుకొనటము ద్వారానే కంపెనీ తన లక్ష్యాలను సాధించగల్గుతుంది. అటువంటి వ్యక్తే ముఖ్య కార్యనిర్వాహణాధికారి పదవికి అర్హుడు.

## 4.5 సారాంశము :

ప్రభుత్వరంగ సంస్థల యొక్క విజయము సంస్థ యొక్క పాలనా నిర్వహణా నమూనాపై ఆధారపడియుంటుంది. సరియైన నిర్వాహణానమూనా ద్వారా సంస్థ సమర్ధవంతముగా వనరులను ఉపయోగించుకొని లాభాల నార్జించగల్గుతుంది. ప్రభాత్వరంగ సంస్థల నిర్వహణలోని లోపాలను తొలగించి సరియైన నిర్వహణా నమూనా ఏర్పాటు చేసుకోవాలి. ప్రభుత్వరంగ సంస్థల నిర్వహణలో ఛైర్మన్ మరియు ముఖ్యకార్య నిర్వహణాధికారి పాత్ర చాలా కీలకమైనది. ప్రభుత్వ నియంత్రణను కొంతమేర తగ్గించి చైర్మెన్‌కు సంస్థ నిర్వహణలో తగిన స్వేచ్ఛను ఇచ్చి ఫలితాలకు బాధ్యుణ్ణి చేసినట్లైతే సంస్థలు విజయము సాధించగల్గుతాయి.

## 4.6 నమూనా ప్రశ్నలు :

1. ప్రభుత్వ కంపెనీ నిర్వహణానమూనాలోని ఉపయోగాలను, లోపాలను వివరింపుము.
2. పబ్లిక్ కార్పొరేషన్ నిర్వహణానమూనాలోని ఉపయోగాలను, లోపాలను వివరింపుము.
3. డిపార్ట్‌మెంట్ నిర్వహణానమూనాలోని ముఖ్య లక్షణములను వివరింపుము.
4. ప్రభుత్వరంగ సంస్థ యొక్క ఛైర్మెన్ అధికారాలు, బాధ్యతలను వివరింపుము.
5. ప్రభుత్వరంగ సంస్థలలో ముఖ్య కార్యనిర్వహణాధికారి యొక్క అధికారములు, బాధ్యతలను వివరింపుము.

## 4.7 చదువదగిన గ్రంథాలు :


1. Lakshminarain - Public Enterprise Management.
2. Purushotham. P.W. - Organisation and Management of Public Enterprises
3. Ziauddin Khan.S; Ramesh K. Aroza - Public Enterprises in India.
4. K. R. Gupta - Issues in Public Enterprises.


డా . బి . ఉదయ ప్రకాశ్

******

పాఠం - 5

# భర్తీ - ప్రభుత్వరంగ సంస్థలు

## 5.0 లక్ష్యం :

ఏ సంస్థ విజయమైన దానిలో పనిచేసే ఉద్యోగులు లేదా సిబ్బందిపై అధికంగా ఆధారపడి ఉంటుంది. అనేక విశిష్టతలుకల ప్రభుత్వరంగ సంస్థల విజయానికి మానవ వనరుల ప్రణాళిక మరింత కీలకపాత్ర వహిస్తుంది. ఈ సంస్థలు సమర్ధవంతంగా పనిచేయటానికి ప్రతిభావంతమైన మానవ వనరులు అత్యంత ఆవశ్యక పరిస్థితి. అయితే మానవ వనరుల నిర్వహణ ఇతర సంస్థలకన్నా ప్రభుత్వరంగ సంస్థలో సంక్లిష్టమైన ప్రక్రియ. ఈ సంస్థల ప్రజా దృక్పథం వాటికి రాజకీయ, సామాజిక లక్ష్యాలను ఏర్పరచటం చేత, వాటి నిర్వహణకు అత్యంత సమర్ధవంతమైన ఉద్యోగి బృందం అవసరం. అంతేకాక ఈ సంస్థలు పరిమాణంలో అతి పెద్దవిగా ఉంటాయి. అవి ఉద్యోగి బృంద నిర్వహణలో ఆదర్శ యజమానిగా వ్యవహరించాలి. మానవవనరులు (ఉద్యోగి బృందపాలన) ఎంత పరిష్టంగా ఉంటే సంస్థ, సంఘం, దేశం అంత పరిష్టంగా ప్రగతిపథంలో నడుస్తాయి.

## విషయ సూచిక :


5.1 పరిచయం

- 5.1.1. సిబ్బంది నియామకంలో ప్రభుత్వ రంగ సంస్థలు అనుసరిస్తున్న సాధారణ సిద్ధాంతాలు
- 5.1.2 షెడ్యూల్డు తెగలు మరియు కులాల వారి కొరకు రిజర్వేషన్లు
- 5.1.3 భారత ప్రభుత్వరంగ సంస్థలలో వ్యక్తుల నియామకాల కొరకు ఉపయోగపడే మార్గాలు
- 5.1.4 ఎన్నిక విధానము

5.2 ప్రభుత్వరంగ సంస్థలలో యజమాని, కార్మిక ఉద్యోగి సంబంధాలు

- 5.2.1 పారిశ్రామిక సంబంధాలు అవశ్యకత
- 5.2.2 ప్రభుత్వ కార్మిక విధానం
- 5.2.3 పారిశ్రామిక శాంతి స్థాపనకు పద్ధతులు

5.3 ప్రభుత్వరంగ సంస్థలలో కార్మిక సంక్షేమ కార్యక్రమాలు

- 5.3.1 సంస్థ ఆవరణలో కల్పించే కార్మిక సంక్షేమ కార్యకలాపాలు

5.4 ప్రభుత్వరంగ సంస్థలు - వినియోగదారుడు

- 5.4.1 భారత ప్రభుత్వరంగ సంస్థలలో వినియోగదారుడు రక్షణ
- 5.4.2 వినియోగదార్ల కౌన్సిళ్ళను నిర్వహించేటప్పుడు కొన్ని జాగ్రత్తలు
- 5.4.3 వినియోగదారుల హక్కులు
- 5.4.4 వినియోగదారుని బాధ్యతలు
- 5.4.5 వినియోగదారల రక్షణకు భారతదేశంలో చట్టాలు
- 5.4.6 వినియోగదారుల కౌన్సిల్స్ నిర్వహించవలసిన పాత్ర

5.5 సారాంశము

5.6 నమూనా ప్రశ్నలు

5.7 చదువదగిన గ్రంథాలు

## 5.1 పరిచయం :

సిబ్బంది నిర్వహణ అనగా మానవ వనరుల అభివృద్ధి శిక్షణ, పరిశోధన, సత్ సంబంధాల అభివృద్ధి వారి సేవలకు తగినంత జీతాలు, వేతనాలు అనగా జీతభత్యాల పాలన, పనివాతావరణము, పని గంటలు, సంక్షేమ కార్యక్రమాలు, వసతులు మొదలగు అంశాలతో సంబంధము కలిగియున్న నిర్వహణ విభాగాన్నే సిబ్బంది నిర్వహణా విభాగముగా పరిగణించబడుతుంది. సంస్థలకు గల అనేక విధులలో సిబ్బందిని సక్రకమమైన మార్గములో నిర్వహించవలసిన విధిని అత్యంత ప్రాధాన్యత గల విధిగా గుర్తించబడినది.సర్వ సాధారణంగా ప్రభుత్వ రంగ సంస్థలు భారీ పరిమాణములో స్థాపించటము వలనను సిబ్బందికి అవసరమైన వృత్తి పరమైన నైపుణ్యము మరియు సామర్థ్యము లోపించడము వలన కూడా ప్రభుత్వ రంగ సంస్థలలో మానవవనరుల నాణ్యత అభివృద్ధికి సిబ్బంది నిర్వహణావిధికి అధిక ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరమేర్పడుతున్నది. సిబ్బంది నిర్వహణ విభాగము సామర్ధ్యము గలిగిన సిబ్బందిని సంపాదించడంలో, వారిలో వృత్తిపరమైన నైపుణ్యతను అభివృద్ధి చేయడం, సంస్థ యొక్క లక్ష్యాల సాధనతో పూర్తిగా నిమగ్నమై ఉంటుంది. నిజానికి సంస్థ యొక్క జయాపజయాలు సంస్థలో నియమింపబడ్డ వ్యక్తుల నైపుణ్యము, శక్తి సామర్థ్యములు, అనుభవాలపై పూర్తిగా ఆధారపడుతుంది. అంతేకాకుండా సంస్థ లక్ష్యాల సాధనలో వారు ఎంత వరకు ఉత్తేజపరచబడినారు అన్న అంశము మీద కూడా సంస్థ జయాపజయాలు ఆధారపడతాయి.

### 5.1.1. సిబ్బంది నియామకంలో ప్రభుత్వ రంగ సంస్థలు అనుసరిస్తున్న సాధారణ సిద్ధాంతాలు :

ప్రభుత్వ రంగ సంస్థలలో కూడా సిబ్బంది నియామకానికి సంబంధించిన మార్గదర్శక అంశాలతో పొందుపరచిన ఒక వివరణ 1961 ఏప్రిల్ 14వ తేదీన భారత ప్రభుత్వము ద్వారా (పారిశ్రామిక మంత్రిత్వ శాఖ) పార్లమెంటు ముందుంచబడింది. వివరణకు గల ప్రత్యేక లక్షణాలు ఈ క్రింది విధముగా ఉన్నాయి.

1) ప్రభుత్వ రంగ సంస్థలలో నిపుణతలేని శ్రామికుల నియమించేటప్పుడు తప్పనిసరిగా సంస్థ స్థాపించిన పరిసర ప్రాంతాలలో లభ్యమయ్యే నిరుద్యోగులకు మొదట ప్రతినిధ్యాన్ని ఇవ్వవలసి ఉంటుంది. అనగా సంస్థ పరిసర ప్రాంతాలలో నివసించే వారినే నిపుణతలేని శ్రామికులుగా నియమించవలసి ఉంటుంది. అదికూడా షెడ్యూల్డు కులములు మరియు జాతులవారికి ప్రాతినిధ్యాన్ని కల్పించాలి.

2) నిపుణతలోని శ్రామికుల విషయంలో మాదిరిగానే క్లర్కులు, నిపుణత కలిగియున్న శ్రామికుల నియామకం విషయంలో కూడా కావలసిన అర్హతలు, అనుభవము కలిగియున్న వ్యక్తులు సంస్థ పరిసర ప్రాంతాలలో లభ్యమైతే వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వవలయును.

3) మధ్యస్థాయి సాంకేతిక పరమైన మరియు సాంకేతిక పరముకాని ఉద్యోగాల భర్తీచేయడంలో అర్హతలకు మరియు యోగ్యతకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది.

4) ఉన్నతస్థాయి సాంకేతిక పరంగాగాని ఉద్యోగుల భర్తీ విషయంలో మొదటగా పారిశ్రామిక నిర్వహణా సమూహములో లభ్యమయ్యే ధరఖాస్తుదారులకు నియామకాలలో ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుంది.

5) సాంకేతిక పరమైన అన్ని ఉన్నతస్థాయి ఉద్యోగుల భర్తీ విషయంలో ఉద్యోగ ప్రకటనలు మరియు వ్యక్తిగతమైన పరిచయాలు ప్రముఖపాత్రను వహించవలసి ఉంటుంది. అనగా ఉన్నతస్థాయి సాంకేతిక పరమైన ఉద్యోగాలను భారతదేశ ప్రాతిపదికపై ఒక ప్రకటన ద్వారా మరియు వ్యక్తులకున్న సంబంధాల ద్వారా వ్యక్తులను నియమించడం జరుగుతుంది.

6) ఉన్నత స్థాయి ఉద్యోగుల భర్తీ విషయంలో సంస్థకు కావలసిన అభ్యర్థులను యావత్ భారత దేశమంతా పత్రికలద్వారా ప్రకటనచేసి భర్తీ చేసుకుందురు.

### 5.1.2 షెడ్యూల్డు తెగలు మరియు కులాల వారి కొరకు రిజర్వేషన్లు :

షెడ్యూల్డు కులములు మరియు తెగలవారికి ప్రభుత్వరంగ సంస్థలలోని ఉద్యోగుల నియామకాలలో ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పించవలెనని 1971లో భారత ప్రభుత్వము ప్రతి ప్రభుత్వ రంగ సంస్థలకు మార్గదర్శక సూత్రాలను జారీ చేసింది. నిర్ణయించబడ్డ శాతం ప్రకారం ఉద్యోగాలలో 15శాతం షెడ్యూల్డు కులముల వారికి మరియు 7.5 శాతము షెడ్యూల్డు తెగలవారికి కేటాయించబడినది. ప్రతి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలలో 3శాతం రిజర్వేషన్ల క్రింద కేటాయించవలెను. అనగా 1 శాతం గుడ్డివారికి, 1శాతం చెవిటివారికి, 1శాతం అంగవైకల్యం గలిగినవారి కోసం ఈ రిజర్వేషన్లు కేటాయించడం జరిగినది. మూడు, నాలుగు తరగతుల ఉద్యోగాలలో 14.5శాతం మరియు 24.5 శాతం మాజీ సైనికులకు మరియు ఉద్యోగ నిర్వహణలో ప్రాణం కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు రిజర్వేషన్లు కల్పించవలెను.

డిసెంబరు 25, 1974వ సంవత్సరములో గవర్నమెంటు 3వ తరగతి మరియు 4వ తరగతి ఉద్యోగాలకు ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజిద్వారా భర్తీ చేయవలెనని ప్రతిని విడుదల చేసింది. వికలాంగులైన మాజీ సైనికోద్యోగులకు, మొదటి ప్రాధాన్యత ఇవ్వవలెను. భారత డిఫెన్సు సర్వీసులలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రెండవ ప్రాధాన్యత ఇవ్వవలెను.

### 5.1.3 భారత ప్రభుత్వ రంగ సంస్థలలో వ్యక్తుల నియామకాల కొరకు ఉపయోగపడే మార్గాలు :

భర్తీ విధానము సంస్థ యొక్క భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ప్రభుత్వరంగ సంస్థలకు సిబ్బందిని నియమించే అధికారము కలిగియున్నది. ఈ సిబ్బంది నియామకం రెండు రకాల మార్గాల ద్వారా జరుగుతుంది. 1) బహిర్గత మార్గాలు 2) అంతర్గత మార్గాలు.

**బహిర్గత మార్గాలు :-** ప్రమోషన్ల ద్వారా ఖాళీలను భర్తీ చేయడమన్నది మంచి విధానమైనప్పటికీ అన్ని వేళలా అది ఉపయోగపడక పోవచ్చును. అనగా కొన్ని సందర్భాలలో కావలసిన అర్హతలున్న వ్యక్తులు వ్యవస్థలలో దొరకనప్పుడు వారి కొరకు తప్పనిసరిగా ఇతర మార్గాలు అనుసరించవలసి వస్తుంది. సంస్థ స్థాయి పెంచదలచుకొన్నప్పుడు కూడా మానవ వనరుల నియామకము కొరకు బహిర్గత మార్గాలను మనము ఆశించవలసి వస్తుంది. సంస్థ స్థాయిని విస్తరించదలచుకొన్నప్పుడు, లేదా ప్రస్తుత అవసరాలు సంస్థలో ఉన్న మానవ వనరులు తీర్చలేప్పుడు తప్పనిసరిగా మేజేజ్‌మెంట్‌వారు ఇతర మార్గాలను అన్వేషించవలసి ఉంటుంది. నియామకము కొరకు సాధారణంగా ఉపయోగించే బహిర్గత మార్గాలను ఈ క్రింది విధముగా ఉంటాయి అవి :-

**1. ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజీలు :-** నైపుణ్యత అవసరమైన నైపుణ్యత అవసరములేని మరియు కొంత నైపుణ్యము అవసరమైన ఉద్యోగాలలో వ్యక్తుల నియామకము కొరకు వివిధ సంస్థలు ఈ మార్గాన్ని ఆచరిస్తాయి. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేముందు ప్రతి ప్రభుత్వ రంగ సంస్థ నిర్దేశించబడిన ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజికి ఖాళీల వివరాలను తెలియచేయవలసిన బాధ్యతను కలిగియున్నది. ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజిల చట్టము 1959 ప్రకారము ఖాళీల వివరాలను తెలియజేయవలసిన బాధ్యతను ప్రభుత్వ రంగ

సంస్థలు కలిగియున్నాయి. అయితే ఉద్యోగాల కొరకు ఆశిస్తున్న వ్యక్తులు తమ వివరాలతో కూడిన ఒక పత్రము అనగా అర్హతలతో కూడిన ఒక పత్రాన్ని కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించబడుతున్న ఏదైనా ఒక ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజిలకు పంపి తమ తమ పేర్లను ఎక్స్చేంజిలలో నమోదు చేయించుకోవలెను. వివిధ సంస్థల ద్వారా తెలియజేయబడ్డ ఖాళీల భర్తీల కొరకు ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజి అర్హతలు కలిగిన నిరుద్యోగుల పేర్లతో కూడిన ఒక పట్టికను సంబంధిత ప్రభుత్వ రంగ సంస్థలకు పంపడం ద్వారా వాటికి ఎంతగానో తోడ్పడుతుంది.

**2 ప్రకటనలు :-** సిబ్బంది నియామక మార్గాలలో ప్రజాదరణ పొందిన వాటిలో ముఖ్యమైనది, వార్తాపత్రికలలో, ఎంప్లాయిమెంట్ న్యూస్‌లలో మరియు టి.వి. రేడియో, ఇంటర్‌నెట్‌లలో ఖాళీలను ప్రకటించడం. 1959 ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజీల చట్టము ప్రకారము ఏఏ రకాల ఖాళీలను ఎక్స్చేంజీలకు తెలియజేయవలెనో ఆయా ఖాళీలు మినహా మిగిలిన అన్ని ఖాళీల భర్తీ విషయంలో ప్రభుత్వరంగ సంస్థలు ప్రకటనల విధానాన్ని అవలంభిస్తూ ఉంటాయి. ఉద్యోగానికి సంబంధించిన అన్ని వివరములు మరియు నియమింపబడబోయే వ్యక్తికి ఉండవలసిన అన్ని అర్హతలకు సంబంధించిన పూర్తి వివరాలు ప్రకటనలో ఇవ్వవలసి ఉంటుంది. ప్రకటన ఫలితంగా కావలసిన అర్హతలున్న వ్యక్తులు తమ ధరఖాస్తులను సంస్థలకు పంపుతారు.

**3 వ్యక్తిగత సంబంధాలు :-** వ్యక్తిగత సంబంధాల ద్వారా అర్హతలు కలిగిన వ్యక్తులను ఎన్నుకోవడం అనేది ఒక ప్రశస్తమైన మార్గముగా పరిగణలో ఉన్నది. ప్రత్యేకంగా, అనుభవములేని శ్రామికుల నియామకములో ఈ మార్గాన్ని అనుసరించడం జరుగుతుంది. సంస్థలలో పనిచేస్తున్న ప్రస్తుత సిబ్బంది ద్వారా, వారి స్నేహితుల మరియు బంధువుల పేర్లు సంస్థ నిర్వహణా విభాగానికి సిఫారసు చేయబడి ఉంటాయి. అలా లభ్యమైన వ్యక్తుల నుండి అర్హతలు కలిగిన వారిని తగిన సమయములో నియమించడం సాధారణంగా జరుగుతున్న పద్ధతి.

**4 గతంలో ఉద్యోగులుగా పనిచేసిన వారు :-** ఎటువంటి వ్యయం లేకుండా ఖాళీలను భర్తీ చేయడంలో అనుకూలంగా ఉండే నియామక మార్గాలలో ముఖ్యమైనది గతంలో ఉద్యోగులుగా పనిచేసి సంస్థనుండి రిటైర్ అయి వెళ్ళిన వారిని (మంచి నడవడి గలవారిని) తిరిగి మరలా ఉద్యోగులుగా నియమించే విధానము. సాధారణంగా అనేక వ్యక్తిగత కారణాల వల్లనో లేదా అవసరము తీరిన వెంటనే సంస్థ నుంచి తీసివేయడం వల్లనో, సంస్థలో పనిచేసే ఉద్యోగులు సంస్థలో పనిచేసే ఉద్యోగులు సంస్థను వదిలి వెళ్ళడం జరుగుతుంది. వారు మరలా ఏ పరిస్థితులలోనైనా తిరిగి సంస్థలో పనిచేయడానికి తమ సంసిద్ధతను వ్యక్తపరిచినప్పుడు గతంలో మంచి ప్రవర్తన నమోదు చేయబడ్డ వారికి మొదట ప్రాముఖ్యతనిస్తూ సంస్థలలో తిరిగి వారిని నియమించడమనేది సాధారణంగా అనేక సంస్థలలో జరుగుతుంది. అయితే వయస్సు పరిమితి (60 సం॥లు) దాటిన వారిని తిరిగి నియమించదలచుకొన్నప్పుడు ప్రభుత్వము వారి సమ్మతి తప్పకుండా పొందవలసి వస్తుంది.

**5. కాలేజీలు, విశ్వవిద్యాలయాలు మరియు సాంకేతిక సంస్థలు :-** ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగాలలో భవిష్యత్తులో సంభవించే ఖాళీలను భర్తీ చేయడంలో విద్యా సంస్థలు మరియు సాంకేతిక సంస్థలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. పేరు ప్రతిష్ఠలు కలిగిన విద్యా సంస్థలతో సత్‌సంబంధాలను సంస్థలు ఎప్పుడు కలిగి యుండడము ద్వారా ఆయా విద్యా సంస్థలలో విద్య విద్య పూర్తి చేసిన వ్యక్తులను ఉద్యోగులుగా నియమించుకొని ప్రభుత్వరంగ సంస్థలు తమ సంస్థలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసుకొంటుంటాయి. కొన్ని సందర్భాలలో తెలివితేటలు, చురుకుతనము కలిగియున్న విద్యార్థులను ఎంపికచేసి వారి విద్యాకాలమునకు అయ్యే పూర్తి వ్యయాన్ని సంస్థల మేనేజ్‌మెంట్లు భరిస్తాయి.

**6. కాంట్రాక్టు పద్ధతిపై ఖాళీ భర్తీ విధానము :-** సిబ్బంది అవసరాలలో వచ్చే స్వల్పకాలిక ఒడుదుడుకులను కొంత నిర్దేశించబడిన సమయానికి సిబ్బందిని ఇతర ప్రభుత్వ డిపార్ట్మెంటుల నుండి లేదా ఇతర ప్రభుత్వరంగ సంస్థల నుండి కాంట్రాక్టు విధానంపై పొందడం ద్వారా పరిష్కరించవచ్చును.

సిబ్బంది యొక్క నాణ్యత, ఉద్యోగ స్వభావము, సంస్థ పరిమాణము మొదలగు అంశాలు దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ రంగసంస్థ అందుబాటులో ఉన్న వివిధ నియామక మార్గాలలో తమకనువైన దానిని అనుసరించవలసి ఉంటుంది. అన్ని రకాల ఉద్యోగాలకు, అన్ని ప్రభుత్వరంగ  సంస్థలకు, అన్ని సందర్భాలలో ఒకే మార్గము ఒక్కో సందర్భములో పరిస్థితి బట్టి అవలంబిస్తుంది.

**అంతర్గత మార్గము :-** సాధారణంగా వ్యవస్థా ఆచార్యాధిపత్యములో ఖాళీ సంభవించినప్పుడు ఖాళీ ఏర్పడిన స్థాయియొక్క క్రింద స్థాయిలలో అర్హత కలిగియున్నవారిని పై స్థాయికి ప్రమోషన్ ద్వారా పంపించి ఆ ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుంది. దానినే అంతర్గత మార్గము ద్వారా ఖాళీలను భర్తీ చేయటం అంటారు. ఈ మార్గాన్ని ఉపయోగించుకోవడం కొరకు ప్రతి ప్రభుత్వ రంగ సంస్థ నిర్దిష్టమైన ప్రమోషన్ విధానాన్ని అనుసరిస్తూ ఉంటుంది. క్రింది స్థాయి ఉద్యోగులకు తగిన శిక్షణ కల్పించి వారిని పై స్థాయిలో కలిగిన ఖాళీకి సంబంధించిన ఉద్యోగ బాధ్యతలు నిర్వహించగలిగిన శక్తిమంతులుగా ఈ విధానము వారిని రూపు దిద్దుతుంది. అంతేగాక ఈ విధానము అందరికి సమాన అవకాశాలను కల్పిస్తుంది. మరియు శిక్షణా వ్యయం తగ్గించడంలో మానవ వనరులను నిలకడగా ఉంచడంలో, ఆశాజనకమైన, ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని కలుగజేయడంలో సంస్థలకు ఎంతగానో సహాయకారిగా తోడ్పడుతుంది. ఉన్నత మరియు మధ్య స్థాయి నిర్వహణ ఉద్యోగులలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడంలో ఈ విధానాన్ని ఆచరిస్తుంటారు.

### 5.1.4 ఎన్నిక విధానము :

ఏప్రిల్ 14,1961 ప్రభుత్వరంగ మంత్రిత్వ శాఖ ఈ క్రింద చెప్పిన ఎన్నిక విధానాన్ని పాటించవలసిందిగా ప్రభుత్వరంగ సంస్థలకు ఆర్డర్ జారీచేసింది.

**ధరఖాస్తు పరిశీలన :-** సంస్థ ఇచ్చిన ప్రకటణ ప్రకారం వచ్చిన ధరఖాస్తులన్నింటిని పరిశీలన చేయుదురు. కొన్ని ప్రభుత్వరంగ సంస్థలు ధరఖాస్తులు పరిశీలన జరిపే సమయంలోనే అనేక రకాలైన పరీక్షలను అభ్యర్థులకు పెట్టడం జరుగుతుంది. ఆయా పరీక్షలలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సమావేశ పరీక్షకు పిలుపును పంపెదరు.

**సమావేశ పరీక్ష :- (ఇంటర్వ్యూ) :-** ఉద్యోగానికి అన్ని అర్హతలు కలిగిన వ్యక్తిని మరియు వ్యక్తికి సరిపడు సరైన ఉద్యోగాన్ని ఎంపికచేయడమే దీనిలోగల పరమార్ధము. ధరఖాస్తుదారుని గురించి పూర్తిగా తెలుసుకొనడమనేది ఎన్నిక క్రమములో మొట్టమొదటి మెట్టు. ఈ సమావేశ పరీక్ష బోర్డు లేదా కమీషను ద్వారా చేస్తుంది.

**పరిచయాలు (రిఫరెన్స్) :-** పైన వివరించిన అడ్డుగోడలన్నింటిని అధిగమించినట్లైతే ధరఖాస్తుదారుని యొక్క ప్రవర్తన, గతంలో నిర్వహించిన ఉద్యోగము, విద్యా అర్హతలు మరియు అతనికి గల మంచి పేరు మొదలగు అంశాలకు సంబంధించిన విచారణ ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా జరుగుతుంది. అభ్యర్థి ఉదహరించిన రిఫరెన్సు వ్యక్తులనుండి అభ్యర్థియొక్క పైన ఉదహరించిన విషయాలన్నింటిని క్షుణ్ణంగా తెలుసుకుంటారు.

**ఆరోగ్య పరీక్షలు :-** ఉద్యోగము కొరకు ఎన్నిక చేయుటకు చివరి నిర్ణయం తీసుకున్న తర్వాత మాత్రమే ఆరోగ్య పరీక్షలు నిర్వహించబడతాయి. ఒక వ్యక్తి ఉద్యోగాన్ని సమర్ధవంతంగా నిర్వహించగల శక్తిసామర్థ్యాలు గలదని వివిధ పరీక్షల ద్వారా ఋజువైన వెంటనే అతనిని ఎన్నిక చేసినట్లుగా ప్రకటించబడతాడు.

**పోలీస్ విచారణ :-** అభ్యర్థియొక్క గుణగణాలు, నడవడిని పోలీసు విచారణ ద్వారా సంస్థ తెలుసుకుంటుంది. తర్వాతనే అభ్యర్థికి శాశ్వత ఎన్నిక పత్రాన్ని అందజేస్తారు.

**ఎన్నిక పత్రము :-** పైన ఉదహరించిన అడ్డుగోడలు తొలగిన తర్వాత అభ్యర్థికి శాశ్వత ఎన్నిక పత్రాన్ని అందజేస్తారు. అందులో అభ్యర్థి జీతభత్యాలు, సెలవు దినాలు, ఆరోగ్య వసతులు, వివిధ నిబంధనలను ఉద్యోగి బృంద అధికారి తెలియపరుస్తారు.

**ముగింపు :-** భర్తీ అనునది భవంతికి పునాదిలాంటిది. భర్తీ ఎంత పటిష్టంగా ఉంటే ఆ సంస్థ అంత ప్రగతిని సాధిస్తుంది. దేశ భవిష్యత్తు ఈ భర్తీపైనే ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వరంగ సంస్థల సామర్థ్యం వాటిలోని వివిధ ఉద్యోగాలలో పనిచేసే ఉద్యోగి బృందంపైనే ఆధారపడి ఉంటుంది. సామర్థ్యం, క్రమశిక్షణ, సుస్థితి, అంకితభావం, ప్రేరణ మొదలైన లక్షణాలు కలిగిన ఉద్యోగ బృందాన్ని కలిగి ఉన్నప్పుడు మాత్రమే ప్రభుత్వరంగ సంస్థలు తమకు అప్పగించిన లక్ష్యాలను విజయవంతంగా సాధించగలవు. ప్రభుత్వరంగ సంస్థలు సమర్ధవంతమైన ఉద్యోగుల నియామకం, అవి అనుసరించే భర్తీ విధానాలు, పద్ధతులపై ఆధారపడి ఉంటుంది. ఈ విధంగా ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగి బృంద పాలనలో భర్తీ అత్యంత కీలకమైన అంశంగా రూపొందింది.

## 5.2. ప్రభుత్వరంగ సంస్థలలో యజమాని, కార్మిక ఉద్యోగి సంబంధాలు :-

**పరిచయం :-** ప్రభుత్వరంగ సంస్థలో యజమాని ఉద్యోగి సంబంధాలు ముఖ్యపాత్ర వహిస్తాయి. భారతదేశంలోని బ్రిటీష్ ట్రేడ్‌యూనియన్ పద్ధతి దీనికి ఆధారమని చెప్పవచ్చును. ప్రభుత్వరంగ సంస్థలో ఉద్యోగి సర్వీసులు గృహవసతి, సాంఘికసేవ, వైద్య సదుపాయాలు, మరియు ఇతర సదుపాయాలు కల్పించటంలో ఒక విధానాన్ని రూపొందించింది. ఈ విధానం యజమానికి సిబ్బందికి మధ్య సంబంధాలు ఏర్పరుస్తాయి.

### నిర్వచనం :

**రిచర్డ్ సన్** నిర్వచనానుసారం పారిశ్రామిక సంబంధాలు అంటే పరిశ్రమలో ఉన్న వివిధ వర్గాల మధ్య ఉన్న సంబంధాలు. ముఖ్యంగా ఇవి స్థితిగతులకు సంబంధించినవి.

పారిశ్రామిక సంబంధాల పరిధి చాలా పెద్దది. కార్మికులు వ్యవస్థీకృతమైన సమష్టివస్తులు. ఈ సమీకృత కార్మికులకు, ఉద్యోగులకు యజమానితో ఉన్న సంబంధాలను కార్మిక సంబంధాలు అంటారు.

పారిశ్రామిక సంబంధాల అనే పదానికి చాలా అర్థాలున్నాయి. దానిని సూక్ష్మంగా వివరంచడం అంత సులభం కాదు. ఉత్పత్తి తయారీలో కార్మికులకు, యజమానికి లేదా కార్మిక సంఘాలకు యజమాన్యానికి గల సంబంధాన్ని పారిశ్రామిక సంబంధాలుగా చెప్పవచ్చు. కార్మిక సంబంధాలు అంటే నిర్వాహకులు కార్మికులతో సంప్రదింపులు చేసి యజమానికి కార్మికుల మధ్య ఒప్పందాలు ఏర్పరచి వాటిని నిర్వహించడం.

భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో పారిశ్రామికశాంతి సామరస్యానికి, సంస్థ అభివృద్ధి యజమాని, సిబ్బంది సంబంధాలు కీలక పాత్ర వహిస్తాయి. దీనిని సాధించడానికి గాను పారిశ్రామిక సంబంధాలు సాధనాలుగా పనిచేస్తాయి. ఇవి బహుముఖ అంశాలకు సంబంధించినవి. రాజకీయ, ఆర్థిక, సిద్ధాంత న్యాయపరమైన వ్యక్తిగత లేదా సంస్థాగత అంశాలు పారిశ్రామిక సంబంధాలలోని కొన్ని ముఖ్యఅంశాలు. ఈ అంశాలు దేశంలోని అనేక పరిశ్రమలలోనే కాక సమాజం మీద కూడా ప్రభావం చూపిస్తాయి. ఈ కారణంవల్ల ప్రతి దేశం తమ ప్రభుత్వాల ద్వారా పారిశ్రామిక సంబంధాలను మెరుగు పరచడానికి వివిధ చర్యలు చేపడుతూ వచ్చింది.

**ఆచార్య డన్‌లప్** పారిశ్రామిక సంబంధాల గురించి ఈ విధంగా వివరించాడు. పారిశ్రామిక సంబంధాలు కేవలం యూనియన్ మరియు యాజమాన్య సంబంధాలుగా చూడరాదు. అభివృద్ధి పథంలో సర్దుబాటు చేసుకున్న కొన్ని అంశాలు ఆలోచనలు వాటికి సరిపడే విధంగా, పనిస్థలానికి అనుకూలంగా ఏర్పరచుకొనే నియమ నిబంధనలను పారిశ్రామిక సంబంధాలని చెప్పవచ్చు.

## 5.2.1 పారిశ్రామిక సంబంధాల ఆవశ్యకత :-

శాస్త్రీయాభివృద్ధి పరిశ్రమలలోని పనివారి సంఖ్య, ఉద్యోగుల సంఖ్యను నిర్ణయించటం వల్ల పారిశ్రామిక సంబంధాలలో కొన్ని తగాదాలు ఏర్పడటానికి అవకాశం కలుగుతుంది. ఉదాహరణకు ఆటోమేషన్, కంప్యూటరైజేషన్ ప్రవేశంతో పరిశ్రమలోని ఉద్యోగాల మీద తీవ్రమైన ప్రభావం కనిపిస్తుంది. శాస్త్రీయమైన పద్ధతిని పరిశ్రమలో ప్రవేశపెట్టడం వల్ల సంస్థలలో వ్యవస్థీకృత మార్పులకు దారితీస్తుంది. భారతదేశంలో పెట్రోలు రసాయనిక పరిశ్రమలలో శాస్త్రీయపద్ధతిని ప్రవేశపెట్టడం వల్ల ఈ పరిశ్రమలో వ్యవస్థీకృత మార్పులు వచ్చాయి. పరిశ్రమలోని పనులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అనుసరించి పారిశ్రామిక సంబంధాలకు గుర్తింపు లభిస్తుంది.

యాజమాన్యానికి కార్మిక సంస్థలకు ఆదేశశాలివ్వడం నియంత్రించడం వంటి అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ఉదాహరణకు ప్రభుత్వం, పారిశ్రామిక తగాదాలన్నింటిని మూడు పద్ధతుల ద్వారా పరిష్కరించటానికి ప్రయత్నింస్తుంది.

1. రాజీ పద్ధతి

2. మధ్యవర్తిత్వం

3. న్యాయ నిర్ణయం, తీర్పు

## 5.2.2. ప్రభుత్వ కార్మికవిధానం :-

మొదటి పంచవర్షప్రణాళికలో పారిశ్రామిక సంబంధాల గురించి ఈ విధంగా పేర్కొనడం జరిగింది. లాభ దృష్టి లేదా ప్రైవేటు సంపాదనకు కార్మికులను పీడించడం అనే అంశానికి ప్రభుత్వరంగ సంస్థలలో ఏ విధమైన ప్రాధాన్యత ఉండకూడదు. రెండవ పంచవర్ష ప్రణాళికలో కూడా పారిశ్రామిక విధానం యొదటి పంచవర్ష ప్రణాళికను పోలి ఉంటుంది. రెండో పంచవర్ష ప్రణాళిక ప్రభుత్వరంగ సంస్థలోని మానవ సంబంధాలను గురించి ఎక్కువగా ప్రాధాన్యతను నొక్కి చెప్పింది. ప్రభుత్వరంగ సంస్థ భవిష్యత్తులో అధికంగా అభివృద్ధి చెందుతుంది. అందువల్ల సంస్థ పరిపాలన, అధికార కార్మిక కోరికలను తీర్చడంలో ప్రాధాన్యతను చూపాలి. ప్రభుత్వరంగ సంస్థలు సాధారణంగా కార్మిక చట్టాల నుంచి మినహాయింపును కోరకూడదు. ప్రైవేటు సంస్థలకు లభించని సదుపాయాలను కోరకూడదు అని రెండో పంచవర్ష ప్రణాళకలో పేర్కొనడం జరిగింది.

1956వ పారిశ్రామిక విధాన తీర్మానం ఈ విధంగా వివరించింది. సామ్యవాద ప్రజాస్వామ్యంలో కార్మికుడు అభివృద్ధి క్రమంలో భాగస్థుడు, కార్మికుడు ఈ చర్యలలో చురుకుగా పాల్గొనలేదు. సంయుక్త సంప్రదింపులు కార్మికుల సాంకేతికపరుల మధ్య అభివృద్ధికరంగా నిర్వహించబడాలి. ఈ విధానంలో ప్రభుత్వరంగ సంస్థలు ఉదాహరణగా పేర్కొనే స్థాయికి చేరాలి.

మూడవ పంచవర్ష ప్రణాళికలో యజమాని వైఖరి ఏ విధంగా ఉండాలో పేర్కొనడం జరిగింది. ప్రభుత్వరంగ సంస్థలు కార్మిక విధానాలను అమలుపరచడంలో ప్రత్యేక బాధ్యత వహించాలి.

నాల్గవ, ఐదవ పంచవర్ష ప్రణాళికలో కూడా పై వైఖరినే వెలిబుచ్చడం జరిగింది. కార్మిక విధానం ప్రణాళికా బద్ధంగా ఆర్థికాభివృద్ధి కోవకు 35 సంవత్సరాల కాలంలో మార్పులు చెందుతూ వచ్చింది.

ఏడవ పంచవర్ష ప్రణాళికను అనుసరించి యజమాని కార్మికుని మధ్య సంబంధాలను అభివృద్ధిపరచి ఉత్పత్తి పెరుగుదలకే కాక అన్ని షరతులతో అభివృద్ధి, తద్వారా ఆర్థిక లక్ష్యసాధనలో ప్రభుత్వరంగ సంస్థ సాధించిన ఉత్పత్తి కార్మిక విధానల విజయాన్ని సూచిస్తుంది. అని పేర్కొన్నారు. ఉత్పత్తి సాధించడంలో సాంకేతిక విషయాలు శాస్త్రీయ పద్ధతులు కీలక పాత్ర వహించినప్పటికీ కార్మికుని నేర్పరితనం క్రమశిక్షణ ప్రేరణ భాగస్వామ్య భావం లేకుండ ఉత్పత్తి పెరుగుదల జరగదు. ప్రభుత్వరంగ సంస్థలు ఉద్యోగ అవకాశాలను గరిష్ఠస్థాయికి పెంచినప్పటికి కొత్త సాంకేతిక పద్ధతులు ప్రవేశపెడుతూ కార్మిక ఉత్పత్తికి దోహదం చేయాలి. ఇదే పారిశ్రామిక జాడ్యాన్ని తగ్గించడానికి చక్కని మార్గం. ప్రభుత్వరంగ సంస్థలో పారిశ్రామిక సంబంధాలను మెరుగుపరిచి సంస్థలో సమ్మెలు, లాకౌట్లు రాకుండా చూచుకోవాలని ఏడో పంచవర్ష ప్రణాళిక పత్రం సూచించింది.

పదవ పంచవర్ష ప్రణాళికలో కూడా యజమాని, కార్మికుల మధ్య సంబంధాలు మెరుగు పర్చడానికి కార్యాచరణ పద్ధతిని సూచించింది. ప్రభుత్వరంగ యాజమాన్యం ఒక ఆదర్శప్రాయమైన యాజమాన్యంగా వ్యవహరించాలి. దీని అర్థం పర్యవేక్షకులు ప్రభుత్వరంగ సంస్థల పట్ల కార్మికుల పట్ల ఉదారభావం కలిగి, కార్మికుల పనిపట్ల విముఖత చూపినా లేదా అక్రమ విధికి పాటుపడినా వారి మీద చర్య తీసుకోకూడదన్న ఉద్దేశం కాదు. అలాగే కార్మికులు కోరిన ఏ కోరికనైనా అనుమతించాలని కాదు.

పరిశ్రమలోని అంతర్గత కలహాలకు కొన్ని ముఖ్య కారణాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు :-

1. ఆర్థిక పరమైనవి, 2. వ్యక్తిగత అంశాలు, 3. బహిర్గత అంశాలు, 4. తక్కువ హోదా, 5. మానసిక సమస్యలు మొదలగునవి.

పారిశ్రామిక కార్మికులకు సంబంధించిన ప్రముఖ రాజకీయనాయకుని నిర్బంధించినప్పుడు లేదా ఇతర ప్రముఖ రాజకీయనాయకులను నిర్బంధించినప్పుడు, ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో సంక్షోభం యేర్పడినప్పుడు ఈ తగాదాలు ఏర్పడతాయి.

### 5.2.3 పారిశ్రామిక శాంతి స్థాపనకు పద్ధతులు :

పారిశ్రామిక రంగాలలో కార్మిక తగాదాలను పరిష్కరించడానికి రెండు పద్ధతులను పాటిస్తారు. ఒకటి నివారణ రెండు ఉపశమనం. నిరోధన పద్ధతి ద్వారా పరిశ్రమలో కార్మిక తగాదాలను పరిష్కరించి శాంతిని నెలకొల్పడానికి గాను అంతర్గత యంత్రాంగాన్ని ఏర్పరుస్తారు.

**ఉదాహరణకు :**

1. సమర్థవంతమైన భర్తీద్వారా, 2. పటిష్టమైన ట్రేడ్ యూనియన్ స్థాపించటం, 3. అభివృద్ధికర శాసనాలను తయారుచేయడం, అమలుపరచడం, 4. పని కమిటీలను, వేతనాల బోర్డులను స్థాపించడం, 5. లాభార్జన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, సహ భాగస్వామ్యాన్ని కల్పించడం, 6. త్రైపాక్షిక కార్మిక యంత్రాంగం, కార్మిక సంక్షేమ పథకాలు.

పై పద్ధతుల ద్వారా యజమాన్యానికి కార్మికులకు మధ్య ఉన్న అగాధాన్ని తగ్గించి సామరస్యాన్ని పెంపొందించడానికి వీలు అవుతుంది.

ఈ క్రింది అంశాలు పారిశ్రామిక సంబంధాలు మెరుగు పర్చడానికి సహాయపడతాయి. 1. ఉద్యోగిబృంద విధానము, 2. కార్మిక యాజమాన్య సంబంధం, 3. సంయుక్త సంప్రదింపులు

**ముగింపు :-** ప్రభుత్వరంగ సంస్థలో కార్మికుడు రెండు పాత్రలు నిర్వహించాలి. ఒకటి సంస్థలో యజమాని, రెండు కార్మికుడు. దేశ పౌరునిగా ప్రభుత్వరంగ సంస్థలో యితను యజమాని కార్మికునిగా సేవకుడు. అందువల్ల ప్రభుత్వరంగ సంస్థలలో కార్మికుడి ఉత్పత్తికి, నిర్వహణకు సంస్థ అభివృద్ధికి పాటుపడేటట్లు అతనిలో చైతన్యం కల్పించాలి. సంస్థ విజయం విఫలం అనేవి నిర్వహణమీద ఆధారపడేవి. దేశాభివృద్ధికే కాక తన అభివృద్ధికి కూడా దారి తీస్తాయని కార్మికులు గుర్తించేటట్లు చేయాలి. ప్రభుత్వరంగ సంస్థలలోని కార్మిక సంఘాలు చాలా వరకు రాజకీయ పార్టీల ప్రతినిధులుగా పనిచేస్తున్నాయి. వీరి ప్రతినిధులు కార్మిక శ్రేయస్సుకన్నా తమ రాజకీయ నేర్పరితనానికి కృషి చేస్తున్నారు. కార్మికుడు తప్పనిసరిగా క్రమశిక్షణా నియమావళి పాటిస్తూ సంస్థ ప్రగతికి తోడ్పడేటట్లు పాటు పడాలి. దీని వలన కార్మికులు ప్రభుత్వరంగ సంస్థలు ప్రగతి బాటలో నడుస్తాయి.

## 5.3 ప్రభుత్వరంగ సంస్థలలో కార్మిక సంక్షేమ కార్యక్రమాలు :-

కార్మిక సంక్షేమ కార్యక్రమాల విషయంలో ప్రభుత్వరంగ సంస్థలు చెప్పుకోదగ్గ పాత్ర వహిస్తున్నాయి. ఈ కార్యక్రమాల అమలువల్ల గరిష్ఠస్థాయిలో కార్మికులను సంస్థకు విధేయులుగా చేయడానికి వీలవుతుంది. తద్వారా సంస్థ తన ఉత్పత్తిని అభివృద్ధి పర్చడమేకాక అధిక లాభాలు పొందవచ్చును.

అంతర్జాతీయ కార్మిక వ్యవస్థ 1947 తన తీర్మానంలో కార్మిక సంక్షేమాన్ని ఈ రకంగా పేర్కొన్నది. తమ నివాసం నుంచి దూరంగా వెళ్ళి వృత్తి నిర్వహించే కార్మికులకు సేవలను, వసతులను, అల్పాహారం, విశ్రాంతి గదులు, వినోద కార్యక్రమాలు, రవాణా సౌకర్యాలతో పాటు విధి నిర్వహణ శక్తిని అభివృద్ధి పరచగల పరిసరాలను ఏర్పరచడాన్ని కార్మిక సంక్షేమం అంటారు.

జాతీయ కార్మిక కమీషన్‌ను అనుసరించి సంక్షేమం అనేది వివిధ దృక్పథాలతో చూసినట్లయితే అది అభివృద్ధికి తప్పనిసరి. సంక్షేమాన్ని వివిధ దేశాలు వివిధ అర్థాలతో వివరించినప్పటికీ అది పారిశ్రామిక, ఆర్థిక, సాంఘిక లేదా సామాజికంగా వివిధ రూపాలలో కనిపిస్తుంది. భారత రాజ్యాంగం ఆదేశ సూత్రాల ద్వారా ప్రజా సంక్షేమాన్ని సూచిస్తుంది.

1953లో అంతర్జాతీయ కార్మిక సంస్థలోని అంగం కార్మిక సంక్షేమాన్ని పటిష్టంగా నిర్వహించాలని భావించింది. అందుకుగాను అంతర్జాతీయ కార్మిక వ్యవస్థ తన 102వ తీర్మానంలో కార్మిక సంక్షేమాన్ని ఈ విధంగా పేర్కొన్నది.

1. సంస్థలో లేదా దగ్గరిలో కార్మికులకు భోజన సదుపాయాలు కల్పించడం.

2. సంస్థ ద్వారా కార్మికులకు విశ్రాంతి, వినోద సౌకర్యాలను కల్పించడం.

3. కార్మికుని నివాసం నుంచి సంస్థ వరకు రవాణా సౌకర్యాలు కల్పించడం.

భారత ప్రభుత్వం నియమించిన అధ్యయన బృందం 1959లో కార్మిక సంక్షేమ కార్యక్రమాలను మొత్తం మూడు వర్గాలుగా విభజించింది.

1. సంస్థ అంతర్గతమైన కార్మిక సంక్షేమం ఉదా॥ వైద్య సదుపాయం, అల్పాహార శాలలు, మంచినీటి సరఫరా, పిల్లలకు భద్రతా సౌకర్యం. 2. సంస్థకు బహిర్గతమైన కార్మిక సంక్షేమం, అంతర్గత, బహిర్గత ఆటలు, గృహనిర్మాణం, వయోజన విద్య మొదలగునవి. 3. సాంఘిక భద్రత.

1963లో కార్మిక సంక్షేమ కార్యక్రమాలను రెండు రకాలుగా విభజించడం జరిగింది.

1. సంస్థ ఆవరణలో కల్పించే కార్మిక సంక్షేమ కార్యకలాపాలు 2. సంస్థకు బహిర్గతమైన కార్మిక సంక్షేమ కార్యకలాపాలు.

## 5.3.1 సంస్థ ఆవరణలో కల్పించే కార్మిక సంక్షేమ కార్యకలాపాలు :-

1. మరుగుదొడ్లు, మూత్రశాలలు, 2. పిల్లలను తగువిధంగా చూడటం, 3. విశ్రాంతి గదులు, ఫలహారశాలలు, 4. మంచినీటి సదుపాయాలు, 5. వైద్య సదుపాయాలు, వృత్తిపరమైన ఆరోగ్య రక్షణ, 6. సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణకు పాలనా వ్యవస్థ ఏర్పాటు, 7. యూనిఫారమ్ సరఫరా, వస్తువుల పంపిణీ, 8. పనిలోని షిఫ్టుల అలవెన్సులు.

## 2. సంస్థకు బహిర్గతమైన కార్మిక సంక్షేమ కార్యకలాపాలు :-

1. సాంఘిక భృమా, గ్రాట్యుటీ, ఫించన్, ప్రావిడెంట్ ఫండ్, పునరావాసం, గ్రూప్ ఇన్సూరెన్సు మొదలగునవి. 2. వైద్యసదుపాయాలు, శారీరక సామర్థ్యం, పని సమర్థత, కుటుంబ నియంత్రణ, ఎయిడ్స్‌పై అవగాహన, 3. విద్యా సౌకర్యాలు, వయోజన విద్య, కంప్యూటర్ పరిజ్ఞానం, మహిళా సాధికారత, 4. గృహవసతి సౌకర్యాలు, 5. వినోద కార్యక్రమాలు, ఆటలు, పాటలు, లైబ్రరీ, అధ్యయన గదులు, 6. సెలవు గృహాలు, సెలవు ప్రయాణ వసతులు, 7. కార్మికుల సహకార సంస్థలు, వినియోగదారుల సహకార సంఘాలు, సహకార దుకాణాలు, సహకార పరపతి సంఘాలు, 8. కార్మికులపై ఆధారపడిన వారికి వృత్తిపరమైన శిక్షణ అవకాశాలు, 9. మహిళా శిశుసంక్షేమ కార్యకలాపాలు, 10. రవాణా సౌకర్యాలు, 11, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబంలోని ఒక సభ్యునికి పునరావాసం, ఉద్యోగం ఆధునికంగా కల్పించవలసిన సౌకర్యం.

కార్మికుల కోసం సంస్థ చేపట్టవలసిన సంక్షేమ కార్యక్రమాలను 1948 కర్మాగారాల చట్టం, కార్మిక చట్టం 1951, గనుల చట్టం 1952 ద్వారా అమలుచేసింది.

కార్మాగార చట్టాన్ని అనుసరించి యజమాని, కార్మికులకు ఈ క్రింది వసతులు విధిగా కల్పించవలసి ఉంటుంది.

1. చల్లని పరిశుభ్రమైన త్రాగే నీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు స్నానాల గదులు, 2. 150 మంది కార్మికులకు ఒకటి చొప్పున ఒక ప్రథమ చికిత్స పెట్టె, 3. 250 మంది కార్మికులకు మించిన సంస్థలో ఫలహారశాలను స్థాపించాలి. 4. 150 లేదా

అంతకు మించిన కార్మికులు గల వ్యవస్థలో విశ్రాంతి గదులు, తగిన విధంగా భోజన గదులను ఏర్పరచాలి. 5. 50 మంది మహిళా కార్మికులు ఉన్నట్లయితే వారి పిల్లల విషయంలో శిశు సంరక్షణశాల తప్పనిసరిగా నిర్వహించాలి.

కర్మాగార చట్టాన్ని అనుసరించి అనుసరించి 500 మంది కార్మికులకు మించిన సంస్థలో ఒక కార్మిక సంక్షేమాధికారిని నియమించాలి. ఇతను కార్మిక సంక్షేమం కోసం పాటుపడాలి. సంస్థకు బహిర్గతమైన కార్మిక సంక్షేమ కార్యకలాపాలు. ఈ రకమైన సంక్షేమ కార్యకలాపాలు చాలా వరకు శాసనబద్ధమైనవి కావు కాని తోటి కార్మికుల్లో మాత్రం కొన్నింటిని యాజమాన్యం తప్పనిసరిగా నిర్వహించాలి. ప్రభుత్వరంగ సంస్థలోని కార్మికులకు ఈ క్రింది పేర్కొన్న సంక్షేమ కార్యక్రమాలు అమలుపరుస్తున్నారు.

1. గృహవసతి సౌకర్యము, 2. రవాణా సౌకర్యము, 3. వైద్య సదుపాయాలు, 4. విద్యా సదుపాయాలు, 5. సాంఘిక సాంస్కృతిక సదుపాయాలు, 6. ఆటల సౌకర్యము, 7. ఫలహాల శాలలు, 8. సాంఘిక భద్రత, 9. ప్రసూతి సౌకర్యము, 10. ఎంప్లాయి స్టేట్ ఇన్సూరెన్సు స్కీములు, 11. లే - ఆఫ్ రిట్రెంచ్‌మెంట్ పరిహారము, 12. కుటుంబ ఫించను పథకాలు, 13. ప్రావిడెంట్ ఫండ్ బోనస్ పథకాలు, 14. గ్రాట్యుటీ స్కీము మొదలగునవి.

### 5.4. ప్రభుత్వరంగ సంస్థలు - వినియోగదారుడు :

మహాత్మాగాంధి వినియోగదారుని కోసం ఈ విధంగా వ్యాఖ్యానించాడు. (జీవిత భీమాలో). వినియోగదారుడు బ్యాంకును సందర్శించే వారిలో గొప్పగౌరవం కలవాడు. సంస్థ వారిపై ఆధారపడి ఉంటుంది. వినియోగదారుడు పనికి ఆటంకపడేవాడుకాడు.

వినియోగిత అనేది ఎస్.ఎస్.ఎ. 1900 సంవత్సరానికి ముందు నుంచే ఉంది. 1930లో భయంకర తుఫాను వచ్చినప్పుడు వినియోగదారులలో ఒక చైతన్యం వచ్చింది. ప్రమాదకరమైన తప్పుడు ప్రచారాల నుంచి వినియోగదారుని రక్షించడానికి ప్రయత్నాలు జరిగాయి. ఎస్.ఎస్.ఎ. లో వ్యక్తిగతంగా రోల్ఫ్ నజ్‌డన్, జె.ఎఫ్ కెన్నెడి వినియోగదారుల పోరాటానికి చాలా కృషి చేశారు.

వినియోగిత అనేది ప్రభుత్వం ద్వారా కొనుగోలుదారులకు అమ్మకం దారులపై హక్కులను అధికారాన్ని కలిగించడం. వస్తువు డిమాండుకు వినియోగదారుడు అధికంగా కొనేటట్లు అమ్మందారుడు ప్రయత్నించాలి. వినియోగదారుడు అమ్మకందారుడు చేసే అవినీతి అక్రమ పద్ధతులపై పోరాడటానికి ప్రయత్నించవచ్చు. వినియోగిత అనేది విశాల దృష్టితో చూచినట్లయితే వివిధ సమాజానికి బాధ్యతను గుర్తింపచేయడానికి సహాయపడుతుంది.

**విలియమ్ జె. స్టానన్** వినియోగితను రెండు రకాలు పేర్కొన్నాడు.

1. వినియోగదారుడు తనకు వస్తువుల కొనుకగోలు విషయంలో జరిగే అన్యాయాన్ని ప్రతిఘటిస్తాడు.
2. అటువంటి అన్యాయాన్ని అరికట్టడానికి పరిష్కారం కనుక్కోవడానికి ప్రయత్నించాలి.

స్వతంత్రమైన ఆర్థికరంగంలో వినియోగదారుడు రాజు వంటివాడు. ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర సంస్థల ముఖ్యోద్దేశ్యం ఏమంటే వినియోగదారుని సంతృప్తిపరచగల ఉత్పత్తి చేయడం, ఆ వినియోగదారుడు పరిశ్రమ విజయానికి, అభివృద్ధి ఆధారం, వినియోగం అనే దాని గురించి వివరిస్తూ “ఆడమ్ స్మిత్” ఈ విధంగా పేర్కొన్నాడు. ఉత్పత్తి అర్థం, పరమార్థం వినియోగమే. ఉత్పత్తి దారుడు ఎల్లప్పుడూ వనియోగదారునికి సంతృప్తిని కలిగించేటట్లు చూడాలి. ఉత్పత్తిలో నాణ్యత, సరసమైన ధర

లోపించినట్లయితే వినియోగాదారునికి అసంతృప్తి కలుగుతుంది. వినియోగదారునికి సరసమైన ధరకు నాణ్యమైన సరకులు లభ్యమయ్యేటట్లు చూడటానికిగాను ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగ సంస్థలు తగు చర్యలు తీసుకోవడం మొదలుపెట్టినాయి.

### 5.4.1. భారత ప్రభుత్వరంగ సంస్థలలో వినియోగదారుని రక్షణ :

వినియోగదారుల రక్షణ కోసం భారత ప్రభుత్వం వారు వనియోగదారుల రక్షణ చట్టం "కన్స్యూమర్ ప్రొటెక్షన్ చట్టం" 1986లో రూపొందించబడి 15-4-1987 నుంచి అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం వినియోగదారుడు తన నష్టానికి పరిహారాన్ని పొందగలడు. ఈ చట్టం ప్రకారం వినియోగదారుల హక్కుల కోసం పోరాడటానికి రాష్ట్రస్థాయిలో "స్టేట్ ప్రొటెక్షన్ కౌన్సిల్" లను ఏర్పాటు చేస్తారు. కేంద్రస్థాయిలో "జాతీయ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్" స్థాయిలలో స్థాపించడం జరిగింది. బ్యాంకు, ఇన్సూరెన్స్, రవాణా, విద్యుత్, ఇంధనం సరఫరామొదలైన సర్వీసులు కూడా ఈ చట్ట పరిధిలోకి వస్తాయి. వినియోగదారుల రక్షణ చట్టం 1986 ను అనుసరించి ఏదైనా వస్తువులో, సేవలో గాని లోపం లేదా నాణ్యత గురించి దావా వేయడానికి వీలు కల్పించడం జరిగింది. ఇటువంటి దావాలు వేయడానికి ఫీజు ఏదీ చెల్లించనవసరం లేదు.

### 5.4.2. వినియోగదార్ల కౌన్సిళ్ళను నిర్వహించేటప్పుడు కొన్ని జాగ్రత్తలు :

వినియోగదార్ల కౌన్సిళ్ళను నిర్వహించేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఐక్య రాజ్యసమితి ఈ కౌన్సిల్ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని తన నివేదికలో ఈ రకంగా పేర్కొన్నది.

1. కౌన్సిళ్ళు ఎక్కువగా ఉంటే ప్రజలలో అవగాహన లోపిస్తుంది. అందుకుగాను పరిశ్రమలను కలిసి వర్గీకరించినట్లయితే వినియోగదారుల కౌన్సిళ్ళ సంఖ్య తగ్గి ప్రతిరూపణ లేకుండా ఉంటుంది.

2. ప్రతి వినియోగదారుల కౌన్సిల్ తన ఉనికిని ప్రజలలో బాగా ప్రచారం చేసుకొని వారికి అందుబాటులో ఉండాలి.

3. వినియోగదారుల కౌన్సిళ్ళకు ఆర్థిక విషయంలో స్వాతంత్ర్యం ఉండాలి. ఇవి కేవలం పరిశ్రమల మీద ఆధారపడి ఉండరాదు.

4. వినియోగదారుల కౌన్సిళ్ళకు కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖల నుంచి ప్రేరణ గుర్తింపు కల్పించాలి.

5. పరిశ్రమలు తమ విధానాల నిర్ణయాలలో ఈ కౌన్సిళ్ళ సలహాలను స్వీకరించాలి.

### 5.4.3. వినియోగదారుల హక్కులు :

1. వినియోగదారుల ఆస్తులకు, ప్రాణాలకు నష్టదాయకమైన వస్తువుల వాణిజ్యాన్ని అరికట్టి వినియోగదారులకు రక్షణ కల్పించడం.
2. మార్కెట్‌లో విక్రయించే వస్తువుల నాణ్యత, ప్రమాణం, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, వస్తురాశి వంటి వివిధ అంశాలలో వినియోగదారుల తెలుసుకొనే హక్కును పరిరక్షిస్తూ, అవాంఛనీయ వ్యాపార ధోరణుల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించడం.

3. పరిపూర్ణమైన పోటీ ధరలతో వస్తువులను ఎంపికచేసే వీలు కల్పిస్తూ వివిధ నమూనాలతో వస్తువుల లభ్యతను పాటిస్తూ, ఎంపిక చేసుకొనే హక్కును వినియోగదారులకు కల్పించడం.

4. విచక్షణా రహితమైన వినియోగదారుల దోపిడీ, అవాంఛనీయ వ్యాపార పద్ధతుల నుంచి, వినియోగదారులకు పూర్తిరక్షణ కల్పించి అన్యాయం జరిగిన సందర్భాలలో వినియోగదారులు తాను న్యాయం పొందే హక్కును పరిరక్షించడం.

5. వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించే సంబంధింత బృందాలకు తమ బాధలను వినిపించే హక్కులను కల్పించడం.

6. వినియోగదారులను విద్యావంతులుగా చేసే హక్కును కల్పించడం.

## 5.4.4. వినియోగదారుని బాధ్యతలు :

1. ఐకమత్యం 2. వస్తువుల కొనుగోలులో శ్రద్ధవహించి వస్తువును పరిశీలించి మాత్రమే కొనుగోలు చేయాలి 3. జాతీయ ఆర్థిక వ్యవస్థలో నిర్వహించవలసిన పాత్రను అర్థం చేసుకోవడం 4. ఇతరుల నుంచి నిజాయితీ ఆశించే ముందు తాను నిజాయితీగా ప్రవర్తించడం 5. వస్తువులు అధికంగా దాచుకోవడం మాని ఇతరులకు సవ్యంగా లేదా పంపిణీ జరగడానికి తోడ్పడటం 6. నల్ల బజారును నిరోధించడం 7. అమ్మకం ప్రచురణలకు, ప్రకటనలకు ఉత్తేజపడి మోసపోకుండా ఒకటికి రెండుసార్లు ఆలోచించి కొనుగోలు చేయడం 8. తన ప్రవర్తనలో మమత మర్యాదను కలిగి ఉండటం 9. సరియైన ఫిర్యాదును మాత్రమే చేసి దానికోసం చివరి వరకు పోరాడటం 10. సాక్షిగా పిలిచినట్లయితే ఎవ్వరికి భయపడకుండా నిజం చెప్పడం.

## 5.4.5. వినియోగదారుల రక్షణకు భారతదేశంలో చట్టాలు :

1. మోనోపాలిస్ అండ్ రిస్ట్రిక్టివ్ ట్రేడ్ ప్రాక్టీస్ చట్టం 1969 2. నిత్యావసర వస్తువుల పంపిణీ చట్టం 3. ఆహార కల్తీ నిరోధక చట్టం 4. ట్రేడ్ మార్క్ చట్టం 5. ఇండియన్ పేటెంట్స్ అండ్ డిజైన్ చట్టం 6. అగ్రికల్చర్ ప్రొడ్యూస్, ట్రేడింగ్ అండ్ మార్కెటింగ్ చట్టం 7. డ్రగ్స్ కంట్రోల్ చట్టం 8. ఇండియన్ స్టాండర్డ్ ఇన్స్టిట్యూట్ సర్టిఫికేషన్ చట్టం 9. తూనికలు - కొలతల చట్టం 10. ఎగుమతులు, దిగుమతుల నియంత్రణ చట్టం 11. ప్రైస్ అండ్ స్టాక్ డిస్ప్లే ఆర్డర్డ్ చట్టం.

ప్రభుత్వరంగ సంస్థలకు పై చట్టంలోని ఎం.ఆర్.టి.పి పద్దతి (మోనోపలిస్ అండ్ రెస్ట్రిక్ట్ ట్రేడ్ ప్రాక్టీస్ చట్టం) వర్తించదు. ఈ విషయాన్ని సచార్ కమిటీ ప్రస్తావిస్తూ ప్రభుత్వరంగ సంస్థలను ఎం.ఆర్.టి.పి. చట్ట పరిధిలోకి తేవాలని సిఫారసు చేసింది. వినియోగదారుల కష్టాలను తగ్గించడానికి గాను ప్రజా పంపిణీ విధానాన్ని ప్రభుత్వం చేపట్టింది. ప్రజలకు వస్తువులు సరసమైన ధరలకు లభింప చేయడానికి చౌకదుకాణాలను నిర్వహిస్తున్నారు.

## 5.4.6. వినియోగదారుల కౌన్సిల్స్ ఈ క్రింది పాత్ర వహించవలసి ఉంది :

1. వినియోగదారులకు విషయపరిజ్ఞానం కలిగించడం 2. ఉత్పత్తి రేటింగ్ నిర్ధారణ 3. ఉత్పత్తి దారునికి, ప్రభుత్వానికి మధ్యవర్తిత్వం నెరపడం, వినియోగదారుల సంఘాలు నిర్వహించవలసిన బాధ్యతలు ఒకటి.

## ముగుంపు :

భారతదేశంలో చెప్పుకోతగ్గ వినియోగదారుల ప్రభావం లేదని చెప్పవచ్చు. దీనికి ముఖ్య కారణం అసంపూర్ణ మార్కెట్ వ్యవస్థ, ఉత్పత్తి కొరత అయినప్పటికీ వివిధ రాజకీయ ఉద్దేశాలతో వినియోగదారుల ప్రదర్శనలు జరుపబడ్డాయి. ఈ ప్రదర్శనకారుల శ్రద్ధ పరిమితమైంది మాత్రమే. భారతదేశంలో వివిధ ప్రదేశాలలో వినియోగదార్ల సంఘాలు ఏర్పడ్డాయి. ఈ సంఘాలు తమ

ఉనికిని, లక్ష్యాలను ప్రత్యక్ష్యంగా ప్రదర్శించవలసి ఉంటుంది. ఈ వినియోగదారుల వ్యవస్థలు పట్టణ ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉన్నాయి.

5. ప్రభుత్వరంగ సంస్థలు సాంఘిక న్యాయంతోపాటు, జాతీయాభివృద్ధి కార్యక్రమాల్లో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకొన్నాయి. ప్రత్యేకంగా భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వీటి ప్రాధాన్యత, ప్రభావాలు బహుముఖంగా పరివ్యాప్తి చెందడం గమనించదగ్గ విషయం. గత నాలుగ దశాబ్దాల కాలంలో ప్రభుత్వరంగ సంస్థలు ముందెన్నడూ కనీవినీ ఎరుగని విధంగా పరిఢవిల్లి, దేశ ఆర్థిక పురోగతిని నిర్వహిస్తున్నాయి. సాపేక్షమైన మార్పులతోపాటు, దేశసమగ్రాభివృద్ధికి తోడ్పడటమేకాక, సామ్యవాద పంథాలో సంక్షేమ సమాజస్థాపనకు, ప్రభుత్వరంగ సంస్థలు ఎంతో దోహదం చేస్తున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలు, వాణిజ్య - పారిశ్రామిక రంగాల్లో వాటి ఆర్థికపుష్టిని ద్విగుణీకృతం చేసుకోవడమేగాక ఉత్పత్తి - పంపిణీ; ఎగుమతులు - దిగుమతులు మొదలైన వాణిజ్యాల్లో లభించిన మిగులు మొత్తాలను దేశ ఆర్థిక పురోగతి కోసం వినియోగపరిచి, దేశంలో ఆర్థికపరమైన ప్రాంతీయ అసమానతలను సరిదిద్ది, సోషలిస్టు సమాజ నిర్మాణానికి తోడ్పడటం, దేశంలో ఈనాటి వరకు సంపూర్ణంగా వినియోగించుకోలేని అనేకానేక వనరులను వినియోగంలోకి తేవడంతోపాటు, నిరుద్యోగంతో బాధపడుతున్న అసంఖ్యాకులైన ప్రజలకు, ఉపాధి సౌకర్యాలు కల్పించడం వంటి సాంఘిక ప్రయోజనాల విషయంలో కూడా ఈ సంస్థలు ఎంతో దక్షతతో పనిచేస్తున్నాయి.

21వ శతాబ్దంలో లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్.పి.జి.) మూలంగా మరియు కంప్యూటరైజేషన్ మూలంగా ఎంప్లాయిమెంట్ ఎక్కువైనప్పటికి కూడా కార్మికులలో ప్రైవేటైజేషన్ మూలంగా అసంతృప్తి నెలకొని ఉంది. వినయోగదారుడు లబ్దిపొందుతున్నాడు.

## 5.5. నమూనా ప్రశ్నలు :

1. భర్తీ అనగానేమి? నియమ విధానం పై ప్రభుత్వ వివరణలో (1961) మార్గదర్శక సూత్రాలను అనుసరించి ప్రభుత్వరంగ సంస్థల యొక్క నియమక విధానాన్ని వివరించండి?
2. ప్రభుత్వరంగ సంస్థలలో వ్యక్తుల నియామకాల కొరకు అందుబాటులో ఉన్న వివిధ మార్గాలను వివరించండి?
3. ఎన్నిక విధానాన్ని వివరించండి?
4. ప్రభుత్వరంగ సంస్థలలో యజమాని, కార్మిక సంబంధాలు వివరింపుము?
5. పారిశ్రామిక సంబంధాల అవశ్యకత వివరింపుము?
6. ప్రభుత్వరంగ సంస్థలలో కార్మిక సంక్షేమ కార్యక్రమాలను వివరింపుము?
7. వినియోగదారుల కౌన్సిల్స్‌పై క్లుప్తంగా వివరింపుము?

**5.6. చదువదగిన గ్రంథాలు :**


1. బి.పి. మాథుర్ - ప్రభుత్వరంగ సంస్థల మేనేజ్‌మెంటు

2. ఎం.ఎన్. మల్లయ్య - భారతదేశంలో ప్రభుత్వరంగ సంస్థలు

3. ఎ.ఆర్.సి. స్టడీ టీం రిపోర్ట్స్

4. జి. రామిరెడ్డి - ప్రభుత్వము మరియు సంస్థలు

5. ఎ. మురళీధర్ రావు, డా॥ డి. రామచంద్రం, ఎన్. భూపతి, శ్రీమతి సూర్యకళాధర్ - ప్రభుత్వరంగ సంస్థలు.


**డా॥ ఎన్. జి. ఎస్. ప్రసాద్**

పాఠం - 6

# నియంత్రణ, మార్గదర్శక సంస్థలు

## 6.0 లక్ష్యం

భారతదేశంలో ప్రభుత్వరంగ సంస్థలు ఆర్థిక అభివృద్ధిలో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. అవి మరింత సామర్థ్యం తోనూ, బాధ్యతాయుతంగానూ పనిచేసి ఆర్థిక పరిస్థితి మెరుగుదలకు తోడ్పడటానికి నియంత్రణా, మార్గదర్శక సంస్థలు సహకరిస్తాయి. అటువంటి నియంత్రణా, మార్గదర్శక సంస్థలు పార్లమెంటు, పాలనా మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థల కమిటీ, ప్రభుత్వరంగ సంస్థల బ్యూరో. ఈ నియంత్రణా మార్గదర్శక సంస్థల గూర్చి వివరించడం ఈ పాఠం యుక్క లక్ష్యం.

**విషయసూచిక :**


6.1. నియంత్రణ, మార్గదర్శక సంస్థలు - పరిచయం

6.2. పార్లమెంటు

6.2.1. పార్లమెంటు మార్గదర్శకత్వం - నియంత్రణ స్వభావం

6.2.2. పార్లమెంటరీ మార్గదర్శకత్వం - నియంత్రణ పద్ధతులు

6.2.3. పార్లమెంటరీ ప్రశ్నలు

6.2.4. పార్లమెంటరీ డిబేట్లు మరియు చర్చలు

6.3. పాలనా మంత్రిత్వ శాఖ

6.4. ప్రభుత్వరంగ సంస్థల కమిటీ

6.4.1. వ్యవస్థీకరణ

6.4.2. విధులు - అధికారాలు

6.4.3. పరిమితులు

6.4.4. కమిటి పనితీరు

6.5. ప్రభుత్వరంగ సంస్థల బ్యూరో

6.5.1. ప్రభుత్వరంగ సంస్థల బ్యూరో విధులు

6.5.2. ప్రభుత్వరంగ సంస్థల శాఖ

6.6. సారాంశము

6.7. నమూనా ప్రశ్నలు

6.8. చదువదగిన గ్రంథాలు

## 6.1. నియంత్రణ, మార్గదర్శక సంస్థలు - పరిచయం :

ప్రభుత్వరంగ సంస్థలతో ప్రభుత్వ వ్యవస్థలు సన్నిహిత సంబంధం కల్గి ఉంటాయి. జాతీయ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగ సంస్థలకున్న ప్రాముఖ్యత దృష్ట్యా, అవి ఆర్థిక, సామాజిక విధానాల అమలు నిర్వహించే సాధనాలుగా పనిచేస్తున్న దృష్ట్యా వాటికి ప్రభుత్వ వ్యవస్థల మార్గదర్శకత్వం, నియంత్రణ, పర్యవేక్షణ ఆవశ్యకత ఉంది. ప్రభుత్వ వ్యవస్థలు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర వహించే ప్రభుత్వరంగ వ్యవస్థల సమర్ధతను పెంపొందించడానికి మార్గదర్శకత్వాన్ని అందించడంతో పాటు, వాటి కార్యకలాపాలు నిర్ధారించిన ప్రణాళికలకు అనుగుణంగా నిర్వహించబడుతున్నాయా, లేదా అన్న విషయాలను కూడా పరిశీలిస్తాయి. ఈ సందర్భంలో నియంత్రణా, మార్గదర్శక సంస్థల పాత్ర కీలకమైనది.

భారతదేశంలో పార్లమెంటు, పాలనా మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థల కమిటి, ప్రభుత్వరంగ సంస్థలశాఖ ప్రభ్వురంగ సంస్థలకు సంబంధించిన నియంత్రణ, మార్గదర్శక సంస్థలు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు పార్లమెంటుకు, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు రాష్ట్ర శాసనసభలకు జవాబుదారి, కేంద్ర స్థాయిలో ప్రభుత్వరంగ సంస్థల కార్యకలాపాలు విస్తృతం కావడం చేత, ఎక్కువ మొత్తం కేంద్ర సంస్థలలో పెట్టుబడులుగా పెట్టిన కారణంగా పార్లమెంటు వాటిపై తగినంత నియంత్రణ చెలాయించవలసి ఉంటుంది.

ప్రభుత్వరంగ సంస్థలు సంబంధిత మంత్రిత్వశాఖల ఆధీనంలో ఉంటాయి. ప్రభుత్వరంగ సంస్థలకు పార్లమెంటుకు మధ్య మంత్రిత్వ శాఖ వారధి. మంత్రిత్వశాఖ నియంత్రణ ద్వారా ప్రభుత్వరంగ సంస్థలు విధానాలకు అనుగుణంగా వ్యవహరించేలా చేయవలసి ఉంటుంది.

ప్రభుత్వరంగ సంస్థలపై సమర్థవంతమైన నియంత్రణకు పార్లమెంటుకు ప్రభుత్వరంగ సంస్థల కమిటి ఒక సాధనం. ప్రభుత్వరంగ సంస్థల పనితీరును సమీక్షించి ఈ కమిటి పార్లమెంటుకు నివేదికను సమర్పించి పార్లమెంటు నియంత్రణకు ఒక సమర్ధవంతమైన సాధనంగా తోడ్పడుతుంది. అదే విధంగా ప్రభుత్వ రంగ సంస్థల ఉమ్మడి సమస్యలను పరిష్కరించడానికి సమన్వయం సాధించడానికి **1964**లో ప్రభుత్వరంగ సంస్థల బ్యూరో ఏర్పాటు చేయబడింది. అది **1985**లో రద్దయి, దాని స్థానంలో ప్రభుత్వరంగ సంస్థల శాఖ ఏర్పాటు చేయబడింది.

## 6.2 పార్లమెంటు :

ప్రతి ఒక్క ప్రభుత్వరంగ సంస్థ అనుచితమైన ఒక కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖకు కేటాయించబడి ఉంటుంది. ఆ మంత్రిత్వ శాఖ ద్వారా ఆ సంస్థ పర్యవేక్షణ, నియంత్రణ చేయబడుతుంది. అదే విధంగా ఆ శాఖ మార్గదర్శకత్వంలో ఆ సంస్థ పని చేస్తుంది. ఉదాహరణకు, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, పారిశ్రామికవేత్త కార్పొరేషన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ కింద, దామోదర్‌లోయ కార్పొరేషన్ నీటి పారుదల, విద్యుశ్చక్తి మంత్రిత్వ శాఖ కింద ఉంటాయి. ఏ మంత్రిత్వ శాఖ ఆధీనంలో ప్రభుత్వ కార్పొరేషన్ ఉంటుందో, ఆ మంత్రి ఆ సంస్థ సంతృప్తికరంగా పని చేయడానికి పార్లమెంటుకు బాధ్యత వహిస్తాడు.

పార్లమెంటు నియంత్రణ ఒక ప్రభుత్వరంగ సంస్థకు సంబంధించి, మంత్రి నిర్దేశించి, నియంత్రణ చేయగల విషయాలకు మాత్రమే పరిమితమై ఉంటుంది. కార్పొరేషన్ నిర్వాహణా వివరాలకు సంబంధించిన ప్రశ్నలను మంత్రులు స్వీకరించి, సమాధానం ఇవ్వరు. ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించిన వివరాలను చర్చించి, వాటిని నియంత్రించే అధికారం పార్లమెంటుకు ఉంది. అయితే పార్లమెంటు వాటి రోజువారీ పాలనా అంశాలలో జోక్యం కల్పించుకోదు. అది ప్రభుత్వరంగ సంస్థల స్థూల విధానాలను పరిశీలిస్తుంది. ప్రభుత్వరంగ సంస్థలకు ఆర్థిక లక్ష్యాలతో పాటు సామాజిక లక్ష్యాలు ఉండటం చేత వాటి నిర్వర్తనపై పార్లమెంటు ఆసక్తి చూపిస్తుంది. జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా అవి తమ కార్యకలాపాలు నిర్వహించేలా పార్లమెంటు వాటికి మార్గదర్శకత్వాన్నిస్తుంది. ప్రజల ప్రతినిధిగా, ప్రజాధనానికి సంరక్షకునిగా పార్లమెంటు ప్రభుత్వరంగ సంస్థలకు నిర్దేశకత్వాన్ని, మార్గదర్శకత్వాన్ని సమకూరుస్తుంది.

ప్రభుత్వ కార్పొరేషన్ల ఆర్థిక అంచనాలు, ప్రకటనలు, వార్షిక నివేదికలు, ఖాతాలు పార్లమెంటు ఉభయసభలకు సమర్పిస్తారు. కాబట్టి కార్పొరేషన్ల వ్యవహారాలను తర్కించడానికి, చర్చించడానికి, పరిశీలించడానికి అవి చక్కటి అవకాశాన్ని కలుగచేస్తాయి. లోక్‌సభ అంచనాల సంఘము, ప్రభుత్వ ఖాతాల సంఘము, ప్రభుత్వ రంగ సంస్థల కమిటి కార్పొరేషన్ల అంచనాలను, ఖాతాలను కూడా పరీక్షించి వాటిపై ప్రభుత్వానికి, పార్లమెంటుకు సమిచితమైన నివేదికలను, సిఫార్సులను అందించగలుగుతాయి. కార్పొరేషన్‌కు సంబంధించిన శాఖ అంచనాలను ఆమోదించేటప్పుడు ప్రభుత్వ కార్పొరేషన్ చట్టానికి సవరణలు చేసేటప్పుడు ప్రభుత్వ కార్పొరేషన్ వ్యవహారాలను తర్కించే అవకాశం పార్లమెంటుకు కల్గుతుంది.

**6.2.1. పార్లమెంటు మార్గదర్శకత్వం - నియంత్రణ స్వభావం :** ప్రజాధనానికి పార్లమెంటు ప్రజల తరపున సంరక్షకపాత్ర పోషిస్తుంది. ప్రభుత్వరంగ సంస్థలలో పార్లమెంటు అతి పెద్ద భాగస్వామి కాబట్టి ప్రభుత్వరంగ సంస్థల మార్గదర్శకత్వం నియంత్రణలకు సంబంధించి పార్లమెంటు రెండు రకాల పాత్రలను పోషిస్తుంది. అవి :

1. ప్రజాధనం సద్వినియోగం అయ్యేట్లు ప్రజల తరపున పార్లమెంటు ప్రజాధనం క్షేమంగా, భద్రంగా ఉండేలా చూడటం ఈ దిశలో పార్లమెంటు ప్రజానిధులు ప్రభుత్వరంగం ద్వారా సక్రమంగా ఉపయోగించబడ్డాయని సంతృప్తి చెందాలి.
2. పార్లమెంటు ప్రభుత్వరంగ సంస్థలలో భాగస్వామ్య పాత్ర పోషిస్తుంది కాబట్టి ప్రభుత్వరంగంలో పెట్టుబడులను పెట్టడంలో కొంత సాహసం చేసి ఆర్థికంగా ప్రభుత్వరంగ సంస్థలు నిలదొక్కుకొనేలా వీరోచితమైన పాత్ర నిర్వహిస్తుంది.

ఈ రెండు సందర్భాలలోను గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే, సాధారణంగా పార్లమెంటుకు ప్రత్యేక నియంత్రణాధికారం అంటూ ఏమీ లేదు అయితే అది ప్రభుత్వం నుండి ఖాతాల నిర్వాణను, సంస్థల వార్షిక నివేదికలను, కంప్ట్రోలర్ & ఆడిటర్ జనరల్‌నుండి ఆడిట్ నివేదికలను స్వీకరిస్తుంది, పరిశీలిస్తుంది, నిర్దిష్టంగా వాటికి సంబంధించి తన భావాలను వ్యక్తీకరిస్తుంది. అటువంటి భావ వ్యక్తీకరణలకు వ్యాఖ్యలకు అత్యంత ప్రభావం ఉంటుంది. ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించి పార్లమెంటుకున్న నిరపేక్ష అధికారం ఏమిటంటే అది వాటి చట్టాలను మార్చడం, వాటి విధానాలను సవరించడం కాబట్టి పార్లమెంటు నియంత్రణా స్వభావం ప్రభుత్వరంగ సంస్థల పద్ధతులకు అనుగుణంగా ఉంటుంది.

**6.2.2. పార్లమెంటరీ మార్గదర్శక, నియంత్రణ పద్ధతులు :** ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించి పార్లమెంటు మార్గదర్శక, నియంత్రణా పద్ధతులు :

1. పార్లమెంటరీ ప్రశ్నలు
2. పార్లమెంటరీ డిబేట్లు మరియు చర్చలు

**6.2.2.1. పార్లమెంటరీ ప్రశ్నలు :** ప్రభుత్వరంగ సంస్థలపై పార్లమెంటరీ నియంత్రణకు ప్రశ్నలు వేయడం అనేది చాలా శక్తివంతమైన శిల్ప పద్ధతి. ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించిన ఏదైనా విషయాన్ని గురించి సమాచారాన్ని సేకరించడమే ప్రశ్నల లక్ష్యం. పార్లమెంటులో ప్రశ్నల సమయాన్ని పాలనా కార్యకలాపాలపై అన్వేషకదీపం (Search light) గా వర్ణించడం జరిగింది. పార్లమెంటులో సభ్యులు అడిగే ప్రశ్నలు సాధారణమైన లేదా ప్రత్యేకమైన అంశాలకు సంబంధించి ఉంటాయి.

పార్లమెంటరీ ప్రశ్నల వలన ఈ క్రింది లాభాలు ఉన్నాయి.

1. ప్రశ్నలు పార్లమెంటు సభ్యులకు ప్రభుత్వరంగ సంస్థల సాధక బాధకాలను ప్రజాభిప్రాయానికీ, ప్రజాచర్చకూ నివేదించే అవకాశాన్ని కల్పిస్తాయి.

2. ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించి ప్రచురించిన పత్రాలలోను, నివేదికలలోను లభ్యంకాని సమాచారం గురించి పార్లమెంటు సభ్యులు తెలుసుకోవడానికి, ప్రజలకు నివేదించడానికి ప్రశ్నలు ఉపయోగపడతాయి.

3. పార్లమెంటు వేదికపై మంత్రులను వారి ఆధ్వర్యంలోని ప్రభుత్వరంగ సంస్థల పనితీరుపై ప్రశ్నించడం ద్వారా ప్రభుత్వరంగ సంస్థలలో సంబంధిత మంత్రులకున్న లాంఛనప్రాయ, లాంఛనేతర సంబంధాలను వారి బాధ్యతకు సంబంధించి తెలుసుకో వీలవుతుంది.

4. ప్రశ్నల కార్యక్రమం సక్రమంగా ఉపయోగింపబడితే ప్రభుత్వరంగ సంస్థల నిర్వాహకులపై దాని ప్రభావం ఉంటుంది.

5. క్లుప్తంగా పార్లమెంటు సభ్యులు, ప్రజలు, పార్లమెంటు ప్రభుత్వరంగ సంస్థల ద్వారా ఏ విధమైన సామాజిక, ఆర్థిక విధానాన్ని అమలు చేయడంలో శ్రద్ధ చూపిస్తుంది స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. పార్లమెంటరీ ప్రశ్నలు ప్రభుత్వరంగ సంస్థల నియంత్రణకే గాక వాటికి మార్గదర్శకత్వంగా దోహదం చేస్తాయి.

పార్లమెంటరీ సాంప్రదాయం ప్రకారం ప్రభుత్వరంగ సంస్థల విధానానికి మంత్రుల చర్యలకు, ప్రజా ప్రాముఖ్యత గల అంశాలకు సంబంధించిన ప్రశ్నలను సభలో అనుమతిస్తారు. సాధారణంగా ప్రభుత్వరంగ సంస్థల దైనందిన పాలనా కార్యక్రమాలకు సంబంధించిన ప్రశ్నలు సభలో అనుమతించబడవు. ప్రశ్నల విభాగాన్ని నిర్వహించే సభాపతి సభ్యుల ప్రశ్నలను అనుమతించడం లేదా అనుమతించకపోవడం అన్న అంతిమ నిర్ణయాధికారం కల్గి ఉంటాడు.

ప్రభుత్వరంగ సంస్థల విధానానికి సంబంధించిన ప్రశ్నలకు, వాటి నిర్వర్తనకు సంబంధించిన ప్రశ్నలకు ప్రభుత్వరంగ సంస్థల శాఖ మంత్రి వ్యవస్థలకు సంబంధించిన ప్రశ్నలకు ప్రభుత్వరంగ సంస్థల శాఖ మంత్రి సమాధానం చెప్తారు. వ్యక్తిగత ప్రభుత్వరంగ వ్యవస్థలకు సంబంధించిన ప్రశ్నలకు మంత్రిత్వ శాఖలకు సంబంధించిన మంత్రులు సమాధానం చెప్తారు.

**6.2.2.2. పార్లమెంటరీ డిబేట్లు మరియు చర్చలు :** ప్రభుత్వరంగ సంస్థల విధానానికి, నిర్వర్తనకు సంబంధించి పార్లమెంటరీ డిబేట్లు ఎన్నో అంశాలకు విస్తరించి ఉంటాయి. రాష్ట్రపతి ప్రసంగానికి కృతజ్ఞతలు తెలిపే తీర్మానం సమయంలోను, బడ్జెట్‌ను పార్లమెంటుకు సమర్పించిన తర్వాత, ప్రభుత్వరంగ సంస్థల చట్టానికి సవరణలు చేసే సమయంలోను పార్లమెంటరీ డిబేట్లు జరుగుతాయి. డిబేట్లు సాధారణంగా నిర్దిష్టమైన విమర్శలను ప్రతిఫలించవు. దానికి ముఖ్యకారణం చాలామంది సభ్యులు సమస్యను క్షుణ్ణంగా అధ్యయనం చేయకపోవడమే. కాబట్టి డిబేట్లు ఉపయోగపడేవిగా ఉండాలంటే పార్లమెంటు సభ్యులకు ప్రభుత్వరంగ సంస్థల విస్తృత సమాచారాన్ని అందించాలని కొంతమంది పేర్కొంటారు. అయితే పార్లమెంటు సభ్యులు పార్లమెంటరీ కమిటీలు, కంప్ట్రోలర్ & ఆడిటర్ జనరల్ నివేదిక, ప్రభుత్వరంగ సంస్థ వార్షిక నివేదికలు సమాచార సేకరణ నిమిత్తం ఉపయోగించుకుంటున్నారా ? అనేది ఇక్కడ సందేహం.

లోక్‌సభ నిర్వాహణా నియమాలు (Rules of Procedure and Conduct of Business in Loksabha) 170 నుండి 183 నిబంధన వరకు పార్లమెంటు తీర్మానాల గురించి పేర్కొంటాయి. వాటి ప్రకారం సభ్యులు అయినవారు ప్రజాసంక్షేమం దృష్ట్యా ఒక తీర్మానాన్ని ప్రతిపాదించవచ్చు. ఉదాహరణకు 1992 జూలై 17, 31 తారీఖులలోను మరియు డిశంబరు 4వ తారీఖున ప్రభుత్వరంగంలో ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ విధానంకు సంబంధించి తీర్మానాలు ప్రతిపాదింపబడ్డాయి.

లోక్‌సభ నిబంధన 197 ప్రకారం సభ్యులు సావధాన తీర్మానాలను సభలో తీర్మానించవచ్చు. ప్రజా ప్రాముఖ్యత కల్గిన తక్షణ అంశాలపై సభ్యులు మంత్రికి సావధాన తీర్మానం ద్వారా విన్నవించవచ్చు. అటువంటి అంశంపై మంత్రి వ్యాఖ్యానించవలసి ఉంటుంది. మంత్రి వ్యాఖ్యానాలపై సభ్యులు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఉదాహరణకు, హిందుస్థాన్ కేబుల్స్ లిమిటెడ్ కంపెని ఎందుకు జీతాలు, ఇతర శాసనాత్మ బాకీలు ఉద్యోగులకు చెల్లించలేదో తెలుసుకోవచ్చా అని 1998 జూలై 29న సంబంధిత మంత్రిని సావధాన తీర్మానం ద్వారా కోరడం.

లోక్‌సభ నిబంధన 55 ప్రకారం అర్ధగంట చర్చ ద్వారా కూడా సభ్యులు ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. సమాచారం సేకరించవచ్చు, ఇంతకు ముందు సభలో సమాధానం ఇచ్చిన ప్రశ్నకు అనుబంధంగా ఈ చర్చ జరుగుతుంది. ఉదాహరణకు, 1990 సెప్టెంబరు 7వ తేదీన ఇండియన్ డ్రగ్స్ & ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్ పెట్టుబడి నిధులను తీసుకున్నప్పుడు ఇటువంటి చర్చ జరిగింది.

లోక్‌సభ నిబంధన 37 ప్రకారం ఏదైనా అంశాన్ని సభ్యులు ప్రస్తావించవచ్చు. ఈ నిబంధన క్రింద పార్లమెంటు సభ్యుడు ముఖ్యంగా భారత ప్రభుత్వానికి సంబంధించిన అంశంపై 250 మాటలకు లోబడి విన్నవించవలసి ఉంటుంది. ఉదాహరణకు 1997 మే 16న ఖాయిలా పడిన ప్రభుత్వంగ సంస్థలను పునరుద్ధరించడానికి సమగ్ర విధానాన్ని రూపొందించవలసిన ఆవశ్యకతను ప్రస్తావించడం.

ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించిన విషయాలను జీరో అవర్‌లో సభ్యులు పార్లమెంటు ముందు ఉంచవచ్చు. ఉదాహరణకు 1999 ఫిబ్రవరి 24న సైకిల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ మరియు నేషనల్ ఇన్‌స్ట్రుమెంట్స్ లిమిటెడ్ కంపెనీలను పునరుద్ధరించమని సభ్యులు పార్లమెంటుకు విన్నవించడం.

సభ ప్రతిపాదించే తీర్మానాలు ప్రజా బాహుళ్యానికి ఉపయోగపడుతుంది. పార్లమెంటరీ నియంత్రణ సాధనంగా చర్చకు విశేషమైన అర్ధం ఉంది. అంటే ప్రభుత్వ విధానం లేదా కార్యకలాపానికి సంబంధించిన ఒక అంశం గురించి పరిశీలించడం చర్చ. పార్లమెంటులో జరిగిన చర్చలను పత్రికలు ప్రచురిస్తాయి, ప్రజలు గమనిస్తారు. కాబట్టి పార్లమెంటరీ చర్చలు ప్రజాభిప్రాయం చైతన్యవంతం కావడానికి దోహదం చేస్తాయి.

## 6.3 పాలనా మంత్రిత్వశాఖ :

ప్రతి ప్రభుత్వరంగ సంస్థ ఒక పాలనా మంత్రిత్వశాఖకు అనుసంధానించబడి ఉంటుంది. మార్చి 31, 1999 సంవత్సరం నాటికి 240 కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు 37 మంత్రిత్వ శాఖల అధీనంలో ఉన్నాయి. అత్యధిక సంఖ్యలో 50 ప్రభుత్వరంగ సంస్థలు భారీ పరిశ్రమలు - ప్రభుత్వరంగ సంస్థల మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఉన్నాయి.

ఒక పాలనా మంత్రిత్వశాఖ పరిధిలోని ప్రభుత్వరంగ సంస్థలకు పార్లమెంటుకు మధ్య ఆ పాలనా మంత్రిత్వశాఖ సంధానకర్తగా ఉంటుంది. ప్రభుత్వరంగ సంస్థలు వాటికి సంబంధించిన పాలనా మంత్రిత్వ శాఖలకు నివేదికలు పంపిస్తాయి. పార్లమెంటరీ కమిటీలకు, కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్‌కు, ఇతర ప్రభుత్వశాఖలకు ప్రభుత్వరంగ సంస్థల యాజమాన్యాలు సమాచారం ఆయా మంత్రిత్వ శాఖల ద్వారా పంపిస్తాయి. ప్రతి మంతిత్వశాఖ దాని పరిధిలోని ప్రభుత్వరంగ సంస్థ సెక్టరు కార్యకలాపాలను నిర్వహించే బాధ్యత కల్గి ఉంటుంది. దీని వల్ల సెక్టరు కార్పొరేషన్లు మధ్య, ప్రభుత్వ, ప్రభుత్వేత సంస్థల మధ్య అవసరమైన సమన్వయం ఆ మంత్రిత్వశాఖ సాధిస్తుంది.

బ్రిటన్‌లో ప్రభుత్వ కార్పొరేషన్ల పై పాలనా మంత్రిత్వశాఖ రాజకీయ అధిపతియైన మంత్రి నియంత్రణా విషయాలు భారతదేశ కార్పొరేషన్లకు కూడా వర్తిస్తాయి.

1. మంత్రి ప్రభుత్వ కార్పొరేషన్ బోర్డుల సభ్యులను నియమించి, వారి జీతాలను సర్వీస్ నియమాలను నిర్ణయించి వారి నియామకాన్ని ఉపసంహరించగలడు.
2. కార్పొరేషన్లకు సాధారణ విధానాలపై నిర్దేశాల నిచ్చే అధికారం మంత్రికి ఉంటుంది.
3. పెట్టుబడి, ఋణాల వంటి విషయంలో కార్పొరేషన్ మంత్రి అనుమతి పొందాలి.
4. ఖాతాలు, వార్షిక నివేదికలు తయారుచేసే పద్ధతికి మంత్రి ఆమోదం కావాలి.
5. కార్పొరేషన్ పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలకు, సిబ్బంది పించను, శిక్షణ పథకాలకు మంత్రి ఆమోదం కావాలి.

6. అనేక సందర్భాలలో సలహా సంఘాలు, ప్రాంతీయ నిర్వాహకులు మంత్రి అనుమతితో నియమింపబడతారు.

భారతదేశంలో ప్రభుత్వరంగ సంస్థలపై పాలనా మంత్రిత్వశాఖ నియంత్రణ చట్టబద్ధమైన హక్కుల పరిధిలో ఉంటుంది. ప్రభుత్వరంగ సంస్థలు అనేక విషయాలకు సంబంధించి వాటి పాలనా మంత్రిత్వశాఖల మార్గదర్శకత్వం కోసం చూస్తాయి. ప్రభుత్వ కంపెనీలకు సంబంధించి పాలనా మంత్రిత్వశాఖ యజమాని పాత్ర నిర్వహిస్తుంది. నియమాల తయారీ, ఆమోదం అనే అధికారాల ద్వారా పాలనా మంత్రిత్వశాఖలు ప్రభుత్వరంగ సంస్థలపై నియంత్రణ చెలాయిస్తాయి.

## 6.4. ప్రభుత్వరంగ సంస్థల కమిటి :

ప్రభుత్వం వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలలో కూడా అనేక కార్యక్రమాలను రూపొందించి, అమలు చేస్తుంది. వీటికి సంబంధించిన అనేక విషయాల పరిశీలనలో శాసనసభలకు అంచనాసంఘం, ప్రభుత్వ ఖాతాల సంఘాల సహాయ,సహకారాలు చాలటం లేదు. అంటే ఆ రెండు సంఘాలు అనేక అంశాలను, విషయాలను పరిశీలించటానికి అవకాశం లేకుండా ఉంది. కాబట్టి ప్రభుత్వరంగ సంస్థల సంఘం ఏర్పాటు అవసరమైంది.

**6.4.1. వ్యవస్థీకరణ :** ప్రభుత్వరంగాల్లో ఉన్న అనేక సంస్థలపై పార్లమెంటు నియంత్రణావశ్యకతను నవంబర్ 1953లో వ్యక్తం చేసారు. జూలై 1957లో అంచనాల సంఘ ఉపసంఘం ప్రభుత్వ రంగ సంస్థల విషయాల పరిశీలనకు ఏర్పాటు చేయబడింది. డిసెంబర్ 1961లో పార్లమెంటు ఉభయ సభల సభ్యులతో ఒక సహాయ సంఘాన్ని ఏర్పాటు చేసారు.

శ్రీ కృష్ణమీనన్ కమిటీ సిఫారసుల ఆధారంగా నవంబర్ 20, 1963లో పార్లమెంటరీ సంఘంగా ప్రభుత్వరంగ సంస్థల సంఘం (ప్రభుత్వ ఉపక్రమాల సంఘం) ఏర్పాటు అయ్యింది. మే 1, 1964 నుంచి ఈ సంఘం పని చేయనారంభించింది. ఇందులో ఉన్న 15 మంది సభ్యుల్లో 10 మంది లోక్‌సభనుండి 5 గురు రాజ్యసభ నుండి నైష్పత్తిక ప్రాతినిధ్య పద్దతిలో ఐదు సంవత్సరాల కాలానికి ఎన్నుకోనబడతారు. రొటేషన్, లోక్‌సభ ఎన్నికల తరువాత ఈ కాలాన్ని 2 సంవత్సరాలకు తగ్గించారు. ఈ సభ్యుల్లో ఒకరిని స్పీకర్ సంఘాధ్యక్షునిగా నియమిస్తారు. ఈ సంఘంలో సభ్యునిగా మంత్రి ఎన్నిక కారాదు.

**6.4.2. విధులు - అధికారాలు :** ప్రభుత్వరంగ సంస్థల కమిటీకి ముఖ్యంగా ఈ క్రింది విధులు, అధికారాలు ఉంటాయి.

1. కేంద్ర ప్రభుత్వ చట్టాల ద్వారా ఏర్పాటు చేసిన, ప్రభుత్వ కంపెనీ, చట్టాల ద్వారా ఏర్పాటు చేసిన ప్రభుత్వరంగంలో ఉన్న సంస్థల ఖాతాలను, నివేదికలను పరీక్షిస్తుంది.
2. భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ప్రభుత్వరంగ సంస్థలపై ఏదైనా నివేదికను పంపినా దాన్ని కూడా పరిశీలన చేస్తుంది.
3. ప్రభుత్వరంగ సంస్థలు స్వతంత్రంగా, సమర్ధవంతంగా, నిర్ణయింపబడిన వ్యాపార నియమాలకనుగుణంగా పనిచేయడాన్ని పరిశీలిస్తుంది.
4. ఈ కమిటీని ఏర్పాటు చేయకముందు అంచనాల సంఘం, ప్రభుత్వ ఖాతాల సంఘం ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించిన ఏయే విషయాలను, అంశాలను పరిశీలించేవో స్పీకర్ అనుమతి ప్రకారం వాటన్నింటినీ ఈ కమిటీ పరిశీలిస్తుంది.

**6.4.3. పరిమితులు :** ప్రభుత్వరంగ సంస్థల కమిటీ తన విధులు, అధికారాలను కొన్ని పరిమితులకు లోబడి నిర్వహిస్తుంది. అవి:

1. ప్రభుత్వరంగ సంస్థల కమిటీ వ్యాపార, వాణిజ్య, పారిశ్రాక సంబంధిత విధులతో సంబంధంలేని ప్రభుత్వ విధానాలను పరిశీలించదు.
2. ప్రభుత్వ సంస్థల దైనందిన పాలన సంబంధిత వ్యవహారాలను పరిశీలించదు.
3. ఒక ప్రత్యేక ప్రభుత్వ చట్టం ద్వారా ఏర్పాటు చేసిన సంస్థలపై దీని పరిశీలనాధికారం ఉండదు.

**6.4.4. కమిటీ పని తీరు :** ప్రతి సంవత్సరం ప్రారంభంలో ఈ సంఘం ఏయే విషయాలను పరిశీలించాలో నిర్ణయించుకుంటుంది. ఈ సంఘం తయారు చేసిన నివేదికను సంబంధిత ప్రభుత్వ శాఖలకు, ఆర్థిక మంత్రిత్వ శాఖకు పంపుతుంది అవి వాటిపై వాస్తవ నిర్ధారణ

చేసాక, నివేదికలను మార్పులు, చేర్పులతో పార్లమెంటుకు సమర్పిస్తుంది. ప్రతి సంవత్సరం దాని ఆధీనంలో ఉన్న సంస్థలలో 5 నుండి 10 సంస్థలను మాత్రమే పరిశీలిస్తుంది. ఆ సంఘం, ప్రభుత్వరంగ సంస్థలను పార్లమెంటుకు జవాబుదారీ చేయటంలో, వాటికి మార్గదర్శకత్వం నివ్వడంలో చాలా విలువైన సేవలను చేస్తుందనే ప్రశంసను పార్లమెంటు, పత్రికా రంగం, ప్రజలనుంచి పొందుతుంది.

## 6.5. ప్రభుత్వరంగ సంస్థల బ్యూరో :

ప్రభుత్వరంగ సంస్థల ఉమ్మడి సమస్యలను పరిష్కరించడానికి, వాటి పనితీరును సమీక్షించడానికి, సమన్వయం సాధించడానికి 1964లో ప్రభుత్వరంగ సంస్థల బ్యూరోను ఏర్పాటు చేయడమైంది. దీనిని ఆర్థిక మంత్రిత్వశాఖలో నెలకొల్పారు.

### 6.5.1. విధులు :

1. ప్రభుత్వరంగ సంస్థల నిర్దేశనకు సంబంధించిన విషయాలను నిర్వహించడం వాటి వ్యవస్థాపరమైన విధానాలు, నిర్వాహణా పద్ధతులు, సిబ్బంది విధానాలు, శిక్షణా కార్యక్రమాలు, సమన్వయ ఏర్పాట్లు, ప్రాజెక్టు ప్రణాళిక, ఆర్థిక, సామాజిక, విత్తపరమైన విషయాలను నిర్వహించడం.
2. ప్రభుత్వ మూలధన వ్యయాల అంశాలను పరిశీలించడం, విశ్లేషించడం, ప్రాజెక్టులు మూలధన వ్యయాల్లో పొదుపు పాటించడానికి గల అన్ని అవకాశాలను అన్వేషించడం,
3. అనువైన నివేదన పద్ధతుల ద్వారా ప్రభుత్వరంగ సంస్థల ఉత్పాదకతను, లాభదాయకతను పెంపొందించడానికి అవసరమైన చర్యలు రూపొందించడం.
4. ప్రభుత్వరంగ సంస్థలు లేదా వ్యక్తిగత యూనిట్ల నిర్వాహణలో ఎంపిక చేసిన రంగాల అంచనాను, మూల్యాంకననూ చేపట్టడం
5. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల పనితీరుకు సంబంధించి వార్షిక, ఇతర నియతకాలిక నివేదికలను తయారు చేయడం.

**6.5.2. ప్రభుత్వరంగ సంస్థలశాఖ :** ప్రభుత్వ సంస్థల బ్యూరో 1985 సెప్టెంబరులో రద్దయింది. దాని స్థానంలో పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వరంగ సంస్థల శాఖ ఏర్పాటు చేయబడింది.

ప్రభుత్వరంగ సంస్థల శాఖ కేంద్రప్రభుత్వ ప్రభుత్వరంగ సంస్థలను సమన్వయపరచే వ్యవస్థ. 1993 ఏప్రిల్‌లో ప్రభుత్వం ఉద్యోగుల జీత భత్యాల విషయంలో ప్రభుత్వ రంగ సంస్థలకు స్వేచ్ఛనిచ్చింది. అదే విధంగా 1998 లో ప్రభుత్వం తీసుకున్న ఒక ముఖ్యమైన నిర్ణయం ప్రకారం ప్రభుత్వరంగ సంస్థల పనితీరుకు సంబంధించిన 696 మార్గదర్శక సూత్రాలను తొలగించింది. వీటి కారణంగా ప్రభుత్వరంగ సంస్థలశాఖ ప్రాధాన్యత కొంత మేరకు తగ్గింది. అయినప్పటికి ఈ శాఖ ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించి ప్రముఖ పాత్ర నిర్వహిస్తుందని చెప్పవచ్చు. దానికి కారణం -

1. ప్రభుత్వరంగ సంస్థల MOUS ను పరీక్షించి అంతమ నిర్ణయం చేయడం, వాటిని మూల్యాంకనం చేయడం
2. పాలక స్థాయి పదవులను సృష్టించడం.
3. పాలనామంత్రిత్వశాఖచే పార్ట్‌టైం - వృత్తి ఉద్యోగుల పానెల్‌ను తయారు చేయడం
4. ప్రభుత్వ విధాన నిర్ణాయాలన్నీ ప్రభుత్వరంగ సంస్థలకు ఈ శాఖ ద్వారా తెలియజేయడం.

పార్లమెంటుకు ప్రతి సంవత్సరం నివేదించే ప్రభుత్వరంగ సంస్థల సర్వేను ఈ శాఖ తయారుచేస్తుంది. ఈ శాఖలో ఉండే అర్బిట్రేటర్‌కు ప్రభుత్వరంగ సంస్థల మధ్య వాణిజ్య పరమైన తగాదాలు, ప్రభుత్వరంగ సంస్థకు ప్రభుత్వశాఖలకు మధ్య తగాదాలు నివేదించబడతాయి.

ప్రభుత్వరంగ సంస్థలశాఖకు ఉన్న పర్యవేక్షణ అధికారం, సమన్వయ పాత్ర ఈ శాఖ ప్రాముఖ్యతకు కారణం.

## 6.6. సారాంశము :

ప్రభుత్వరంగ సంస్థలు సేవా, వ్యాపార, పారిశ్రామిక రంగాలలో విస్తృతమైన విధులను నిర్వహిస్తున్నాయి. జాతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో అవి ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తున్నాయి. వాటిని మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి మార్గదర్శక నియంత్రణా సంస్థలు ఉన్నాయి అవి **1.** పార్లమెంటు, **2.** పాలనా మంత్రిత్వశాఖలు, **3.** ప్రభుత్వరంగ సంస్థల కమిటి, మరియు **4.** ప్రభుత్వరంగ సంస్థల బ్యూరో. **1985**లో ప్రభుత్వరంగ సంస్థల బ్యూరో స్థానంలో ప్రభుత్వరంగ సంస్థల శాఖ ఏర్పాటు చేయబడింది. ఈ సంస్థల మార్గదర్శక నియంత్రణా పద్ధతులు ప్రభుత్వరంగ సంస్థల విధానాలకు, కార్యకలాపాలకు, సమన్వయానికి సంబంధించినవి. ప్రభుత్వరంగ సంస్థలలో శాఖాపరమైన ప్రభుత్వరంగ సంస్థలు మంత్రిత్వ శాఖ ప్రత్యక్షపాలనా నియంత్రణలో పనిచేస్తాయి. కార్పొరేషన్, కంపెనీ తరహా సంస్థలు మాత్రం చట్టంలో పేర్కొన్నంతవరకు మంత్రిత్వశాఖ నియంత్రణలో ఉంటాయి. చట్టానికి అతీతంగా, లాంఛన, లాంఛన ప్రాయంకాని శాఖ నియంత్రణ వల్ల ప్రభుత్వరంగ సంస్థల సమర్థత ప్రభావితం అవుతుందనే వాదన ఉంది. మంత్రిత్వ శాఖ విధి నిర్వాహణలో పార్లమెంటుకు బాధ్యత వహిస్తుంది. పార్లమెంటు ప్రశ్నల ద్వారా, తీర్మానాల ద్వారా, చర్చల ద్వారా, కమిటీల ద్వారా ప్రభుత్వరంగ సంస్థల పనితీరును ప్రభావితం చేస్తుంది.

## 6.7. నమూనా ప్రశ్నలు :

### 1) వ్యాస రూప ప్రశ్నలు :

1. ప్రభుత్వరంగ సంస్థల సమర్థత పెంపొందించడంలో నియంత్రణ, మార్గదర్శక సంస్థల పాత్రను వివరింపుము.
2. ప్రభుత్వరంగ సంస్థలకు పార్లమెంటుకు గల సంబంధాన్ని పరిశీలించుము.
3. ప్రభుత్వరంగ సంస్థలను నియంత్రించే వ్యవస్థలపై ఒక వ్యాసము వ్రాయుము.

### 2) లఘు వ్యాసరూప ప్రశ్నలు :

1. ప్రభుత్వరంగ సంస్థలు - పార్లమెంటరీ ప్రశ్నలు
2. ప్రభుత్వరంగ సంస్థల బ్యూరో
3. ప్రభుత్వరంగ సంస్థల శాఖ
4. ప్రభుత్వరంగ - పాలనా మంత్రిత్వశాఖ సంబంధం

## 6.8.. చదువదగిన గ్రంథాలు


1. ఎమ్.పి. శర్మ : ప్రభుత్వపాలనా - సిద్ధాంతం, ఆచరణ
2. యస్.ఆర్. మహేశ్వరి : భారతీయ పాలనా శాస్త్రం
3. జి. రాధాకృష్ణ, యస్. భాస్కరరావు : వనరుల నిర్వహణ
4. Laxmi Narain : Public Enterprises Managment and Privatisation.


**డా॥ పి.వి.వి. సుబ్రహ్మణ్యం**

పాఠం - 7

# ప్రభుత్వరంగ సంస్థలు - ధరల విధానం

## 7.0 లక్ష్యం

ధరలు నిర్ణయించడం, వాటిని సమర్థవంతంగా అమలుచేయడం అనేది ప్రభుత్వరంగ సంస్థల విషయంలో చాలా ముఖ్యమైన అంశంగా పేర్కొనవలసి ఉన్నప్పటికీ, ధరల నిర్ధారణ అనేది చాలా వివాదాస్పదమైన విషయంగా కనిపిస్తుంది. ప్రభుత్వరంగ సంస్థల ధరల విధానాన్ని ఒకే విధమైన సాధారణ పద్ధతిలో నిర్ణయించడం సాధ్యమయ్యే పని కాదు. ఎందుచేతనంటే ప్రభుత్వరంగ సంస్థలు వాటి స్వభావాన్ని బట్టి ఒక దానితో ఒకటి భిన్నంగా ఉంటాయి. వాటికి సంబంధించిన చట్టాలు గానీ, ప్రభుత్వ మార్గదర్శక సూత్రాలు గానీ వేటికవి విడివిడిగా స్పష్టంగా ఉండవు. అయినప్పటికీ వినియోగానికీ, ఉత్పత్తికీ తగినట్లుగా కేటాయింపులు జరిపే విషయంలోను, తద్వారా వచ్చే ఆదాయాన్ని వ్యక్తులు, తెగల మధ్య పంపిణీ చేసే విషయంలోనూ సారధ్యం వహించడానికి ఈ ధరల విధానం ఎక్కువగా ఉపయోగపడుతుంది. కాబట్టి, దేశ సాంఘిక, ఆర్థిక లక్ష్యాల సాధనలో దీని ఆవశ్యకత చాలా ఉంటుంది. ప్రభుత్వరంగ సంస్థల ధరల నిర్ధారణ సిద్ధాంతాలు, ధరల నిర్ణాయక పద్ధతులు, ధరల నియంత్రణ, 3వ పంచవర్ష ప్రణాళికలో ధరల విధానం, ధరలు నిర్ధారించే యంత్రాంగాల గురించి వివరణాత్మకంగా చెప్పడం ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

**విషయసూచిక :**


7.1. ధరల విధానం - పరిచయము

7.2. ధరల నిర్ధారణ సిద్ధాంతాలు

7.3. ధరల నిర్ణాయక పద్ధతులు

7.4. 3వ పంచవర్ష ప్రణాళికలో ధరల విధానం

7.5. ధరల నియంత్రణ

7.6. ధరలు నిర్ధారించే యంత్రాంగం

7.7. సారాంశము

7.8. నమూనా ప్రశ్నలు

7.9. చదువదగిన గ్రంథాలు


## 7.1. ధరల విధానం - పరిచయము :

మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తికి సంబంధించిన కార్యక్రమాలన్నింటిపై ప్రభుత్వరంగ సంస్థల నియంత్రణ ఉంటుంది. కాబట్టి, ఈ సంస్థల ధరల విధానానికి కూడా అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. ప్రత్యేకంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ అంశం సహజంగానే ఇంకా ఎక్కువ ప్రాధాన్యం వహించే అవకాశం ఉంది. వాస్తవంగా ఈ ప్రభుత్వ రంగ సంస్థలు రాజ్యంలో కొన్ని సాంఘిక, ఆర్థికపరమైన లక్ష్యాలను సాధించడం కోసం ఉద్దేశితమైనాయి. అదే విధంగా వీటి ధరల విధానాన్ని కూడా ఆ లక్ష్యాల ఆధారంగానే నిర్ధారించవలసిన అవసరం ఉంటుంది. ఈనాడు అనేక దేశాల్లో ధరల విధానాలు సాధారణంగా ధరల హెచ్చుతగ్గులను అరికట్టడానికి వనరుల సమీకరణను

వీటి వినియోగాన్ని క్రమబద్ధం చేయడానికి ఉద్దేశితమైనాయి. అంతేగాక క్రమబద్ధమైన కేటాయింపుల ద్వారాను, ప్రోత్సాహక ధరలు ఏర్పాటు చేయడం ద్వారాను, ఉత్పత్తి పెంచి, తద్వారా లభించే ఆదాయాన్ని దారిద్ర్యరేఖకు దిగువగా ఉండే పేద ప్రజల సంక్షేమానికి వినియోగించడం వీటి ముఖ్య ఉద్దేశాలుగా పెట్టుకున్నాయి. ఒక దేశం అవలంబించవలసిన ధరల విధానాలు, సాధారణంగా ఆ దేశ ఆర్థికవ్యవస్థ పైన, సంక్షేమం కోసం నిర్ణయించుకొన్న లక్ష్యాలు, వ్యవస్థా నిర్మాణంపైన, వాణిజ్య విధానం, మార్కెట్ స్వభావం మొదలైన అంశాలపైన ఆధారపడి ఉంటాయి.

మొదటి పంచవర్ష ప్రణాళికా రచనా కాలంలో ప్రణాళికా రచయితలు ఈ ధరల విషయం అంతగా పట్టించుకొన్నట్లు కనిపించదు. మొదటి ప్రణాళికా కాలంలో తులనాత్మకంగా ధరలు నిలకడగా ఉండటం వల్ల రెండో ప్రణాళికా రచన చేసేటప్పుడు ఆ విషయం పట్ల ఎక్కువ శ్రద్ధ చూపలేదు. కాని రెండో పంచవర్ష ప్రణాళిక అమలు జరుగుతున్న కాలంలో ధరల స్వభావం దారుణంగా పరిణమించింది. అందువల్ల మూడో పంచవర్ష ప్రణాళికలో మొదటిసారిగా ధరల విధానానికి సంబంధించిన ఒక ప్రత్యేక అధ్యాయాన్ని చేర్చడం జరిగింది.

## 7.2 ప్రభుత్వరంగ సంస్థల్లో ధరల నిర్ధారణ సిద్ధాంతాలు :

ప్రభుత్వరంగ సంస్థల్లో ధరల నిర్ధారణకు అనేక రకాల సిద్ధాంతాలు ఉన్నాయి. అవి ఉపాంత వ్యయ సిద్ధాంతం, సగటు వ్యయ సిద్ధాంతం, లాభ నష్టాలు లేని సిద్ధాంతం, లాభార్జన సిద్ధాంతం, ఉత్పత్తి వ్యయానికంటే తక్కువ ధర సిద్ధాంతం, విచక్షణాత్మక ధరల సిద్ధాంతం, డిమాండ్ - సరఫరాలకు సంబంధించిన సాధారణ సిద్ధాంతం. ఈ సిద్ధాంతాలను ఒక్కొక్కటిగా చర్చిద్దాం.

**7.2.1. ఉపాంత వ్యయ సిద్ధాంతం (Marginal Cost of Production Theory) :** మూలధనం నిర్ధారిత పరిమాణం మీద ఆధారపడి ఉన్న ఉపాంత వ్యయాన్ని "స్వల్పకాలిక ఉపాంత వ్యయం" అంటారు. అనుకూలాన్ని బట్టి మారుతుంది. మూలధనం పరిమాణం మీద ఆధారపడి ఉన్న వ్యయాన్ని "దీర్ఘకాలిక ఉపాంత వ్యయం" అంటారు. అయితే ఈ సిద్ధాంతానికి కొన్ని పరిమితులు కూడా ఉన్నాయి. అవి :

1. ఈ సిద్ధాంతం స్పష్టంగా లేదు. ఈ సిద్ధాంతం సరిగ్గా పాటించారా లేదా అని పరిశీలించడానికి ఇందులో ఎలాంటి కొలమానం లేదు.
2. ఈ సిద్ధాంతం కొన్ని పాలనా సంబంధమైన ఇబ్బందుల కారణంగా ధరల సిద్ధాంతంలో ముఖ్యమైందిగా ఉండడానికి సరియైనదికాదు.
3. ఉత్పత్తి కారకాలు విభజించడానికి వీలులేనివి కాబట్టి ఉపాంత వ్యయాన్ని ఖచ్చితంగా నిర్ధారించలేము.
4. ఒక వేళ ఉపాంత వ్యయాన్ని ఖచ్చితంగా అమలు పర్చినట్లయితే ఉత్పత్తి ఖర్చులు తక్కువగా ఉన్న సంస్థల్లో లోటు సంభవిస్తుంది.

అందువల్ల ఈ ధరల విధానం ఉపాంత వ్యయంతో సంబంధము ఉన్న ధర మాత్రమే అంటారు తప్ప ఉపాంత వ్యయానికి సమానమైందిగా పేర్కొనరు. ఈ సిద్ధాంతం గరిష్ట పరిమితిలో ఉత్పత్తి కారకాలన్నింటినీ వినియోగించుకొని, గరిష్ట ఉత్పత్తి సాధించి, ఆ ఉత్పత్తిని ఉపాంత వ్యయాన్ని ఆధారం చేసుకొని ధరలు నిర్ణయించాలని చెబుతుంది. ఈ సిద్ధాంతంలోని అంతరార్థం ఏమిటంటే ఒకవేళ వినియోగదారులు అదనపు ఉత్పత్తికి ధర చెల్లించి తీసుకోవడానికి ఇష్టపడినట్లయితే సంక్షేమంలో ప్రగతి కలిగినట్లుగా భావిస్తారు.

**7.2.2. సగటు వ్యయ సిద్ధాంతం (Average Cost of Production Theory) :** ఈ సిద్ధాంతం ప్రకారం ప్రభుత్వరంగ సంస్థల ద్వారా ఉత్పత్తి చేసే వస్తువు, సేవలు సగటు వ్యయానికి సమానంగా ఉండాలి. ఇది చాలా న్యాయమైన సిద్ధాంతం. దీని వల్ల సంస్థ మొత్తం వ్యయం భర్తీ అవుతుంది. తద్వారా సంస్థ తన స్వయం ప్రతిపత్తిని సాధించి మనుగడ సాగిస్తుంది. కాగా ధరలను సగటు వ్యయం ప్రాతిపదికగా నిర్ణయించడం జరుగుతుంది. కాబట్టి ఖాతాదారులను దోచుకోవడం అనేది జరుగదు. ఈ సిద్ధాంతానికి కూడా ఇంతకు ముందు చర్చించిన సిద్ధాంతం వలెనే కొన్ని పరిమితులున్నాయి.

1. ప్రభుత్వరంగ సంస్థలలో సగటు వ్యయాన్ని నిర్ధారణ చేయడం కోసం సామాజిక పరమైన ఉత్పత్తి వ్యయాన్ని, లాభాలను రెండింటినీ లెక్కలోకి తీసుకొనవలసి ఉంటుంది. ఇది ఆచరణలో సాధ్యమయ్యే పనికాదు.

2. సగటు వ్యయ నిర్ధారణ పైకి కనిపించినంత తేలిక కాదు. సగటు వ్యయం సమాజపరమైన ఉత్పత్తుల వ్యయాన్ని కూడా భర్తీ చేయవలసి ఉంటుంది.

3. ధరలకు అనుకూలంగా సర్దుబాటు చేయడం కోసం ఇది తగినంత సరళంగా లేదు.

**7.2.3. లాభనష్టాలు లేని సిద్ధాంతం (No Profit No Loss Theory) :** ప్రభుత్వరంగ సంస్థలు ప్రజా సంక్షేమం కోసం స్థాపించబడ్డాయి. కాబట్టి అవి తమ పూర్తి ఉత్పత్తి వ్యయాన్ని మూలధన వ్యయంతోసహా రాబట్టుకోవలసి ఉంటుంది. లాభార్జనను లక్ష్యంగా పెట్టుకోకూడదు. లెవిస్ (Lewis) ఈ రకమైన విధానాన్ని అమలు పరచడం కోసం కొన్ని నియమాల్ని సూచించాడు. అవి

1. మూలధన వ్యయాన్ని చేసిన తర్వాత సంస్థ లాభాన్ని గాని, నష్టాన్నిగాని ఆశిస్తున్నట్లుగా వ్యవహరించకూడదు.

2. వివిధ రకాల సేవల నిమిత్తం నిర్ణయించే ధరలు ఉత్పత్తి వ్యయానికి అనుగుణంగా ఉండాలి.

ఈ సిద్ధాంతానికి అనుకూలంగా లెవిస్ క్రింది ఆధారాలు వివరించాడు. అవి

1. ఈ సిద్ధాంతం సంస్థ వ్యాకోచ సంకోచాలను అరికడుతుంది.

2. ఈ సిద్ధాంతం ద్రవ్యోల్బణంను నియంత్రిస్తుంది.

కాని దీనికి కూడా పరిమితి ఈ క్రింది విధంగా ఉన్నది. ప్రభుత్వరంగ సంస్థలు కేవలం ప్రజా సంక్షేమం కోసం సేవలందించడానికే గానీ, లాభాలు ఆర్జించడానికి కాదనే సిద్ధాంతానికి కట్టుబడి ఉండటం, మనదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు సాధ్యపడకపోవచ్చు. ఎందువల్లనంటే భరతదేశంలాంటి దేశాలలో ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వ రంగ సంస్థలు ఎంతో ముఖ్యమైన పాత్రను పోషించవలసి ఉంది. అయితే, ఈ సిద్ధాంతాన్ని భారతదేశంలోని సంస్థల శాశ్వత విధానంగానీ లేదా ప్రభుత్వరంగ సంస్థల దీర్ఘకాలిక ధ్యేయంగానీ, సిఫారసు చేయడంగానీ జరగలేదు.

**7.2.4. లాభార్జన సిద్ధాంతం (Theory of Making Profits) :** ప్రయివేటు సంస్థలకు అత్యధిక లాభార్జన అనేది లక్ష్యం అయినప్పటికీ ప్రభుత్వరంగ సంస్థలకు దీనికి సంబంధించిన విధానం లేదు. అయితే ఈ సిద్ధాంతం ప్రకారం ప్రభుత్వరంగ సంస్థలు ప్రయివేటు సంస్థల వలెనే అత్యధిక లాభార్జన కోసం పాటుపడాలి లేదా కృషి సల్పాలి. V.K.R.V. రావ్ అభిప్రాయం ప్రకారం ప్రభుత్వరంగ సంస్థల ధరల విధానం జాతీయ ఆదాయాన్ని పెంపొందించే విధంగాను, అభివృద్ధి రేటును పెంచే విధంగాను ఉండాలి. కృష్ణమీనన్ కమిటీ అభిప్రాయంలో గవర్నమెంటు కంపెనీలు ధరలను మాత్రమే కాక లాభాలను కూడా నిర్దేశించాలి. ఈ సిద్ధాంతానికి అనుకూలంగా కొన్ని అనుకూల వాదనలు ఏమిటంటే -

1. వ్యాపార మరియు ఉత్పత్తి సంస్థల ఆధిపత్యం

2. జాతీయ వడ్డీలో మిగులును వినియోగించుకోవడం

3. సంస్థల అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం

4. సంస్థల సామర్థ్యాన్ని కొలమానానికి నిర్దేశకాలు

ఈ సిద్ధాంతానికి వ్యతిరేక వాదనలు కూడా ఉన్నాయి. అవి -

1. ఏకస్వామ్యాన్ని దుర్వినియోగపర్చే అవకాశం

2. అసమర్థతను కప్పిపుచ్చడానికి సహాయపడుతుంది.

3. ప్రజా ప్రయోజనానికి ఈ సిద్ధాంతం అనుకూలమైంది కాదు

4. సామాజిక ఆర్థిక ప్రాధాన్యతల దృష్ట్యా ఇది సరియైనది కాదు

5. నిరపేక్షంగా ధరలను మార్పు చేయడం, లక్ష్యాన్ని చేరుకోవడం సరియైనదికాదు.

**7.2.5. ఉత్పత్తి వ్యయానికంటే తక్కువ ధరల సిద్ధాంతం (Theory of Below Cost Price) :** ప్రభుత్వరంగ సంస్థలు ఆర్థిక వ్యవస్థలో మౌలిక, కీలక రంగాలలో ప్రముఖ పాత్రను నిర్వహిస్తున్నాయి. కాబట్టి తమ ఉత్పత్తుల ధరలను కనిష్ఠ స్థాయిలోఉండేటట్లు చూడాలనే అభిప్రాయ వాదాలు ఉన్నాయి. ఈ రూపంలో సమాజానికి పరోక్షంగా లాభం చేకూరుతుంది. ఒకవేళ కీలక ప్రణాళికాబద్ధమైన సంస్థలు విద్యుత్తు, స్టీలు, రైల్వేల వంటి సంస్థలో ధరలు అధికంగా పెరిగినట్లయితే ఆ పెరుగుదల ప్రభావం మొత్తం ఆర్థిక వ్యవస్థ మీద పడే ప్రమాదం ఉంది. ఈ సిద్ధాంతాన్ని కొద్ది కాలం మాత్రమే కొనసాగించే వీలుంటుంది. ఈ సిద్ధాంతం కూడా ఇతర సిద్ధాంతాల వలె విమర్శలకు గురైనది. ఈ సిద్ధాంతం క్రింది పరిమితులను కలిగి ఉన్నది.

1. నష్టాల విధానం వల్ల ద్రవ్యోల్బణం వస్తుంది.

2. సంస్థ నిరంతరంగా నష్టాల్లో ఉన్నట్లయితే ఆ నష్టాల నుండి కోలుకోవడానికి అదనపు పన్ను అవసరం అవుతుంది.

3. ధరల తగ్గింపు ప్రయివేటు సంస్థలకు లాభాన్ని పెంచే విధంగా ఉంటుంది. కారణం డిమాండు, సప్లైల మీద ఆధారపడి వస్తువుల ధరలను నిర్ణయిస్తారు.

4. పరిశ్రమ ఉత్పత్తి చేసిన వస్తువులకు సముచితమైన గిరాకీ ఉన్నట్లయితే పరిశ్రమ విస్తరించడానికి మార్గమేర్పడుతుంది.

**7.2.6. విచక్షణాత్మక ధరల సిద్ధాంతం (Discriminating Price Theory) :** భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వం పెట్టుబడులను ప్రోత్సహించడం, వినియోగాన్ని నిరుత్సాహపరచడం తన విధానంగా పెట్టుకొన్నది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే విచక్షణాత్మక ధరల సిద్ధాంతాన్ని ఉపయోగించవచ్చు. ఉదాహరణకు బొగ్గు, గనులు, విద్యుత్తు, నూనె పరిశ్రమలు లాంటి ఉత్పత్తి మరియు వినిమయం కల్గిన వస్తువుల విషయంలో విచక్షణాత్మక ధరల సిద్ధాంతాన్ని ఉపయోగించాలి. ప్రజా ప్రయోజన సాధనాలు మరియు వస్తువులు అయిన రవాణా మరియు గ్యాస్ లాంటి విషయంలో ఈ విచక్షణాత్మక ధరల పద్ధతి అభిలషణీయమైనది. రైల్వేస్‌లో మొదటి మరియు రెండవ తరగతి ప్రమాణపు ధరలలోని వ్యత్యాసం ఇతర కంపార్ట్‌మెంట్లు నిర్వహించడానికి, సాధారణ భోగీలు నిర్వహించడానికి వీలుపడుతుంది. ఈ సిద్ధాంతం విజయవంతం కావడానికి మూడు రకాల పరిస్థితులు నెలకొని ఉండాలి. అవి -

1. సరఫరా విషయంలో ఏకస్వామ్యం ఉండాలి

2. డిమాండును అనేక రకాలుగా విభజించి డిమాండు వ్యాకోచించడానికి అనువుగా పరిస్థితులు కల్పించాలి.

3. వస్తువులను తక్కువరేట్లకు కొని అధిక రేట్లకు విక్రయించే పద్ధతిని తొలగించడానికి మార్కెట్లను వేరు చెయ్యాలి.

ఈ క్రింద సూచించిన అంశాల ఆధారంగా ఈ సిద్ధాంతాన్ని సమర్థించవచ్చు.

1. ధనిక వర్గాలు అధిక ధరలు చెల్లించేటట్లుగా చేస్తుంది. కాబట్టి దీన్ని న్యాయోచితమైన సిద్ధాంతంగా చెప్పవచ్చును.

2. ఈ సిద్ధాంతం ద్వారా పెట్టుబడులు ప్రోత్సహించబడతాయి. ప్రభుత్వం అత్యధిక స్థాయిలో ఆర్థిక పురోగతిని సాధించగలుగుతుంది. కాని ప్రజల వైఖరి మాత్రం ఈ సిద్ధాంతాన్ని ఎప్పుడూ ఆమోదించే విధంగా లేదు.

**7.2.7. డిమాండు సరఫరాలకు సంబంధించిన సాధారణ సిద్ధాంతం (General Theory of Demand and Supply):** ప్రభుత్వరంగ సంస్థలు, ప్రయివేటు రంగ సంస్థలు ఒకే రంగంలో, ఒకే రకమైన వస్తువులు తయారు చేస్తున్న సందర్భాల్లో ఆ సంస్థలు ఉత్పత్తి చేసిన వస్తువులకు, సేవలకు, వాటి డిమాండు సరఫరాల ఆధారంగానే వాటి ధరల నిర్ధారణ జరుగుతుంది. కాబట్టి ప్రభుత్వరంగ సంస్థల ధరలు నిర్ధారించే పద్ధతుల విషయంలో ప్రభుత్వ జోక్యం ఉండదు.

ఈ సిద్ధాంతాలను పరిశీలించిన తరువాత ప్రభుత్వరంగ సంస్థల్లో ధరలు నిర్ధారణ చేసే విషయంలో ఖచ్చితమైన నిబంధనలేవీ లేవని స్పష్టమవుతుంది. ఎందుచేతనంటే, ఒక సంస్థ భిన్న పరిస్థితుల్లో విభిన్నమైన సిద్ధాంతాలను అనుసరించవచ్చు. అదే విధంగా ధరలు కూడా ఆ సంస్థలు ఉత్పత్తి చేసే వస్తువుల స్వభావం మీద, ఆర్థిక వ్యవస్థ విధానం మీద ఆధారపడి ఉంటాయి.

## 7.3 ప్రభుత్వరంగ సంస్థలు - ధరల నిర్ణాయక పద్ధతులు :

ఆచరణలో ప్రభుత్వరంగ సంస్థలు వివిధ రకాల ధరల నిర్ణాయక పద్ధతులను అవలంబిస్తూ ఆయా సంస్థల ఉత్పత్తులు, సేవలను ప్రభుత్వం నిర్ణయించిన ధరల విధానం అనే చట్రంలో, ప్రజలకు అందజేస్తున్నాయి. ధరల నిర్ణయక పద్ధతులను క్రింది విధంగా వర్గీకరణ చేయవచ్చు.

1. పోటీ మార్కెట్‌లో నిర్వహిస్తున్న సంస్థలు (Enterprises operating in a Competitive Market) :

   ఎ) పోటీ ధరలు

   బి) అంతర్జాతీయ ధరలు

2. గుత్తాధిపత్య - అర్ధ గుత్తాధిపత్య పరిస్థితుల్లో నిర్వహించబడే సంస్థలు (Enterprises Operating in Monopolistic or Semi-Monopolistic Market) :

ఎ) దిగుమతి ధరల స్వామ్యం (Import Parity Price)

బి) ఉచితంగా తగ్గించిన ధరలు (Subsidised Price)

సి) లాభనష్టాలు లేని ధరలు (No Profit No loss price)

డి) ఉపాంత వ్యయ ధరలు (Marginal Cost Price)

ఇ) ఉత్పత్తి వ్యయంతో కలిపిన ధరలు (Cost Plus Price)

యఫ్) ముందు నిర్ణయించిన ధర లేదా నిలిపి ఉంచే ధర (Administered Price or Retention Price)

### 7.3.1. పోటీ మార్కెట్‌లో నిర్వహిస్తున్న సంస్థలు :

**a) Competitive Price :** అత్యధికంగా పోటీ నడుస్తున్న పరిస్థితుల్లో అక్కడ డిమాండు, సప్లైలకు సంబంధించిన అంశాలే ధరలను శాసిస్తాయి. అయితే, మార్కెట్‌లో పోటీ ఉద్దేశించబడినప్పుడు ప్రభుత్వరంగ సంస్థలకు రహస్యంగా రాయితీలు ఇవ్వడంగానీ, సౌకర్యాలు కల్పించడంగానీ లేదా ప్రతిఫలం లేని బాధ్యతలను అప్పగించడంగానీ జరుగవు. కొన్ని సందర్భాలలో ప్రభుత్వరంగ సంస్థలు ఉత్పత్తికి నాయకత్వం వహించి మార్కెట్‌లో ఇతర ఉత్పత్తిదారుల ధరలను సరిదిద్దుతాయి. ఇటువంటి సమయాల్లో ప్రభుత్వరంగ సంస్థలు, ప్రయివేటు రంగ సంస్థలు ధరలను తగ్గించుకోవడమే వాటి సమర్ధతగా చెప్పబడుతుంది. స్కూటర్స్ ఇండియా లిమిటెడ్, మోడరన్ బేకరీస్ లిమిటెడ్, నేషనల్ ఇన్‌స్ట్రుమెంట్స్ లిమిటెడ్, నేషనల్ టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ లిమిటెడ్ వంటి సంస్థలు మార్కెట్ పరిస్థితులు ధరలను నిర్ణయించే పరిమితులకు లోబడి పనిచేస్తున్నాయి.

బి) అంతర్జాతీయ ధరలు (International Price) : విదేశాలకు ఎగుమతి చేసే సంస్థలకు అంతర్జాతీయ రవాణా సదుపాయాలు కల్పించబడి, అంతర్జాతీయ సంస్థల నియమ నిబంధనలకు లోబడి వాటి ఉత్పత్తులను ఎగుమతి చెయ్యాలి. ఎయిర్ ఇండియా, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా లాంటి రవాణా సంస్థలు అంతర్జాతీయ పరిమితులకు లోబడి సంస్థల యొక్క ఉత్పాదితాలను రవాణా చేస్తాయి. టీ మరియు జనపనార వంటివి అంతర్జాతీయ ధరలననుసరించే తయారు చేయబడతాయి. భారత్ గోల్డ్‌మైన్స్ లిమిటెడ్ భారత ప్రభుత్వంచే నియంత్రించబడి అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF) ధరలను ఆ సంస్థకు చెల్లించబడుతుంది. ఈ సంస్థలకు సంబంధించిన ధరల విధానం అంతర్జాతీయ మార్కెట్ యొక్క సత్తాననుసరించి నిర్ధారించడం జరుగుతుంది.

### 7.3.2. గుత్తాధిపత్య - అర్థగుత్తాధిపత్య పరిస్థితుల్లో నిర్వహించబడే సంస్థలు :

ఇటువంటి సంస్థలు సాధారణంగా విదేశీయమైన పోటీ నుంచి దూరంగా ఉంటాయి. ఈ సంస్థలు వనరులను పెంచుకోవడమే లక్ష్యంగా పెట్టుకొని, ధరలను నిర్ణయించుకొంటాయి. అయితే ఆ విధంగా లభించిన మిగులు వనరులను సంస్థల విస్తరణకుగానీ లేదా దేశ రెవిన్యూను పెంచుకోవడం కోసం గానీ పెట్టుబడిగా ఉపయోగించుకొనే అవకాశం వాటికి ఉంటుంది. భారతదేశంలోని అధిక సంఖ్యలో ప్రభుత్వరంగ సంస్థలు గుత్తాధిపత్యం లేదా అర్థగుత్తాధిపత్యంకు చెంది నిర్వహించబడుచున్నవే.

**7.3.2.1. దిగుమతి ధరల స్వామ్యం :** దిగుమతి ధరల స్వామ్యం కలిగి ఉన్న మొట్టమొదటి ప్రభుత్వ రంగ సంస్థల్లో హిందుస్థాన్ నౌకా నిర్మాణ సంస్థను మొట్టమొదటిగా పేర్కొనవచ్చును. ఈ సంస్థ తన ఓడల ధరను నిర్ధారించే విషయంలో "యు.కె. ధరల స్వామ్యం" అనే సూత్రాన్ని అనుసరిస్తుంది. ఈ సూత్రాన్ని అనుసరించి U.K. షిప్ యార్డులో తయారుచేయబడిన అదే రకం ఓడల ధరను ప్రాతిపదికగా తీసుకొని మన దేశంలో ఓడల ధరను నిర్ణయిస్తారు. ఇక్కడ ఓడ తయారీకి అయిన ఖర్చు మరియు కొనుగోలుదారుడు చెల్లించిన ధరలలో వ్యత్యాసం ఉంటుంది. ఆ వ్యత్యాసాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. అయితే ఈ సూత్రం బాగా పనిచేయలేదు, కారణం U.K. లో ఓడల తయారీ ఖర్చు అంతర్జాతీయంగా ప్రాతిపదిక కానేరదు. అంతేగాక ఈ సూత్రం ద్వారా నౌకా నిర్మాణ సంస్థ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడానికి కూడా ఏ మాత్రం ప్రోత్సాహం లభించలేదు. అందుచేత దీనిస్థానే "ప్రపంచధరల స్వామం" అనే సూత్రాన్ని పశ్చిమ జర్మనీ, జపాన్ మరియు యుగోస్లోవియా ఓడల ధరల సరాసరితో బాటు 15 శాతం కలిపి 1968లో నిర్ణయించే పద్ధతిని ప్రవేశపెట్టారు. 1971 నుండి ప్రముఖ ఓడల కంపెనీల ధరల సరాసరితోబాటు 5 శాతం నౌక యజమాను చెల్లించే విధంగా మరియు ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలు కలిపి ఓడల ధరను నిర్ణయిస్తారు.

**7.3.2.2. ఉచితంగా తగ్గించిన ధరలు :** భారత ఆహార సంస్థకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో వందల కోట్ల రూపాయలు చెల్లిస్తుంది. ఈ సంస్థ ఆహార ధాన్యాలను సేకరించి రైతులకు గిట్టుబాటుధరను చెల్లిస్తుంది. ఆహార ధాన్యాలను గిడ్డంగులకు తరలించడానికి రవాణా ఛార్జీలు మరియు గిడ్డంగుల నిర్వహణా చార్జీలు ఆ సంస్థ భరించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో భారత ఆహార సంస్థ ధాన్యాలను విక్రయించే సందర్భాలలో నిర్ణయించే అమ్మకం ధరలు, అది ఆ ధాన్యాలపై వెచ్చించిన మొత్తం వ్యయాన్ని భర్తీ చేసే విధంగా లేవు. ఎందుచేతనంటే ఆ సంస్థ విక్రయించిన సరుకు విడుదల చేసే నాటికి వెచ్చించిన మొత్తం వ్యయం, ప్రభుత్వం నిర్ణయించిన అమ్మకం ధర కంటే అధికంగా ఉంటుంది. అయితే అమ్మకం ధర తక్కువగా ఉండి, మూల వ్యయం ఎక్కువగా ఉన్నప్పుడు రెండిటి మధ్య ఉండే వ్యత్యాసం సంస్థకు నష్టం కలిగించే విధంగా ఉంటుంది. కాబట్టి ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వం వినియోగదారులకు ఆర్థిక సహాయంగా పూరిస్తుంది.

**7.3.2.3. లాభనష్టాలు లేని ధరలు :** టాక్సేషన్ ఎంక్వయిరీ కమిషన్ సలహాననుసరించి లాభనష్టాలు లేని ధరల విధానం అభివృద్ధి చెందిన దేశాలలో అభిలషణీయమైనది. ప్రభుత్వరంగ సంస్థల తొలిదశలో ఇది మంచి విధానము. హిందుస్థాన్ ఏంటిబయోటిక్స్ లిమిటెడ్ మరియు హిందుస్థాన్ ఇన్‌సెక్టిసైడ్స్ లిమిటెడ్ ఈ ధరల విధానాన్ని అనుసరిస్తున్నది. వివిధ రాష్ట్రాలలో విద్యుత్తు ధరలు వేరుగా ఉన్నప్పటికీ విద్యుత్ సంస్థలు ఒకే విధమైన ధరల నిర్ణయ విధానాన్ని అనుసరిస్తున్నాయి. విద్యుత్తు ఉత్పత్తి వ్యయం, సరఫరా వ్యయం, పంపిణీ వ్యయం,

నిర్వహణ మరియు తిరుగుదల ఛార్జీలు కలిపి విద్యుత్ యూనిట్ ధరను నిర్ణయిస్తారు. మన దేశంలోని తపాలా శాఖ ఒక సేవా సంస్థగానే పనిచేస్తుందిగాని లాభాన్ని ఆర్జించే సంస్థలా వ్యవహరించదు.

**7.3.2.4. ఉపాంత వ్యయ ధరలు :** నిజమైన ధర ఉపాంత వ్యయ ధర కాదు అని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేసారు. కారణం వినియోగదారుడు అధిక వస్తుసేవలకు అధిక ధరను చెల్లించడానికి సిద్ధంగా ఉంటాడు. రోగ నిరోధక మందులు మరియు ఎరువుల ధరలు ఉపాంత వ్యయ ధరల పద్ధతిలో నిర్ణయిస్తారు. ఎగుమతులు అభివృద్ధి చేయడానికి ప్రభుత్వరంగ సంస్థల ఉత్పత్తులకు ఉపాంత వ్యయ ధరల విధానాన్ని అనుసరిస్తారు.

**7.3.2.5. ఉత్పత్తి వ్యయంతో కలిసిన ధరలు :** ఈ పద్ధతిలో ప్రభుత్వరంగ సంస్థలకు వాటి ఉత్పత్తి వ్యయం మీద కొంత శాతం లాభాన్ని ఇచ్చే సదుపాయం కల్పించబడుతుంది. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ తమ ఉత్పత్తి వ్యయంతో బాటు ఇతర ఖర్చులు మరియు 10 శాతం లాభాన్ని కలిపి ధరలు నిర్ణయిస్తుంది. ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్ తను ఉత్పత్తి చేసిన వస్తువుల ధరను ఉత్పత్తి వ్యయంతో బాటు కొంత శాతం లాభాన్ని కలిపి నిర్ణయిస్తుంది. హిందుస్తాన్ ఏరోనాటిక్స్, హిందుస్తాన్ కేబుల్స్, భారత్ డైనమిక్స్ వంటి ఉత్పాదక సంస్థలు ఉత్పత్తి వ్యయానికి సంబంధించిన ఈ పద్ధతిని అనుసరిస్తాయి.

**7.3.2.6. ముందు నిర్ణయించిన ధర లేక నిలిపి ఉంచే ధర :** ఉత్పత్తిదారుల, వినియోగదారుల ప్రయోజనాల మధ్య రాజీ కుదర్చడం కోసం ఉత్పత్తి వ్యయం ఆధారంగా ఈ నిలిపి ఉంచే ధరల పద్ధతిని ఎంపిక చేసుకోవడం జరిగింది. ఎరువులవంటి కొన్ని ఉత్పత్తుల విషయంలో ఈ పద్ధతిని వినియోగదారులకు వర్తించే అమ్మకం ధర ఒకే మాదిరిగా ఉండేటట్లు చూస్తుంది. ముందు నిర్ణయించిన ధరలు ఎక్కువ సమర్థవంతంగా పనిచేసే విభాగాలలోని ఉత్పత్తి వ్యయాలను లెక్కలోనికి తీసుకొని వాటి ఆధారంగా నిర్ధారించడం జరుగుతుంది. ఈ విభాగాలు ముడి సరుకులు, విద్యుత్తు మొదలైన వాటికి సంబంధించిన కొన్ని వినియోగ ప్రమాణాల ఆధారంగా మొత్తం ఉత్పత్తిలోని అత్యధిక భాగం ఉత్పత్తికి బాధ్యత వహిస్తాయి.

## 7.4. మూడవ పంచవర్ష ప్రణాళికలో ధరల విధానం :

మూడవ పంచవర్ష ప్రణాళికలో ధరల విధానానికి సంబంధించి, ప్రత్యేకంగా చేర్చిన అధ్యాయంలోని ధరల విధానం పరిధి పరిమితులు, దానిలోని అంతర్భాగాల గురించి ఇప్పుడు పరిశీలిద్దాం. ప్రభుత్వరంగ సంస్థలు ఆర్థికపరంగా స్పష్టంగానూ, సహేతుకంగానూ ఉండే ధరల విధానాన్ని అనుసరించాలని, మూడవ పంచవర్ష ప్రణాళికలో కోరడం జరిగింది. అధికోత్పత్తిని సాధించి, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాల కోసం మిగులు సమకూర్చుకోవలసిందిగా కూడా ఆశించారు.

కోశ సంబంధ, ద్రవ్యసంబంధమైన నియమాలు, ఈ ధరల విధానంలో ముఖ్యమైన అంతర్భాగాలుగా భావిస్తారు. కోశ విధానం అత్యధిక కొనుగోలు శక్తిని నివారించడానికి నిర్దేశితమైంది. ఎందువల్లనంటే, ఈ అధిక కొనుగోలు శక్తి అందుబాటులో ఉన్న మిగులు బడుల స్థాయికంటే డిమాండ్లను అధికంగా పెంచుతుంది. అందువల్ల, సరియైన పన్ను విధింపు పద్ధతి ద్వారా ప్రణాళికలో సూచించిన పరిమితుల మేరకు వినియోగాన్ని తగ్గించవలసి ఉంటుంది. మొత్తం మీద ఈ కోశవిధానం వినియోగాన్ని తగ్గించి, పొదుపును సమర్థవంతంగా సమీకరించడానికి ఉద్దేశితమైందని చెప్పవచ్చు. ద్రవ్య విధానం, కోశ విధానం రెండూ సమాంతరంగా కలిసి పయనిస్తాయి. కోశ విధానం ప్రభుత్వ నిర్వహణ ద్వారా అధిక కొనుగోలు శక్తిని అరికడితే ద్రవ్య విధానం బ్యాంకుల ద్వారా రుణ సౌకర్య వేగాన్ని క్రమబద్ధం చేస్తుంది. ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వాన్ని కల్పించడం కోసం, వాణిజ్య విధానం పరిధి, పరిమితులను కూడా ఈ విధానం గుర్తించింది. అంతేగాక, వివిధ రకాల ధరల స్వభావాల మధ్య సత్సంబంధాలను నెలకొల్పడానికి కోశ విధానం, ద్రవ్య విధానం అనే ఈ రెండు విధానాలు అంతగా సహాయపడజాలవని కూడా గుర్తించడం జరిగింది. అందువల్ల కొన్ని రంగాల్లో కేటాయింపులుగానీ, నియంత్రణగానీ ప్రత్యక్షంగా జరుగవలసిన అవసరం కలిగింది.

## 7.5. ధరల నియంత్రణ :

ధరలను నియంత్రించడానికి అనేక చర్యలు తీసుకోవడం జరిగింది. వాటిని మొత్తంగా ప్రత్యక్ష మరియు పరోక్ష నియంత్రణలు అని రెండు విధాలుగా చెప్పవచ్చు.

**7.5.1. పరోక్ష నియంత్రణలు :** పరోక్ష నియంత్రణలు ప్రధానంగా ద్రవ్య విధానం, కోశ విధానం, వాణిజ్య విధానం అనే మూడు విధానాల ద్వారా జరుగుతుంది.

**ఎ) ద్రవ్య విధానం :** ద్రవ్యం సరఫరా, ధరల మధ్య ప్రత్యక్షమైన గట్టి సంబంధం ఉంది. కాబట్టి ధరలను నియంత్రించడం కోసం ద్రవ్య విధానాన్ని వినియోగించుకోవడం జరుగుతుంది. ఉదాహరణకు ద్రవ్యం పెరగడం వల్ల సరఫరాలోనూ, ధరల్లోనూ పరస్పరం పెరుగుదల జరుగుతుంది. అందువల్ల ధరల పెరుగుదలను అరికట్టడానికి ద్రవ్యాన్ని సంకోచింపచేయడం, ధరలు పడిపోవడాన్ని నిరోధించడానికి, ద్రవ్యాన్ని విస్తరింపచేయడం వంటి చర్యలను చేపట్టవలసి ఉంటుంది.

**బి) కోశ విధానం :** కోశ విధానం పటిష్టం కావాలనుకొంటే ద్రవ్య విధానం, కోశ విధానం రెండూ కూడా సమాంతరంగా నిర్వహించవలసి ఉంటుంది. కోశ విధానం ప్రభుత్వ రెవిన్యూలకు, ప్రభుత్వ వ్యయాలకు సంబంధించి ఉంటుంది. అయితే ఈ విధానం కొనుగోలు శక్తిని పెంచడం లేదా తగ్గించడం ద్వారా ధరల స్థాయిని ప్రభావితం చేయగలుగుతుంది. ఇంతే కాకుండా ఈ కోశ విధానం ఎక్సైజ్ పన్నులు, అమ్మకం పన్ను వంటి వివిధ రకాల పన్నులు విధించడం ద్వారాను లేదా తొలగించడం ద్వారాను వివిధ రకాలైన సరుకుల ధరను కూడా ప్రభావితం చేస్తుంది.

**సి) వాణిజ్య విధానం :** వాణిజ్య విధానం కూడా దేశీయ ఆర్థిక వ్యవస్థను సుస్థిరం చేయడానికి కొంత వరకు వినియోగపడుతుంది.

**7.5.2. ప్రత్యక్ష నియంత్రణలు :** భారతదేశంలో ఆర్థిక కార్యవిధుల మీద ప్రత్యక్ష నియంత్రణ జరపడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలను రూపొందించినాయి. ఉదా : పారిశ్రామిక చట్టాలు, అత్యవసర వస్తువుల చట్టం, MRTP చట్టం, కంపెనీల చట్టం, ఎగుమతులు దిగుమతుల నియంత్రణ చట్టం మొదలైనవి. ఇవన్నీ కూడా ఉత్పత్తిని, సరఫరాను, పంపిణీ విధానాన్ని నియంత్రించడానికి, ఇంకా అనేక సందర్భాలలో ధరల మీద నియంత్రణ సలుపడానికి కేంద్ర ప్రభుత్వానికి అధికారాన్ని కల్పిస్తాయి.

## 7.6. ధరలు నిర్ధారించే యంత్రాంగం (Machinery for Price Fixation) :

ఇంతకు పూర్వం ప్రభుత్వరంగ సంస్థల ఉత్పత్తులు, సేవల ధరలు నిర్ధారించడం కోసం ఏ విధమైన శాసన బద్ధ సంస్థలు ఉండేవి కావు. కాని ప్రస్తుతం ఈ క్రింది పేర్కొన్న సంస్థాపరమైన ఏర్పాట్లు ఆ అవసరాలను తీరుస్తున్నాయి.

**7.6.1. పారిశ్రామిక ఉత్పత్తి వ్యయాలు, ధరలు సంస్థ :** ఈ సంస్థ పాలనా సంస్కరణల కమిటీ (ARC) సిఫారసుల ప్రకారం ప్రభుత్వ తీర్మానం మేరకు జనవరి 1970 వ సంవత్సరములో స్థాపితమైంది. ఈ సంస్థ అవసరమనుకుంటే ఉత్పత్తి వ్యయాల అధ్యయనం చేస్తుంది. ఈ బ్యూరో సిఫారసులు తుది నిర్ణయాలు కావు. వాటిని ఆమోదించడం, ఆమోదించక పోవడం ప్రభుత్వ నిర్ణయం మీద ఆధారపడి వుంటుంది.

**7.6.2. తాత్కాలిక ధరల నిర్ణాయక సంఘం :** ఈ కమిటీని తాత్కాలికంగా ఏర్పాటు చేయడం జరిగింది. ప్రభుత్వశాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల మధ్యన లేదా వివిధ రకాలైన ప్రభుత్వ రంగ సంస్థల మధ్య ధరల నిర్ధారణ సందర్భంగా ఉత్పన్నమయ్యే సమస్యలు, పరస్పర సమ్మతితో పరిష్కారం కానట్లయితే ఇటువంటి సమస్యలను ఆర్థికమంత్రిత్వశాఖకు, B.P.E. కి పరిశీలన కోసం ఈ తాత్కాలిక ధరల నిర్ణాయక కమిటీల ద్వారా పంపించడం జరుగుతుంది. సాధారణంగా ఈ కమిటీకి BPE డైరెక్టర్ జనరల్ అధ్యక్షత వహిస్తారు.

**7.6.3. ప్రభుత్వ రంగ సంస్థల బ్యూరో (Bureau of Public Enterprises) :** ధరలు నిర్ధారించడంలో వివిధ ప్రభుత్వరంగ సంస్థల మధ్య ఉత్పన్నమయ్యే వ్యత్యాసాలను సవరించి పరిష్కారం కుదిరించడానికి BPE కూడా సహాయం చేస్తుంది. BPE ఈ విషయంలో

ధరల నిర్ణాయక సంఘాన్ని ఆశ్రయించకుండానే వ్యవహరిస్తుంది. ఈ బ్యూరోలోని ఫైనాన్స్ విభాగం ధరల నిర్ధారణకు సంబంధించిన సమస్యలను చర్చలు, సూచనల ద్వారా పరిష్కరించడంలో ప్రశంసనీయంగా పనిచేస్తుంది. ప్రభుత్వరంగ సంస్థల ధరల నిర్దరణకు వ్యతిరేకంగా వచ్చే ఫిర్యాదులకు స్వీకరించడానికి, శాసనబద్ధమైన ఒక సంఘం అవసరం ఉంది. అయితే ఈ విషయంలో BPE తన సమన్వయ కర్తవ్యాన్ని నిర్వహించవలసి ఉంటుంది.

## 7.7. సారాంశము :

ఒక దేశం అవలంభించవలసిన ధరల విధానాలు సాధారణంగా ఆ దేశ ఆర్థిక వ్యవస్థపైన, సంక్షేమం కోసం నిర్ణయించుకొన్న లక్ష్యాలు, వ్యవస్థా నిర్మాణంపైన, వాణిజ్య విధానం, మార్కెట్ స్వభావం మొదలైన అంశాలపైన ఆధారపడి ఉంటాయి. ధరలు నిర్ణయించడం, వాటిని సమర్థవంతంగా అమలు చేయడం అనేది ప్రభుత్వరంగ సంస్థ విషయంలో చాలా ముఖ్యమైన అంశంగా పేర్కొనవలసి ఉన్నప్పటికీ ధరల నిర్ధారణ అనేది చాలా క్లిష్టమైన అంశంగా కనిపిస్తుంది. ప్రభుత్వరంగ సంస్థల ధరల విధానాన్ని ఒకే విధమైన సాధారణ పద్ధతిలో నిర్ణయించడం సాధ్యమయ్యే పనికాదు. అనేక సిద్ధాంతాలను పరిశీలించినట్లయితే ప్రభుత్వ రంగ సంస్థల్లో ధరలు నిర్ధారణ చేసే విషయంలో ఖచ్చితమైన నిబంధనలేవీ లేవని స్పష్టమవుతుంది. ఎందువల్లనంటే ఒక సంస్థ విభిన్న పరిస్థితుల్లో విభిన్నమైన సిద్ధాంతాలను అనుసరించవచ్చు. అదే విధంగా ధరలు కూడా ఆ సంస్థలు ఉత్పత్తి చేసే వస్తువుల స్వభావం మీద ఆర్థిక వ్యవస్థ విధానం మీద ఆధారపడి ఉంటాయి. ప్రభుత్వరంగ సంస్థలు పనిచేసే పరిస్థితులు, వాటికి అప్పగించిన బాధ్యతలు అనేక రకాలుగా ఉంటాయి. కాబట్టి, ధరల నిర్ధారణ విషయంలో కేవలం ఒకే పద్ధతిని వాటికి అన్వయించడం వీలుపడదు. ప్రభుత్వరంగ సంస్థలు, వాటి పని పరిస్థితులు, బాధ్యతల్లో తేడా ఉన్నట్లే వాటి ధరల నిర్ధారణ పద్ధతులు కూడా అనేక రకాలుగా ఉండవలసిన ఆవశ్యకత ఉంది. ఇంతేకాక, ప్రభుత్వరంగ సంస్థలకు మార్గదర్శకంగా ఉండేటట్లు ధరలు నిర్ధారణ చేసే విధానం కూడా స్పష్టంగా ప్రకటించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

## 7.8. నమూనా ప్రశ్నలు

1. ప్రభుత్వరంగ సంస్థల ధరల విధానం గూర్చి వివరిస్తూ ధరల నిర్ణాయక పద్ధతులను, ధరల నిర్ధారణ సిద్ధాంతాలను గూర్చి చర్చించండి?
2. ప్రభుత్వరంగ సంస్థల్లో ధరల నియంత్రణ మరియు ధరలను నిర్ణయించే యంత్రాంగాలను గూర్చి వివరించండి ?
3. ప్రభుత్వరంగ సంస్థల్లో ధరల విధానాన్ని గూర్చి వ్రాయండి ?

లఘు ప్రశ్నలు

1. ప్రభుత్వరంగ సంస్థల ధరల నిర్ధారణ సిద్ధాంతాలను గూర్చి వ్రాయండి ?
2. ప్రభుత్వరంగ సంస్థల ధరల నిర్ణాయక పద్ధతులను గూర్చి చర్చించండి ?
3. ధరల నియంత్రణా పద్ధతులను గూర్చి చర్చించండి ?
4. ప్రభుత్వరంగ సంస్థల్లో ధరలు నిర్ధారించే యంత్రాంగం గూర్చి వ్రాయండి ?

## 3.13. చదువదగిన గ్రంథాలు


1. Jagdish Prakash, Nageshwar Rao, M.B. Shukla : Administration of Public Enterprises in India.
2. Muralidhara Rao, Ramachandram, Bhupathi Rao, Surya Kaladhar : Public Enterprises (Telugu Academy)
3. W.A. Lewis : "The Policy of Public Corporations"


**డా॥ డి. వెంకటేశ్వరరావు**

**పాఠం - 8**

# ప్రభుత్వరంగ సంస్థలు - పనితీరు విశ్లేషణ

## 8.0 లక్ష్యం :-

ప్రభుత్వరంగ సంస్థల పని తీరు, నిర్వహణా సామర్థ్యము దేశ ఆర్థిక వ్యవస్థలు కీలక స్థానాన్ని ఆక్రమిస్తున్నదని చెప్పవచ్చును. ఇవి తమ సామర్థ్యంతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నాయి. అందుచే వీటి పనితీరు, సామర్థ్య నిర్వహణ, పనితీరు విశ్లేషణల ద్వారా అధ్యయనం చేసి వాటి అభివృద్ధి నిరోధకాలను వివరంగా కనుగొనవలసిన ఆవశ్యకత ఎంతైనా కలదు. ఈ పాఠ్యాంశం లక్ష్యం ప్రభుత్వ రంగ సంస్థల పనితీరును అంచనా వేయుట, అభివృద్ధికి గల మార్గాలను విశ్లేషణ చేయుట, వాటిలో ఏర్పడే పరిపాలనా సమస్యలను అధ్యయనం చేసి, వాటి స్థాయిని పెంచుట ద్వారా మార్కెట్‌లో ప్రైవేటు సంస్థలతో గల పోటీని పరిశీలించుట. ప్రభుత్వంతో గల సంబంధాలను పరిశీలించి ప్రభుత్వ నియంత్రణ పోటీ పనితీరును ప్రభుత్వం ఎట్లు నియంత్రించి ప్రభావితం చేస్తాయో తెలుసుకొనుటకు నిర్దేశించబడినది.

**విషయసూచిక :**


8.1 విషయ పరిచయము

8.2 ప్రభుత్వరంగ సంస్థలు - ఆర్థిక వ్యవస్థలోని పాత్ర

8.3 పనితీరు మదింపు పద్ధతులు - పారిశ్రామిక వ్యవస్థలు

8.4 పనితీరు విశ్లేషణ - ప్రస్తుత పద్ధతులు

8.5 ప్రభుత్వరంగ సంస్థలు - పరిపాలనా సమస్యలు

8.6 ప్రభుత్వరంగ సంస్థలు - ప్రభుత్వ నియంత్రణ

8.7 మార్కెట్‌లో పోటీ - ప్రైవేటు సంస్థల పై ప్రాధాన్యత

8.8 సారాంశము

8.9 నమూనా ప్రశ్నలు

8.9 చదువదగిన గ్రంథాలు


## 8.1 విషయ పరిచయం :

ఏ వ్యవస్థకైనా కొన్ని నిర్ణీత లక్ష్యాలను నిర్దేశించి వాటిని సాధించుటకు కొన్ని విధులను బాధ్యతలను నిర్ణయం చేసి వాటిని అమలు చేయుటద్వారా వ్యవస్థ యొక్క పురోగమన దిశా నిర్దేశనం చేయబడుతుంది. వ్యవస్థల పనితీరు సామర్థ్యములను నిర్ణయించే ప్రక్రియలు వ్యవస్థను ఒక యూనిట్‌గా తీసుకొని, పనితీరును విశ్లేషించి, లాభనష్టాలను మదింపు చేసి పెట్టుబడుల నిష్పత్తులలు వాటి నిర్వహణా సామర్థ్యాన్ని అంచనా వేసే పద్ధతిని అవలంబించుట సాధారణ విషయం. వ్యవస్థను నిర్వహించే వ్యక్తుల స్థాయి,

వారికి గల విషయ పరిజ్ఞానము, నైపుణ్యాము, శాస్త్రీయ దృక్పథము వ్యవస్థ యొక్క అభివృద్ధిని రాబోయే కాలానికి చేయవలసిన అభివృద్ధి ప్రణాళికలు, వ్యవస్థలోని వ్యక్తుల సహకార, సమన్వయము ఇవి అన్ని వ్యవస్థ యొక్క గమ్యాన్ని నిర్ణయిస్తాయని చెప్పవచ్చును. వ్యవస్థాగత నిర్దేశ లక్ష్యాలను సాధించాలంటే, నిర్ణీత మార్గముల ద్వారా అంతర్గత సామర్ధ్యాన్ని పెంచుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా కలదు. అంతేకాదు వ్యవస్థ ఎదుర్కొనే పలురకములైన నిర్వహణా సమస్యలను సమర్ధవంతంగా పరిష్కరించే విధంగా ముందుకు నడిపించగలిగిన నాయకత్వము కార్యనిర్వాహణాధికారులను కలిగి యుండుట అత్యంత అభిలషణీయం అని చెప్పవచ్చును.

ప్రస్తుతము భారతదేశ పారిశ్రామిక రంగాన్ని, అందులోని కీలక ప్రభుత్వ రంగ సంస్థల పనితీరును విశ్లేషిస్తే మౌలికంగా మార్కెట్‌లో గల పోటీ నందు నిలబడి ప్రయివేటు సంస్థలతో సమానంగా లాభాల బాట యందు నడవటం లేదన్నది అందరికి తెలిసిన వాస్తవము. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా వ్యవస్థలు తమ పద్ధతులందు అవసరమయిన మార్పులు చేస్తూ నూతన పద్ధతులకై అన్వేషించవలసిన సమయాలలో ప్రభుత్వము యొక్క అధీన సంస్థలు సరియైన సమయంలో తగిన విధముగా స్పందించి మార్పులకు శ్రీకారం చుట్టని యెడల నేటి తీవ్రమైన పోటీ వాతావరణంలో వాటి మనుగడ ప్రశ్నార్ధకంగా మారుతుందనడంలో ఎట్టి సందేహము లేదు. అందువలన ప్రభుత్వరంగ సంస్థలు నూతన పనితీరు మదింపు పద్ధతులను అవలంబించి వాటికి అనుగుణంగా తగిన వ్యవస్థాగత మార్పులను చేయుచు, అభివృద్ధి మార్గములను విపులంగా అధ్యయనం చేస్తూ నిర్వహణా సామర్ధ్యమును పెంచుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా కలదని చెప్పవచ్చును. ఈ దిశగా పయనించే మార్గంలో కొన్ని క్లిష్టమైన అంశాలను గర్తెరిగి వాటిని మార్పులు చేసే ప్రయత్నం చేయాలి. అవి ఆర్థిక వ్యవస్థలోని మిశ్రమ ఆర్థిక విధానానికి అనుగుణంగా ఆర్థిక, పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వ రంగ సంస్థలు వహిస్తున్న పాత్ర, జాతీయం చేయబడిన ప్రభుత్వ సంస్థలు ప్రభుత్వ ఖజానా నుండి పెట్టుబడులను స్వీకరిస్తూ లాభాలను ఆర్జించవలసిన గురుతర బాధ్యతలను పరిశీలన చేయాలి. ఒక రంగంలోని ప్రభుత్వ రంగ సంస్థలు (ఉదాహరణ ఎరువులు, రసాయనాలు, నష్టాల ఊబిలో ఉండి సంస్థలను మూసివేయవలసిన పరిస్థితులు ఎదురవుతుండగా అదే రంగంలోని ప్రయివేటు కర్మాగారాలు, లాభాలనార్జిస్తూ అభివృద్ధి పథంలోని దూసుకొని వెళ్తున్న పరిస్థితులు నేడు మనకు అనేక విషయాలలో ఎదురవుతున్నాయన్నది వాస్తవము.

ఈ వైరుధ్యాన్ని నివారించి, వైవిధ్యాన్ని ప్రదర్శించవలసిన పద్ధతులను అవలంబించే కృషిని ప్రారంభించవలసిన అవసరం ఉన్నదని చెప్పవచ్చును. ప్రభుత్వ రంగ పారిశ్రామిక సంస్థలు కీలకమైనవి. వీటి పనితీరు సూక్ష్మంగా మదింపు చేసి, పరిపాలనా, నిర్వహణ లోపాలను విశ్లేషిస్తూ గుర్తించి వాటిని సరిగా సవరణ చేయుట ద్వారా ప్రజాధనాన్ని పెట్టుబడులుగా నిర్వహిస్తూ లాభాలను ఆర్జించుట విఫలమయినపుడు ప్రజాధనాన్ని దుర్వినియోగ పరచినట్టు అని చెప్పవచ్చును. అందుకై వీటిని నివారిస్తూ, ప్రజలకు, వాటాదారులకు లాభాలను అందిస్తూ వ్యవస్థ ముందుకు అడుగువేయవలసిన అవసరాన్ని ఇటు ప్రభుత్వం అటు పారిశ్రామిక రంగ నిపుణులు, వ్యవస్థల ముఖ్య కార్యనిర్వాహకులు గుర్తించాలి. అందుచే తరువాయి భాగాలను మనం ప్రభుత్వ రంగ సంస్థలలో చేయవలసిన మార్పులు, వాటిలో గల అంతర్గత నిర్వాహణ సమస్యలు, వ్యవస్థా నిర్మాణ ప్రక్రియ, వ్యవస్థను సమర్ధవంతంగా నడిపించగలిగిన నాయకత్వము, వారి సామర్ధ్యపు పెంపు చేసే విధానాలు, ప్రభుత్వంతో గల సంబంధాలు, ప్రభుత్వ రంగ సంస్థలపై ప్రభుత్వ నియంత్రణ, వాటి మనుగడకు కావలసిన స్వతంత్ర ప్రతిపత్తి, స్వయం పోషకత్వము మరియు ఆర్థిక స్వావలంబన, నిర్ణయాకరణ ప్రక్రియలలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, మొదలగు అంశాలను సమగ్రంగా విశ్లేషణ చేస్తే ప్రస్తుతం సంక్షోభం ఎదుర్కొనుచున్న అనేక ప్రభుత్వ రంగ సంస్థలను, వాటి సమస్యల పరిష్కారంలో అవలంబించవలసిన నూతన ద్వారాలు ఆవిష్కరింపబడగలవని విద్యావేత్తలు, పారిశ్రామిక రంగ నిపుణులు, రాజకీయ మేధావులు అభిప్రాయపడుచున్నారన్నది మనకు తెలిసిన వాస్తవ విషయము.

## 8.2 ప్రభుత్వరంగ సంస్థలు - ఆర్థిక వ్యవస్థలోని పాత్ర :-

నేడు భారతదేశ ఆర్థిక పరిస్థితిని విశ్లేషిస్తే ప్రభుత్వ రంగ పారిశ్రామిక, సేవారంగ, వ్యాపార రంగ సంస్థలు దేశ ఆర్థిక పురోభివృద్ధికి మార్పును సూచించే కీలక స్థాయిలో నుండి, ఆర్థిక అభివృద్ధికి సూచికలుగా మారవలసిన స్థాయికి చేరుచున్నవి. ప్రాంతీయ సమగ్ర అభివృద్ధి ద్వారా సమతుల్యాన్ని సాధించుటకు ప్రజా ధనాన్ని పెట్టుబడులుగా స్వీకరించి, పోటీని ఎదుర్కొనే సామర్థ్యాన్ని కలిగి, అవసరమైన నేర్పును ప్రదర్శించి తమ ప్రత్యేకతను తెలియ చేయవలసిన అవసరం ఉన్నది.

Pandit Jawaharlal Nehru అభిప్రాయంలో "ప్రభుత్వ పారిశ్రామిక సంస్థలు దేశ ఆర్థిక వ్యవస్థను సమున్నత స్థాయికి చేర్చుటకు ఉపకరించే అతి ముఖ్యమైన సాధనాలుగా వర్ణించవచ్చును".

భారత పారిశ్రామిక విధానం 1980 ప్రకారం - ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజలకు ప్రభుత్వ విధానంలో నమ్మకం కలిగించుట, వాటి సామర్థ్యాన్ని పెంచుట ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రజా సంస్థలుగా రూపొందించుటకు కృషి చేయడం ప్రధాన లక్ష్యంగా పేర్కొనబడినది.

1985 రాజీవ్ గాంధీ ప్రభుత్వ పారిశ్రామిక తీర్మానం ప్రకారము "దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రయివేటు సంస్థలు ప్రాధాన్యతను కొనసాగించడం వలన దేశ ఆర్థిక వ్యవస్థలో సంపద కేంద్రీకృతకమవడానికి దోహదం ఏర్పడుతుంది. ఎందుచేతననగా ప్రణాళికా పెట్టుబడుల ద్వారా 55.7% పెట్టుబడులు కలిగిన ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజాధనము సద్వినియోగము కావడానికి, అన్ని రంగములందు సంపద సమానంగా పంపిణీ జరుగుటకు కృషి చేయగలవు.

1986లో 214 ప్రభుత్వ రంగ సంస్థలలో 35,411 కోట్ల రూపాయిల పెట్టుబడితో అభివృద్ధిని ప్రారంభించి 1998-99 వరకు 48,457 కోట్ల రూపాయిలకు పెరిగి దేశ ఆర్థిక రంగంలో కీలక స్థానాన్ని వహిస్తున్నాయి. కాని నేటి ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకృత విధానాలతో దేశాల విధానాల నిర్ణయంలో మార్పులు జరుగుట వల్ల దేశ పారిశ్రామిక రంగంలో విదేశీ మార్కెట్ నుంచి గట్టి పోటీని ఎదుర్కొని రావలసి వచ్చినది. తద్వారా ఉత్పత్తి వ్యయం పెరుగుల, ధరల నిర్ణయాలు పోటీలకు తట్టుకొనలేక అనేక పారిశ్రామిక రంగ సంస్థలు ప్రభుత్వ రంగంలో నుండుట వలన నష్టాల ఊబికి నెట్టి వేయబడి మూతపడే ప్రమాదాల్ని ఎదుర్కొనుచున్నాయి. అందుచే వాటి నిర్వహణ లోపాలను అన్వేషించడం ద్వారా వాటిని రక్షించి మనుగడకు అవకాశమును కలిగించి ప్రజాధనమును కాపాడుటకు కృషి ప్రారంభింపబడినది. దీనిలో భాగంగా వీటి పరిరక్షణకు ఒక కేంద్ర ప్రభుత్వ శాఖను NDA ప్రభుత్వము నేర్పాటు చేసి ఈ క్రింది విషయములపై సమగ్ర చర్యలు తీసుకొనుట ప్రారంభింపబడినది. అవి ప్రయివేటు రంగంలోని సంస్థలతో పోటీని తట్టుకొని నిలబడుట, పెట్టుబడుల వ్యయమును నియంత్రించుట, నిర్వహణ సామర్థ్యము తగ్గుటకు గల కారణములను అన్వేషించి విశ్లేషించుట, సాంకేతిక రంగంలోని మార్పులను అవలంబించి నూతన విధానములను ప్రయివేటు సంస్థలతో సమానముగా అమలుచేయుట, నిర్వహణా నైపుణ్యమును పెంపొందించుట అనే అంశాలలో పరిశ్రమల పరంగా అధ్యయనం చేసి విధాన నిర్ణయములకు రూపకల్పన చేయుట మొదలగునవి విశేష ప్రాధాన్యతను సంతరించుకొనుచున్నవి.

పని సామర్థ్యమును పెంచుటకు, అంచనాలు తయారు చేయుటకు వ్యవస్థలను ఒక యూనిట్‌గా పరిగణించుట, పెరుగుదలకు గల కారణాలను విశ్లేషించి ఉత్పత్తిని పెంపుచేయుట ద్వారా సాంకేతికపరంగా నైపుణ్యము లేకుండుట, వ్యక్తుల అలసత్వమును ఎదుర్కొనుచు ఉత్పత్తులను పెంచుట ద్వారా నిర్వహణను మెరుగుపరచుకుని అవకాశాలను ఎదురుచూస్తూన్న సమయంలో నూతన పద్ధతులను అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా కలదు.

అంతర్గత విధానాలను మార్పు చేయుచు, రాజకీయ, రాజకీయేతర సహాయ సహకారములతో, నిపుణుల కమిటీల సలహాలతో ప్రభుత్వ రంగాన్ని పటిష్టం చేయడానికి కృషి ప్రారంభించబడి నేడు అదే విధానాలు కొనసాగిస్తూ ప్రభుత్వ రంగంలోని పారిశ్రామిక రంగ సంస్థలు తమ స్థానాన్ని పదిలపరచు కొనుటకు కృషిని నిరంతరం చేస్తున్నాయని మనకు తెలిసిన విషయం.

2001 వ సంవత్సరము నుండి ఈ కృషి, ప్రయత్నములు ముమ్మరము చేయబడి అనేక చర్యలు తీసుకొనుట ప్రారంభించబడినది. నష్టాల ఊబిలోని సంస్థలను పరిశీలన చేసి వాటిని మూసి వేయడం ద్వారా పెట్టుబడులను రక్షించడం, ప్రభుత్వ షేర్లను అమ్మడం ద్వారా జాయింటు రంగానికి మార్పు చేయడం, 'డిజిన్విస్ట్మెంట్' ప్రక్రియను సమగ్రంగా నిర్వచించి, నిర్ణయించి, రూపకల్పన చేయుట ద్వారా ఆదా చేయుట, మొదలగు చర్యలు ప్రారంభింపబడినవి.

ఆర్థిక రంగంలో వీటిని "While Elephants" గా పరిగణించి, లక్ష్య సాధనానికి విఫలమై ప్రాథమిక లక్ష్యాన్ని దెబ్బతీసే విధంగా ఉన్న వీటిని సరిదిద్దుటకు కృషి చేయవలసిన అవసరం ఉంది. ఒక క్రమపద్ధతిలో అధ్యయనం చేసి, పనితీరు మదింపు చేసి, అభివృద్ధికి మార్గదర్శకాలను ఏర్పరుస్తూ విశ్లేషణతో సరియైన మార్గంలో నడుచుటకు చర్యలు తీసుకొనవలసిన అవసరము కలదు.

## 8.3 ప్రభుత్వ రంగ సంస్థలు - పనితీరు మదింపు పద్ధతులు :-

సంస్థల నిర్వహణా సామర్ధ్యాన్ని అంచనా వేసి, మెరుగుపరచే విధానాలను ఎంపిక చేయుటకు ముందు వ్యవస్థల స్థాపనకు గల లక్ష్యాన్ని, కారణాలను తెలుసుకొనుట అవసరము. అనేకమైన పార్లమెంటు బిల్లులు, పరిశ్రమలను జాతీయం చేసే విధానాలు రూపొందించుట, నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేయడం ద్వారా కీలక రంగాలలో ప్రధాన్యతను పెంచుట, వ్యవస్థలపై ప్రభుత్వ నియంత్రణ, ఆధిపత్యమును నిరూపించుట ద్వారా కృషి జరుగుచున్నది. (1980 Bill of Industrial Policy Resolution) దీనివలన మనకు ప్రభుత్వపరంగా ప్రభుత్వ రంగ సంస్థలకు గల విశేష ప్రాధాన్యతను తెలియచేయబడుతుంది.

1983 Prime Ministers Principle Secretary P.C. Alexanda 'ప్రభుత్వ రంగ సంస్థల కార్య నిర్వాహకుల సదస్సు' ను ప్రారంభిస్తూ ఈ విధంగా అన్నారు, నష్టాల ఊబిలోని ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుట అసాధ్యమని తెలిస్తే వాటిని ప్రభుత్వానికి భారంగా మారకుండునట్లు ఏదో విధంగా పరిష్కారం చేయాలని" అన్నారు. "they will have to be get rid of in a decent way" లేనియెడల అవి ప్రభుత్వానికి మచ్చలుగా నిలబడే ప్రమాదం ఉంది.

ప్రభుత్వ రంగ సంస్థల పునర్ నిర్మాణ బోర్డు అభిప్రాయంలో వీటిని వ్యాపార సరళిలో నిర్వహించుట మంచిదే గాని ఇతర వ్యవస్థల వలే తప్పులు చేసే అవకాశం వున్నది కనుక వ్యవస్థని సమర్థవంతంగా నిర్వహించాలి. నేటి సరళీకృత రంగంలో పారిశ్రామిక వ్యవస్థలు వ్యాపార రంగంలో పొందే వైఫల్యాలు ఎదుర్కొనడంలో నష్టాలు భరించవలసి వస్తోంది. అందుచే వాటిని పునర్నిర్మాణం, పునర్ వ్యవస్థీకరణ, మూసివేయుట అనేవి నిత్యం జరుగుచున్నాయి. అందుచే ప్రభుత్వ రంగ సంస్థలని మూసివేయుటను అసాధారణమైన నేరంగా పరిగణించరాదు అని ప్రభుత్వ పెట్టుబడుల పరిరక్షణలో దీన్ని ఒక భాగంగా స్వీకరించాలి అని "స్కూటర్స్ ఇండియా" నిర్వహణ పై "Economics Times" అనే పత్రిక యొక్క వ్యాఖ్యానాన్ని ఇక్కడ ప్రస్తావించవలసిన అవసరం వుంది.

ప్రభుత్వ రంగ సంస్థల పనితీరుని వాటి లక్ష్యాలు, గమ్యాలు, వాటిని సాధించుటకు అవలంబించే పద్ధతులను ప్రతిపాదికగా విశ్లేషించవలసిన అవసరం వుంది. సూక్ష్మ స్థాయిలో (Micro Level) అధ్యయనం అవగాహన జరిపి వాటి ఆధారంగా వ్యవస్థ గమనాన్ని మనం అంచనా వేయాలి. ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు మదింపులలో గల అంతర్గత వ్యవస్థా పద్ధతులు (Organisational Pattern) స్థూల, సూక్ష్మ పద్ధతుల ద్వారా విశ్లేషణ చేయవలసిన ప్రాథమిక అవసరం ఏర్పడుతుంది.

Sri. N.N. Mallayya దశాబ్ద కాలంలో ప్రభుత్వ రంగ సంస్థల కార్యదర్శిగా పని చేసిన అనుభవంతో ఇలా అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల లక్ష్యాలు, వాటి విధానాలు ఎక్కడా విపులంగా చర్చించబడలేదు. అందుచే అవి వ్యవస్థకు గాని, ప్రభుత్వానికి గాని జవాబుదారిగా లేవు. తద్వారా పరస్పర నిందారోపణ చేస్తూ సామర్థ్యం లోపించే అవకాశం ఏర్పడింది. వ్యవస్థ పనితీరు, సామర్థ్యాన్ని అంచనా వేయడంలో వ్యవస్థ యొక్క వాటి అంతర్గత నిర్మాణ వ్యవస్థను పరిశీలించి బోర్డు డైరక్టర్ నియామకం, పదవి కాలం, బాధ్యతలు, లక్ష్యాలు నిర్దేశించి లక్ష్యసాధనకై వాటికి నిర్ణయ అధికారం, స్వయం ప్రతిపత్తిని అందచేస్తూ తద్వారా వ్యవస్థ సమస్యలను పరిష్కరించి ముందుకు సాగే అవకాశం కలదు.

ప్రభుత్వ రంగ పారిశ్రామిక సంస్థలు నేడు ప్రైవేటు సంస్థలతో పోటీ పడవలసిన అవసరం వుంది. దానికై కొన్ని ప్రత్యేక పద్ధతులు ఏర్పరచి మార్కెట్‌లో నిబడుటకు, పనితీరు మెరుగుపరచవలసిన అవసరం వుంది. పనితీరును అభివృద్ధి చేస్తూ, లాభాల సాధన ద్వారా ప్రజలకు జవాబుదారీ వహించవలసిన అవసరం వుంది. వీటి ద్వారా నిర్వహణలో ఏర్పడే అంతర్గత సమస్యలను పరిష్కరించాలి. నిర్ణయీకరణ, విధానంలో స్వయం ప్రతిపత్తిని ఏర్పరచి కార్యదర్శులకు స్వాతంత్రత లేనిచో జాప్యంతో సంస్థకు నష్టం ఏర్పడే ప్రమాదం వుంది. ప్రభుత్వ రంగ సంస్థల గమనంలో ప్రభుత్వ నియంత్రణ, స్వయం ప్రతిపత్తి జవాబుదారీ విధానాలు అనే మూడు అంశాలు ప్రభుత్వ రంగ సంస్థలను మార్కెట్ పోటీలో ప్రభావితం చేస్తున్నాయి. అందుచే సూక్ష్మంగా పరిశీలిస్తే సంస్థల పనితీరు మదింపునకు ఈ క్రింది విధానాలు అమలు పరచవచ్చును.

1. సంస్థ యొక్క లాభనష్టాల ప్రతిపాదిక ద్వారా సంస్థ పనితీరు అంచనా వేసి సామర్థ్యపు రేటును నిర్ణయించుట.

2. వ్యవస్థ యొక్క అభివృద్ధి రేటును అంచనా వేసి విశ్లేషణ ద్వారా నిర్వహణ సామర్థ్యాన్ని మదింపు చేయుట.

3. వ్యవస్థలో గల పెట్టుబడుల నిష్పత్తులు, యాజమాన్య పద్ధతులు, మార్కెట్ పోటీలో సంస్థ యొక్క స్థానాన్ని అంచనా వేయడం.

4. ప్రభుత్వంచే ఏర్పరచబడిన కమిటీల ద్వారా ప్రభుత్వరంగ సంస్థల పనితీరు సమీక్షించి వాటి లోటుపాట్లను, అంతర్గత సమస్యలను, ఏర్పడే లోపాలను పరిశీలించి నివేదికలను రూపొందించి వాటి సమీక్ష ద్వారా పరిష్కార మార్గాలని తెలియజేసి పనితీరు రేటును మదింపు చేయవచ్చు.

## 8.4 ప్రస్తుత పనితీరు మదింపు పద్ధతులు - విశ్లేషణ :-

భారత పారిశ్రామిక రంగంలో ప్రభుత్వరంగ సంస్థలుగా ఏర్పడి నిర్వహించబడుచున్న వానిలో మూడు రకములు కలవు.

1) ఉత్పత్తి కారకములై వాణిజ్య రంగంలో నుండి దేశ ఆర్థిక వ్యవస్థలు భాగస్వామ్యములై ఉండునవి.

2) సేవా పద్ధతులు గలిగి ప్రజలకు సేవలనందించుటకు వివిధ రంగాలలో ఏర్పడిన సంస్థలు (LIC, UTI) మొదలగునవి.

3) దేశ ఆర్థిక రంగంలోని కీలక రంగాలను ఆక్రమించి ప్రైవేటు సంస్థలకు అవకాశంలేని రంగంలో ప్రజాధనమును పెట్టుబడులుగా పెట్టి నిర్వహించబడే సంస్థలు (ONGC, FCI, Defence or factories) మొదలగునవి. అందుచే పనితీరు మదించుటకు అన్నిటికీ ఒకేవిధములైన పద్ధతులు అవలంబించుట సాధ్యము కాని విషయము.

ప్రభుత్వ రంగ సంస్థల పనితీరును నిర్ణయించే విషయంలో అవి నిర్వహించే కార్యక్రమములు, లక్ష్యాలు, ఆ రంగానికి చెందిన విధాన నిర్వహణల ప్రకారం చేయగలగాలి. సేవాసంస్థలను లాభనష్టాల ప్రాతిపదికన అంచనా వేయుట సమంజసం కాదు. ఉత్పత్తి రంగ సంస్థలను ప్రభుత్వ మూలధన నిష్పత్తి ప్రకారం మార్కెట్‌లో గల పోటీని తట్టుకొని లాభాలను ఆర్జించవలసిన అవసరం ఉంది. వస్తువుల ఉత్పత్తిలో నిర్వహణ వ్యయాలను తగ్గించుకొని నాణ్యతను సాధించుకొని తక్కువ ధరకు వస్తువులను ప్రజలకు అందించవలసిన బాధ్యత కలదు. తద్వారా ప్రైవేటు నిర్వహణలోని మెళకువలను గ్రహించి వనరులను సమర్ధవంతంగా వినియోగించినప్పుడే పనితీరులో సామర్ధ్యము పెంచినట్లు నిర్ణయించవచ్చును.

ప్రభుత్వ పరంగా లభించే సహాయాన్ని స్వీకరిస్తూ, తగిన సమయంలో నిర్ణయాలను తీసుకొని అమలు చేసినపుడు సంస్థ లాభాలను ఆర్జించుటలో ముందుంటున్న విషయం అందరికీ తెలుసు. పారిశ్రామిక అశాంతి లేకుండా సమ్మెలు నివారిస్తూ ఉత్పత్తి పెంచుతూ పనిగంటలను సద్వినియోగం చేసే సంస్థలు మార్కెట్‌లో నాణ్యత గలిగిన సరుకులను అందచేయడం ద్వారా ప్రైవేటు సంస్థల కంటే ముందుంటూ, మార్కెట్ ఉనికి దూసుకొని పోయే సంస్థలు నిర్వహణ సామర్ధ్యంలో ఉన్నత స్థానాలను సాధిస్తాయి.

రెండవ రకమైన సంస్థలు ప్రజాధనం పెట్టుబడిగా ఏర్పడి పార్లమెంటు లేదా అసెంబ్లీ చట్టముల ద్వారా లక్ష్య నిర్ణయం చేయబడి మౌలిక రంగములలో సేవలను అందచేయుటకు స్థాపన చేయబడినవి. ఇవి సేవాదృక్పథం ప్రధానంగా కలిగి యుండి లాభనష్టాల బాటను గుడ్డిగా అనుసరించజాలవు. సమర్థవంతంగా నిర్ణయించబడిన రంగంలో ఆశించిన విధంగా ప్రజలకు సేవలను అందచేయాలి. జీవిత భీమా సంస్థలు, భారతీయ ఆహార సంస్థలు, గిడ్డంగుల సంస్థలు, విత్తన నిర్వహణ సంస్థలు, పారిశ్రామిక మౌలిక సదుపాయముల సంస్థ మొదలగునవి. వీటిని ఇవి అందచేసే సేవలను లక్ష్యాలు ప్రాతిపదికగా సాధించిన ఫలితాలను బేరీజు వేసి Feedback ద్వారా వాటి నిర్వహణ సామర్ధ్యమును రేటింగు చేయవలసి వచ్చును.

మూడవ రకమైన ప్రభుత్వ సంస్థలు ప్రభుత్వంతో ఏకస్వామ్యము ఉండి ప్రజా పెట్టుబడులను సద్వినియోగం ద్వారా పరిశ్రమలకు, ప్రజలకు, ప్రభుత్వానికి సహాయకారిగా వుండి ఆర్థిక అభివృద్ధికి పాటుపడతాయి. ఉదాహరణకి పెట్రోలియం కార్పోరేషన్‌లు, భారీ పరిశ్రమలు, నౌకా నిర్మాణ సంస్థలు, పోర్టు యాజమాన్యాలు మొదలైనవి. వీటికి ప్రైవేటు రంగంలో పోటీ వుండదు గాని ప్రభుత్వ మూలధనాన్ని సమర్ధవంతంగా నిర్వహించి పనితీరును ప్రదర్శించినప్పుడే అవి సరైన మార్గంలో నిర్వహించబడుతున్నాయి అని పనితీరు విశ్లేషణ ద్వారా నిర్ణయించవలసిన ఆవశ్యకత కలదు. ఈ రకమైన వివిధ నిర్వహణ పద్ధతులు లక్ష్యాలు కలిగియున్న దేశీయ ప్రభుత్వ రంగ సంస్థల సామర్ధ్య నిర్వహణ, పనితీరు విశ్లేషణకు కొలబద్ధలను, ఒకే విధమైన పద్దతులను అవలంబించుట సాధ్యంకాదు. అందుచే వ్యవస్థల లక్ష్యాలు, స్థాపన నిర్మాణ పద్ధతులు, ప్రభుత్వ జోక్యం, నియంత్రణ మొదలగు విషయాలని దృష్టిలో వుంచి కొన్ని పనితీరు సూచికలను ఏర్పరచి తద్వారా మాత్రమే వాటి స్థాయిని నిర్ణయించేందుకు మార్గాలను అవలంబించవలసి వున్నది. లేని యెడల తప్పుడు అంచనాలతో పెడదారి పట్టే అవకాశం వుంది.

## 8.5 ప్రభుత్వ రంగ సంస్థల - పరిపాలన సమస్యలు :-

ప్రభుత్వరంగ సంస్థల పరిపాలన పద్ధతులు ప్రభుత్వం అవలంబిస్తున్న పరిపాలన విధానాలు వాటి అభివృద్ధి, పెంపుదలను నిర్బంధం చేస్తాయి. అందుకని ప్రభుత్వ సంస్థల సామర్ధ్యం పెంపుకు కావలసిన పద్ధతులను అవలంబించే అవకాశం పరిపాలన విధానాల వల్లనే సాధ్యమవుతున్నాయి. ప్రభుత్వ సంస్థల నిర్మాణం, వాటిలో గల అంతర్గత సమన్వయమును సాధించుట, నిర్ణయాకరణలో వివిధ వ్యవస్థల సహకారము, సమాచార లభ్యత అనేవి పరిపాలన పరంగా సంస్థ యొక్క అభివృద్ధిని నిర్ణయిస్తాయి. సంస్థలోని కీలక స్థాయి ఉద్యోగుల నుండి సహకారం లభించినప్పుడే లక్ష్య సాధన జరుగుతుంది. ఉద్యోగుల సమస్యల పరిష్కారం

ద్వారా పరిపూర్ణ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించి లాభాల వైపు నడువకలదు. దీనికి సంస్థను నడుపుటకు సమర్థులైన నాయకత్వాన్ని ఎంపిక చేయడానికి (P.E.S.B) ప్రభుత్వ సంస్థల సెలక్షన్ బోర్డును ఏర్పాటు చేసి తగిన మేనేజింగ్ డైరెక్టర్‌లను నియమించవచ్చు. సుమారుగా 550 బోర్డు డైరెక్టర్‌లను నియమించవలసిన బాధ్యత P.E.S.B. కి కలదు. సంస్థలోని ఉన్నత శ్రేణి నాయకులకు శిక్షణ ఇచ్చి సమర్థులను ఎంపిక చేయుటకు అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లను B.P.E. నిర్వహిస్తుంది. మరియు P.E.S.B. వద్ద సుమారు 3000 దాకా సమర్థులైన నాయకుల "డేటా బ్యాంక్" నిర్వహిస్తోంది. ఇవి అన్ని సంస్థల పరిపాలన సామర్థ్యాలను పెంచి సమస్యలను అధిగమించి నిర్ణీత లక్ష్య సాధన ద్వారా ఉన్నత స్థాయిలో సంస్థలను నిలబెడతాయి. ప్రస్తుతం పరిస్థితిని పరిశీలిస్తే సుమారుగా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు పార్ట్ టైమ్ డైరెక్టర్‌లను, బోర్డును కలిగి వుండి తమ పూర్తి కాలాన్ని సంస్థ అభివృద్ధికి కేటాయించలేరు. B.P.E. సెక్రటరీకి ఇతర కీలక బాధ్యతలను అందచేయడం వలన పూర్తి కాలాన్ని వినియోగించలేక పోతున్నాడు.

అయినను వ్యక్తుల యొక్క వ్యక్తిగత శైలి విలక్షణమైన నాయకత్వం B.P.E. ని సరైన మార్గంలో నడిపించి పదవీ కాలం యొక్క పొడిగింపును కూడా సాధించిన వారు లేకపోలేదు. అనేక మంది తమ సామర్థ్యం ద్వారా సంస్థలను అభివృద్ధి చేసారు అనే విషయం CAG, B.P.E., P.A.C. రిపోర్ట్‌ల ద్వారా ప్రజలకు తెలియచేయడం జరిగింది. ప్రభుత్వ సంస్థల నిర్వహణలో ఈ క్రింది విషయాలు పాటించవలసిన అవసరం వుంది.

1. సంస్థ లక్ష్యాలు, ఉత్పత్తి విధులు, నిర్వహణ గురించి అవగాహన కలిగిన సమర్థులను నాయకత్వానికి ఎంపిక చేయడం అవసరం.

2. నాయకులకు, ఉద్యోగులకు సంస్థపై అంకిత భావంతో అభివృద్ధికి ఏకం అయి కృషి చేయడం, సామాజిక విలువలు పాటించి జాతీయ లక్ష్యాలను సాధించడం ద్వారా జాతీయ ఆదాయాన్ని పెంపు చేయడం.

3. ప్రస్తుతం ప్రభుత్వ రంగ పారిశ్రామిక సంస్థలలో అంకిత భావం కొరవడి పని గంటలను పెంపు ద్వారా లాభాలను ఆర్జించవలసిన అవసరం వుంది.

పరిపాలనా సామర్థ్యం పెంచుటకు అంతర్గత వ్యవస్థ పునర్నిర్మాణం అత్యవసరం. ఇవి సమాచార వ్యవస్థ (M.I.S.) లను ఆధునీకరణ చేయడం ద్వారా అవసరమైన విషయ సేకరణ జరిగి నిర్వాహణ మెరుగుపడును. అనేక సంస్థల్లో ఇవి లోపపూరితమై కీలక స్థానాలకు సరైన సమాచారం లభించక పోవడం వల్ల నిర్ణయీకరణ జాప్యం జరిగి సంస్థకు నష్టం వాటిల్లుతుంది. ప్రత్యామ్నాయం లేక సరైన అభివృద్ధి జరుగుట లేదు. ప్రభుత్వ రంగ సంస్థలు డిమాండ్‌కు తగ్గట్టుగా నాణ్యత కలిగిన సరుకులను అందచేసి క్వాలిటీ సర్కిల్స్ ద్వారా ఒక ప్రమాణాన్ని సాధించి సామర్థ్య నిరూపణ ద్వారా ఒక 'మోడల్' గా నిలబడాలి.

ప్రభుత్వ రంగ సంస్థల్లో శిక్షణలో అంతర్గత శిక్షణ సంస్థలను ఏర్పరచి ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచవలసిన లక్ష్యం వుంది. సంస్థ నాయకత్వానికి బాహ్య శిక్షణ సంస్థల ద్వారా వ్యూహాత్మక ప్రణాళికాబద్ధ నిర్వహణకు భవిష్యత్ ప్రణాళికల ద్వారా అభివృద్ధికి కృషి చేయాలి.

## 8.6 ప్రభుత్వరంగ సంస్థలు - ప్రభుత్వ నియంత్రణ :-

ప్రభుత్వరంగ సంస్థల నిర్వాహణలో ప్రభుత్వ శాఖలతో సమన్వయం అతి ముఖ్యమైనది. ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర వహిస్తూ ప్రగతి సాధనాలుగా పరిగణించబడుతున్న వీటి నిర్వహణలో ప్రభుత్వ ప్రాతినిధ్య నియంత్రణ తప్పని సరి. ఆర్థిక

ప్రగతికి ప్రాధాన్యత వహిస్తూ అత్యవసర, పారిశ్రామిక, సేవా రంగాలలో కీలకం అయి ప్రగతిని నిర్దేశించే ఈ ప్రజా సంస్థలపై ప్రభుత్వ పరివేక్షణ మరియు నియంత్రణ అత్యవసరం.

ప్రభుత్వ విధాన నిర్ణయాల అమలులో కొన్ని మార్గదర్శకాలు అనుసరించవలెను. పరిపాలన విధానాల్లో ప్రభుత్వ జోక్యం తప్పనిసరి అయినందు వల్ల కొన్ని అత్యవసర నిర్ణయాల్లో అడ్డంకులు ఏర్పడవచ్చు. కొన్ని విషయాల్లో ఇవి స్వతంత్రంగా నిర్ణయించవలసిన అవసరం వుంది. కొన్ని ముఖ్య విషయాల్లో ప్రభుత్వ ముందస్తు అనుమతి తప్పనిసరి. అధికార దత్తత, వికేంద్రీకరణ ప్రభుత్వ సంస్థలతో సమన్వయ సహకారాలు, ప్రభుత్వ అధికారుల ఆదేశాలు పాటించడం, రాజకీయ వత్తిడి, ప్రభుత్వ అధికారుల నియంత్రణ తప్పనిసరి. ప్రభుత్వ కమిటీలు, రిపోర్టులు, సమీక్షల ద్వారా ప్రగతిని నిర్దేశించడం జరుగుతోంది. ప్రభుత్వ నియంత్రణ మూడు రకాలు :-

1. మంత్రి వర్గ నియంత్రణ

2. శాసనసభ కమిటీల నియంత్రణ

3. సమగ్ర ఆడిట్ ద్వారా నియంత్రణ

1. ప్రభుత్వ శాఖల ద్వారా, మంత్రి వర్గ సమావేశాల ద్వారా, నిర్ణయించిన సూచనల అమలుకు నిర్దేశించడం జరుగుతోంది. మంత్రి వర్గం మూడు విధాలుగా నియంత్రణ చేస్తుంది. అవి:-

(1) నిబంధనల మార్పు (2) వ్యవస్థకు ఆర్థిక పుష్టికి గ్రాంటులను, వనరులను అందచేయుట (3) పరిపాలనలో బోర్డు డైరెక్టరుల పదవీకాలం, నియామకాలు చేయుట ద్వారా నియంత్రణ.

శాసణ సభ కమిటీలు ప్రభుత్వ రంగ సంస్థల పని తీరుని నిర్ణయాలను సమీక్షిస్తాయి. అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులు కలిగిన అంచనాల సంఘం, ప్రభుత్వ ఖాతాల సంఘం, ప్రభుత్వ రంగ సంస్థల పై కమిటీ (C.O.P.U) ఇవి తమ సమీక్షలో పెట్టుబడుల వినియోగం, నిర్వాహణ, లాభ నష్టాలు, జరిగిన అభివృద్ధి నిర్ణయించి లోపాలను విశ్లేషించి తమ రిపోర్టులను పార్లమెంటుకు సమర్పించి తగు చర్యలు తీసుకునేలా నియంత్రణ చేస్తున్నాయి.

స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఆడిట్, (C.A.G) ల ద్వారా ప్రభుత్వ సంస్థల ఖాతాలను ఆడిట్ చేయుట ద్వారా నిధుల దుర్వినియోగాన్ని అరికట్టుటకు, ముఖ్య కార్యనిర్వహణ అధికారులను విచారించుట ద్వారా విశ్లేషణ చేసి అధికారుల చర్యలను సమీక్షిస్తాయి. తద్వారా అధికారుల్లో బాధ్యత పెరిగి సమర్థమైన నిర్ణయాలతో సంస్థలను ముందుకు నడుపుతారు.

## 8.7. ప్రభుత్వ రంగ సంస్థలతో పోటీ - ప్రైవేటీకరణ :-

సరళీకృత ఆర్థిక విధానాల ద్వారా గ్లోబల్ మార్కెట్‌లో విశేషమైన మార్పులు ఏర్పడి అనేక విదేశీ సంస్థలు దేశీయ మార్కెట్‌లోకి పోటీగా ప్రవేశించాయి. ఈ పోటీకి నిలబడి దేశీయ సంస్థలు తమ ఉనికిని కాపాడుకోవాలి అంటే వాటితో సమానంగా నాణ్యత, నిర్వాహణలో వాటిని అధిగమించాలి. దీనికై అధికారులకు తగిన స్వేచ్ఛను ఇచ్చి బాధ్యతలు, లక్ష్యాలను ఏర్పరిచి సామర్థ్యాన్ని పెంచాలి. ప్రపంచ వ్యవస్థలో వచ్చే మార్పులను పటిష్టం చేయబడిన సమాచార వ్యవస్థల ద్వారా సేకరించి వాటికి అనుగుణంగా

సంస్థను మార్పు చేసి ముందుకు నడపాలి. మార్కెట్ పోకడలను నిర్ణయిస్తూ, ధరలను, స్థిరీకరిస్తూ ప్రైవేటు వ్యక్తుల ప్రవేశాన్ని నియంత్రిస్తూ, కీలక రంగాలను కాపాడాలి. నష్టాల ఊబిలో వున్న సంస్థల రీఇన్వెస్టిమెంట్ మరియు Analysis ద్వారా వాటిని తిరిగి లాభాలపై నడుపుటకు కృషి చేయాలి. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానిస్తూ నిర్మాణం చేయడం, పబ్లిక్ షేర్ల ఇష్యూ చేయడం, ప్రైవేటు సంస్థలకు లీజు ఇచ్చుట, ప్రభుత్వ పెట్టుబడులను క్రమంగా తిరిగి విత్‌డ్రా చేయుట అనే చర్యలను గత NDA ప్రభుత్వం చేపట్టి ఒక ప్రభుత్వరంగ సంస్థల మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయుట ద్వారా వీటిని పరిరక్షించుటకు విశేషముగా కృషిని ప్రారంభించినదని చెప్పవచ్చును.

## 8.8 సారాంశము :-

పై విషయాలు సమగ్రంగా విశ్లేషిస్తే క్రింది విషయాలు అర్థం అవుతాయి. అవి 1. ప్రభుత్వ రంగ సంస్థలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక వంటివి. వీటిని సమగ్రంగా నిర్వహించి ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయవచ్చు. 2. విదేశీ సంస్థలను నియంత్రించి సమగ్ర మార్కెట్ - ధరల విధానంతో కృషి చేయాలి. 3. నష్టాల సంస్థలను గర్తించి లోపాలను విశ్లేషించుటకు, వీటిని పరిరక్షించుటకు కమిటీలను వేసి గమ్యాన్ని చేరడానికి కృషి చేస్తున్నాయి. ఉపయోగం లేని సంస్థలను ప్రత్యామ్నాయం పై దృష్టి సారించి వాటిలోని ప్రభుత్వ పెట్టుబడులను రక్షించాలి.

నేడు అనేక సంస్థలు నిర్వహణ లోపాలతో ప్రభుత్వ రక్షణ లేక అధికారుల అలసత్వం, నిర్లక్ష్యంతో, నాయకత్వ లోపాలతో, వైఫల్యాలతో వీటిని ఆర్థిక వ్యవస్థకు గుదిబండలుగా మార్చి ప్రజాధనం దుర్వినియోగం అగుటకు కారకులు అవుతున్నారు. అందుకే B.S.R.B. ద్వారా Sick ఇండస్ట్రీలను సమీక్షించి వీటిని కాపాడుటకు ప్రయత్నం చేయుట ద్వారా దేశ మిశ్రమ ఆర్థిక వ్యవస్థను పరిరక్షించే ప్రయత్నం చేయవలసిన బాధ్యత ప్రభుత్వం పై కలదు.

## 8.9 నమూనా ప్రశ్నలు :

1) ప్రభుత్వరంగ సంస్థలు దేశ ఆర్థిక విధానాన్ని ప్రభావితం చేస్తాయి. పై వాక్యాన్ని పరిశీలించండి.

2) ప్రైవేటు సంస్థలతో పోటీకి ప్రభుత్వ రంగ సంస్థలు బలోపేతం కావాలి - విమర్శించండి.

3) ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు, సామర్థ్య నిర్వహణను విమర్శనాత్మకంగా పరిశీలించండి?

## 8.10 చదువదగిన గ్రంథాలు:


1) Laxmi Narian - Public Enterprise Management

2) R.K. Nigam - Management of Public Enterprises

3) N.N. Mallayya - Public Enterprises in India 1971

4) B.P. Mathur - Public Enterprises in Perspective, 1973.

| | | |
|---|---|---|
| 5) P.H. Appllby | - | Re-Examination of India's Industrial Enterprises |
| 6) S.S. Khera | - | Government in Business |
| 7) A.D. Agarwal | - | Public Enterprises in India - 1978 |
| 8) R.S. Arora | - | Administration of Government Industries |
| 9) Brice - R - Eleg | - | Human Resource & Plannning |
| 10) R.K. Jain | - | Management of State Enterprises |
| 11) A.D. Gorwal | - | Report on Indian Administration |
| 12) V.N. Chaturvedi | - | CAG Report on Central Govt. P.E.'s Performance. |

డా॥ షేక్ సులేమాన్